M. V. KRI[illegible]
Minister for Education & Cultural [illegible]
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

197
3954

ద్వితీయ ముద్రణకు ప్రకటన

ప్రపంచమున పవిత్రమైన కర్మక్షేత్రము భారతభూమి. ధర్మము స్థాపించుటకు భగవంతుడు అవతారరూపమున అవతరించిన పుణ్యభూమి భారతదేశము. అట్టి భారతదేశము స్వాతంత్ర్యమును కోల్పోయి బానిసత్వమున ప్రమగ్నుండగా దేశమునకు స్వాతంత్ర్య భాగ్యము, జాతికి చైతన్యము కూర్చుటకవతరించిన మహనీయుడు గాంధీమహాత్ముడు. బుద్ధదేవుని అహింసాధర్మమును, క్రీస్తుప్రభువు కారుణ్యమును మేళవించి సత్యాహింస లనే ఆయుధములను వినియోగించి తుపాకి ప్రేల్చకుండా, నెత్తురు చిందకుండా రవి అస్తమించని మహాసామ్రాజ్యపాలకులైన బ్రిటిషువారితో శాంతి సమరముసల్పి విజయలక్ష్మి భాగ్యమందిన చరితార్థజన్ముడు పూజ్య బాపూజీ. ఆయనను భారత జాతిపితగా, లోకోత్తర పురుషునిగా, కారణ జన్మునిగా సర్వమానవ ప్రపంచము పూజించుచున్నది.

గాంధీమహాత్మునికి ప్రియశిష్యులై, ఆయన అడుగుజాడలలోనడిచి ఆంధ్రదేశనాయకులై పేరు ప్రఖ్యాతులందిన మహనీయులు డాక్టరు పట్టాభిసీతారామయ్యగారు, శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు. వారిరువురి బోధలచే, వ్రాతలచే ప్రభావితులై పూజ్య బాపూజీ శంఖారావమాలించి శాంతి సమరమునచేరి స్వాతంత్ర్యము సంపార్జించిన వీరదంపతులు శ్రీ వల్లభనేని రామబ్రహ్మం, ఆయన సతీమణి శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారలు. దేశ స్వాతంత్ర్యమునకు పూర్వము వీరుచేసిన అకుంఠిత దేశ సేవను స్వాతంత్ర్యానంతరము చేయుచున్న నిష్కళంక ప్రజాసేవను గుర్తించి శ్రీ వల్లభనేని కాశీవిశ్వనాధంగారు 1960 వ సంవత్సరంలో "వీర దంపతులు" అను కావ్యమున ఆ దంపతుల సంగ్రహచరిత్రను ఆంధ్రుల కందించిరి. అచిరకాలమున ఆ ప్రతులన్నియూ అమ్ముడుపోయినందున చాలమంది ఆ పుస్తకములు కోరుచున్నందున ఈ ద్వితీయ ముద్రణకు అవసరమేర్పడినది. ఆ సంగతి సంకలన కర్తయైన వల్లభనేని కాశీవిశ్వ

నాధంగారికి తెల్పగా వారు పునర్ముద్రణకంగీకరించిరి. పూర్వమున్న విషయము మార్చవలదనికోరిరి. వారి అనుమతి ప్రకారమే ఇటీవలి చరిత్ర కొంతచేర్చి వీరదంపతుల పుస్తకమును ద్వితీయముద్రణచేసి మీకరకమలములయందుంచడమైనది. దంపతులిరువురూ స్వాతంత్ర్య సమరయోధులై స్వాతంత్ర్యానంతరము జీవించి స్వాతంత్ర్య రజతోత్సవమును కనులారచూచి సోదర ప్రజానీకముచేతను, దేశపాలకులచేతను, సన్మానింపబడు భాగ్యమునందిరి. అది అందరికిలభించదు. అట్టిభాగ్యమునకు నోచుకొనిన అదృష్టవంతులు వల్లభనేని వీరదంపతులు ప్రశంసార్హులుగదా! వారిచరిత్ర శ్లాఘనీయముగదా! ఈ ద్వితీయముద్రణము సంకలనము చేయవలెనని మిత్రులుకోరగా వీరదంపతులపై గల అభిమానముచేత సాహసించి వ్రేలువెట్టితిని. ఇందలి గుణాగుణములు పాఠకులే నిర్ణయింతురుగాక.

వీరారాధన అనాదిసిద్ధము. దయావీరులు, ధర్మవీరులు, సమరవీరులు, కర్మ వీరులందరిలో ముఖ్యులు శాంతిసమర వీరులు. అట్టి ఆంధ్ర స్వాతంత్ర్య సమర వీరదంపతుల చరిత్ర ఆంధ్రులకు పఠనీయము. ఆదరణీయము. ఇక చదువనారంభింపుడు.


ఇట్లు,

సుజన విధేయుడు


గుడివాడ,
20-8-74

మధురకవి కాకాని నరసింహారావు.

3



16-4-1929 సంవత్సరము మహాత్మాగాంధి ఆంధ్ర ప్రదేశ్ ఖద్దరు యాత్రకు వచ్చినప్పుడు శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారు తమ స్వంతకారు నొసంగి కృష్ణాజిల్లా పర్యటనలో సారధ్యము వహించిరి.



ప్రథమ తూర్పు కృష్ణాజిల్లా రాజకీయ మహాసభ

పామర్రు, ది 21-5-1937.

అధ్యక్షుని ఊరేగింపు

ఆహ్వాన సంఘాధ్యక్షులు - శ్రీ వల్లభనేని రామబ్రహ్మం


జాతీయ పతాక స్థాపకులు - శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు M. L. A.

సభాధ్యక్షులు - శ్రీ వి. వి. గిరి M. L. A.

కార్మిక నాయకులు

సభా ప్రారంభకులు - శ్రీ కాట్రగడ్డ వెంకటనారాయణరావు M. L. A.

వరుసగా వెనుక సీట్లపై ఆసీనులై యుండిరి.




1938 ఏప్రియల్ 20-21 తేదీలలో కృష్ణాజిల్లా మహిళా మహాసభ కొమరవోలు
గాంధి ఆశ్రమంలో జరిపిన సందర్భమున తీయబడిన ఛాయా చిత్రము

కృష్ణాజిల్లా మహిళా ప్రతినిధులు


అధ్యక్షురాలు: శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ,

ప్రారంభకురాలు: శ్రీమతి దర్భి సుభద్రమ్మవగైరా



1939 సం॥లో కృష్ణాజిల్లాబోర్డు సభ్యులు

అధ్యక్షులు : శ్రీ కోలపల్లి లక్ష్మయ్యనాయుడు, ఉపాధ్యక్షురాలు: శ్రీమతి వాసిరెడ్డి హనుమాయమ్మ, మెంబర్లు : శ్రీ యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దరు (చల్లపల్లి రాజా) శ్రీ అడుసుమెల్లి గోపాల కృష్ణయ్య, శ్రీమతి రత్నమాంబ, శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ, శ్రీ వల్లభనేని రామబ్రహ్మం, శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్య, శ్రీ దుక్కిపాటి నాగేశ్వరరావు మొదలగు ప్రముఖులు గలరు.




అక్కగారు కీ॥ శే॥ పొట్లూరి బసవలక్ష్మీదేవమ్మ




చెల్లెలు కీ॥ శే॥ అద్దుమెల్లి అన్నపూర్ణమ్మ

మాతృమూ॥ కీ॥ శే॥ వల్లభనేని వెంకమ్మగారు



పినతల్లి కీ॥ శే॥ దుగ్గిరాల బసవమ్మగారు






కృష్ణాజిల్లా బోర్డు ఎన్నికలలో గెలుపొందిన స్త్రీ సభ్యురాండ్రయిన శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ, ఈడ్పుగంటి వెంకటరత్నమాంబ, చాగర్లమూడి హనుమాయమ్మగార్లకు వేములపల్లి రామతులశమ్మ గారిచే 17-2-1940 తేదీన గుడివాడలో తేనీటి విందొనరించిన సందర్భమున తీయబడిన ఛాయాచిత్రము


అభినందన సభకు శ్రీమతి మూల్పూరు చుక్కమ్మగారు
అధ్యక్షత వహించిరి.

1-12-1949 న మదరాసు ప్రభుత్వ మద్యనిషేధ శాఖామాత్యులు శ్రీ నీలం సంజీవరెడ్డిగారు జబీ గొల్వేపల్లి మాతా శిశు సంక్షేమ కేంద్రమునకు శంకుస్థాపనకు విచ్చేసిన సందర్భములో కృష్ణాజిల్లా కాంగ్రెసు కార్యకర్తలతో శ్రీ నీలం సంజీవరెడ్డి.



కూర్చున్నవారు 1. మాగంటి అంకినీడు 2. వల్లభనేని రామబ్రహ్మం 3 వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ (ఎం. ఎల్. ఏ.) 4. నీలం సంజీవరెడ్డి (మధ్యనిషేధ శాఖామాత్యులు) 5. కొల్లిపర సూరయ్య [ఎం. ఎల్. ఏ] 6. పోలవరపు నాగేశ్వరరావు 7. పోతిని గణపతిరావు.

నిలబడినవారు : 1 యన్. వి. యస్. ప్రసాద్ 2 డాక్టరు ఆర్. అచ్యుత రామయ్య 3 మోపర్రు దాసు 4. ఈడుపుగంటి లింగయ్య 5 మలిరెడ్డి పకీరు రామదాసురెడ్డి 6. విన్నకోట రామలింగం 7. వీరపనేని పెదనారాయణ 8. దుక్కిపాటి నాగేశ్వరరావు 9 ఆత్మూరి నాగేశ్వరరావు 10 కొడాలి ఆంజనేయులు 11 బొబ్బా ఆదినారాయణమూర్తి 12 కామినేని సుబ్బారావు 13 అయినంపూడి సీతారామవరావు 14 కానూరి సుబ్బారావు 15 వల్లభనేని వెంకటరత్నం.




ది 1948 సం॥ లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర అస్సెంబ్లీ మరియు కౌన్సిల్ సభ్యులు మహా నాయకులు, సెంట్రల్ గవర్నమెంటు మంత్రివర్యులు శ్రీ సి. రాజగోపాలాచారి, అస్సెంబ్లీ స్పీకరు శ్రీ జె. శివషణ్ముఖంపిళ్లై, శ్రీ ఆర్.బి. రామకృష్ణరాజు, కౌన్సిల్ ప్రెసిడెంటు, ముఖ్యమంత్రి శ్రీ వోమండూరి రామస్వామి రెడ్డియార్, మంత్రులు బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ కల్లూరి చంద్రమౌళి, శ్రీ కళా వెంకట్రావు, శ్రీ వేముల కూర్మయ్య, శ్రీ అవినాశ లింగంచెట్టి, శ్రీ భక్తవత్సలం, శ్రీమతి సి. అమ్మన్నరాజా, శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారు - అనేకమంది ప్రముఖులు.




ది 1 - 12 - 49 న

జమ్మిగొల్వేపల్లి మాతా శిశుసంక్షేమ కార్యాలయ భవనమునకు శంకుస్థాపన చేయుచున్న మదరాసు మద్యనిషేధ శాఖామాత్యులు శ్రీ నీలంసంజీవరెడ్డి శ్రీరామబ్రహ్మం, శ్రీమతి సీతామహాలక్ష్మమ్మ యం. యల్. ఏ. డాక్టరు : ఆర్. అచ్యుతరామయ్య శ్రీ కొల్లిపర సూరయ్య యం. యల్. ఎ. గారలు




మధ్యప్రదేశ్ గవర్నరు శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారితో
నాగపూర్ రాజభవనంలో శ్రీరామబ్రహ్మం, వీరి బావమరదులు
శ్రీ పొట్లూరు సూర్యనారాయణ. శ్రీ వెంకటరత్నం గారలు.



ఆంధ్ర యూనివర్సిటీ సెనేట్ మెంబర్లు 10-12-1949 తేదీ సమావేశము.

ముందువరుసలో కూర్చున్నవారు : సిస్టర్ మేరీస్టానిస్లాసీ, 2. శ్రీమతి యన్. కమలా ఫిలిప్ 3 శ్రీమతి ఆర్. దురాని 4. డాక్టరు సి. ఆర్. రెడ్డి (ప్రోచాన్సలర్, మైసూరు యూనివర్సిటీ) 5. శ్రీ శ్రీ శ్రీ మహారాజా డాక్టరు విక్రమదేవవర్మగారు (ప్రోచాన్సలర్ ఆంధ్ర యూనివర్సిటీ) 6. డాక్టరు వి. యస్. కృష్ణ (వైస్‌చాన్సలర్) 7. ఆనర్‌బుల్ శ్రీ బెజవాడ గోపాలరెడ్డి 8. శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ 9. శ్రీమతి సి. అమ్మన్నరాజా 10. రాజా వై.యస్.ఆర్. ప్రసాద్ బహద్దూర్ గారలు



8 - 8 - 1955 నాడు

ఆంధ్ర రాష్ట్ర ముఖ్య మంత్రి డాక్టరు బెజవాడ గోపాలరెడ్డిగారు ప్రారంభోత్సవము
చేసిన జమీగొల్వేపల్లి మాతా - శిశుసంక్షేమ కేంద్ర భవనము.


15


8 - 8 - 1955 సం॥

ఆంధ్ర రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డి జమ్మిగొల్వేపల్లి గ్రామంలో రామబ్రహ్మంగారిచే నిర్మించబడిన మాతాశిశు సంరక్షణా లయ భవనము ప్రారంభోత్సవమునకు వచ్చినప్పటి చిత్రము.

అధ్యక్షులు : శ్రీ వల్లభనేని రామబ్రహ్మం

జిల్లాకలెక్టరు శ్రీ సయ్యద్ అబ్దుల్ ఖాదరు ఐ. ఏ. యస్.







మచిలీపట్నంలో డాక్టరు పట్టాభి కాంగ్రెసు భవనమునందు
శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి షష్టి పూర్తి ఉత్సవ సందర్భములో ఆంధ్ర ప్రదేశ్
ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవిరెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు, అయ్యదేవర
కాళేశ్వరరావు, వి. బి. రాజు ప్రభృతులను ఆహ్వానించుచున్న శ్రీ పట్టాభి
కాంగ్రెసు భవన సంపాదకులు శ్రీ వల్లభనేని రామబ్రహ్మం

ది కృష్ణా డిస్ట్రిక్టు ఇరిగేటెడ్ కాటన్ గోదియుస్ కో - ఆపరేటివ్ మార్కెంగు సొసయిటీ, పామర్రు.

నూతనముగా ఎన్నుకొనబడిన పాలకవర్గ సభ్యులు 1970 - 1972



1. శ్రీ గొంది రామబ్రహ్మం (మద్దూరు) 2. శ్రీ బొప్పన జగ్గయ్య (పెంజెండ్ర) 3. శ్రీ కంఠంనేని అచ్యుతరామయ్య (మోపిదేవి) 4. శ్రీ పిడికిటి మాధవరావు (పునాదిపాడు) 5. శ్రీ తమ్మా కోటిరెడ్డి; ఉపాధ్యక్షులు (పామర్రు) 6. శ్రీ యలమంచిలి వెంకటాద్రి; అధ్యక్షులు (పెదమద్దాలి) 7. శ్రీ వల్లభనేని రామ బ్రహ్మం కోశాధికారి: (జమీగొల్వేపల్లి) 8. శ్రీ వేములపల్లి వెంకటేశ్వరరావు (నిడమానూరు) 9. వెల్లంకి రాజారావు (కలవపాముల) 10. శ్రీ కొడాలి పాండురంగారావు (యలమర్రి) 11. శ్రీ కొల్లిసత్యనారాయణరెడ్డి(ఉరుటూరు)




కుమారి వల్లభనేని శోభ మెమోరియల్ జిల్లాపరిషత్ హైస్కూల్
ప్రారంభోత్సవ సమయమున తీయబడిన చిత్రం
29 - 8 - 1964

కూర్చున్నవారు: శ్రీ యలమంచిలి వెంకటాద్రి- శ్రీ వల్లభనేని రామబ్రహ్మం
(హైస్కూలు భవన ప్రదాత) శ్రీమతి వల్లభనేని కమలకుమారి
యం. యల్. సి. శ్రీ పి. వెంకటసుబ్బయ్య (జిల్లాపరిషత్ కార్యదర్శి)
శ్రీ కె. సూర్యనారాయణ (జిల్లాపరిషత్ డిప్యూటీ కార్యదర్శి)
శ్రీ తుమ్మల చౌదరి యం.ఏ. (సెక్రటరీ హైస్కూలు కమిటీ)
శ్రీ కాకొల్లు రాఘవులు

నిలబడినవారు: 1. శ్రీ అడ్డుమెల్లి వెంకట్రామయ్య 2. గుమ్మడి పిచ్చయ్య (మెంబరు) 3. శ్రీ వల్లూరుపల్లి బాపయ్య 4. శ్రీ వల్లభనేని వెంకట సుబ్బయ్య (మెంబరు) 5. కొట్రుగడ్డ వెంకటకృష్ణయ్య 6. శ్రీ పొట్లూరు బలరామ కృష్ణయ్య సర్పంచి (మెంబరు) 7. శ్రీ పి. వి. చలపతి రావు (ఉభయభాషాప్రవీణ) 8. శ్రీ పొట్లూరు సత్యనారాయణ వి. యం. అండ్ మెంబరు) 9. బొప్పూడి వీరరాఘవయ్య (మెంబరు) 10. శ్రీ పెద్దు సాంబశివరావు (మెంబరు) 11. గుమ్మడి వెంకటేశ్వరరావు [మెంబరు] 12 .యన్. యస్. ఆర్. ఆంజనేయ చౌదరి (మెంబరు)




29-8-69 సం॥ కుమారి వల్లభనేని శోభ మెమోరియల్
జిల్లా పరిషత్ హైస్కూళ్లు ప్రారంభకులు
శ్రీ కె. సూర్యనారాయణ [జిల్లా పరిషత్ డిప్యూటి కార్యదర్శి] రిబ్బను
కత్తిరించి ప్రారంభోత్సవము జరుపుచున్న చిత్రము.
భవనదాత :- శ్రీ వల్లభనేని రామబ్రహ్మం
శ్రీమతి వల్లభనేని కమల కుమారి యం. యల్. సి.
శ్రీ పొట్లూరు రంగారావు
శ్రీ యలమంచిలి వెంకటాద్రి
శ్రీ కంఠంనేని వెంకటేశ్వరరావు
ప్రిన్సిపాల్ ఐ. టి. ఐ. విజయవాడ



దత్తత పుత్రుడు
చి॥ వెంకట రత్నం


కోడలు
చి॥ సౌ॥ మృదులారాణి





ప్రేమ పుత్రుడు
చి॥ మురళీ మోహన్


కోడలు
చి॥ సౌ॥ కరుణ



23 - 3 - 70

వల్లభనేని రామబ్రహ్మం దంపతులు

చి॥ వెంకటరత్నంను దత్త స్వీకార సందర్భముకో తీసిన వాయూ చిత్రము.



శ్రీరామ బ్రహ్మం దంపతులచే నిర్మించబడిన

కుమారి వల్లభనేని శోభామెమోరియల్

జిల్లాపరిషత్తు హైస్కూలు భవనము


జమీగొల్వేపల్లి.

ప్రారంభము ది 7-10-70



ది 7 - 10 - 70 న

కుమారి వల్లభనేని శోభా మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూలు భవన
ప్రారంభోత్సవము చేయుచున్న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి
శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి భవన దాతలు శ్రీ వల్లభనేని రామ
బ్రహ్మం, శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ, దత్తుడు
చి॥ వెంకటరత్నం ఆర్థిక మంత్రి అనగాని భగవంతరావు,
వ్యవసాయశాఖామాత్యులు శ్రీ కాకాని వెంకటరత్నం
గారలు



ది 7 - 10 - 70 న

కుమారి వల్లభనేని శోభా మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూలు భవన
ప్రారంభోత్సవ సందర్భమున ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి శ్రీ కాసు
బ్రహ్మానందరెడ్డిగారు రామబ్రహ్మం దంపతుల ఫొటో ఆవిష్కరించు
చున్న దృశ్యము.



ది 7 - 10 - 70

కుమారి వల్లభనేని శోభా మెమోరియల్

జిల్లా పరిషత్ హైస్కూలు నూతన భవన ప్రారంభోత్సవ సందర్భమున

భవనదాత శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారికి పౌర సన్మానము జరుపు

చున్న జమ్మిగొల్వేపల్లి సర్పంచి శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావుగారు



7 - 10 - 70 న

కుమారి వల్లభనేని శోభా మెమోరియల్

జిల్లా పరిషత్ హైస్కూల్ భవన ప్రారంభోత్సవ సందర్భమున

శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ మాజీ యం. యల్. ఏ. గారిని నూతన

వస్త్రములతో గ్రామ సర్పంచి శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు సన్మానించు

చున్న దృశ్యము



7 - 10 - 70


కుమారి వల్లభనేని శోభా మెమోరియల్

జిల్లా పరిషత్ హైస్కూల్ భవన ప్రారంభోత్సవము సందర్భములో

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు సభలో

ప్రసంగించుచున్న దృశ్యము

వేదికపై : శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ } భవనదాతలు
శ్రీ రామబ్రహ్మం }
శ్రీ కొడాలి ఆంజనేయులు
శ్రీ కాకాని వెంకటరత్నం (వ్యవసాయ శాఖామాత్యులు)
శ్రీ అనగాని భగవంతరావు (ఆర్థిక మంత్రి)
శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు [జిల్లాపరిషత్ చైర్మన్]



ది 8 - 6 - 1971


పశువుల ఆసుపత్రి భవన ప్రారంభోత్సవ సందర్భములో జరిగిన మీటింగునకు జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించిరి. శ్రీ పర్వతనేని వెంకటరత్నం శ్రీ వల్లభనేని రంగయ్య గారలు వేదిక నలంకరించిరి. శ్రీరామ బ్రహ్మంగారు స్వాగతోపన్యాసం చేయుచున్నారు.

భవన ప్రారంభకులు శ్రీ కాకాని వెంకటరత్నం (వ్యవసాయ శాఖామాత్యులు)


చెరుకూరు సత్యనారాయణ గ్రామీణ పశు వైద్యశాల
ప్రారంభోత్సవము
చేసిన వ్యవశాయ శాఖామాత్యులు శ్రీ కాకాని వెంకటరత్నం, శ్రీ వల్లభనేని
రామబ్రహ్మం, శ్రీ చెరుకూరు సత్యనారాయణ, గ్రామ సర్పంచ్
శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లాపరిషత్ చైర్మన్
శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు తదితర ప్రముఖు
ది 8-6-71



26 - 1 - 72 రిపబ్లిక్ దినోత్సవ సందర్భమున
భారత రాష్ట్రపతి గౌ॥ శ్రీ వి. వి. గిరి గారితో స్వాతంత్ర్య సమర యోధుడు
శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారు కరచాలన చేయుచున్న దృశ్యము
న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవనమునందు.



25-4-72 తేదీ కుమారి వల్లభనేని శోభ మెమోరియల్ జిల్లా పరిషత్తు హైస్కూలు వార్షికోత్సవ సందర్భములో తీయబడిన ఫొటో చిత్రము ఇందు భవనదాత శ్రీ వల్లభనేని రామబ్రహ్మం, హైస్కూలు హెడ్ మాష్టరు శ్రీ ఉప్పలపాటి రామచంద్రరావు మరియు హైస్కూలు స్టాపు

ఎడమ నుండి కుడికి

1. శ్రీమతి కె. సీతారత్నం [సెకండరీ గ్రేడు] 2. శ్రీ వి. సత్యనారాయణ [గ్రేడు-2 హిందీ పండిట్] 3. శ్రీ యస్. సీతారామశాస్త్రి బి.ఏ., బి.ఇడి. 4 శ్రీ ఎ. రామమోహనరావు [సైన్సు అసిస్టెంటు] 5. శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారు [భవనదాత] 6. శ్రీ వి. రామచంద్రరావు బి. ఏ., బి.ఇడి. [హెడ్‌మాష్టరు] 7. శ్రీ యమ్. రామకృష్ణారావు బి.ఏ., బి.ఇడి. 8. శ్రీ వి. ధనుంజయరావు బి.యస్‌సి., బి.ఇడి. 9. శ్రీ కె. మల్లికార్జున రావు పి.ఇ.టి. 10. శ్రీ పి. వి. యస్ వాసుదేవశర్మ [గ్రేడ్-? తెలుగు పండిట్] 11. శ్రీ టి. రాధాకృష్ణమూర్తి బి. యస్‌సి. బి. ఇడి. 12. శ్రీ ఆర్. సుబ్బారావు వ్యాన్ 13. శ్రీ ఎ. వి. సుబ్బయ్య వాచ్‌మాన్.



25 - 4 72 న కుమారి వల్లభనేని శోభా మెమోరియల్ జిల్లాపరిషత్ హైస్కూలువార్షికోత్సవ సందర్భములో సభాపేధిక నలంకరించిన ప్రముఖులు

1. గుడివాడ మహిళా కళాశాల ప్రిన్సిపాలు
   శ్రీమతి పద్మసులోచనాబాయి పి. హెచ్. డి.
2. హైస్కూలు భవనదాత శ్రీ వల్లభనేని రామబ్రహ్మం
3. గుడివాడ ఎ. యన్. ఆర్. కళాశాల ప్రిన్సిపాలు
   శ్రీ యెర్నేని వెంకటేశ్వరరావుగారు
4. కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావుగారలు

హైస్కూలు బాలికా విద్యార్థినులు ప్రార్థనా గీతము పాడుచుండుట.





స్వాతంత్ర్య సుమరము లో
స్మరణీయమైన త్యాగము చేసినందుకు,
ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ,
దేశప్రజలచేపున, భారత స్వాతంత్ర్యదిన
రజతోత్సవ సమయమున, ఈ తామ్ర
ఫలకమును బహూకరించుటమైనది.

15 ఆగస్టు 1972

న్యూఢిల్లీ ప్రధాని

శ్రీ వల్లభనేని రామబ్రహ్మం
ఉయ్యూరు :: ఆంధ్ర ప్రదేశ్

ది 15-8-72 వ సం॥ భారత స్వాతంత్ర్య దిన రజతోత్సవ సందర్భమున భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి స్వాతంత్ర్య సమర యోధుడు శ్రీ వల్లభనేని రామబ్రహ్మంకు బహూకరించిన తామ్రఫలకము.



ది 15-8-1972 తేదీన స్వాతంత్ర్య రజతోత్సవం సంచర్భముగా ఢిల్లీలో తామ్రపత్రం స్వీకరించిన ఆంధ్ర స్వాతంత్ర్యయోధుడు శ్రీ వల్లభనేని రామబ్రహ్మంను భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి అభినందిస్తున్నట్టి దృశ్యం.



ది 15-8-72 తేదీన కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధులు ఢిల్లీలో తామ్రపత్ర స్వీకరణకు వెళ్లినప్పుడు హైదరాబాద్ రైల్వేస్టేషనులో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ కాకాని వెంకటరత్నంగారితో కృష్ణాజిల్లా ఆహ్వానితులు.

1. శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు 2. శ్రీ అన్నే మల్లిఖార్జునుడు 3. శ్రీ కాకాని వెంకటరత్నం 4. శ్రీ వల్లభనేని రామబ్రహ్మం 5. శ్రీ పైడిపాటి అప్పలస్వామి 6. శ్రీ కంభంపాటి సత్యనారాయణ.

Blank Page



ది 15-8-72 తేదీన ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధులు తామ్రపత్ర స్వీకరణకు ఢిల్లీ వెళ్లినప్పుడు రాష్ట్రప్రభుత్వ ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరశింహారావు, వ్యవసాయశాఖా మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు గార్లు హైదరాబాద్ రైల్వేస్టేషనులో వీడ్కోలు నొసంగుచున్న సందర్భములోతీసిన ఛాయాచిత్రము

1. శ్రీ వల్లభనేని రామబ్రహ్మం 2. శ్రీ కన్నిగంటి సూర్యనారాయణ 3. ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు 4. శ్రీ అన్నే మల్లిఖార్జునుడు 5. శ్రీ ప్రతివాది భయంకరాచారి 6. శ్రీ కాకాని వెంకటరత్నం 7. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు


M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

Blank Page



స్వాతంత్ర్య సమరయోధులకు 1972 ఆగష్టు 15 ఢిల్లీలో తామ్ర పత్ర ప్రదానమునకు వెళ్లు సందర్భములో హైదరాబాద్ రైలు స్టేషనులో శ్రీ రామబ్రహ్మం, శ్రీ కన్నిగంటి సూర్యనారాయణగార్లకు వీడ్కోలు నిచ్చుచున్న రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ కాకాని వెంకటరత్నం, మధ్యలో దత్తుడు చి॥ వెంకటరత్నం.

Blank Page



1972 ఆగష్టు 15 వ తేదీ భారత స్వాతంత్ర్య రజతోత్సవముల
సందర్భమున ఢిల్లీకి ఆహ్వానించిన ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్యసమరవీరులు
భారతప్రధాని శ్రీమతి ఇందిరాగాంధితో తీన్‌మూర్తి భవనమునందు

Blank Page





కుమారి
కొ॥ శే॥ రాజలక్ష్మి
కుమారి వల్లభనేని శోభ
జననం : ది 14-12-52
మరణం : ది 10-7-69



కోడలు
కొ॥ శే॥ రాజ్యలక్ష్మి
వల్లభనేని చంద్ర కుమారి
జననం :
మరణం : ది 30-9-1971

ది 23-8-72 తేదీన ఇరువది యైదవ స్వాతంత్ర్య రజతోత్సవ సందర్భమున నెమ్మలూరు గ్రామ సభాపేదికపై న ఆంధ్రప్రదేశ్ పంచా యితీరాజ్ మంత్రి శ్రీ హయగ్రీవాచారిగారు స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ వల్లభనేని రామ బ్రహ్మంగారినినూతన వస్త్ర ములతో సత్కరించుట.

Blank Page

మొదటి భాగము

శ్రీ వల్లభనేని రామబ్రహ్మం

Blank Page

1

శ్రీ వల్లభనేని రామబ్రహ్మం

దేశపరిస్థితి

పవిత్ర భారత ఖండం మొత్తం పరాయి దేశస్థుల పరిపాలనతో అనేక కష్ట నష్టాలనేగాక అవమానాలను కూడా పొందుతూ బానిసత్వంలో మ్రగ్గిపోతూన్న కాలమది. స్వాతంత్ర్యమనే మాటను సైతం బహిరంగంగా ఉచ్చరించడానికైనా వీలులేని నికృష్ట స్థితిలో ప్రజలు జీవించవలసి వచ్చింది. పరాయి పాలకుల నృశంస పరిపాలనా విధానం ప్రజల మనస్సులను భగ భగ మండించినా, ఆ మంటల తాకిడి ఆంగ్ల ప్రభుత్వాన్ని అంతగా కంపింపజేయలేక పోవడం వల్ల వారు తమ రాకాసి దమన విధానాన్ని మరింత విశృంఖలంగా ఆచరణలో పెట్టి అనేక మంది ప్రాణాలను ఆహుతిగొని ఆనందింప సాగారు.

బానిసత్వంలో పడి మ్రగ్గే భారతీయుల మనస్సులు కాలం గడచిన కొద్దీ తెల్ల దొరల ప్రభుత్వంపై మరింత అసహ్యతను ప్రదర్శించడానికి పూనుకోసాగాయి. అనేక విధాల ఆందోళనలతో దేశం అలకలోలితం కాసాగింది. ప్రముఖ విద్యావేత్త లనేకమంది కార్యరంగంలోకి ప్రవేసించి "స్వాతంత్ర్యం మా జన్మ హక్కు" అంటూ గొంతెత్తి చాట సాగారు. ఎన్ని దౌర్జన్య విధానాలను ఆచరణలో పెట్టి ఈజాతీయ వాంఛను అణచి వేయడానికి ప్రభుత్వం పూనుకున్నా అది అణగారిపోవడానికి మారుగా మరింత విస్తృత రూపంతో ప్రత్యక్షం కాసాగింది.

వంగ దేశాన్ని చీల్చి తమ ప్రభుతను సుస్థిరపరచుకొనాలనే కుత్సిత తలంపు కలిగింది. భారతాన్ని పాలిస్తూన్న వైస్రాయి కర్జన్ ప్రభువుకి ఎంతో నేర్పుగా తన ఉద్దేశ్యాన్ని ఆచరణలో పెట్టి పూనుకున్నాడు. కాని అతని ఈ కుటిల రాజనీతిని బెంగాలీ ప్రజలు గ్రహించ గలిగారు. వెంటనే వారంతా ఆవేశంతో ఈ కార్యాన్ని వ్యతిరేకిస్తూ మహోగ్రమైన ఆందోళన గావించారు. ఈ ఆందోళన వంగదేశానికే పరిమితం కాకుండా యావద్భారత ఆందోళన రూపాన్ని ధరించి తెల్లదొరల ప్రభుత్వాన్ని గడ గడ లాడించ సాగింది.

"వందేమాతరమ్" అనడమే నేరంగా నిర్ణయించింది ప్రభుత్వం. అయినా ఇంటింటా-వాడవాడా - పల్లెపల్లెనా "వందేమాతరమ్" నినాదం మారుమ్రోగిపోతూ ప్రజానీకం హృదయాలను నవోత్సాహంతో నింపి స్వాతంత్ర్య సమరోన్ముఖులను గావించడానికి "పాంచజన్య" సమంగా దీపించింది. ఆంధ్రదేశంలోని ప్రజానీకం "వందేమాతరం" నినాదానికి మరోపదం చేర్చి మరింత దృఢసంకల్పాన్ని ప్రదర్శించి కూకటిప్రేళ్ళతో నృశంస ఆంగ్లప్రభుత్వాన్ని పెకలించి పారవేయటానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. "వందేమాతరమ్ - మందే రాజ్యం" అనేదే ఆ దివ్యనినాదం! ఆ నినాదం వృద్ధులను సైతం స్వాతంత్ర్య సమర రంగంలోకి ఉరుకులు పరుగులు పెట్టేలా చేసిందంటే అత్యుక్తి కాదనే చెప్పాలి. దేశభక్తి అన్నిటికన్నా ముఖ్యమైన పవిత్ర కర్తవ్యంగా ప్రజానీకం భావించి సర్వస్వాన్ని స్వాతంత్ర్య సమరాగ్ని జ్వాలల కాహుతి గావించేందుకు కూడా సంసిద్ధులు కాసాగారు. పరిస్థితులు ప్రభుత్వ పాలకుల మనోధైర్యాన్ని సడలించి యుక్తాయుక్త జ్ఞానహీనులను గావించ సాగడంతో రక్త పిపాసతో విరచుకుపడే రాకాసుల రూపంలో ప్రత్యక్షం కాసాగారు. అయినా ఆందోళన దినదిన ప్రవర్ధమానం అవుతూ నిత్యనూతనోత్సాహ జవసత్వాలను సతంరించుకుంటూ ముంచుకుంటూ పోసాగింది ప్రభుత్వాన్ని!

జననం - బాల్యం

ఆంధ్రదేశంలోని కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా జమీ గొల్వేపల్లి గ్రామంలో క్రీ॥ శ॥ 1907 వ సంవత్సరం సెప్టెంబరు నెల 17 వ తేదీ మంగళవారంనాడు శ్రీ వల్లభనేని వెంకటరత్నం వెంకమ్మగార్లకు ఓ మగ శిశువు కలిగాడు. ఆ పిల్లవానికి రామబ్రహ్మం అనే నామకరణం చేశారు. అల్లారుముద్దుగా పెంచసాగారువారు. తండ్రి చుట్టుపట్ల గ్రామాలలో పేరు పొందిన పెత్తందారు. కలవారి కుటుంబం; వారు గుణంలో, శీలంలో చాలా మంచివారనిపించుకుని పదిమందికీ తలలో నాలుకలా జీవించేవారు. చుట్టు ప్రక్కల గ్రామాలలో ఏవైనా తగవులువస్తే వెంకటరత్నంగారి వద్దకు వచ్చి ఆ తగవులను తీర్చుకొని సంతోషంగా తిరిగివెళ్ళడం అలవాటయి పోయింది.— చీటికీ మాటికీ కోర్టులకు ఎక్కవలసిన అవసరం వెంకట రత్నంగారు బ్రతికివున్నంతవరకూ ఎవరికీ కలగనేలేదు. రామబ్రహ్మం పెరిగి పెద్ద అవుతూ అయిదవయేట అడుగుపెట్టేసరికి తండ్రిగారు జీవ యాత్ర ముగించుకొని పోవడం జరిగింది. చిన్న వయసులోనే కరుణా మూర్తి అయిన తండ్రిని గోలుపోయిన రామబ్రహ్మాన్ని తల్లి, పినతల్లి దుగ్గిరాల బసవమ్మగారు ఎంతో ప్రేమానురాగాలతో పెంచి పెద్దనుగావించ పూనుకున్నారు. పినతల్లికి బిడ్డలు లేకపోవడంవల్ల రామబ్రహ్మాన్నే కన్న బిడ్డకన్న మిన్నగా చూచుకోసాగారు. తండ్రి మరణానంతరం రామబ్రహ్మం ఆస్తి యాభై యకరాల మాగాణీభూమి - కొంత డబ్బూ మొదలైనవి వున్నాయి. క్రమక్రమంగా పెరిగి పెద్దఅవుతూన్న రామబ్రహ్మానికి యధావిధిగా అక్షరాభ్యాసం గావించి విద్యాబుద్ధులు చెప్పించసాగారు. ఆరు - ఏడు - ఎనిమిది - ఒక్కొఏడు పెరుగుతూ వచ్చిన రామబ్రహ్మం పదమూడవ ఏట పాదం పెట్టాడు. ఆనాటి ఆచారం అక్షరాలా పాటించే సంకల్పం కలిగింది పెద్దలకి. పదమూడు సంవత్సరాల వయస్సువాడైన రామబ్రహ్మం వివాహం గావించాలని నిశ్చయించుకుని గుడ్లవల్లేరు గ్రామంలోని ఒకప్రముఖ పొట్లూరి వారి కుటుంబంలోని శ్రీ అచ్చయ్యగారి తమ్ముడైన శ్రీ వెంకయ్యగారి

కుమార్తె శీతామహాలక్ష్మమ్మను ఇచ్చి వివాహం చేశారు. ది. 8-2-1920 సంవత్సరము నందు.

రామబ్రహ్మానికి ఇంగ్లీషువిద్య చెప్పించాలని కుతూహలం కలిగింది పెద్దలకి. గుడివాడలోని బోర్డు హైస్కూలులో చేర్పించారు. కాని అదేసమయంలో సహాయ నిరాకరణోద్యమం మహోత్తుంగ తరంగంగా ముంచి తేల్చసాగింది దేశాన్ని.

శ్రీ చెరుకువాడ నరసింహం, శ్రీ గుప్తా మొదలైన కాంగ్రెసు నాయకుల మహోపన్యాసాలు రామబ్రహ్మం హృదయాన్ని గాఢంగా హత్తుకుపోయి ఇంగ్లీషువిద్యను బహిష్కరించాలనే సంకల్పాన్ని కలిగించాయి. తక్షణం చదువుకు స్వస్తిచెప్పి తన గ్రామం చేరుకున్నాడతడు. స్వాతంత్ర్యంకోసం తను మనధనముల నర్పించి పాటుపడాలనే దృఢదీక్ష రామబ్రహ్మంలో నెలకొని కర్తవ్యోన్ముఖుని గావించింది.

జమీగొల్వేపల్లి గ్రామంలో డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య గారి అధ్యక్షతన ఓ పెద్ద బహిరంగసభ ఏర్పాటుచేయడానికీ, పన్నుల నిరాకరణోద్యమంతోపాటు గ్రామంలో 20 ఖాదీ నేత మగ్గాలనూ - 400 రాట్నాలనూ నెలకొల్పి ఖాదీ ఉద్యమాన్ని ప్రారంభించడానికీ పాటుపడ్డాడు. తటవర్తి గ్రామ కరణంగావున్న శ్రీ ఆదుర్తి సూర్యప్రకాశరావు తన ఉద్యోగాన్ని త్యజించి- ఇంటులోచేరి తగు విధంగా అభివృద్ధికి తెచ్చేందుకు పనిచేయసాగాడు. పన్నుల నిరాకరణ అక్షరాలా అమలుజరిగింది. గాంధీజీ ఆజ్ఞ అయినపిదపనే పన్నులు చెల్లించారు జమీ గొల్వేపల్లి గ్రామస్థులు; రామబ్రహ్మం ఏర్పాటుచేసిన మహాసభ ఫలితంగా కల్లుపాకలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

రామబ్రహ్మం ఇంగ్లీషుభాషను విరమించి దేశసేవా తత్పరతో రాజకీయ రంగంలో చిన్నవయస్సులోనే అడుగుపెట్టడం జరిగింది. అనేక కార్యక్రమాలలో అతడు ముందంజవేస్తూ తన జీవనయాత్రను ప్రారంభించాడు. ఇంగ్లీషుభాషకు మారుగా హిందీని అభ్యసించాలనే కోరిక కలగడం తడవుగా కొంతమంది యువకులను కూడగట్టుకొని ఓ హిందీ పాఠశాలను నెలకొల్పి హిందీని అభ్యసించాడు.

రోజులు గడుస్తున్నాయ్! యువకహృదయం ఉత్తేజంతో ఊగిసలాడి పోసాగింది. గ్రామంలో ఓ నాట్యమండలిని స్థాపించి నాటకాలలో ప్రావీణ్యత చేకూర్చాలనే తలంపు గలిగింది. శ్రీ బాలకృష్ణ నాట్యమండలి అనే పేరుతో ఓ సమాజం స్థాపించాడు రామబ్రహ్మం. చాలా డబ్బు ఖర్చు చేసి రంగాలంకరణకు అనువైన సీనరీలు మొదలైనవాటిని నిర్మింపజేశాడు. ఈ సమాజం అనేక గ్రామాలలో ప్రదర్శనలిచ్చి మంచి పేరును సంపాదించింది.

కళాభిలాష

1925 వ సంవత్సరం నాటికి రామబ్రహ్మం నాట్యకళాభిమానిగా - దేశసేవకునిగా - చిత్తశుద్ధిగల క్రీయాశీలిగా అనేకులచే గుర్తింపబడ్డాడు. కొమరవోలు వాస్తవ్యులు కవిసోదరులైన శ్రీ రాళ్ళబండి నాగభూషణము, వేంకటప్పయ్యగారలు రచించిన "శుద్ధాంధ్ర నిర్వచన శతకంఠ రామాయణము" అనే గ్రంథాన్ని రామబ్రహ్మానికి కృతిగానిచ్చి ఘనంగా సన్మానం పొందగలిగారు.

జమీ గొల్వేపల్లి గ్రామంలోనున్న శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయం ఈనాం భూములు గ్రామస్థులలో ఒకరైన.....కౌలుకు తీసుకొని సవ్యంగా వ్యవహరించక దేవుని నిత్యనైవేద్య కార్యక్రమాలకు లోటు కలిగించినందుకు ఆ గ్రామస్థులలో కొందరు సహించక దావా వేయడం - మైనారిటీతీరిన రామబ్రహ్మం తానూ అందులో కలుగజేసుకొని మద్రాసు హిందూ ధర్మాధాయాల బోర్డుకు దరఖాస్తుపెట్టి ఈ దేవాలయమునకు స్కీమ్ చేయించి ధర్మకర్తగా నియామకం చేయించుకుని అభియోగాన్ని నడపడంలో - స్వామి ఆలయాన్ని బాగుచేయించి అభివృద్ధికి తీసుకురావడంలో అనేకవేల రూపాయలు వ్యయపరచడం జరిగింది. అభియోగంలో విజయమంది-భూములను స్వాధీనపరచుకొని స్వామికి ఆదాయం పెరిగే అనేకఏర్పాట్లను స్వయంకృషితో గావించాడు శ్రీ రామబ్రహ్మం.

దేశసేవ

ఒకవైపు దేశభక్తి ప్రేరితుడై మరో వైపు వ్యాపార దక్షతను గూడా ప్రదర్శించ పూనుకున్నాడు రామబ్రహ్మం. ఆ రోజులలో ప్రయాణ సౌకర్యార్థం బస్సులు చాలా అవసరంగా తోచాయి అతనికి. జిల్లాలోని ఎవరికీ ప్రభుత్వం బస్సులునడిపేందుకు లైసెన్సులు ఇచ్చేవారుకాదు. అలాంటి స్థితిలో రామబ్రహ్మం తన పలుకుబడిని వినియోగించి "కైకలూరు - గుడివాడ" - "గుడివాడ - ఉయ్యూరు" రూట్లలో బస్సులు నడుపుకునేందుకు లైసెన్సులు పొందాడు. "శ్రీ వేంకటేశ్వర మోటారు సర్వీస్" అనే పేరుతో ఇది ప్రారంభింపబడింది. కాని ఈ సర్వీస్ ప్రారంభింపబడిన వెంటనే ఈయన ఏకైక పుత్రుడు సంవత్సరం వయస్సువాడు ఎలాంటి జబ్బూ, కారణమూ లేకుండానే అకస్మాత్తుగా చనిపోడం తటస్థించింది.

ఈ సంఘటన రామబ్రహ్మం హృదయాన్ని ఒక్కసారిగా ప్రక్కలయ్యేలాచేసింది. ఉత్సాహం నశించింది. విరక్తి కలిగింది. ఎన్నెన్నో ఆశయాలతో ప్రారంభించిన ఆ బస్ సర్వీసును గుడివాడ వాస్తవ్యులైన శ్రీ కఠారి సుబ్బయ్య అనే ఆయనకు అమ్మివేశాడు.

విచారమూ - విరక్తీ కొన్నాళ్ళు ఏ కార్యక్రమంలోనూ రామబ్రహ్మాన్ని మనస్సునిలిపి పాల్గొనకుండా చేసాయి. రోజులతోపాటు ఆతని హృదయంలోని వేదనా - విరక్తీ కొంచెం కొంచెంగా క్షీణిస్తూ కొన్నాళ్ళకు పూర్తిగా అదృశ్యమైపోయి తిరిగి పదిమందిలో అతడు మెలగ గలిగే అవకాశాన్ని కలిగించాయి. పుత్రుని మరణంతో కోలుపోయిన ఉత్సాహ శక్తులు క్రమక్రమంగా తమ తమ స్థానాలను ఆక్రమించుకొని అతనిని కార్యశూరునిగా తీర్చిదిద్ది రంగస్థలంలోకి ప్రవేశపెట్టాయి.

రాజకీయ వాతావరణం కొంత చల్లబడినట్లు తోచింది. రామబ్రహ్మం తిరిగి బస్‌సర్వీసు ప్రారంభించి గుడివాడ - బందరూ, ఏలూరు-చింతలపూడి - తిరువూరు మొదలైన చోట్లకు బస్సులను నడపడం సాగించాడు. ఇందుకు అనువుగా ఉంటుందనే ఉద్దేశ్యంతో గుడివాడలో 20 వేల రూపాయల ఖర్చుతో ఓపెద్ద బిల్డింగు కట్టించి అందులో ఆఫీసునుపెట్టడం - "వి. ఇర్. చౌదరి అండ్ కంపెనీ" అనే పేరుతో ఓ సంస్థను స్థాపించి దాని ప్రొపైట్రరుగా వుండి చిన్నకార్లకూ - ట్రక్కులకూ ఏజెంటుగా నియమింపబడి విరివిగా ప్రచారంతో కృష్ణా పశ్చిమగోదావరి జిల్లాలలో వ్యాపారం భారీగా సాగించి కార్ల కంపెనీవాళ్ళతో గూడా ప్రశంసల నందుకోగలిగాడు అతడు.

8

మహాత్ముని ఖద్దరు యాత్ర

1929వ సంవత్సరం ప్రవేశించింది. రాజకీయవాతావరణం కొంచెం కొంచెంగా మార్పుపొందుతూ రాసాగింది. మహాత్మా గాంధీ ఖద్దరుయాత్రకు బయలుదేరాడు. ఆ యాత్రలో ఆంధ్రదేశ సంచారం ఏర్పాటు చేయబడింది. ఆంధ్రదేశ సంచారంలో కృష్ణా జిల్లాలో పర్యటన సమయం నిశ్చయింప బడింది. డాక్టర్ పట్టాభిఅంటే రామబ్రహ్మానికి ఎంతో పూజ్యభావం ఏర్ప డింది. ఆయనను తన గురు తుల్యునిగా భావించి ఏమి చెబితే అది ఆచర ణలో పెట్టడానికి సంసిద్ధ మయ్యేవాడు. మహాత్మా గాంధీ పతిత జనోద్ధ రణకు భూమిపై అవతరించిన మహాత్ముడని 14 వ ఏటనే రామబ్రహ్మం నిశ్చయించుకున్న కారణంవల్లనే ఆయన ఆశయాల ఆచరణకు సర్వథా నడుంకట్టి నిలవడం జరిగింది. తాను దైవసమునిగా భావించిన పూజ్య బాపూజీ కృష్ణాజిల్లా పర్యటనకు రాబోతూండటమే రామబ్రహ్మం హృద యానికి ఎంతో ఆనందకారకం కాగా - క్రొత్తగా తాను కొన్న చిన్న కారులో మహాత్ముని అన్నిచోట్లకూ తీసుకుపోవలసిన భారం తనపైనే మోపుతూ గురువుగారైన పట్టాభి వార్తపంపడం వర్ణింపరాని తన్మయావ స్థను చేకూర్చి విడచింది !

గాంధీజీకి సారధిగా కావడం - ఆయన కార్యక్రమాన్ని నిర్వి ఘ్నంగా కొనసాగింప బడేలా చూడటం అనుకున్నంత తేలిక పనిగాదని రామబ్రహ్మం గుర్తించగలిగాడు. అయినా తన సర్వశక్తులనూ కేంద్రీక రించి బాపూజీకి సంతృప్తి కలిగించేందుకు సంసిద్ధమయ్యాడు.

కృష్ణాజిల్లా మొత్తంలో అనేక గ్రామాలకు వెళ్ళవలసిన కార్య క్రమం ఏర్పాటు చేయబడింది. గాంధీజీ సందర్శించవలసిన గ్రామాలు సరియైన సమయాలకు చేరుకోవలసిరావడం చాలా కష్టంతో కూడుకున్నదే

అయ్యింది. ఒక్కోసారి గంటకు 60 మైళ్ళ వేగంతో కారు నడపవలసి వచ్చేది. అలాంటి సమయాలలో వెన్నంటివచ్చే కారులూ - పోలీసువారి వ్యాన్‌లూ ఎంతో సమయం గడచిన తరువాతగానీ నిర్ణీత గ్రామానికి చేరుకోలేక పోయేవి. రామబ్రహ్మంలో అంతటి అతిసాహసం ఏ అదృశ్య శక్తి ప్రసాదితమోనని తనలో తానే ఆశ్చర్యపోయేవాడు.

నైకలూరు మకాంలో ఓ పోలీస్ ఆఫీసర్ రామబ్రహ్మాన్ని పిలచి- "మీరు అనుకున్న సమయానికే అన్నిచోట్లా సభలూ - సమావేశాలు నిర్వహించ గలుగుతున్నారు. మీరు ఇంత నేర్పుగా కారు ఎలా నడప గలుగుతున్నారు? ఎంతో అనుభవమున్న మేము మిమ్మల్ని సమయానికి చేరలేక పోతున్నాం. ఉపన్యాసాలను వ్రాసుకోలేక పోతున్నాం. ఇంత నేర్పు మీకు ఎలావచ్చిందో!" అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తంచేశాడు. రామబ్రహ్మం చిరునవ్వుతో చూచాడు. అంతే!

నైకలూరులో సభ జరుగుతోంది. కొంతమంది వ్యక్తులు సభను ఎలానైనా పాడుచేయాలనే భావంతో అక్కడకుచేరారు. గాంధీజీని చెప్పదలచింది చెప్పనివ్వకుండా మాటి మాటికీ అడ్డుప్రశ్నలతో విసిగించి అవమానించాలనే ప్రయత్నం సాగించారు. అయినా బాపూజీ తన సహజ మధుర మందహాసవందనంతో విసుగనేది కనిపించనివ్వక వారి ప్రశ్నలకు తగు సమాధానాల నందిస్తూవచ్చారు. ఎంతకూ బాపూజీ ఉపన్యాసాన్ని అడ్డుపెట్టలేని ఆ అల్లరిమూక అసహనంతో రెచ్చిపోదలచారు మహాత్మాజీ తన మామూలు ప్రకారం ఉపన్యాసాన్ని ముగించి వేదికనుండివచ్చి కారులో కూర్చున్నాడు. అపజయమందిన ఆ మూక గబగబావచ్చి కారును చుట్టముట్టింది. కాని బాపూజీ కన్నులలో మెరుపుగానీ, పెదవుల మీది చిరునవ్వుగానీ ఏమాత్రం వన్నె దొరగలేదు. చుట్టుముట్టిన ఈ మూకలను ఒత్తిగించుకుంటూ అతి కష్టంమీద కస్తూరిబా, డాక్టర్ పట్టాభిగారూ కారులోకి చేరుకోగలిగారు.

స్టీరింగ్‌వీల్ ముందు కూర్చున్న రామబ్రహ్మం ఆమూకల అల్లరికి అమితమైన అసహ్యాన్ని పొందాడు. అంతకుమునుపు మనిషికి బదులు తానిప్పుడో కొత్తమనిషి నయ్యానని అనుకున్నాడు. అంత అనుచిత ప్రవర్తన తనలో ఆగ్రహాన్ని రేకెత్తించక శాంతి-అహింసా సిద్ధాంతాలను అక్షరాలా ఆచరణలోపెట్టే మనోదశను కలిగించినందుకు అమితమైన ఆశ్చర్య సంభ్రమాలలో మునిగిపోయాడు. తనలోని ఈ పరివర్తనకు బాపూజీలోని అమోఘమైన అదృశ్య శక్తే కారణ మనుకున్నాడు చివరికి.

ఒక్కపలుకైనా ఆడకుండా ఆ మూకలను తప్పించుకుంటూ కారులోవున్న పూజ్యులకు ఎలాంటి అపకారమూ కలుగకుండేలా అతి నేర్పుతో కారును ఊరువెలుపలకు జేర్చాడు రామబ్రహ్మం. గాంధీజీ ఆశ్చర్యంతో డాక్టర్ పట్టాభినిచూస్తూ "ఇంతమంది జనంలోనుండి కారును ఎలా తప్పించుకు తీసుకురాగలిగాడితడు?" అంటూ అడిగాడు.

"మా రామబ్రహ్మం మహా ఓర్పు-నేర్పులుగల వ్యక్తి. అందుకనే మీ కారునడిపే భారం ఇతనికి అప్పగించాను" అంటూ జవాబు చెప్పాడు పట్టాభి.

ఇది విన్న రామబ్రహ్మం తనలో తాను—"బాపూజీ! నీ సన్నిహితత్వంవల్ల నాజన్మమే ధన్యమైంది" అనుకొని సంతృప్తిగా నిట్టూర్పు విడిచాడు.

గాంధీజీ పర్యటనలో కృష్ణాజిల్లా మొత్తంలో 32 వేల రూపాయలు పైగా ఖద్దరునిధికి ధనం లభించింది. అనేక గ్రామాలలో స్త్రీలు తమ ఒంటిమీదనున్న ఆభరణాలనుతీసి బాపూజీకి అందజేశారు. సభలకు ఇసుక వేస్తే రాలనంతగా జనం వచ్చేవారు. ఉపన్యాసం పూర్తికావడంతో ఆయన వచ్చి కారులో కూర్చొనేవాడు. రామబ్రహ్మం వెంటనే మరోచోటుకు

కారును పరుగెత్తించేవాడు. కారు నడుస్తున్నంతసేపూ గాంధీజీ ప్రశాంతంగా నిద్రపోయేవాడు. గమ్యం చేరిచేరడమే తనకు తానుగానే ఆయన మేల్కొని కార్యక్రమంలో పాల్గొనేందుకు సంసిద్ధుడవటం అందరినీ ఆశ్చర్యపరవశులను గావించేది.

కృష్ణాజిల్లా పర్యటన ముగిసింది. రామబ్రహ్మం తన సారథ్యంలోనే బాపూజీబృందాన్ని గుంటూరుజిల్లా చేర్చాడు. రామబ్రహ్మంలోని నేర్పును ఎన్నో విధాల కొనియాడుతూ అక్కడి నాయకులకు బాపూజీ స్వయంగా పరిచయం చేయడం రామబ్రహ్మాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. అత్యంత భక్తిశ్రద్ధలతో అంజలి ఘటించి బాపూజీ ఆశీర్వాదాన్ని పొంది తిరిగి స్వస్థలాన్ని జేరుకున్నాడు తన్మయత్వంతో!

ఉప్పు సత్యాగ్రహం

1930 వ సంవత్సరం నూతన జవసత్వాలతో ఉరుకులు పరుగులు తీసుకుంటూ ప్రవేశించింది. రాజకీయ వాతావరణం ప్రతి భారతీయుని హృదయాన్ని ఆవరించుకుని తెలియని ఉత్తేజోద్రేకాలతో ముందెత్త సాగింది. మహాత్మా గాంధీ నాయకత్వంలో ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించబడింది. ఈ ఉప్పు సత్యాగ్రహ ఆయుధంతో బ్రిటీషు ప్రభుత్వం గుండెలను చీల్చి చెండాడ పూనుకుంది భారత ప్రజ!

తూర్పు కృష్ణాజిల్లాలో ఈ సత్యాగ్రహ సమరనాయకునిగా డాక్టర్ పట్టాభి నాయకులుగా ఎన్నుకోబడ్డాడు. ఆయన అహోరాత్రాలు శాంతియుత సత్యాగ్రహ సమరాన్ని సాగించేందుకు కష్టించి వ్యూహరచనకు, వాలంటీరుయోధుల సమకూర్చుకొనేందుకు పని సాగించారు. ఏపని కైనా డబ్బు అవసరమేకదా! ఒకవైపు సత్యాగ్రహులను – మరోవైపు వారికి

తగు ఆలనాపాలన చూచేందుకు డబ్బును సమకూర్చుకుంటూ మహా నేర్పరి అయిన సేనాధిపతిగా కార్యరంగంలో ప్రవేశించాడు. బందరులో సత్యాగ్రహ సమర శిబిరం ఏర్పాటుచేశారు. పత్రికలుకూడా దేశంలోని ప్రజలను ప్రోత్సహిస్తూ అనేక విధాలుగా సహకరించ సాగాయి. పానిసత్వంలోపడి ప్రగ్గుతూన్న భారతమాతకు విముక్తి ప్రసాదించే ఈ సత్యాగ్రహ సమరంలో ప్రతి భారతీయుడూ పాల్గొని తను మన ధనముల త్యాగం గావించడానికైనా సన్నద్ధం కావడం ప్రధమ కర్తవ్యంగా ప్రబోధింపబడ సాగారు. ఎక్కడచూచినా ఈ విషయమైన కోలాహలమే! ఏనోటవిన్నా ఈ ఉప్పు సత్యాగ్రహ సమర వార్తలే! యువకులు, వృద్ధులూ, బాలురూ, బాలలూ వయోభేదం కనుపించలేదు. దేశం యావత్తూ నూతన తేజో కాంతుల తేజరిల్లి పోసాగింది. పరప్రభువుల కన్నులు ఈకాంతికి చలించిపోయాయి! మనస్సులు కంపన నందాయి!!

రామబ్రహ్మం మనస్సు దేశభక్తితో విచలితమై పోసాగింది. దేశమింత ఉత్సాహోద్రేకాలతో ఉప్పొంగిపోతూంటే తాను ఏమీ చేయక సుఖంగా జీవించడం ఒక జీవితమేనా! ఉహూ! తాను దేశ స్వాతంత్ర్యం కోసం శక్తిగలంతవరకూ పాటుపడవలసిందే! అదే తన ప్రధమ కర్తవ్యం! అదే తనజన్మ సాఫల్యం! ఇక ఏమాత్రం ఆలసించడం తగదు అనుకున్నాడు. ఆస్తిపాస్తుల విషయమై చూచేందుకు తన బావగారైన శ్రీపొట్లూరు లక్ష్మీనృసింహంగారిని నియమించి తాను సరాసరి బందరు చేరుకుని సత్యాగ్రహిగా శిబిరంలో ప్రవేశించాడు.

సత్యాగ్రహంలో పాల్గొనేందుకు రామబ్రహ్మం శిబిరంలో ప్రవేశించడంలోనే అక్కడవున్న సత్యాగ్రహుల ఆనందం వర్ణింప నలవిగాకుండా పోయింది. అలాంటి ఉత్తమ కార్యదీక్షా పరతంత్రుడైన వ్యక్తి సత్యాగ్రహిగా రావడం వారందరిలో మరింత ఉత్సాహ దీక్షాకారకమైంది.

వారంతా రామబ్రహ్మాన్ని ఒక దళానికి అధిపతిగా సహర్షంగా ఎన్నుకొని గౌరవాన్ని ప్రకటించారు.

ఉప్పుసత్యాగ్రహం: సముద్రప్రాంతమైన చిన్నాపురంలో క్యాంపు బిశిరం ఏర్పాటుజరిగింది. అది అనువైన ప్రదేశంగా నిర్ణయించుకోబడింది. ఆ శిబిరానికి వాలంటీర్లను బందరునుండి తీసుకువెళ్ళడానికి రామబ్రహ్మం తన స్వంతబస్సులనే ఏమాత్రం జంకులేకుండా ఉపయోగించవలసిందిగా ఆదేశాన్నిచ్చాడు. సర్వీసు బస్సులలో సత్యాగ్రహులు నిర్ణీతస్థానాలకు జేరవేయబడ్డారు. ఇలా సత్యాగ్రహులను అనుమతిలేని మార్గాలలో తీసుకు పోవడం ఘోరమైన నేరంగా ప్రభుత్వం తలపోసింది. కేసుపెట్టింది. బందరు సబ్ మేజిస్ట్రేట్‌కోర్టులో విచారణ జరిగింది. 300 రూపాయలు అపరాధ శుల్కంగా విధింపబడి చరాస్తి నిర్బంధంతో ఆ అపరాధ శుల్కాన్ని రాబట్టుకుంది ప్రభుత్వం. ఇంతతో పోనిస్తే చాలదనీ ఇలాంటి వ్యక్తిని పూర్తిగా లొంగదీయడం అవసరమనీ భావించి తక్షణం రామబ్రహ్మానికున్న బస్సుల లైసెన్సుల నన్నిటినీ రద్దుచేసి విజయోల్లాసంతో వికటాట్టహాసం గావించారు పరాయి ప్రభువుల పాదసేవకులు! పరమ హేయ ప్రవర్తకులు!

ఇందుమూలంగా రామబ్రహ్మానికి కలిగిన నష్టం లక్షరూపాయలు! ల-క్ష-రూ-పా-య-లు!- అయినా ధీరత్వం మూర్తీభవించిన రామబ్రహ్మం ఏమాత్రం తొణకలేదు. మరింతపట్టుదల ఏర్పడింది వానిలో! సత్యాగ్రహులను జేరవేసిన నేరంపైనే రామబ్రహ్మం బస్సుడ్రైవరు శ్రీ అన్నె వెంకటశివుడు అనే అతనికి నాలుగు నెలలు శిక్ష విధించింది ప్రభుత్వం. రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారు అతనిని. ఈ ఘోరదురంతక ప్రభుత్వ శాసననీతికి, రీతికి చాలామంది సర్వీసులోని ఉద్యోగులు ఆగ్రహావేశ పరవశులయ్యారు. వారిలోనూ దేశ భక్తిభావం పాదుకొంది. వారూ

చాలామంది దేశసేవలో తమ తను మన ప్రాణధనాదులను అర్పణ గావించేందుకు నిశ్చయించుకుని పనిచేయడం ప్రారంభించారు.

రామబ్రహ్మం తన వాలంటీర్ దళముతో మరింత ఉత్సాహంతో గ్రామగ్రామం తిరిగి ప్రజలకు సత్యాగ్రహోద్యమం గురించి విపులంగా తెలియజేస్తూ సంచారం ప్రారంభించాడు. కొన్నాళ్ళకు స్వగ్రామం జమీ గొల్వేపల్లి చేరుకుంది ఈ దళం.

అడ్డాడ కల్లుపాకముందు పికిటింగు ప్రారంభించారు వీరు. ఒకరోజు రెండురోజులు!! మూడురోజులు!!! ఈ పికిటింగు మూలంగా ఫలితం సంతృప్తికరంగా తోచలేదు రామబ్రహ్మానికి. రైతులతో ఈ విషయమై చర్చించి చూచాడు. కల్లు దొరకడం మానితే త్రాగేవాళ్ళు వారంతట వారే మానుకుంటారు. అసలు మూలాన్నే ఛేదిస్తేకాని ఈ మద్యపాన నిషేధోద్యమం సఫలంకాదు. కనుక అందుకు తగిన ఏర్పాట్లు చేయదలిచాడు. రైతులూ – చాలామంది ప్రజలూ రామబ్రహ్మం అభిప్రాయాన్ని బలపరిచారు. వారందరి అనుమతితో రామబ్రహ్మం ఆత్మబలం మరింత పెరిగింది. దళంతో బయలుదేరి కొమరవోలు గ్రామం తాలూకూ కల్లుగీయు తాళ్ళనుండి కల్లునిచ్చే గెలలను నరికించి వేశాడు.

ఇంకేముంది! పోలీసుబలగం ఈ వార్తనందుకొని ఆగమేఘాలవచ్చి వ్రాలింది. దళాన్ని మొత్తంగా అరెస్టు చేసింది. వీరందరిపైనా ది 30-4-1930 తేదీన గుడివాడ సబ్ మేజిస్ట్రీట్ కోర్టులో ఐ. పి. సి. 143-426 సెక్షన్లక్రింద కేసులు పెట్టారు పోలీసులు. ఈ కారణంగా దళంలోనివారందరికీ ఆరు నెలలు శిక్ష విధింపబడింది. 'సి' క్లాసు ఇచ్చారు.

రామబ్రహ్మంతోపాటు శిక్షపొందిన దళం సభ్యులు శ్రీ ఆరెకపూడి కోటయ్య, శ్రీ రాళ్ళబండి దుర్గానాగేశ్వరరావు, శ్రీ కొమ్మ సత్యనారాయణ,

శ్రీ సన్నపనేని పున్నయ్య, శ్రీ మోటూరి వెంకటాచలపతిరావు, శ్రీ వల్లభనేని వెంకట కృష్ణయ్యలు. వీరందరిని తీర్పు చెప్పిననాటిరోజు అర్ధరాత్రి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకుపోయారు. అదే పగలయితే ప్రజలు విరగబడి తమ అభిమాన సత్యాగ్రహులకు ఎక్కడ నీరాజనాల నర్పించ పూనుకుంటారోననే భయమే అలా చేయడానికి కారణం అనక తప్పదు మరి!

కారాగారవాసం

రాజమండ్రి సెంట్రల్ జైలులో పదిరోజులు గడిపాడు రామ బ్రహ్మం. ప్రభుత్వం ఏమనుకుందో ఏమో అక్కడనుండి బరంపురం జైలుకు అతణ్ణి మార్చింది. శిక్షాకాలం ఆ జైలులోనే పూర్తిచేసి విడుదల పొందిన రామబ్రహ్మం ఊళ్లోకి పోదామనుకుంటూంటే అక్కడి పోలీసులు అతణ్ణి అడ్డుపెట్టారు. తన స్వేచ్ఛకు వారి అవరోధం సహింపరాదనుకొని అక్కడనే సత్యాగ్రహం ప్రారంభించి - విజయంతో వ్యక్తిస్వేచ్ఛా - స్వాతంత్ర్యాల విలువను ఎలుగెత్తి చాటాడు. ఆ రోజంతా స్వేచ్ఛగా బరంపురం పట్టణమంతా తిరిగి బెజవాడకు బయలుదేరాడు.

ఈవార్త తెలిసిన ప్రజలు ఆనందానికి అంతులేకపోయింది. బళ్ళారి జైలునుండి విడుదలపొంది వచ్చిన శ్రీ చలపతిరావునీ, బరంపురంనుండి వచ్చిన రామబ్రహ్మంనీ — దేశభక్తులూ - సేవకులూ అత్యంత ఆదరాభిమానాలతో సత్కరించి పురంలో ఊరేగించి తమ కృతజ్ఞతను వ్యక్తపరుచుకున్నారు. వారి ఈ ఆదర సత్కారాలకు రామబ్రహ్మం మనసు పులకలెత్తింది.

రోజులు గడుస్తూన్నాయి. 1930 వ సంవత్సరం గతించింది. క్రొత్తసంవత్సరం ప్రారంభమైంది. జనవరి 26 వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరపాలని నిశ్చయం జరిగింది. తూర్పు కృష్ణాజిల్లా కేంద్ర స్థానమైన బందరులో 144 వ సెక్షన్ విధించబడింది. అఖిల భారత కాంగ్రెసు ఎలాంటి నిర్బంధాలు విధింపబడినా స్వాతంత్ర్యదినోత్సవం జరిపితీరవలసిందే అనే ఆదేశాన్ని పంపింది.

ఆ ఆదేశాన్ని అక్షరాలా ఆచరణలో పెట్టడానికి రామబ్రహ్మం ముందుకు వచ్చాడు. నిరంకుశ బ్రిటీష్ అన్యాయ శాసనాన్ని ధిక్కరించి వీరత్వంతో స్వేచ్ఛ - స్వాతంత్ర్య పిపాసను ఎలుగెత్తి ఘోషించేందుకు ఈ రామబ్రహ్మంతోపాటు కురుమద్దాలి వాస్తవ్యులు మరో రామబ్రహ్మం సంసిద్ధమయ్యాడు. ఇద్దరూ రామబ్రహ్మం నామధేయులే! ఈరామబ్రహ్మం వల్లభనేని రామబ్రహ్మం అయితే, ఆ రామబ్రహ్మం గుళ్ళపల్లి రామబ్రహ్మం. ఇరువురూ అతి సాహసంతో తమజన్మహక్కు అయిన స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను చాటిచెప్పేందుకు రంగస్థలంలో ప్రవేశించారు. తప్పక త్యాగి మానవత్వాన్నే విస్మరించి హేయప్రవృత్తితో నిండిపోయిన పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు. చిత్తమొచ్చినట్లు గొడ్డును బాదినట్లు బాదివిసిగి - అలసి తమ దౌర్జన్యకాండనుండి విరమించి వీరాధివీరులైనట్లు నలుదిశలా పరిక్రించారు.

రామబ్రహ్మం ఒళ్లు లాఠీదెబ్బలకు విపరీతంగా కలిమిలి కంది పోయింది. అయినా తన దీక్షావ్రతాన్ని అణుమాత్రం సడలించుకునేందుకు అంగీకరించలేదు అతడు. జయజయ నినాదాలు గావిస్తూనే వున్నాడు. స్వాతంత్ర్య శపథాన్ని వల్లిస్తూనేవచ్చాడు. లాఠీచార్జీ ముగిసింది. విపరీతమైన బాధ కంపింపజేస్తూంది. అంతలో తృప్తిపడలేదు రాకాసిమూక. అతణ్ణి బంధించి సబ్‌జైలుకు గొనిపోయి-అందులో పడనెట్టారు. ఆ రాత్రి ఆ దెబ్బల బాధతోనూ - ఆత్మ సంతృప్తితోనూ ఆ జైలులోనే గడచిపోయింది రామబ్రహ్మానికి.

ఆ మరునాడు సబ్‌మేజిస్ట్రీటు ఐ. పి. సి. 151 సెక్షన్ క్రింద రామబ్రహ్మాన్ని నిందితునిగా నిర్ణయించి 3 మాసాలు కఠిన కారాగారవాస శిక్షను విధించి, తను దేశోద్ధారణ కార్యంలో అమోఘమైన కార్యం గావించినట్లు ఘంటీ విరుచుకుని చూచాడు ఆ మేజస్ట్రీట్! రామబ్రహ్మం చేతులకు సంకెళ్ళను తగిలించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకు పోయారు. అక్కడి, ఆహార, వాతావరణ ప్రభావాలు అతని ఆరోగ్యాన్ని భంగపరిచాయి. అనారోగ్యంతోనే తనకు విధించిన శిక్షాకాలాన్ని గడప సాగాడు అతడు.

మార్చినెల ప్రవేశించింది. ఆంగ్ల పరిపాలకవర్గ ప్రతినిధి ఇర్విన్‌కూ, భారత జాతీయ కాంగ్రెస్‌నేత గాంధీజీకిమధ్య సంభాషణలు నడచి ఓ వ తేదీన ఒక ఒడంబడిక కుదిరింది. ఈ ఒడంబడిక ప్రకారం దేశంలోని రాజకీయ ఖైదీల నందరినీ విడిచిపెట్టడం జరిగింది.

రాజమండ్రి పౌరులు వేలాదిమంది సెంట్రల్ జైలుగేటు ముందు తెల్లవారుతూండగానే జేరుకోవడం ప్రారంభించారు. వారి ఆనందోత్సాహా లకు అంతులేకపోయింది. కొందరు పూలమాలలు తెచ్చారు. మరికొందరు బ్యాండ్‌మేళం ఏర్పాటుచేశారు. ఇంకా కొందరు జెండాలను ఎగురవేస్తూ జయ జయ నినాదాలను మిన్నుముట్టేలా అరవడం ఆరంభించారు. అంత కంతకూ కోలాహలం అధికమైంది. ఎనిమిది గంటలు వినిపించాయి, జైలు సింహద్వారం తలుపులు తెఱుచుకున్నాయ్! మధుర మందహాస వదనాలతో రాజకీయఖైదీలు వెలుపలకు అడుగుపెట్టారు. ఎట్టి ఎదుటగల జనసముద్రాన్ని చూచి విస్మయులై పోయారు. ఎంత ఆప్యాయత! ఎంత ప్రేమ! ఎంత అభిమానం! తమ జన్మలే తరించిపోయిన వనుకున్నారు సత్యాగ్రహ ఖైదీయులు! పూలమాలలతో కంఠాలు నిండిపోయాయి! ఆనందంతో హృదయాలు అల్లకల్లోలితమై పోతుండగా "భారమాతకీ

జై - గాంధీకి జై" మొదలైన నినాదాలు మంగళగీతాలుగా వినిపించాయి. ఊరేగింపు! పెద్ద ఊరేగింపు! ఊహించనైనాలేని విధంగా జైలుగోడల ఈవల అడుగుమోపడం తడవుగా ఇలాంటి సన్మానసత్కారాలు జరగడం కలగా తోచటంలో అబ్బుర మేముంటుంది. కాని కొంతసేపటికి ఇది నిజంగా వారు గుర్తించ గలిగారు.

ఊరేగింపు మహోత్సాహంగా ముందుకు సాగింది. ఓధి ఓధినా, ఇంటింటా రాజకీయ బంధితులకు నీరాజనాలు అర్పించ బడినయ్! మేడల నుండి - మిద్దెలనుండి పూలవర్షం కురిసింది. ఉక్కిరిబిక్కిరి అయి పోయాడు రామబ్రహ్మం! అతనిలానే ఇతరులూను! ఇంతటి అమోఘ సన్మాన సత్కారాలకు మూల కారకులు ప్రముఖ కాంగ్రెసు నాయకులైన శ్రీ డాక్టర్ పాలకోడేటి గురుమూర్తిగారేనని గుర్తించారు రామబ్రహ్మం. ఆయనకు ప్రజలబలం ఎంతగావుందో చూచి ఆశ్చర్యపోయాడు. అంతటి క్రియాశీలి అయిన నాయకుడు కలగడం రాజమండ్రి పౌరుల అదృష్టమేనని మురిసిపోయాడు.

ఊరేగింపు శ్రీ గురుమూర్తిగారి యింటివద్ద ముగిసింది. భోజనాల ఏర్పాటుకూడా అక్కడే. సత్యాగ్రహయోధు లందరినీ కలిపి భోటో తీయించారు. అప్పటికి కాస్త విశ్రాంతి లభించింది వీరికి. సాయంత్రం జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో ఈ సత్యాగ్రహ యోధుల పరిచయం జరిగింది. ఇసుకవేస్తే రాలనివిధంగా జనం వచ్చారు సభకి. రామబ్రహ్మం తన్మయత్వంతో తన్నుతానే మరచిపోయాడు ఆజనాన్ని చూస్తూ.

సత్యాగ్రహసమరం

ప్రతి పట్టణంలోనూ ఓ శిబిరాన్ని నెలకొల్పి విదేశీవస్త్ర బహిష్కరణకూ, మద్యనిషేధ కార్యక్రమాన్ని అమలు జరిపించుట కొరకూ శాంతియుత సత్యాగ్రహాన్ని ప్రారంభించవలసిందిగా కాంగ్రెసు సంఘంనుండి

ఆదేశం అందింది రామబ్రహ్మనికి. ఆ ఆదేశానుసారం గుడివాడలో ఓ శిబిరాన్ని నెలకొల్పాడు అతడు. ఈ శిబిరంలో 50 మంది వాలంటీయలు వచ్చి చేరారు. ఈ వచ్చినవారిలో చాలామంది స్త్రీలు కూడా వున్నారు. ఈ స్త్రీలలో రామబ్రహ్మం భార్య శ్రీమతి సీతామహాలక్ష్మమ్మ కూడా వుంది. పట్టణంలోని ప్రముఖులైన, న్యాయవాదులలో ఒకరైన శ్రీ కేతవరపు లక్ష్మీనృసింహారావు, డాక్టర్లలో ఒకరైన శ్రీ ముదునూరు గుర్రాజు, వర్తకులలో ఒకరైన శ్రీ గోనుగుంట్ల సుబ్రహ్మణ్యగుప్త పౌరులలో ఒకరైన శ్రీ మూడెక్క రామారావులు మొదలైనవారు వున్నారు. ఈ సత్యాగ్రహుల బృందానికి పౌరులూ - వర్తకులూ పూర్తి ఆదరప్రోత్సాహాలనిచ్చి ఆదుకొన్నారు. జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కానూరి వెంకటదాసయ్యగారు అప్పుడప్పుడూవచ్చి శిబిరాన్ని పరిశీలించి రామబ్రహ్మనికి తగు ప్రోత్సాహాన్నిస్తూ వచ్చారు.

సత్యాగ్రహులు శాంత - సహనాలతో నిర్విరామంగా విదేశీవస్త్ర విక్రయశాలలవద్దా - కల్లుపాకలవద్దా పికిటింగుచేస్తూ వాటివల్ల దేశ ఆర్థిక-ఆరోగ్యస్థితికి ఎంత అపకారం జరుగుతున్నదో వివరించి చెబుతూ రాసాగారు. విదేశీవస్త్రాలను కొనేవాళ్ళను కొనవద్దనీ, కల్లు త్రాగేవాళ్ళను త్రాగవద్దనీ ప్రాధేయపూర్వకంగా ప్రార్థించి - వారి మనసులను మార్చి వెనుకకు మళ్ళించి చేయడంలో వాలంటీర్లు దినదినానికీ అభివృద్ధిని సాధిస్తూ మరింత ఉత్సాహంతో పనిచేయసాగడంతో రెండుమాసాలు గడచిపోయాయి. కల్లు అమ్మకం తగ్గిపోయింది. విదేశీవస్త్రం విడుదల కుంటుబడి పోయింది. పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించిన బట్టలకొట్టులవారు తమ కొట్టులను మూసివేయడానికి అంగీకరించి - కొట్టులను తెరువడమే మానివేశారు. ఈ విజయానికి రామబ్రహ్మం, అతని ఆధ్వర్యాన సత్యాగ్రహం సాగించిన సత్యాగ్రహులు ఎంతో ఆనందించారు. పికిటింగు కార్యక్రమం ముగించబడింది.

౨౦

సత్యాగ్రహాల మహాసభ

తూర్పు కృష్ణాజిల్లా సత్యాగ్రహుల మహాసభ జమీగొల్వేపల్లి గ్రామంలో ఏర్పాటు చేయబడింది. కృష్ణాపత్రిక అధిపతులూ ప్రముఖ దేశ భక్తులూ - నాయకమ్మన్యులూ అయిన శ్రీ ముట్నూరి కృష్ణారావుగారిని అధ్యక్షులుగా పిలిపించారు. జిల్లాలోని సత్యాగ్రహులంతా మహాసభకు వచ్చారు. ఎంతో ఉత్సాహంతో ఊరేగింపు బయలుదేరింది. కొన్ని వీధులు తిరిగేసమయానికే పిడుగులాంటి వార్తవచ్చి చేరింది. అందరూ స్తబ్ధులై పోయారు. విప్లవ వీరకిశోరాలైన భగత్సింగ్, సుఖదేవ్ మొదలైన కొంతమంది యువకులను రక్త పిపాసాపూరితమైన కిరాతక బ్రిటీష్ ప్రభుత్వం ఉరితీసిందన్నదే ఆవార్త! ఆవార్త కొందరి కన్నులను చెమ్మగిల జేస్తే - మరికొందరి హృదయాలను బ్రద్దలుచేసింది. కొందరు కన్నీటిని ఆపుకోలేక కాలవలుగా పారిస్తోంటే - ఇంక కొందరు ఆగ్రహంతో కంపించి పోసాగారు.

రామబ్రహ్మం అంతలోనే తేరుకున్నాడు. కొంతమందినిపంపి నల్ల జెండాలను తెప్పించాడు. ఆనందంతోసాగిన ఊరేగింపును ఆ అమరవీరుల త్యాగమూర్తుల మృతికి సానుతాప సూచకంగా - విచారవదనాలతో సాగింది - దుఃఖకంఠాలతో వారి పీరోచిత గాథలను చెప్పకుని సానుతాప తీర్మానాన్ని ఆమోదించి సభను ముగించివేశారు.

జిల్లాకాంగ్రెసు కార్యదర్శి

శ్రీ రామబ్రహ్మంలోగల పట్టుదల, దీక్ష - సేవానిరతి - త్యాగ భావం జిల్లాలోని కార్యకర్తలందరి అభిమానానికీ. భక్తి శ్రద్ధలకూ పాత్ర

మైనాయి. అందుచేత జిల్లా కాంగ్రెస్ ఎన్నికలలో రామబ్రహ్మాన్ని కార్య దర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకొని అతనియందు తమకుగల నమ్మకాన్ని వెల్లడి చేసుకున్నారు. శ్రీ కొల్లిపర సూరయ్య అధ్యక్షులుగా, శ్రీ కొడాలి ఆంజనేయులూ, రామబ్రహ్మాలు కార్యదర్శులుగా ఎన్నిక కావడంతో జిల్లాలోని రాజకీయ పరిస్థితిలోనే పెద్ద మార్పువచ్చింది. జిల్లాలోని అనేక గ్రామాలలో పర్యటించి గ్రామసంఘాలను స్థాపిస్తూ ప్రాథమిక సభ్యులుగా అనేకులను జేర్పించి సంఘాన్ని పటిష్ఠంగావించడానికి చాలా శ్రద్ధ తీసు కొని పనిచేయసాగాడు రామబ్రహ్మం.

స్వగ్రామంలో తిరిగి "అన్నపూర్ణాదేవీ ఖాదీ పరిశ్రమాలయము" స్థాపించి స్వంత పెట్టుబడి ధనంతో ఖాదీ ఉత్పత్తికి కృషిసాగే ఏర్పాట్లు గావించాడు.

తాను చేపట్టిన ప్రతిపనినీ శ్రద్ధాశక్తులతో నిర్వహిస్తూ పలువురి ఆదరాభిమానాలతో పురోగమించ సాగాడు అతడు. రౌండ్‌టేబిల్ కాన్ఫరెన్సుకు ఇంగ్లాండువెళ్ళిన మహాత్మాగాంధీ ఆ సమావేశం విఫలం కావడంతో తిరిగి బొంబాయికి ప్రయాణమైన విషయం తెలిసింది. ఆయనకు బొంబాయిలో ఎదురుకోలు సన్నాహం ఏర్పాటు జరిగినట్లు తెలిసింది. అందులో పాల్గొనేందుకు కృష్ణాజిల్లా తరపున శ్రీ రామబ్రహ్మం బొంబాయి వెళ్ళాడు. ఇది తెలిసిన ప్రభుత్వం ఇల్లువిడచి పోరాదంటూ 144 వ సెక్షన్ అమలుజరిపి ఆజ్ఞనందించింది. అది తన వ్యక్తి స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికీ విరుద్ధమనీ – అలాంటి నిరంకుశ అన్యాయ శాసనాన్ని బొదలదాల్చడం అవమానకరమనీ ఆ ఆజ్ఞను ధిక్కరించాడు వీరోచితంగా!

*　　*　　*

దివి తాలూకాలోని కొన్ని గ్రామాలలో పర్యటించి పరిశోధం గావించుకుంటూ రామబ్రహ్మం శ్రీ కామినేని వెంకటప్పయ్యతో భట్ట

పెనుమర్రి గ్రామం చేరుకున్నారు. ఆ రాత్రి శ్రీ వెంకటప్పయ్య ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. అలసి సొలసివున్న కారణంగా ఆదమరచి నిద్రలో పడిపోయారువారు.

తెల్ల వారుఝాము! కోళ్ళు కూస్తోన్నాయి! రిజర్వు పోలీసుబలంతో గుడివాడ డిప్యూటీ కలెక్టర్ రంగప్పబంగారు, సర్కిల్ షేక్ దావూద్‌ఖాన్ వెంకటప్పయ్య ఇంటిని చుట్టుముట్టారు. తలుపులు బాదారు. బలాత్కారంగా ఇంట్లో చొరబడి వెంకటప్పయ్యనూ, అతని సోదరునీ స్పృహ పోయేలా కొట్టారు. నానాభీభత్సం గావించి వారిద్దరినీ అరెస్టుచేసి తమ వెంట లాక్కుపోతూ, భారతీయులపై, భారత జాతీయ నాయకులపై వారికిగల ఈర్ష్యా - విద్వేషాలకు చిహ్నంగా చెరువుగట్టు కూడలిలో స్థాపించిన మహాత్ముని శిలావిగ్రహాన్ని పెకలించివాన్‌లో వేసుకుపోయారు. ఇది చూస్తూ - ఈ అన్యాయ, దౌర్జన్య, నృశంస చర్యలకు స్తంభించి పోయాడు రామబ్రహ్మం!

భార్యభర్తలిద్దరు జైలు జీవితం

1932 - జనవరి - 31వ తేదీ! బందరు పట్టణంలో 144 వ సెక్షన్ అమలులోవుంది. అయినాసరే విదేశీబట్టల దుకాణాలముందు పికెటింగు చేసితీరవలసిందేననే నిర్ణయం జరిగింది. రామబ్రహ్మం అచంచలదీక్షతో శ్రీ మానికొండ సత్యనారాయణశాస్త్రితో కలసి పికెటింగు చేసేందుకు బయలుదేరాడు. ఇరువురూ దీక్షతో తమ కార్యక్రమాన్ని నిర్వహించ ప్రారంభించారు. పోలీసుబలగం దిగింది. మిమ్మల్ని అరెస్టు చేశామంది. నడవమంది. వెంటబెట్టుకుపోయింది. డిప్యూటీ కలెక్టరువద్ద కేసుపెట్టారు. విచారణ తతంగం నడచింది. ఈ మహానేరాన్ని సహించలేకపోయాడా న్యాయాధికారి. ఇద్దరకూ 2 సంవత్సరాల చొప్పున కఠినశిక్ష - పెద్దమొత్తం రూపాయల జరిమానా విధించి సంతృప్తిపొందాడా విదేశీపరిపాలకులజ్ఞానిని!

రామబ్రహ్మాన్ని తిరుచునాపల్లి సెంట్రల్ జైలుకు పంపారు. అక్కడ శిక్ష ననుభవిస్తూండగానే ఇక్కడ అనేక విపరీతాలు జరిగి పోయాయి. శాసనధిక్కార నేరంమీదనే భార్య సీతామహాలక్ష్మమ్మకు ఒక సంవత్సరం కఠినశిక్షవేసి జైలుకు పంపింది ప్రభుత్వం. పోలీసుల దౌర్జన్యకారణంగా "అన్నపూర్ణాదేవి ఖాదీ పరిశ్రమాలయం" అస్తవ్యస్తమై ఆగిపోయింది. జరిమానాధనం రాబట్టుకొనేందుకుగాను మేడ తలుపులూ, పాడి పశువులూ వేలం వేయబడి పోయాయి. ఆర్థికనష్టం అలా వుండగా అనుంగుసోదరి శ్రీమతి పొట్లూరి బసవలక్ష్మీదేవమ్మ 35 సంవత్సరాల వయస్సులోనే బాలింతగా అసువుల త్యజించి మాతృదేవిని దుఃఖ సముద్రంలో ముంచిపోయింది.

ఈ విషమ ఘటనలన్నీ రామబ్రహ్మం జైలునుండి విడుదలై వచ్చేంతవరకూ తెలియనివ్వలేదు ఎవరూను. జరిగిపోయిన దుర్ఘటనలకు కొంత చింతించినా దృఢమనస్కుడు కావడంవల్ల ఆ చింతను అంతలోనే దూరంచేసుకొని తిరిగి కార్యరంగంలోకి ఇనుమిక్కిలి పట్టుదలతో ప్రవేశించాడు ఆ ధీశాలి!

హరిజనోద్ధరణ

1934 వ సంవత్సరం, సెంట్రల్ అస్సెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు నిర్ణయింపబడ్డారు. ప్రత్యర్థిని ఓడించి తమ అభ్యర్థిని గెలిపించాలనే దృఢసంకల్పంతో కాంగ్రెసు కార్యకర్తలు నిర్విరామ కృషి గావించారు. సతీసమేతంగా రామబ్రహ్మం ఈ సమయంలోపడిన శ్రమ మరపురానిదే అనాలి. వీరందిన శ్రమా ఫలించింది. కాంగ్రెస్ అభ్యర్థికి అఖండ విజయం కలిగింది. ప్రత్యర్థి డిపాజిట్టుకూడా పోగొట్టుకున్నాడు.

రామబ్రహ్మం బాపూజీ హరిజనోద్ధరణ ఉద్యమాన్ని అభిమానించాడు. అందుచేత గుడివాడ తాలూకా హరిజన సేవాసంఘం కార్యదర్శి

పదవిని స్వీకరించి హరిజనోద్ధరణ కార్యక్రమాలను చేపట్టి పనిచేయడాని కారంభించాడు. జమీగొల్వేపల్లి గ్రామంలో ఒక రాత్రి పాఠశాల ఏర్పాటు చేసి చాలామంది హరిజన యువకులనూ - వయోవృద్ధులను సైతం అక్ష రాస్యులయ్యేట్లు చూచాడు. ఒక హరిజన యువకుని తన గృహంలోనే వుంచుకుని అంటరానితనానికి తనకుగల వ్యతిరేకభావాన్ని చేతలద్వారా నిరూపించుకో గలిగాడు.

గ్రామంలో పూర్వాచార పరాయణులు కొంతమంది ఈ కార్యంవల్ల ఎడముఖం పెడముఖంపెట్టి దూరదూరంగా తప్పుకు తిరగసాగారు. స్వంత తల్లిగారే స్వయంపాకం ప్రారంభించడం ఓ పెద్ద పరీక్షగా అయ్యింది రామబ్రహ్మానికి. అయినా ఏమాత్రం చలించలేదు. తనభావాన్ని వారికోసం నశింపజేసుకోలేదు. బావకూడా వ్యతిరేకించాడు. రామబ్రహ్మంకుటుంబాన్నే వెలివేసినట్టు చూచారంతా! గ్రామంలోని సాముదాయక బావులకు సైతం నీళ్ళు తీసుకుపోవడానికి రాకూడదంటూ శాసించడానికి పూనుకున్నారు. వారి ఈనిరంకుశ ప్రవర్తనానికి మనసు కలగిపోయింది. ఇలాంటి నిరంకుశ విధానాలను శాంతి - సత్యాగ్రహ ఆయుధాలతోనే ఎదిరించాలని బాపూజీ సూచించిన మార్గం అకస్మాత్తుగా మనసులో మెదిలింది. ఇకనేముంది! నవోత్సాహం నిలువునా నిండిపోయింది. బావివద్ద గ్రామ ప్రజలలోని కొందరి నిరంకుశ ప్రవర్తనకు అసమ్మతి సూచకంగా నిరాహారదీక్ష పూని సత్యాగ్రహం ప్రారంభించాడు. ఒకరోజు గడచింది! రెండవరోజు ప్రారంభమైంది. మిగిలిన గ్రామప్రజల మనస్సులు కలగిపోసాగాయి! ఈ నిరంకుశ విధానంపై ఆగ్రహం పొడచూపసాగింది. ఉద్రేకులైన యువ కులు లోలోన కుతకుతలాడి పోతూండగానే మూడవ దినం వచ్చింది. రామబ్రహ్మం నిరాహారదీక్షతో గ్రామంలోని పూర్వాచార పరాయణుల హృదయ పరివర్తనను ఆకాంక్షిస్తూ గడపసాగాడు. ప్రజలలో కలవరం మరింత అధికమైంది. యువరక్తం దౌర్జన్యంతో పరిస్థితిని అటో ఇటో

తేల్చుకునే ప్రయత్నంలో భుగభుగలాడసాగింది. ఇది గుర్తించిన రామబ్రహ్మం వారికి సత్యాగ్రహ సిద్ధాంతాన్ని విపులంగా వివరించి శాంతచిత్తులను గావించాడు. పెద్దలు ఒకచోట సమావేశమయ్యారు. సాముదాయక బావులవద్ద నీళ్ళు తీసుకుపోయేందుకు ఎలాంటి నిరోధము లేకుండా వుండేందుకు వారిని ఒప్పించి ఈ జటిల సమస్యను పరిష్కరించగలిగారు. అంతలో నిరశనదీక్షను విరమించుకున్నాడు రామబ్రహ్మం. ప్రజల మనస్సులు సంతృప్తితో ప్రశాంతత నందాయి.

జిల్లా బోర్డు యెన్నికలు

కాలచక్రం ప్రశాంతంగా పరిభ్రమించ సాగింది. రామబ్రహ్మం జీవిత ప్రవాహంకూడా స్థానిక రాజకీయ రంగంలో మార్పుచేర్పులతో ప్రవహించింది. శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ సిద్ధాంతాలవైపు అతని దృష్టి ఆకర్షింపబడటం మూలంగా కృష్ణాజిల్లాలోని సోషలిస్టు భావాలుగల వ్యక్తుల నందరినీ సమావేశపరచి శ్రీ గద్దె లింగయ్య అధ్యక్షులుగా, తాను కార్యదర్శిగాఅయి పనిచేయ పూనుకున్నాడు.

1936 వ సంవత్సరం వచ్చింది. కృష్ణాజిల్లా బోర్డు ఎన్నికలలో పోటీచేయడానికి కాంగ్రెసు నిశ్చయించుకుంది. ప్రత్యర్థి శ్రీ చల్లపల్లి రాజా: అంగబలం – అరబలం – సానిక రాజకీయాలు రాజావారి ముఠాకు బాగా బలాన్నిచ్చాయి. జిల్లా మొత్తంలో ఒక్క హరిజన కాంగ్రెస్ అభ్యర్థి నెగ్గడం – మిగతావారంతా ఓడిపోవడం జరిగింది. ఈ పోటీలో రామబ్రహ్మం సతీమణితో కలసి పోటీలో పాల్గొన్నాడు. ఇద్దరూ ఓడిపోయారు:

అయినా నిరుత్సాహపడలేదు రామబ్రహ్మం. అనేక కార్య క్రమాలలో పాల్గొంటూ దేశసేవలోనే కాలం గడుపుకుంటూ పోసాగాడు. కొన్ని

రోజులు గడిచాయి. రామబ్రహ్మం ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా ఎన్నుకోబడ్డాడు.

పంచాయతీ బోర్డు అధ్యక్షత

1938 వ, సంవత్సరం వచ్చింది. నూతనంగా జమీగొల్వేపల్లి పంచాయితీబోర్డు నిర్మాణంజరిగింది. ఎన్నికల కోలాహలం: రామబ్రహ్మం బోర్డు అధ్యక్షునిగా అయ్యాడు. పదవిని అలంకారార్థంగాక ప్రజాసేవలోనే ఉపయోగపరచడానికి పూనుకున్నాడు. గ్రామంలోని రోడ్లను బాగు చేయించాడు. క్రొత్తరోడ్లను వేయించాడు. ముఖమాటాలకూ - బంధు ప్రీతికీ ఏమాత్రం అస్కారమివ్వక సాంఘిక సంక్షేమానికే దీక్షవహించి - ఆదాయాన్ని పెంచి అనేక సత్కార్యాలకు చొరవగా పూనుకున్నాడు.

చెరువుగట్టుమీద శ్రీ పొట్లూరు నరసయ్యచే ధర్మంగా కట్టించబడిన సత్రమువుంది. దాన్ని వారి కుమారులైన శ్రీ పొట్లూరు సత్యనారాయణ, ఆదినారాయణల అనుమతితో బోర్డుపాలనలోకి తీసుకుని అందులో పంచాయితీ ఆఫీసు ఏర్పాటు చేయించాడు. చక్కటి పార్కూ, పబ్లిక్ రేడియో నిర్మాణమైంది. పంచాయితీపాలన ప్రజల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడటంవల్లం అంతా రామబ్రహ్మాన్ని శ్లాఘించసాగారు.

విజయోత్సాహము

సంవత్సరం తిరిగిపోయింది. మరు సంవత్స చివరిలో మళ్ళా జిల్లాబోర్డు ఎన్నికలు వచ్చాయి. అంతకుముందు ఓడిపోయామనే భయం లేకుండా ఈసారికూడా పోటీ చేయడానికి కాంగ్రెసుపార్టీ రంగంలో కాలు

పెట్టి నిలచింది. స్త్రీల స్థానం పామర్రు ఫిర్కాకు మార్చబడింది. రామ బ్రహ్మం దంపతులను ఒకరిని రిజర్వు స్థానానికి, ఒకరిని ప్రత్యేక స్థానానికీ పార్టీ నిశ్చయించింది.

రామబ్రహ్మం దంపతులకు ప్రముఖ జస్టిస్‌పార్టీ నాయకులైన శ్రీ వడ్డె శోభనాద్రి, తన కుమార్తెతో కలసి పోటీగా నిలచారు. ఇరువైపులా విజయంకోసం తీవ్రాతితీవ్రంగా ప్రచారం జరిగింది. పట్టుదల పతాకస్థాయి నందుకుంది. శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీమతి అమ్మన్నరాజా మొదలైన కాంగ్రెసువారు పై జిల్లాలనుండి వచ్చి ఉపన్యాసాల నిచ్చారు. ప్రజల మనసులు ఊగిసలాటలో పడినయ్. చిరకాలంగా పాదుకొనివున్న అభిమానాలు క్రమక్రమంగా కాలం మార్పుతో మార్పుపొందక తప్పదని తోచింది. చాలా ఉద్రేక పరిస్థితులలో పోలింగు జరిగింది.

గుడివాడ తాలూకా ఆఫీసు ఆవరణమూవత్తా తాలూకా ప్రజలతో ఖచాఖచిగా నిండిపోయింది. కోలాహలం మిన్ను ముట్టసాగింది. తహసీల్దారు ఓట్ల లెక్కింపు ముగించి రామబ్రహ్మం దంపతులు నెగ్గినట్లు ప్రకటించడం ఆలస్యంగా ప్రజానీకం జయజయ ధ్వానాలతో - కరతాళ ధ్వనులతో ఆ ప్రదేశమంతా దద్దరిల్లి పోయింది.

విజయోత్సాహం వెల్లివిరిసింది! మంగళ వాయిద్యాలతో రామ బ్రహ్మం దంపతుల నిద్దరినీ కారుపైన పట్టణమంతా ఊరేగించారు. పూల మాలలు! మంగళహారతులు!! జయ జయ ధ్వానాలు! కాంగ్రెస్ కీర్తి చంద్రికలు ప్రజానీకం మనోసముద్రాన్ని వరవళ్ళ త్రొక్కేట్లు చేసింది. ఈ దంపతులకు మరోమారు కళ్యాణ మహోత్సవం జరిగినట్లుగా ప్రజానీకం ఆనందించింది. గ్రామగ్రామాన ఉత్సవాలు, విందులు ఏర్పాటయి సన్మానాలు జరిగాయి. తమ విజయానికి కారకులైన మిత్రులకూ, కార్యకర్తలకూ రామబ్రహ్మం దంపతులు తమ హృదయపూర్వక కృతజ్ఞతల నందజేశారు.

అలుమగ లిద్దరూ జిల్లాబోర్డుద్వారా ప్రజలకు కావలసిన సదు పాయాలను గ్రామగ్రామం సంచారంచేస్తూ తెలుసుకొని శక్తికొలదీ ఆ ఏర్పాట్లు సవ్యంగాజరిగేట్లు చూడ్డంతో కాలాన్ని గడపసాగారు. తాము ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకునేందుకు అహరహం శ్రమిస్తూ కర్తవ్య పరాయణులై ప్రజాభిమానాన్ని కూడగట్టు కుంటూ వచ్చారు.

వ్యష్టి సత్యాగ్రహం

రాజకీయరంగంలో తిరిగి నూతన చైతన్యం వెల్లివిరియసాగింది. లోలోన రాజుకుంటూ వస్తూన్న అగ్నిసెగలు పొగలను వెలియబెట్టసాగింది. పూర్తిగా చల్లబడిపోయింది స్వాతంత్ర్య సత్యాగ్రహ సమరమని భావించిన తెల్లదొరల ప్రభుత్వం తమ నేర్పువల్లనే ఇలా సంభవించిందని మురిసి పోయింది. కాని అది భ్రమ మాత్రమేననీ, ఈ కాలాన్ని కాంగ్రెసు తన సాధన సంపత్తిని కూడగట్టుకునేందుకు విరామ సమయంగా ఉపయోగించు కుందని గుర్తించి తెల్లబోయింది. తీపిమాటలతో స్వాతంత్ర్య పిపాసు లపై మచ్చచల్లి ఉచ్చులోబిగించి వుంచగలిగాననుకున్న పరాయి ప్రభు త్వాన్ని కాంగ్రెస్ మహానేత మహాత్మాగాంధీ విజయ శంఖనాదంతో తళ్ళిపడేట్లు చేశాడు.

యుద్ధంలో చిక్కుకుంది బ్రిటీష్ ప్రభుత్వం. ప్రపంచవ్యాపిత యుద్ధంగా రూపొందిన ఈ యుద్ధంలో భారతదేశం జన, ధన బలాన్ని కూర్చి సహాయ పడవలసిందిగా ప్రభుత్వం కోరింది. "మాకుకాని యుద్ధ నికి మేమెందుకు సహాయపడాలి? మమ్మల్ని స్వతంత్రులుగా ప్రకటించండి. అప్పుడు మేం మా స్వాతంత్ర్య సంరక్షణార్థం మీతోకలసి యుద్ధంలో

పాల్గొంటాం. ధన - జన సంపత్తిని స్వేచ్ఛాపూర్వకంగా ఆ స్థాయిలో తప్ప మీకు సహాయార్థం వెచ్చించేందుకు మేం అంగీకరించలేం" అన్నది నాయకుల వాదం. ఇలాంటిస్థితిలో - అవకాశవాదులైన కమ్యూనిస్టులూ- జస్టిస్ పార్టీ వారూ తగు సమయంకోసం ఎదురుచూస్తూ నిమిషాలు లెక్క పెట్టుతూ, లోలోన దేశ హితానికి గోతులు త్రవ్వుతూ గడపసాగారు.

కాంగ్రెస్ సంస్థ యుద్ధనిధిని ఇవ్వవద్దని ప్రజలలో ప్రబోధం గావించవలసిందిగా అన్ని సంఘ శాఖలకూ ఆదేశాలను పంపింది. ఈ బలాత్కార బ్రాహ్మణార్థాన్ని సహించడం మహా హీనమైన కార్యంగా భావించవలసిందిగా తెలిపింది.

ఈ నిరంకుశ విధానానికి అసమ్మతి సూచనగా వ్యష్టి సత్యాగ్రహ ఆయుధాన్ని ప్రయోగించాడు బాపూజీ. "యుద్ధానికి ఎలాంటి సహాయమూ చేయకండి! నిర్బంధంగా నిధి వసూలు చేయవస్తే ధైర్యంగా తిరస్కరించండి!" అంటూ ప్రబోధంతో వాడవాడలా - గ్రామగ్రామానా సత్యాగ్రహ యుద్ధం ప్రారంభమైంది.

ఈ వ్యష్టిసత్యాగ్రహ ఉద్యమంలో రామబ్రహ్మం తన సతీమణితో పాటుగా పాలుగొనేందుకు నిశ్చయించుకున్నాడు. 1941 వ సంవత్సరం, 19వ తేదీ మార్చినెల అది. కలెక్టరుకు ముందుగానే తాము సత్యాగ్రహం చేయబోతున్నట్లు తెలియజేశాడు. భార్యాభర్తలిద్దరూ ఒకేరోజున స్వరాజ్యమంలోని మహాత్మాగాంధీ పార్కులో సత్యాగ్రహం ప్రారంభించారు. ముందే సంసిద్ధంగావున్న సిబ్బంది వీరిద్దరినీ అరెస్టుచేసి గుడివాడ తీసుకుపోయి ఎస్. డి. యమ్. కోర్టులో నిలిపారు. విచారణ తతంగం ముగిసింది. రామబ్రహ్మానికి 5 నెలల శిక్ష, 400 రూపాయల జరిమానా విధించాడు. ఆ జరిమానా చెల్లించనిచో మరో నాల్గుమాసాల శిక్ష! రాము

బ్రహ్మం సతీమణి సీతామహాలక్ష్మమ్మకు మూడువందల రూపాయల జరిమానా, కోర్టులేచేవరకూ శిక్ష విధింపబడింది. ఇరువురూ జరిమానా ధనం చెల్లించేందుకు నిరాకరించారు. 'బి' తరగతి ఖైదీలుగా వీరిని పరిగణించడానికి నిర్ణయింపబడింది. ఈ విచారణ సమయంలో తాలూకాలోని ఎంతో మంది ప్రజలు కలెక్టర్ ఆఫీసు ఎదుట గుమిగూడి జయ జయ ధ్వానాలు చేశారు. రామబ్రహ్మాన్ని అల్లిపురం క్యాంప్ జైలుకూ, సీతామహాలక్ష్మమ్మను రాయవెల్లూరు స్త్రీలజైలుకు పోలీసు సంరక్షణతో పంపారు ఆరోజుననే.

*　　*　　*

శిక్షాకాలం జరుగుతోంది 'బి' క్లాసు ఇచ్చిన ప్రభుత్వమే అకస్మాత్తుగా రామబ్రహ్మాన్ని "సి" క్లాసుకు మార్పించింది. ఇలా ఎందుకు చేయవలసివచ్చిందో ఆ చేసిన - చేయించినవారికే తెలియాలి! రామబ్రహ్మం ఇందుకు ఎలాంటి అభ్యంతరాన్నీ తెలుపలేదు. ఇతడు జైలులో శిక్ష ననుభవిస్తోన్న ఈ సమయంలోకూడా ఒకే ఒక మేనల్లుడయిన పొట్లూరి శ్రీమన్నారాయణ 22 ఏండ్ల వయస్సులోనే ఆకస్మికంగా మరణించడం సంభవించింది. విధి విచిత్రమైంది. దాన్ని గుర్తించగలగడం ఎవరివశం? బాధలోవున్నా - సంతోషంలోవున్నా కాలం తన గమనాన్ని తాను మానదుగా! కాలం గడచింది. శిక్షాకాలం పూర్తి అయ్యింది. 18-10-41 న విడుదల పొందాడు రామబ్రహ్మం!

*　　*　　*

వ్యష్టి సత్యాగ్రహోద్యమం మూలంగా కుంటుపడిన కాంగ్రెస్ కమిటీల పునరుద్ధరణ కార్యక్రమం ప్రారంభమైంది. తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీకి రామబ్రహ్మం అధ్యక్షుడుగా ఎన్నిక అయ్యాడు. శ్రీ కొడాలి ఆంజనేయులు ప్రధాన కార్యదర్శి.

ప్రపంచ పరిస్థితులు మహాసంక్షోభంలో పడిపోయాయి. రెండవ ప్రపంచ మహాయుద్ధంలో క్షణక్షణం విస్తృతరూపంతో దేశాలను దేశాలనే నేలమట్టం గావిస్తూ వేలాది ప్రాణాలను బలిగొంటూ పోసాగింది. జపాన్ భారతదేశంపై విరుచుకు పడటానికిసంసిద్ధంగా వున్నదన్న వార్త గాలిలో తేలుతూ దేశం మొత్తంలో అలుముకుపోయింది. కల్లోలితమైంది ప్రజానీకం. అధ్యక్షపదవిలోనున్న రామబ్రహ్మం తనకర్తవ్యాన్ని గుర్తించాడు. కార్యదర్శులతో శ్రీ మానికొండ సత్యనారాయణతోనూ కలసి గ్రామ గ్రామాన పర్యటనచేస్తూ - శాంతిదళాలను ఏర్పరచి, జపాన్ నిజంగా దాడి జరిపితే ఎలా శాంతియుతంగా ఎదుర్కోవలసిందీ వివరించి చెప్పుతూ - ప్రధమ చికిత్సలో అనుభవం పొందే ఏర్పాట్లను గూడా గావించసాగాడు.

క్విట్ ఇండియా

ఏ క్షణంలో ఏం జరుగుతూందో ఎవరూ చెప్పలేని పరిస్థితులలో కాలగమనం సాగింది. 1942 ఆగస్టునెల ప్రవేశం జరిగింది. మహాత్మా గాంధీ గొంతెత్తి "క్విట్ ఇండియా" నినాదాన్ని ఉచ్చరించాడు. "భారత దేశాన్ని వదలిపొండి!" ఎవరినోట విన్నా ఇదే నినాదం. శతాబ్దాలుగా బానిసత్వంలోపడి క్రుగ్గిన భారతజాతి పాషండ బ్రిటీష్ పాలకులకు అంతిమహెచ్చరికగా ఈ నినాదాన్ని ఉపయోగించింది. అయినా బ్రిటీష్ ప్రభుత్వం ఈ హెచ్చరికను లెక్కచేయక తన వికృత దమననీతిని ఆచరణలో పెట్టడానికి పూనుకుంది.

అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశానికి ముందుగానే ప్రముఖ నాయకులను అరెస్టుచేసింది. ఈ వార్త దావానలంలా దేశం

మొత్తంమీద ప్రాకిపోయింది. నిరంకుశ ప్రభుత్వం నృశంస విధానానికి భారతజాతి యావత్తు ఆగ్రహావేశాలతో నిండిపోయింది. విప్లవ భావాలు విస్తృతరూపాన్ని ధరించాయి. తిరుగుబాటు లేచింది. ప్రజలు తమకుతామే నాయకులై విశృంఖల వీరవిహారం గావించ సాగారు. టెలిగ్రాం తీగెలు తెగిపోసాగాయి! రైలుపట్టాలు తొలగింపబడ సాగాయి! వంతెనలు కూలద్రోయబడ్డాయి! రోడ్లు విచ్ఛిన్నం అయ్యాయి! అనేక చోట్ల రైల్వే స్టేషన్‌లు భగభగ మండాయి! న్యాయస్థానాల రికార్డులు మంటలలో మసి మసి అయ్యాయి! ప్రభుత్వం స్తంభించిపోయింది. పాలకులకు ఊహించరాని పరిస్థితి ప్రత్యక్షమైంది. మెల్లగా తేరుకుంది. కార్యాచరణకు ఫ్రానుకుంది. తుపాలుమోగాయి! అనేకమంది ప్రజల రక్తం ఛారై పారింది. ఏరులై సాగింది! కుప్పలుకుప్పలుగా యువజనులు స్వాతంత్ర్య సమర జ్వాలలకు ఆత్మబలిదానం గావించి అమరత్వ మందారు.

పినతల్లిమరణం

రామబ్రహ్మం డిటెన్యూగా నిర్బంధింపబడి రాయవెల్లూరు జైలుకు గొనిపోబడ్డాడు. అక్కనుండి తంజావూరు డిటెన్యూ క్యాంపునకు మార్చ బడ్డాడు. బయటి విషయాలు వివరంగా తెలియరావడంలేదు. కాలంభారంగా గడుస్తూన్నట్లుతోచింది. చిన్నతనంనుండీ ప్రాణసమంగా పెంచిన పినతల్లి బసవమ్మ చాలా పెద్ద జబ్బుతో మరణాసన్న స్థితిలో వున్నట్లు తెలియ వచ్చింది. ప్రభుత్వం పెరోలుమీద విడుదల చేసింది. పినతల్లిని చేరు కున్నాడు. రామబ్రహ్మం చెంతను ఉండగానే శ్రీమతి బసవమ్మ ప్రాణా లను విడిచిపెట్టింది. జైలుకుపోయిన ప్రతిసారీ ఎవరినో ఒకరిని ప్రాణ సమమైనవారిని కోలుపోవలసి రావడం రామబ్రహ్మం జీవితంలో విధి వైచిత్ర్యంగా సంప్రాప్తం కావడం విచారణీయ మనక తప్పదు.

ఇంతటి తీవ్రమైన అఘాతాలు సంభవిస్తూన్నా రామబ్రహ్మం చలించక తన సిద్ధాంతాచరణకు దీక్షాబద్ధుడై ముందుకు సాగడానికే నిశ్చయించుకున్నాడు. పినతల్లి కర్మకాండ పూర్తిచేసి తిరిగి జైలుకు చేరుకున్నాడు దృఢమైన మనస్సుతో!

రామబ్రహ్మం జైలుజీవితం 1945 వ సంవత్సరందాకా సాగింది. ప్రభుత్వంచే విడుదలపొంది స్వస్థానం జేరుకున్న రామబ్రహ్మం మనో నిబ్బరాన్ని పరీక్షించడానికో అన్నట్లు కొద్దిరోజులకే చిన్న సోదరి ఆకస్మిక మరణ మందింది. మరణ సమయానికి ఆమె వయస్సు 35 సంవత్సరాలు మాత్రమే!

స్వాతంత్ర్య సంపాదన

నలభైరెండు ఆగష్టు విప్లవజ్వాల ప్రతాపాన్ని రుచిచూచిన ఆంగ్లేయ ప్రభుత ఇక ఎక్కువకాలం భారతదేశాన్ని తమ గుప్పిటపట్టి ఉంచడం కష్టమని గుర్తించింది. బలవంతంగా గెంటబడటం కన్నా మంచిగా అధికారాన్ని వదలుకోవడం ఉత్తమ రాజనీతిగా భావించి కాంగ్రెసు నాయకత్వంతో రాజీబేరాలు సాగించింది. స్వాతంత్ర్య ప్రధానికి అంగీకరించింది. దేశంలో ఎన్నికలు జరపడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

రామబ్రహ్మం జిల్లా అధ్యక్షపదవిని నిర్వహిస్తూ ఎన్నికలలో ఎంతో శ్రమించి పనిచేశాడు.

స్వాతంత్ర్య సంపాదనకోసం ఎన్నెన్నో త్యాగాలతో దృఢదీక్షతో నిలచి పోరాడిన వీరాధివీరులలో రామబ్రహ్మం ఒకడు. స్వాతంత్ర్యం

సంపాదనానంతరం కూడా సాంఘికసేవలో అపార శ్రద్ధాసక్తులతో అహరహం శ్రమించి పనిజేస్తూ - యెన్నో సత్కార్యాలతో జీవిత సాఫల్యాన్ని గావించుకున్న పవిత్రవ్యక్తి రామబ్రహ్మం. ఇలాంటి ధన్యజీవుల గురించి తెలుసుకోవడం ఆంధ్రుడైన ప్రతివాని కర్తవ్యమని వేరుగా చెప్పాలా?

ప్రజాసేవ

శ్రీ రామబ్రహ్మంగారు బాల్యవయస్సునందే గుడివాడ హైస్కూలులో ఆంగ్లవిద్యను అభ్యసించుచూ, నాయకుల ప్రబోదములవలన ఆంగ్లవిద్యను బహిష్కరించి ఖాదీ ఉద్యమములో పనిచేయుచూ 1922 సంవత్సరము కాకినాడలో జరిగిన కాంగ్రెసు మహాసభలకు హాజరయి దేశనాయకుల ప్రబోధములను మనస్సునకు పట్టించుకొని జాతీయోద్యమములో తీవ్రముగ కృషిచేయ నారంభించిరి.

16-4-1929 న మహాత్మాగాంధిని డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి పిలుపుననుసరించి జిల్లా పర్యటన సమయమున రామబ్రహ్మంగారి స్వగ్రామమైన జమీగొల్వేపల్లి ఆహ్వానించి గొప్ప బహిరంగ సభ జరిపించి వారి ఖద్దరు ఉద్యమమునకు గ్రామస్థులనుండి విరాళములు వసూలుపరిచిన మొత్తం రు 1209-10-3 లు శ్రీ రామబ్రహ్మంగారిచే వేదికపై మహాత్మునకు సమర్పించబడినది.

జమీగొల్వేపల్లి గ్రామ ధర్మ చెఱువుకు యు 8-50 ట్లు ఈనాము భూమిగలదు. గ్రామానికి ఎక్కువ ఆదాయమునిచ్చు ఈ భూమి చెఱువు ప్రైవేటు మానేజిమెంటులో ఉంటున్నవి. సదరు ఆదాయము ప్రతి

సంవత్సరము జరుగు గ్రామసభలో జమ – ఖర్చులు లెక్కచూచి గ్రామసభ ఆమోదమునుపొంది ముందు జరుగబోవు సంవత్సరమునకగు ఖర్చులు. ఆదాయము అంచనాలు నిర్ణయించు ఆచారముగలదు. కాని అప్పటి మానేజిమెంటువారు గ్రామస్థులకు జమ – ఖర్చులు చెప్పకము మానివేసి సదరు ఆదాయమును దుర్వినియోగము చేయుచుండిరి. ఎవరైన లెక్కలు చెప్పమని అడిగిన గ్రామంలో రెండు కక్ష్యలుండుటచే వారు నిర్లక్ష్యము చేయుచుండిరి. మనకెందుకు తగాదాలు అని ఎవరికివారు అడుగుటయే మానివేసినారు. అందువలన దానిపైవచ్చు ఆదాయమును గ్రామావసరము లకు ఖర్చుపెట్టక స్వంతమునకు వినియోగించుకొనసాగిరి. ఆ విధముగా దాదాపు ఇరువదివేల రూపాయలవరకు దుర్వినియోగమైనది. అట్టి సందిగ్ధ వస్థలో శ్రీ రామబ్రహ్మంగారు పంచాయితీ అధ్యక్షులుగా ఏకగ్రీవముగా ఎన్నుకొనబడిరి. గ్రామ పంచాయితీ ఆదాయము చాల స్వల్పము.

అందువలన ఈ ఆదాయమునుగూడ పంచాయితీ పాలనలోకి తీసుకొనిన ప్రజాభివృద్ధి కార్యక్రమములకు దోహదమగునని తలంచి గ్రామ చెరువును దాని సర్వీసు ఈనాం భూములను పంచాయితీ ఆధీనంచేసిన బాగుండునని గ్రామస్థులకు ప్రబోధించి, నచ్చజెప్పి చివరకు గ్రామంలో పలుకుబడి కలిగిన శ్రీ తుమ్మల సీతారామబ్రహ్మం (వకీలు) గారి తోడ్పాటుతో గ్రామస్థులనందరను ఏకాభిప్రాయమునకు తీసుకొనివచ్చి ప్రైవేటు మానేజిమెంటు తొలగించి, ప్రైవేటు మానేజిమెంటువారు స్వంతమునకు వాడుకున్న మొత్తము లెక్కకట్టి యు 4-50 ట్లు భూమిని ధర్మ చెరువుపేర వ్రాయించగలిగిరి. అప్పుడు గ్రామసభ ఏకగ్రీవ తీర్మా నంతో ధర్మ చెరువు దాని ఆస్థులు పంచాయితీ పాలనలోనికి తీసుకొనెను. పంచాయితీ ఆదాయమును శ్రీ రామబ్రహ్మంగారు అభివృద్ధి చేసిరి.

శాసనోల్లంఘనోద్యమము ప్రారంభమైన వెంటనే జిల్లా కాంగ్రెసు కార్యదర్శులు శ్రీ వల్లభనేని రామబ్రహ్మం, శ్రీ కొడాలి ఆంజనేయులు

గారలు జిల్లాలో పర్యటనకు బయలుదేరిరి. ది 11-1-1932 వ సంవత్సరమున గుడివాడ తాలూకాలోని నందివాడ, విరివాడ, వెన్నెనపూడి, రామాపురం మొదలగు గ్రామాలలో ఉద్యమమునకు వాలంటీర్లను సమకూర్చుకొని గుడివాడచేరి రాత్రి సుమారు 10 గంటలకు శ్రీ గొనుగుంట్ల వేంకటసుబ్రహ్మణ్యం శ్రేష్ఠిగారి గృహములో ఉద్యమములో స్త్రీలు ప్రవేశాన్నిగూర్చి శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ, శ్రీమతి గొనుగుంట్ల లక్ష్మీనరసమ్మగార్లతో సంప్రదింపులు జరుపుచుండగా గుడివాడ పోలీసుస్టేషన్ సబ్ఇనస్పెక్టరు, స్పెషల్ పోలీసు దళం, సార్జెంటు మున్నగు పది, పదిహేనుమంది లాఠీలతో ప్రత్యక్షమై గృహములో ప్రవేశించి రామబ్రహ్మం, ఆంజనేయులుగార్లను బండ బూతులు తిట్టుచూ లాఠీలతో బాదుకొంటూ తాలూకా ఆఫీసువరకు నెట్టుకొనిపోయిరి. అక్కడ కొంతసేపుబాది చేతితీట తీరినవెంటనే వదిలిపెట్టిపోయిరి.

అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షుని హోదాలో పండిత శ్రీ జవహర్ లాల్ నెహ్రూ ఆంధ్రదేశ పర్యటనకువచ్చిరి. అప్పుడు జిల్లా కాంగ్రెసు కార్యదర్శిగా శ్రీ రామబ్రహ్మంగారు పనిచేయుచుండిరి. శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ సోషలిస్టు ప్రచారము ప్రధానముగా పెట్టుకొని పర్యటన చేయుచుండిరి. తూర్పు కృష్ణాజిల్లాలో గుడివాడ పట్టణమును ఎంచుకొని గొప్ప బహిరంగసభకు ట్రావెలర్సుబంగళ ఆవరణలో వేదికను నిర్మించిరి. ది 20-10-1936 వ తేదీన యీ సభకు ఇసుకవేస్తేరాలని జనసమూహము అనేక పల్లెగ్రామాలనుండి తిరునాళ్ళకు వచ్చినట్లువచ్చిరి. మీటింగు అనంతరం పామర్రు మీదుగా విజయవాడచేరిరి. గ్రామ గ్రామాలు తోరణములతో అలంకరించి త్రోవపొడుగునా జనసమూహము కారునాపి గించి జవహర్‌లాల్‌కు స్వాగతమునలికిరి. ఈ పర్యటన వారికి చాలా ఉల్లాసము కలుగచేసెను. 25-10-36 వ తేదీన శ్రీ రామబ్రహ్మం గుడ్లవల్లేరు లోని శ్రీ రాజరాజేశ్వరి పుస్తక భాండాగారమునకు ప్రారంభోత్స

వము గావించిరి. ఈ సందర్భమున గ్రామస్థులొసగిన సన్మాన పత్రములనందుకొనిరి.

దరిమిలా రాష్ట్రి అసెంబ్లీ ఎన్నికలువచ్చినవి. ఆ యెన్నికలలో అన్నిరాష్ట్రాలలోను కాంగ్రెసువారు పోటీచేయవలెనని అఖిలభారత కాంగ్రెసు సంఘమువారు ఆదేశించిరి. తూర్పు కృష్ణాజిల్లాలోని బందరు రూరల్ నియోజకవర్గమునకు జనరల్ స్థానమునకు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యను రిజర్వ్‌స్థానమునకు శ్రీ పేముల కూర్మయ్యను అభ్యర్థులుగా నిలిపిరి. వ్యతిరేకపక్షమున జస్టిస్‌పార్టీ తరపున చల్లపల్లి రాజా శ్రీమంత్ యార్లగడ్డ శివరామప్రసాద్‌గారు ఒక అనామక హరిజన అభ్యర్థిని రిజర్వ్ స్థానమునకు పెట్టుకొని పోటీచేసిరి. ఈ యెన్నికలలో యీ జిల్లాలోని కాంగ్రెసువారందరూ ఒక్కతాటిమీద నిలబడి తీవ్ర ప్రచారమొనర్చిరి. జిల్లాలోని కాంగ్రెసు అభిమానులందరూ కాంగ్రెసు విజయమునకు శక్తి సంతయూ ధారపోసి పనిచేసిరి. యెక్కడ చూచినను వాలంటీరు దళములు జాతీయపతాకములతో, జాతీయగీతములతో నేల ఈనినట్లుగా పొలాల గట్ల వెంట, రోడ్ల వెంట, కూడలులలో, పల్లెలలో కనపడుచుండిరి. రాత్రింబవళ్ళు ఈ దంపతులియువరూ నిద్రాహారములు గూడా విసర్జించి అనేక సభలుచేసి ప్రచారము సల్పిరి. కాని దురదృష్టవశాత్తు కొద్ది ఓట్ల తేడాతో జనరల్ స్థానము పోయినది. రిజర్వ్‌స్థానములో శ్రీ కూర్మయ్యగారు విజయము సంపాదించిరి. ఈ యెన్నికలలో డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య, అప్పటివరకు జస్టిస్‌పార్టీలో నాయకుడుగా నుండిన శ్రీ కొల్లిపర రమణయ్యనాయుడు కాంగ్రెసు పక్షావలంబులై జిల్లాలో మారుమూల గ్రామములలోగూడా విరివిగా ప్రచారమొనర్చి ప్రజానీకమును వూపివైచిరి. కాని యెన్నికల ఫలితములు తెలియగానే జిల్లాలోని కాంగ్రెసు వాదులందరకు నడుములువిరిగి నిరుత్సాహులై కూలబడిరి.

జనరల్ స్థానము పోవుటకు ముఖ్యకారణము శ్రీ రాజాగారు క్యుమ్యులేటివ్ ఓటింగ్ అగుటవలన తాను నిలబెట్టుకొనిన హరిజన అభ్యర్థికి ఓట్లు వేయించకుండా రెండుఓట్లు తానే పెట్టెలలో వేయించుకొన్న కారణమున మెజారిటీ సంపాదింప గలిగినట్లు విశదమైనది. ఓట్ల లెక్కింపునుబట్టి, కాంగ్రెసువారు నాడు సుశిక్షులగుటచే కాంగ్రెసు ఆజ్ఞ శిరసావహించి జనరల్ స్థానమునకు ఒకఓటు, రిజర్వ్‌స్థానమునకు ఒక ఓటు వేయించుటవలన ఈ అపజయము ప్రాప్తించినది.

1937 ప్రారంభములో అప్పటివరకు జరిగిన జాతీయ పోరాటము, సత్యాగ్రహచరిత్ర చాలావరకు రామబ్రహ్మం కార్యదర్శిగావున్న జిల్లా కాంగ్రెసుకమిటీ వివరములను అందినంతవరకు సేకరించినది. దీనిని అచ్చువేయవలెనను తలంపుతో జాతీయోద్యమములో పాల్గొన్నవారి పొటోలు, వివరములకొరకు పత్రికలలో ప్రకటించడము జరిగినది. దానిపై కొంత సమాచారము, కొన్ని పొటోలు వచ్చినవి. దానినికూర్చి పెట్టుటకు శ్రీ మానికొండ సత్యనారాయణశాస్త్రిగారిని కోరడమైనది. వారు దానిక్ అంగీకరించి చరిత్రను ఒక రూపమునకు తీసుకొనివచ్చిరి. ఆర్థికస్థితి కారణంగా పుస్తక ప్రకటనకగు వ్యయము వసూలుపరచుట అప్పట్లో సాధ్యపడునందున శ్రీ రామబ్రహ్మంగారు తాను స్వంత ధనముతో ప్రకటించుటకు ముందునకువచ్చి దానికగుఖర్చు యావత్తూ తానే భరించుటవలన తూర్పు "కృష్ణాజిల్లా జాతీయోద్యమ చరిత్ర" 9-1-1937 న శ్రీ కృష్ణా పత్రికాధిపతుల సహకారముతో ప్రకటించుట జరిగినది.

21-5-1937 వ తేదీన పామర్రు గ్రామంలో ప్రథమ తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు మహాసభలు జరుపుటకు జిల్లా కాంగ్రెసు సంఘము తీర్మానించినది. శ్రీ రామబ్రహ్మంగారి యధ్యక్షతన ఆహ్వాన సంఘము యేర్పడినది. సభాధ్యక్షులుగా శ్రీ వరాహగిరి వెంకటగిరి M. L. A. గారిని ప్రారంభకులుగా కామ్రేడ్ కొట్రగడ్డ వెంకటనారాయణ M. L A.

గారిని జాతీయ పతాకారోహణోత్సవమునకు శ్రీ అయ్యదేవర కాశేశ్వర రావు M. L. A. గారిని ఆహ్వానించడం జరిగినది. సభలకు జిల్లాలోని కాంగ్రెసు వాదులందరూపాల్గొని సభలను జయప్రదమొనర్చిరి.

శ్రీ రామబ్రహ్మం బొంబాయి, ఫైజపూర్ కాంగ్రెసు మహాసభలకు రాష్ట్రప్రతినిధిగావెళ్ళి సభలో పాల్గొనిరి. బొంబాయి వెళ్ళినపుడు పూనానగరములోదిగి మహావీర్ శివాజీచే నిర్మించబడిన అనేక పురాతన కట్టడములను దర్శించిరి. సింహగడము మున్నగు చరిత్రాత్మక పర్వతారోహణచేసి పురాతనకోట, శిధిలాలను దర్శించి మురిసిపోయిరి. ఫైజపూర్ కాంగ్రెసుకు వెళ్ళినపుడు శ్రీకృష్ణదేవరాయలచే పాలింపబడిన విజయనగర సామ్రాజ్యములోని పురాతనకోట శిధిలాలను హంపీ క్షేత్రమును, అజంత, గాంధిసేవాగ్రాం (వార్ధా ఆశ్రమము) మొదలగునవి చూచి ఎంతగానో ఆనందించిరి.

1941 అక్టోబరు 18 వ తేది ఆలిపూర్ కంటోన్మెంటు జైలు నుండి విడుదలైవచ్చిన అనంతరం ఈ దంపతులకృషితో ద్వితీయ తూర్పు కృష్ణాజిల్లా రాజకీయ మహాసభ గుడ్లవల్లేరు గ్రామంలో జరుపబడినది. ఈ సభకు శ్రీ కల్లూరి సుబ్బారావుగారు అధ్యక్షులు, శ్రీ టంగుటూరి ప్రకాశంగారు ప్రారంభకులు. ఈ సభలు జిల్లా కాంగ్రెసు కమిటీ ఆధ్వర్యమున నిర్వహించ బడెను. గ్రామస్థులు సభలకు చక్కని యేర్పాట్లుచేసిరి.

రామబ్రహ్మంగారు జిల్లా కాంగ్రెసు అధ్యక్షులుగా నున్నప్పుడు 1945 వ సంవత్సరములో ఆంధ్ర కాంగ్రెసు నాయకులు డాక్టరు శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారి జన్మదినోత్సవము మచిలీపట్నములో వైభవోపేతముగా జరిపించిరి. రామబ్రహ్మంగారు ప్రత్యేకశ్రద్ధ వహించి

గ్రామాలవెంటతిరిగి 15,000/- ల రూపాయలు ప్రజలనుండి విరాళములు వసూలుపరచి డాక్టరుగారి పేరుతో కాంగ్రెసు భవనమును నిర్మించుటకు యేర్పాట్లుచేసిరి.

ఆ డబ్బు శ్రీ పట్టాభిగారు, అధ్యక్షులైన రామబ్రహ్మంగారిపేర, తనపేర భారతలక్ష్మి బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్టుచేసిరి. కొంతకాలము జరిగిన తరువాత "డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య"గారి పేరున అనగా "శ్రీ పట్టాభి కాంగ్రెసు భవనము"గా ఒక పెద్ద చక్కని భవనమును కొనిరి. దరిమిలా సదరు భవనముపై శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య గారి షష్టిపూర్తి సందర్భములో "బ్రహ్మయ్యహాలు" నిర్మించుటకు శ్రీ రామబ్రహ్మంగారి అధ్యక్షతను ఒక కమిటీ యేర్పడినది. సదరు కమిటీకి శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు అధ్యక్షులుగా బ్రహ్మయ్యహాలు నిర్మాణమునకు చాలా కృషిచేసిరి.

1946-47 సంవత్సరములో శ్రీ రామబ్రహ్మంగారు గ్రామస్థుల సహకారముతో జమ్మిగొల్వేపల్లి, పెదమద్దాలి, బల్లిపర్రు, కొండిపర్రు, రిమ్మనపూడి, అయినంపూడి, అడ్డాడ యేడు గ్రామములకు అనువర్తించు ఉత్పత్తి కొనుగోలు దారుల కో ఆపరేటివ్ సొసైటీని ఆగ్నైజుచేసి 24 గంటలలో 50,000 రూపాయలు షేరుధనం వసూలుచేసి బ్యాంకులో జమకట్టి రాష్ట్రి ప్రభుత్వమువారిచే రిజిష్టరు చేయించినారు. వెంటనే డైరక్టరుల బోర్డును. ప్రభుత్వం నామినేటు చేసినది. బోర్డులో శ్రీ వల్లభనేని రామబ్రహ్మం, తుమ్మల వెంకటకృష్ణయ్య, పొట్లూరి సత్యనారాయణ, నలజాల వెంకటసుబ్బారావు, వల్లభనేని వెంకటరత్నప్రసాద్, కోగంటి వెంకట్రామయ్య, వల్లూరు రామకృష్ణారావుగార్లను డైరెక్టరులుగా నియమించిరి. తదుపరి డైరెక్టర్ల బోర్డు సమావేశమై శ్రీ రామంబ్రహ్మంగారిని, అధ్యక్షులుగను శ్రీ వేంకటకృష్ణయ్యగారిని ఉపాధ్యక్షులుగను ఏకగ్రీవముగా ఎన్నుకొనిరి. ఈ సంస్థ కొంతకాలము రైతులవద్ద ధాన్యముకొని

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD-500 482

మిల్లింగుచేయించి ప్రభుత్వమునకు విక్రయించుట, అపరాలు, పిల్లి దానా వులవలు వుత్పత్తి ప్రదేశములనుండి తెప్పించి సరసమగు ధరలకు రైతులకు విక్రయించుట మొదలగు కార్యములలో శ్రద్ధతీసుకొని సమర్థతో పనిచేయుచుండెను. ఈ సంస్థ రైతులకు చాలా ఉపయోగకరముగాను, లాభదాయకముగా నుండెను. ఇంతలో ప్రకాశం మంత్రివర్గము పడిపోయినది. రాష్ట్రమంతటా పి. సి. సి. సొసైటీలను రద్దుపరచు కార్యక్రమము అమలు జరుగుచుండెను. అప్పుడు ప్రెసిడెంటుగావున్న రామబ్రహ్మంగారు మంత్రి మండలితోను, రాష్ట్ర రిజిష్ట్రారుగారితోను సంప్రదించి దీనిని రద్దు చేయకుండా ఆపి, రీ ఆర్గనైజుచేసి "శ్రీ పట్టాభి కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్"గా రిజిష్టరు చేయించెను. దీనిద్వారా రైతులకు వ్యవసాయ అభివృద్ధి కార్యములకు కావలసిన అప్పులు ఇచ్చుచూ, మిక్కిలి లాభదాయకముగా పనిచేయసాగెను. చాలా సంవత్సరములు రామబ్రహ్మంగారే అధ్యక్షులుగావుండి ప్రతి సంవత్సరము షేరుహోల్డర్లకు లాభములు పంపిణీచేయుచూ ఎనలేని సేవచేసిరి. దరిమిలా శ్రీ రామబ్రహ్మంగారు కృష్ణాజిల్లా ఈస్టరన్ డివిజన్ ఇరిగేషన్ బోర్డులో సభ్యులుగా ప్రభుత్వము వారిచే నామినేటు చేయబడిరి. రాజకీయ బాధితులకు భూములు శాంక్షను చేయుటకు కృష్ణాజిల్లాకు శ్రీ రామబ్రహ్మం, శ్రీ కొడాలి ఆంజనేయులు, శ్రీ మాగంటి అంకినీడుగార్లతో ల్యాండు అక్వయిజీ కమిటీ మద్రాసు ప్రభుత్వమువారు నియమించిరి. దీనికి జిల్లాకలెక్టరు అధ్యక్షులు. ఈ కమిటీ స్వాతంత్ర్య సమరయోధులకు, జిల్లాలోని వివిధ ప్రాంతములలోను ఖాళీ బంజరుగాపడియున్న ప్రభుత్వ భూములను సాగుకు లాయకు అయినవి జిల్లా పర్యటనలో తెలుసుకొని తగినవారికి పట్టామీద మంజూరు చేయించుచుండిరి. హోంగార్డ్స్ సెలక్షన్ కమిటీ ఒకటి ప్రభుత్వంవారు శ్రీ రామబ్రహ్మం, శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, శ్రీ మరుపిళ్ళ చిట్టిగార్లతో కృష్ణాజిల్లాకు నియమించిరి. దీనికి జిల్లా కలెక్టరు, జిల్లా పోలీసు సూప

రించెండెంటుగార్లను గూడా ఉద్యోగరీత్యా సభ్యులుగా నియమించిరి. ఈ అయిదుగురున్నూ వేసవికాలంలో మంచి ఎండలలో జిల్లా అంతయూ పర్యటించి సమర్థులైన మంచి హోంగార్డులను సెలెక్టు చేసిరి.

1948 సంవత్సరములో డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు కాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నుకొనబడినప్పుడు జైపూర్ కాంగ్రెసుకు దంపతులిరువురూ వెళ్ళిరి. అప్పుడు సీతామహాలక్ష్మమ్మగారు M. L. A. గా వున్నారు. వీరి ముఖ్య స్నేహితులు శ్రీ కొడాలి ఆంజనేయులు, డాక్టరు రాళ్ళపల్లి అచ్యుతరామయ్య, విన్నకోట రామలింగం, వడ్డె రంగారావు గారలతో కాంగ్రెసుసభ అనంతరం ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా, తాజ్ మహల్. ఢిల్లీ, హరిద్వార్, పత్తేపూర్ శిక్రీ, లక్ష్మణమూల, హృషీకేష్, అయోధ్య. లక్నో, అలహాబాద్, ప్రయాగ, కాశీ, బుద్ధగయ, కలకత్తా మొదలగు చరిత్ర ప్రసిద్ధక్షేత్రిము లన్నియూ దర్శించివచ్చిరి.

తదుపరి 1949 సంవత్సరములో దక్షిణదేశంలోని మధుర, తిరువాన్‌కూర్, కన్యాకుమారి ఆగ్రా, రామేశ్వరము, ధనుష్‌కోటి మున్నగు క్షేత్రిములు ఈ దంపతులు పర్యటించిరి. అస్వస్థతగానున్న రామబ్రహ్మంగారి మాతృమూర్తి వెంకమ్మగారు ది 24-5-50 వ తేదీన బుధవారం రోజున దివంగతురాలైరి.

1955 సంవత్సరము జమ్మిగొల్వేపల్లి గ్రామంలో మాతా శిశు సంక్షేమ కొలయము నిర్మించుటకు గ్రామస్థులనుండి 10,000 రూపాయలు వసూలు చేసి కృష్ణాజిల్లా కలెక్టరు శ్రీ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌గారిని గ్రాంటు ఇప్పించమని కోరగా వారు 15,000 రూపాయలు శాంక్షను చేసినారు. ఈ మొత్తం 25,000 రూపాయిలతోను శ్రీ రామబ్రహ్మంగారు గ్రామంలో బిల్డింగు నిర్మాణము నిమిత్తము ఒక కమిటీని నియమించి తాను అధ్యక్షులుగావుండి ప్రత్యేక శ్రద్ధతీసుకొని అందమైన పెద్ద భవన

మును జిల్లా హెల్తు ఆఫీసరుగారి ప్లానును ప్రకారము నిర్మించిరి. ఈ భవనమునకు ది 8-8-1955 సంవత్సరం ఆంధ్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ప్రారంభోత్సవము జరిపిరి. ఆ సభకు శ్రీ రామబ్రహ్మంగారే అధ్యక్షులుగా ఉండి నిర్వహించిరి. ఈ భవనమునకు లోగడ మద్రాసు ప్రభుత్వ మధ్యనిషేధ మంత్రి శ్రీ నీలం సంజీవ రెడ్డిగారు ది 1-12-49 వ తేదీన శంఖుస్థాపనచేసిరి. శ్రీ బెజవాడ గోపాల రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉండగానే ఈ గ్రామ అవసరాలను గమనించి ఒక గ్రామీణ ప్రాధమిక వైద్యశాలను ఒక డాక్టరుతో కాంక్షన్ చేయించిరి.

ఈ దంపతులు శ్రద్ధతీసుకొని కృషిచేసినందువలన జమ్ముగొల్వేపల్లి గ్రామం గుడివాడ - పామర్రు రోడ్డు నుండి 2 మైళ్ళు నిడివిగల ఒక మెటల్‌రోడ్డు, రూల్ డిస్పెన్సరీ, మాతా శిశు సంరక్షణాలయము దీనికి 25 వేల రూపాయలు విలువగల చక్కని బిల్డింగు, మంచి గ్రంధాలయము, గ్రామంలో నాలుగైదు వంతెనలు, ఎలక్ట్రిసిటీ స్కీము శ్రీ వేణుగోపాల దేవస్థానం అభివృద్ధి పంచాయితీ ఆదాయాభివృద్ధి మొదలగు ప్రజోపయోగ కార్యములు ఎన్నియో సాధించబడెను.

ది 20-7-1960 వ తేది ఆలిండియా రేడియో విజయవాడ వారు శ్రీ రామబ్రహ్మంగారిని ది 29-7-60 తేదీన ఉదయం గం॥ 7-40 లకు గాంధీమహాత్మునితో 1929 ఖద్దరు యాత్రలలో మీ అనుభవాలను గురించి ఉపన్యసించవలసినదిగా ఆహ్వానించిరి. సదరు ఉపన్యాసమువిన్న రేడియో శ్రోతలు ఆనందించిరి. రేడియో వుపన్యాససారాంశము ఒకటవ అనుబంధముగా ప్రచురింపబడినది.

శ్రీ రామబ్రహ్మంగారి అధ్యక్షతను నడచుచున్న శ్రీ పట్టాభి కో ఆపరేటివ్ బ్యాంకు తరపున 1962 సంవత్సరములో గ్రామ కర్షకుల ఉప యోగ నిమిత్తం ధాన్యం నిల్వచేసికొనుటకు శ్రీ పట్టాభి ధాన్యం గిడ్డంగులు 15,000 రూపాయల వితువగలవి రామబ్రహ్మంగారు నిర్మించి గ్రామస్థుల ప్రశంసల నందుకొనిరి.

శ్రీ రామబ్రహ్మంగారు మామూలుగా సాంఘికసేవ, ప్రజాసేవ చేయుచూ గ్రామంలో పాలసేకరణ కేంద్రమును 965 సంవత్సరమున నెలకొల్పి అంతదనుక దుర్భరమైయున్న గ్రామ జీవమును సుఖవంతము చేసిరి. పాడి పరిశ్రమ మీద గ్రామవార్షిక ఆదాయము నాలుగు లక్షలు రూపాయలవరకు అభివృద్ధి చెందుటకు కారకులైరి. పాల వుత్పత్తిదారుల నుండి విశాళములు వసూలుపరచి ఒక చక్కని బిల్డింగు కట్టించి ప్రభు త్వమువారికి అప్పగించిరి. గ్రామంలో ఈ పని నిమిత్తము ఒక కమిటీ యేర్పడినది. సదరు కమిటీకి రామబ్రహ్మంగారే అధ్యక్షులు. కార్యదర్శి కొట్రగడ్డ వెంకటకృష్ణయ్య. సభ్యులు బొప్పూడి సత్యనారాయణ, చాపరాల కోటయ్య, పెద్దు ఆంజనేయులు, గుమ్మడి పిచ్చయ్య, వల్లభనేని జనార్దన రావు, పొట్లూరు నరసింహారావు, పొట్లూరు కోదండరామయ్యగారి కుమా రుడు కృష్ణారావుగారలు దక్షతతో కార్యక్రమమును నిర్వహించిరి. వ్యవ సాయ శాఖామాత్యులు కాకాని వెంకటరత్నంగారిచే భవన ప్రారంభోత్స వము ది 23-4-70 న జరుపబడెను. ఈ కమిటీకి గ్రామస్థులు పూర్తి సహ కారము నందించిరి. ఈ సంస్థనిలా అభివృద్ధిపరచుచూ కృష్ణాజిల్లా కాటన్ గ్రోయర్స్ కో - ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ స్థాపించి రిజిష్టరీ చేయించుటకు తీవ్రమైన కృషిచేసిరి. ప్రత్తి పండించుటకు రైతులను ప్రోత్సహించుచూ, చాలీ చాలని ఆదాయం వచ్చుచున్న మాగాణీ రైతులకు ఉపవృత్తిగా సేకరించుటకు ప్రోత్సహించి, వృత్తివల్ల అదనపు ఆదా యము రెండవ పంటగావచ్చుటకు కృషిచేసిరి. సదరు సహకార సంఘ

ములో ప్రారంభమునుండియూ కోశాధికారిగా నుండి సదరు సంఘమునకు ప్రభుత్వము నుండి ఆర్థికవనరులు ఏర్పాటుకున్నా రైతులు పండించు ప్రత్తికి మార్కెటింగ్ సౌకర్యముల యేర్పాటుకున్నా పూర్తిగా తోడ్పరి. పామర్రు గ్రామములో సదరు సొసయిటీ కవసరమైన బిల్డింగులు, గోడవున్నా, మిషనరీ, జిన్నింగులు, బేలింగుప్రెస్సు వగైరాలు లక్షలు విలువ గల నిర్మాణమొనర్చుటకు వీరుచేసిన కృషివలన సంఘములో రైతు సోదరులు, భాగస్వాముల ప్రశంసలనందుకొనిరి. ఇటీవల సంఘములో జరుగుచున్న కొన్ని అవాంఛనీయమైన సంఘటనలవలన అసంతృప్తిచెంది వీరు కోశాధికారి పదవికి రాజీనామా ఇవ్వడము జరిగినది.

కుమారి శోభ ఆత్మాహుతి

శ్రీ రామబ్రహ్మం దంపతులు 1969 సంవత్సరము జూలై 10 వ తేదీన 17 సంవత్సరములు అల్లారు ముద్దుగా పెంచుకొనిన కుమారి శోభ పెద్ద చదువులు చది, తన్ను పెంచిన తల్లి దండ్రులను సంతోషపెట్టలేక పోయితినే అనే విచారముతో మద్రాసు ఆంధ్రసభవారి పాఠశాలలో మెట్రిక్ పరీక్షవ్రాసి కొద్ది మార్కులతో తప్పినందున అకస్మాత్తుగా ఆత్మాహుతి చేసుకొని రామబ్రహ్మం దంపతులను పుట్టెడు దుఃఖములో ముంచి వైచెను. ఎట్లాగో కాలక్రమేణా ఈ దుఃఖమును దిగమ్రింగి తమ విద్యుక్త ధర్మమును తెలుసుకొని గ్రామములో ఉన్నత పాఠశాల లేని లోటు తీర్చ వలెనని కుమారి శోభ స్మారక చిహ్నముగా గ్రామములో హైస్కూలు నిర్మించుటకు కృతనిశ్చయులై, భవనమును తామే స్వంతడబ్బుతో నిర్మించుటకు వాగ్దానముచేసి గ్రామస్థులతో తాను అధ్యక్షుడుగా జమీగొల్వేపల్లి కుమారి వల్లభనేని శోభా మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూలు స్థాపనకు ఏర్పాటుచేసిరి. సదరు పాఠశాల స్థాపించుటకు కృష్ణాజిల్లా పరి

షత్ ఛైర్మన్ శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు, గ్రామస్థురాలు శ్రీమతి వల్లభనేని కమలకుమారి M. L. C. గ్రామ పెద్దలు, ఇతర మిత్రులు చాలా కృషిచేసిరి. అతిత్వరలోనే ది 29-8-69 సంవత్సరము సదరు ఉన్నత పాఠశాలకు ప్రారంభోత్సవము చేయబడెను. ప్రారంభకులు శ్రీ కె. సూర్యనారాయణ జిల్లాపరిషత్ డిప్యూటీ సెక్రిటరీ, అధ్యక్షులు శ్రీ పి. వెంకటసుబ్బయ్య జిల్లా పరిషత్ కార్యదర్శి, జాతీయ పతాక స్థాపకులు శ్రీ యలమంచిలి వెంకటాద్రి, (ప్రెసిడెంటు కాటన్‌గోరియర్సు కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ, పామర్రు.) జమీగొల్వేసల్లి కుమారి వల్లభనేని శోభ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూలు కమిటి అధ్యక్షులు శ్రీ వల్లభనేని రామబ్రహ్మం, కార్యదర్శి శ్రీ తుమ్మల చౌదరి M. A. సభ్యులు, శ్రీ వల్లభనేని వెంకటరత్నప్రసాద్ B. A. పొట్లూరు బలరామకృష్ణయ్య, గ్రామ సర్పంచి గుమ్మడి వెంకటేశ్వరరావు, యన్. యస్. ఆర్. ఆంజనేయ చౌదరి, పెద్దు సాంబశివరావు, పొట్లూరు సత్యనారాయణ (V. M.) కాట్రగడ్డ వెంకటకృష్ణయ్య, చెరుకూరు నాగేశ్వరరావు, పొట్లూరు వెంకట చలపతిరావు (ఉభయ భాషా ప్రవీణ) జూపూడి వీరరాఘవయ్య, గుమ్మడి పిచ్చయ్య, వల్లభనేని వెంకట సుబ్బయ్య గారలు. పై కమిటీవారి ఆధ్వర్యమున గ్రామంలో వసూలుపరచిన చందాలనుండి పశువుల ఆసుపత్రి నిర్మాణమునకు సగము ఇచ్చు యేర్పాటుతో పశువుల ఆసుపత్రి నిర్మాణమునకు శ్రీ చెరుకూరి సత్యనారాయణ ముందునకువచ్చిరి. వారిపేరుతో బిల్డింగు నిర్మించుటకు గ్రామస్థులు అంగీకరించి పూర్తి సహకారమునిచ్చి బిల్డింగు త్వరగా పూర్తిచేయుటకు తోడ్పడిరి. ఇందు ప్రముఖపాత్ర పంచాయితీ సర్పంచి శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు వహించిరి. దరిమిలా వ్యవసాయ శాఖ మాత్యులు శ్రీ కాకాని వెంకటరత్నంగారిని శ్రీ రామబ్రహ్మంగారు తీసుకొనివచ్చి పశువుల అసుపత్రి భవనమునకు ది 8-6-71 వ తేదీన పారంభోత్సవము చేయించిరి.

దత్తత కుమారుడు

ది 23-3-70 వ తేదీన శ్రీ రామబ్రహ్మంగారి సోదరి మనుమడు చందరాల గ్రామంలోని శ్రీ చాపరాల వెంకటేశ్వరరావు, శ్రీమతి యూన్సీ లక్ష్మీ బాయమ్మ (రామబ్రహ్మంగారి మేనకోడలు) గార్ల పుత్రుని రామ బ్రహ్మం దంపతులు దత్తత చేసుకొని రామబ్రహ్మం తండ్రి వెంకట రత్నంగారి పేరును దత్తునకు నామకరణము చేసుకొనిరి. దరిమిలా కొమరవోలు గ్రామస్థులు అట్లూరి వెంకటరంగారావుగారి కుమార్తె చంద్రకుమారినిచ్చి 1971 ఏప్రియల్ 28 వ తేదీన వైభవోపేతముగా వివాహమొనర్చిరి. దురదృష్టవశాత్తు ఆ అమ్మాయిగూడా సంవత్సరము తిరుగకమునుపే 1971 సెప్టెంబరు 30 వ తేదీన విజయదశమి పండుగ రోజు రాత్రి (తెల్లవారు ఝామున) కన్నవారి ఇంటివద్ద ఆత్మ హత్య చేసుకొనెను.

శ్రీ రామబ్రహ్మం దంపతుల దత్త పుత్రుడు చి॥ వెంకటరత్నం ప్రథమ కళత్రము ది 30-9-71 తేదీన స్వర్గస్థురాలైనపిదప తిరిగి పున ర్వివాహము, గుడివాడ కాపురస్తులు చెరుకూరి శ్రీనివాసరావుగారి చతుర్థ పుత్రిక చి॥ సౌ॥ మృదులారాణితో ది 9-5-74 తేదీన విజయవాడ లబ్బీ పేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిని జరుపబడెను. శ్రీ శ్రీనివాస రావుగారిది అసలు గుడివాడ తాలూకా పెరిసేపల్లి గ్రామం. వీరి తండ్రి మంచి పేరు ప్రఖ్యాతలుగలవారు. వారిని షావుకారు రామయ్య అనేవారు. చుట్టుపట్ల గ్రామాల ప్రజలకు చాలా సన్నిహితులు, వారి కష్ట - సుఖాలలో పాల్గొని వారికి అవుసరమైన సహకారమిచ్చుచూ, వారి అభిమానమునకు పాత్రులై వారిచేత మిక్కిలి ప్రేమింపబడు చుండెడివారు.

1970 సంవత్సరం మార్చిలోనే రామబ్రహ్మంగారు తన పినతండ్రి మనుమడు, చనిపోయిన పెంపుడు కుమార్తె శోభ సోదరుడు అయిన

వల్ల ఖనేని మురళీమోహన్ అను యువకుని ప్రేమపుత్రునిగా స్వీకరించి, ఆదరించి రెండెకరముల మాగాణిభూమి దఖలు ప్రాసియు, వివాహము తన స్వంత ఖర్చుతో వైభవోపేతముగా చేసిరి. పాల ప్రాజెక్టులో ఉద్యోగము యిప్పించియు అతని అభివృద్ధికి తోడ్పడిరి. మురళీమోహన్ ఆస్తి 10 యకరముల మాగాణిభూమి, ఈయన మేనత్త భర్త పెరిశేపల్లి గ్రామస్థుడు చెరుకూరి వెంకటసుబ్బయ్య అను పెద్దమనిషి అమ్మ డబ్బు తనవద్ద వుంచెదనని తీసుకొనిపోయి చివరకు ఇతనికి యేమీ ముట్టచెప్పకయే మరణించెను. అట్టి తరుణములో నిశ్చహాయుడైయున్న ఈతనికి సహాయపడి పైవిధముగా అతని అభివృద్ధికి దోహద మొనర్చుచుండెను.

పశువుల ఆసుపత్రి భవన నిర్మాణము సందర్భములో మరొక విశేషము జరిగినది. గ్రామ ప్రజలలో ఒక వాతావరణము యేర్పడినది. గ్రామస్తులు ఇవ్వవలసిన చందాలు వసూళ్ళలో వారు ఇవ్వలేదని వీరు, వీరు ఇవ్వలేదని వారు మొత్తం వసూళ్ళు ఆగిపోయినవి. అప్పుడు గ్రామ కమిటీ అధ్యక్షుడుగానున్న శ్రీ రామబ్రహ్మం గ్రామస్తులకు వారం రోజులలో చందాలు ఇవ్వవలెనని, బిల్డింగు నిర్మాణము ఆగిపోయినదని, ఇతర సాముదాయక వ్యాపారములు గూడా కుంటుబడిపోయినవని, అందువలన గ్రామం చాలా నష్టపడిపోవుచున్నదని, అలా ఇవ్వనియెడల 15-8-71 తేదీ నుండి నిరాహారదీక్ష సాగించవలసి వస్తుందని ఒక విజ్ఞప్తి చేసిరి. దానికిగూడా సరిఅయిన సమాధానము రానందున నిరాహారదీక్ష పూర్తిగా అయిదు దినములు సాగించిరి. అప్పటికి గ్రామస్తులలో హృదయ పరివర్తనంగలిగి, అప్పటికి మిగిలివున్న విరాళములు ఇచ్చుటకు అంగీకరించుచూ పిరిని దీక్షవిరమించమని గ్రామస్తులందరూ ఏకగ్రీవముగా విజ్ఞప్తిచేసిరి. కార్యరూపములో చూపించినగాని విరమించనని కోరినందున ఆ ప్రకారం చాలామంది విరాళములను తీసుకొనివచ్చి గ్రామ కమిటీకి

జమకట్టిరి. అంతటితో రామబ్రహ్మంగారు దీక్షవిరమించి బిల్డింగు నిర్మాణము పూర్తి చేయించిరి.

ఇక హైకోర్టులు విషయములో శోభాయమానమైన రెండంతస్థుల పక్కా బిల్డింగ్ 80,000 రూపాయల విలువగలవి త్వరత్వరగా దీక్ష వహించి పూర్తిచేయుట జరిగినది. ఇందు నిమిత్తము య 5-50 ట్లు భూమిని విక్రయించడముకూడా జరిగినది. 1970 అక్టోబరు నాటికి భవనములు పూర్తిఅయి నూతన భవన ప్రారంభోత్సవము ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారిచే 7-10-70 వ తేదీన బ్రహ్మాండముగా జరుపబడెను. సభాధ్యక్షులుగా వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ కాకాని వెంకటరత్నంగారు, జాతీయ పతాకారోహణ శ్రీ కొడాలి ఆంజనేయులుగారు. ఆర్థిక మంత్రి శ్రీ అనగాని భగవంతరావుగారు స్వయముగా విచ్చేసి తమ సందేశమునిచ్చిరి. ఈ శుభ సమయములో స్వాతంత్ర్య సమరయోధులు పితామహులు శ్రీ ముదిగంటి జగ్గన్నశాస్త్రి కొడాలి ఆంజనేయులు, కొల్లిపర సూరయ్య, తంగిరాజు రాఘవరావు ప్రభృతులకున్నూ, మధురకవి కాకాని నరసింహారావుగారికిన్నీ సన్మానమొనరించి నూతన ఖాదీ వస్త్రములతో సత్కరించిరి. హైకోర్టులు భవన దాతలు, స్వాతంత్ర్య సమర యోధులు అయిన రామబ్రహ్మం దంపతులకు పౌరసన్మానము జమీగొల్వేపల్లి గ్రామ సర్పంచి గుమ్మడి వెంకటేశ్వరరావు పౌరులతరపున నూతన వస్త్రములొసంగి సన్మానించిరి. ఈ దంపతుల భాయా చిత్రములు హైకోర్టులు భవనములో ముఖ్యమంత్రిగారిచే ఆవిష్కరించబడెను.

క

సన్మానములు

1972 ఆగష్టు 15 వ తేదీ 25వ స్వాతంత్ర్య రజతోత్సవ సంవర్భ ములో శ్రీ రామబ్రహ్మంగారిని భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ఢిల్లీ ఆహ్వానించి యర్రకోటలోని దర్బారు హాలులో సన్మానించి తామ్ర పత్ర మును బహూకరించిరి. ఈ సందర్భములో ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు రాష్ట్రము నుండి ఢిల్లీకి పంపబడుచున్న స్వాతంత్ర్య సమరయోధులను హైదరాబాద్ ఆహ్వానించి ది 11-8-72 వ తేదీన సన్మానమొనరించి ప్రత్యేక రైలులో ఢిల్లీకి వీడ్కొలొసంగి పంపించిరి. ఢిల్లీలో 13-8-72 న సెంట్రలు గవర్నమెంటువారు రైలు స్టేషనులో వీరిని రిసీవుచేసుకొని ఆంధ్రప్రభుత్వ గెస్టుహవుస్‌లో వీరికి మకాం యేర్పాటుచేసి ఢిల్లీలో ఉన్నంతకాలం భోజనవసతులు, పడక సౌకర్యములు యేర్పాటు చేయుటయేగాక ప్రత్యేక టూరిస్టు బస్సులో హరిద్వార్, ఆగ్ర మొదలైన పుణ్యక్షేత్రములు దర్శింపచేసిరి. ఢిల్లీలో 14-8-72 వ తేదీన ఆంధ్ర అసోషియేషన్, ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ వగైరాసంస్థలు వీరిని సన్మానించి ప్రీడంఫైటర్సు సావనీర్ ప్రచురించి అందు వీరి చరిత్రలు, ఫొటోలు పొందుపరచిరి.

20-8-72 వ తేదీ ఢిల్లీ నుండి తిరిగివచ్చిన స్వాతంత్ర్య సమర వీరులను నాంపల్లి రైల్వేస్టేషనులో (హైదరాబాద్) ఆంధ్రప్రదేశ్ వ్యవ సాయ శాఖామాత్యులు శ్రీ కాకాని వెంకటరత్నంగారు పూల మాలలతో సత్కరించి రిసీవుచేసుకొనిరి. హైదరాబాద్‌లోని ఆలిండియా రేడియో వీరి చరిత్రలను టేపురికార్డు చేసుకొని దరిమిలా ప్రసారమొనర్చిరి. 23-8-72 న తేదీన శ్రీ ప్రకాశం శతజయంతి సందర్భములో ఆదర్శ గ్రామముగా ఎన్నుకొన్న గుడివాడ తాలూకా నెమ్మలూరు గ్రామంలో

గొప్ప బహిరంగసభ జరుపబడెను. ఆ సందర్భములో శ్రీ రామబ్రహ్మం గారితో జాతీయ పతాకారోహణోత్సవం చేయించబడెను. ఈ దంపతు లిరువురికి ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్యమంత్రులు శ్రీ టి. హయ గ్రీవాచారులుగారితో సన్మానము జరిపించి నూతన వస్త్రములతో సత్కరించిరి.

27-8-72 వ తేదీన విజయవాడ పాల ప్రాజెక్టు పాల ఉత్పత్తి దారుల మహాసభ విజయవాడలో సమావేశమై రామబ్రహ్మంగారిని ఆ సమావేశమునకు అధ్యక్షునిగా ఎన్నుకొనిరి. సదరు సమావేశములో సంఘ మును రిజిష్టరు చేయుటకు ప్రణాళికను రూపొందించి, శ్రీ వల్లభనేని రంగయ్యగారిని అధ్యక్షునిగాను, శ్రీ కె. వి. సత్యనారాయణగారిని కార్య దర్శిగాను, మరి కొంతమంది అన్ని జిల్లాల నుండి సభ్యులుగా తీసుకొని స్టాడింగు కమిటీ యేర్పరచిరి. దీనికి శ్రీ వాసిరెడ్డి నారాయణరావుగారు (పశు సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు) చాలా కృషిచేసిరి.

దరిమిలా పామర్రు పాలశీతల కేంద్ర యేరియా పాల ఉత్పత్తి దారుల మహాసభ శ్రీ రామబ్రహ్మంగారి అధ్యక్షతను జరుపబడి శ్రీ యన్. యస్. ఆర్. ఆంజనేయులు చౌదరి అధ్యక్షులుగాను, శ్రీ పేములపల్లి నారాయణరావుగారు కార్యదర్శిగాను కొందరు సభ్యులతో స్టాడింగ్ కమిటీ యేర్పాటు చేయబడినది.

విజయవాడ పాల ప్రాజెక్టు వుత్పత్తిదార్ల సంఘములో కార్య నిర్వాహకసభ్యుడుగా శ్రీ రామబ్రహ్మంగారు పాల ఉత్పత్తిదార్ల అభి వృద్ధికి, పాలధరలను పెంచవలసినదిగా పాల కమీషనర్ శ్రీ సూర్యప్రకాశ రావు గార్ల వద్దకు రాయబారములు వెళ్ళి పాలధరల పెంపుదలకు కృషిచేసి

జయమునుగాంచిరి. భారత ప్రభుత్వమువారు యీ దంపతులను గౌరవించి తామ్రపత్రముల బహూకరించుటేగాక 1972 ఆగష్టు నుండి నెల 1కి రు 300/- లు స్వాతంత్ర్య సమరయోధుల పెన్షనుగూడా శాంక్షనుచేసిరి.

ఇక హైస్కూలు చుట్టుపట్ల గ్రామములకు కూడలిగాఉండి మంచి అభివృద్ధిగాంచినది. గ్రామంలో మరొక కాన్వెంట్‌స్కూలు ఉన్నప్పటికి కుమారి శోభా మెమోరియల్ హైస్కూలులో సగం పైచిలుకు బాలికలున్నూ, మూడవవంతు హరిజన బాల - బాలికలున్నూ విద్య నభ్యసించుచున్నారు. ఈ దంపతులు వృద్ధాప్యములోగూడా ప్రజాసేవయే తమకర్తవ్యముగా భావించి అనారోగ్యములను గూడా లెక్కచేయక శక్తివంచన లేకుండా కృషి చేయడము ప్రశంసార్హము.

జీవితము ప్రజాసేవకంకితముచేసిన, శ్రీ వల్లభనేని రామబ్రహ్మము చరితార్థ జన్ముడు. ఆయన జీవిత చరిత్రము అవస్య పఠనీయము.

మహాత్మాగాంధి ఆంధ్రదేశ పర్యటనగూర్చి విజయవాడ ఆకాశవాణి 29-7-60 వ తేదీన ప్రసారముచేసిన రామబ్రహ్మంగారి ఉపన్యాసమును ఒకటవ అనుబంధముగా పరిచురించబడినది.

అనుబంధము-1

గాంధీ కథ

(శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారి రేడియో ప్రసంగం)

1929 లో నేను కొత్తగా మోటార్ కారు కొన్నాను. కారు నడపడం నేర్చుకున్నాను. ఆ నేర్పువల్ల నాకు గొప్ప అదృష్టం కలిగింది.

1921 లోనే మహాత్మాగాంధీ పేరువిన్నాను. అప్పటికి నాకు 14 ఏళ్ల లేతవయసు. గాంధీజీ పతిత జనోద్ధరణకు అవతరించిన మహాత్ముడనే విశ్వాసం నాకప్పుడే కలిగింది. వారి ప్రబోధం నా హృదయంలో గాఢంగా నాటుకుంది ఆంగ్ల విద్యకు స్వస్తిచెప్పి, హిందీ భాషాభ్యాసం ప్రారంభించాను. ఖాదీ ఉత్పత్తి నుపక్రమించాను. నాకు రాజకీయ గురువు డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు.

నేను మోటారు కారుకొన్న కొత్తలో గాంధీగారు ఖద్దరు ప్రచారంచేస్తూ ఆంధ్రదేశంలో పర్యటించారు. కృష్ణా జిల్లాలో మహాత్ముని పర్యటనానికి నేను నా మోటారు కారును నడిపించవలసిందిగా డాక్టర్ పట్టాభిగారు నాకు వర్తమానం చేశారు. నేనూ నా మోటారూ తరించామనుకున్నాను. మా గురువుగారి ఆనతిని శిరసావహించి మహాత్మునికి సారథి నయ్యాను.

గాంధీజీకి కారునడపడం తేలికపనికాదు వారి కార్యక్రమం చాలా క్రిక్కిరిసి వుంటుంది. Punctuality మహాత్మునికి ప్రత్యేకత. అనుకున్న సమయానికి అనుకున్న స్థలానికి వారిని తీసుకువెళ్ళాలి. ఒక్కొక్కసారి గంటకు 60 మైళ్ళు చొప్పున కూడా కారు నడపాలి. అయినా వేను జంకలేదు. మహాత్ముని సన్నిధానం నాకు శక్తినీ ఉత్సాహాన్నీ కలిగించింది. కారు నడపడంలో నాకున్న నేర్పునంతనూ చూపించాను. వారి వెనుక వచ్చే ఇతర మోటార్ కారులూ పోలీస్ వేనులూ ఒక్కొక్కప్పుడు మమ్మల్ని కలుసుకోలేక వెనకబడేవి. కృష్ణా జిల్లాలో గాంధీగారు ఎన్నెన్నో గ్రామాలు పర్యటించారు. విరామమన్నదేదికాదు. అన్నీసకాలములో జరిగేవి. ఒకచోటలూకు మకాంలో ఒక పోలీస్ ఆఫీసర్ నన్నుపిలిచి—

"మీ కారు సరిగ్గా క్లైంకి చేసుకుని ప్రోగ్రాంలు నడిపిస్తోంది. ఎలా కారు నడుపుతున్నారు? మేం మిమ్మల్ని అందుకోలేక పోతున్నాం. ఉపన్యాసాలు వ్రాసుకోలేక పోతున్నాం" అని ఆశ్చర్యంతో నన్నడిగారు.

ఆ గ్రామంలోనే ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. కొంతమంది అల్లరిమూక చేరి గాంధీజీని మాటి మాటికీ అడ్డు ప్రశ్నలు వేయడం మొదలు పెట్టారు. గాంధీగారు యే మాత్రము చలించక, చిరాకుపడక, మామూలు ధోరణిలోనే ఉపన్యాసం కొనసాగించారు. ఆ మూక యెంతగోల చేసినా గాంధీజీ భయపడలేదు, కోపగించలేదు. శాంతంగా నిశ్చలంగా ఉపన్యాసం ముగించి వేదికప్రక్కనే నిలబెట్టబడిన నా కారు

లోనికివచ్చి కూర్చున్నారు. ఇంతలో అల్లరిమూక వచ్చి, కారు చుట్టూ మూగారు. మహాత్ముని కన్నుల్లో మెరుపులుగాని, పెదవులపై చిరునవ్వుగాని ఏమాత్రమూ తగ్గలేదు. ఇంతలో అతికష్టంమీద జనాన్ని తప్పించుకొని, కస్తూరిబాజీ డాక్టర్ పట్టాభిగారూవచ్చి కారులో కూర్చున్నారు. చుట్టూ మూక చేరి గోలపెడుతున్నారు. గాంధీగారి శాంతమూ అహింసా ధైర్యమూ ననాన్నావహించాయో యేమో ! నేను కారు నడిపించాను.

ఆ మూక అల్లరి చేయడానికే వచ్చారనుకుంటాను. గిల్లికజ్జాలు తేవడమే వారి వుద్దేశం కాబోలు! నానాగోలా మొదలు పెట్టారు. మామూలుగా నాకు విసుగూ కోపమూ కలిగేవి. కాని – మహాత్ముని సన్నిధానం నన్ను కొత్తమనిషిని చేసింది వారు చాటిస్తూన్న శాంతీ అహింసా నన్ను ఆవేశించాయి. నేను ఆక్షణంలోనే గాంధీ అనుమాయి నయాను. ఆవేశం పొందలేదు. ఆ మూకమీద కోపంరాలేదు. ఎలాగేనా ఆ గోలనుంచి బైట పడాలనుకున్నాను.

ఇటు బాపూజీకీ, అటు మూగినవారికీ, ఏవిధమైన ప్రమాదమూ కలగకుండా, అతి జాగ్రత్తగా మిక్కిలినేర్పుతో కారునడిపించి, దూరంబైట చేసుకున్నాం. అంతమందిని తప్పించి, కారునిలా నడపగలిగానా అని గాంధీజీ ఆశ్చర్యపడి, డాక్టర్ పట్టాభిగారి నడిగారు. నేను చాలా ఓర్పూ నేర్పూ గలవాడ ననీ, అందుకే మహాత్ముని కారునడిపే అవకాశం నా కిప్పించా ననీ పట్టాభిగారు చెప్పారు.

గాంధీజీని కృష్ణాజిల్లా నుంచి గుంటూరు జిల్లాకు తీసుకు వెళ్ళాను. అక్కడవారి సెలవు తీసుకోగా, వారు నా చాక చక్యాన్ని గురించి అక్కడి పెద్దలతో చెప్పి అభినందించారు. ఆ తరవాత Young India పత్రికలో దాన్నిగురించి ఒక వ్యాసం వ్రాసి ప్రచురించారు.

మహాత్ముని దర్శనంవల్ల, వారి నా విధంగా సేవించడం వల్ల నాజన్మ ధన్యమైంది. నాలో పరివర్తన కలిగింది. దేశసేనకు నన్ను పురికొల్పింది.

స్వల్ప విషయాలనుగూడా గాంధీజీ మరిచిపోరు. వారు చూపించే ఆదరణ మరపురానిది నేను కారునడిపిన విషయం వారు పత్రికలో ప్రకటించడం వారి ఔదార్యాన్ని తెలియ జేస్తుంది.

గాంధీ మహాత్మునికీ, వారి సేన చేసే అవకాశం కల్పించిన డాక్టర్ పట్టాభిగారికీ ఆ జన్మాంతం కృతజ్ఞుణ్ణి! జైహింద్!

రెండవ భాగము

శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ

Blank Page

1

శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ

జననం - వివాహం

బానిస భారతదేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం పోరాడుతోన్న రోజులు. పురుషులతోపాటు స్త్రీలు సైతం వీరత్వంతో విజృంభిస్తూ, ఝాన్సీరాణి, లక్ష్మీబాయి మొదలైన వీరనారీమణుల అడుగుజాడలలో ప్రయాణమై, పరాయి కిరాతకప్రభుత్వ యంత్రాంగాన్ని ఆశ్చర్యచకిత మొనరించసాగారు.

ఆంధ్ర వీరనారీమణి రుద్రమ వీరగాధ తిరిగి ప్రతి నారీ హృదయంలోనూ మెదలి ఉత్తేజితులను గావించి విడిచింది. జన్మతఃనీతి నియమబద్ధ జీవనులై, దైవభక్తి తత్పరతతో శాంతిమయ జీవితాల సభిలషించే ఆంధ్రజాతి అన్యాయ, నిరంకుశ దౌర్భాగ్య పరప్రభుత్వ పరిపాలనతో పీడింపబడుతూ లోలోన ఆగ్రహావేశాలతో అల్లాడిపోసాగింది.

పల్లెపల్లెనా - గ్రామగ్రామాన స్వేచ్ఛా స్వాతంత్ర్య వాంఛాపూరిత పవనం ప్రచండ వేగంతో పరువులు తీస్తూపోతూంది. కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా గుడ్లవల్లేరు గ్రామంలో ఓ పెత్తందారు కుటుంబం వారైన శ్రీ పొట్లూరి అచ్చయ్య సోదరులైన శ్రీ వెంకయ్య దంపతులకు 1910 వ సంవత్సరం, జనవరినెల 12 న ఓ ఆడపిల్ల కలిగింది. శ్రీ వెంకయ్య శ్రీమతి శోభనాద్రమ్మలకు శ్రీ రాజేశ్వరరావు, శ్రీ రంగారావు అనేవారలు మగ సంతానం. ఆడపిల్ల కలగడమే ఆ తల్లిదండ్రుల ఆనందం వర్ణింప సలవికానిదైంది. మంచి శుభసమయాన ఆ పాపకు సీతామహాలక్ష్మమ్మ అనే నామకరణంచేసి ఎంతోవేడుక సాగించారు.

రోజులు - నెలల - సంవత్సరాలు అమాయకత్వంతో - అల్లారు ముద్దుముచ్చటలతో గడిపివేసింది సీతామహాలక్ష్మమ్మ. అక్షరాభ్యాసం గావించబడింది. మెల్ల మెల్లగా విద్యాభ్యాసంలో కాలం దొర్లించుకుంటూ 11 వ ఏట పాద ముంచింది.

బాల్యవివాహమే ఉత్తమ కార్యమనే భావన బాగా పాదుకుపోయిన రోజులు కావడంవల్ల సీతామహాలక్ష్మమ్మను శ్రీ వల్లభనేని రామబ్రహ్మని కిచ్చి అత్యంత వైభవోపేతంగా వివాహం గావించారు. పెద్దలు.

సంతాన ప్రాప్తి

ప్రశాంతంగా రోజులు గడుస్తోన్నాయి. ప్రజలలోనగల చైతన్యం, రాజకీయ వాతావరణం, ఊహ కలిగినప్పటినుండి సీతామహాలక్ష్మమ్మ హృదయంలో స్థానమేర్పరచుకో ప్రారంభమైంది. గాంధీజీ ఆశయాలూ - ఆచరణలూ - పలుకులూ ఆమె నెంతో ఘనంగా ఆకర్షించుకొని ఖద్దరు ధారణకు పురికొల్పాయి. దేశంకోసం, స్వేచ్ఛా - స్వాతంత్ర్యాలకోసం తన శక్తికలంతవరకు తానూ ఏమేమో చేయాలని ఉవ్విళ్ళూరేది.

కలవారిబిడ్డ; అమితమైన ఆదరాభిమానాలు; ఎలాంటిలోటూ లేకుండా సంసార సౌఖ్యం అనుభవిస్తూ గర్భవతిఅయి 17 వ ఏట పుత్ర బిడ్డను కన్నది. పరవశత్వంతో పసిపాపను పెంచుకుంటూ సర్వస్వంమరచి సుఖమయ జీవితాన్ని గడుపుతోన్న ఆమెకట్టెదుట అనుకోని విధంగా ఓ విషమ సమస్య ప్రత్యక్షమై విచలితను గావించింది.

సీతామహాలక్ష్మిని అమితంగా ప్రేమించే అన్న రాజేశ్వరరావు. అతనికీ, రామబ్రహ్మనికీ మధ్య కలతరేగి అది మహా కఠోరస్వరూపాన్ని

ధరించింది. అకస్మాత్తుగా భర్త రామబ్రహ్మం ఓ చిన్నకారుతో ఇంటి ముందు ప్రత్యక్షమయ్యాడు. భార్యను పిల్లవానితోసైతం ప్రయాణం కావలసిందని చెప్పాడు. రాజేశ్వరరావు అంయకు నిరాకరిస్తూ సోదరిని వెళ్ళవద్దని చెప్పాడు. ఈ ఇరువురి విరోధాలమధ్య సీతామహాలక్ష్మమ్మ మనసు చెఱుకులా పిండి వేయబడినంతబాధా, భయాలను పొందింది.

ఒకవైపు ప్రాణసమంగా చూచే అన్నగారు, మరోవైపు అగ్ని సాక్షిగా పెండ్లిచేసుకున్న భర్త. ఈ ఇద్దరూ తనకు పెద్ద పరీక్షనుపెట్టి విలపించ జేయడం ఎంత దుర్భరం? అన్నా - భర్తలమధ్య వాగ్వాదం తీవ్రరూపం కాసాగింది. అన్నగారు సీతామహలక్ష్మమ్మను లోనకు త్రోసి తలుపులు మూశాడు. భర్త రామబ్రహ్మం పట్టుదల మరింత అధికమైంది. వెట్టి ఆవేశం ముంచుకురావడంతో—"నేను కావాలంటే నాతోరా; లేదా ఈరోజుతో ఇక నీ, నా మధ్య సంబంధం సరి" అన్నభావంతో మాట్లాడాడు శృతిమించి రాగానపడబోతూన్న వ్యవహారాన్ని పరికించాడు సీతామహాలక్ష్మమ్మ తండ్రి. తలుపులు తెఱిచాడు. కుమార్తెతో—"ఈ పట్టుదలల మూలంగా పండువంటి సంసారం పాడుకావడం తథ్యం! ఆడది దానికి వివాహానంతరం భర్త ముఖ్యుడు. ఏది ఏమైనా నీ భర్తతో నువ్వు జీవించవలసివుంది. కనుక ఆతని ఇష్ట ప్రకారం ప్రయాణం కా తల్లీ!" అంటూచెప్పి మనుమనీ, కుమార్తెనూ, అల్లునీ దీవించి సాగనంపాడు చెమ్మగిలిన కళ్ళతో!

బిడ్డ మరణం

విధి విచిత్రమైంది. అన్నీ కలిగి నిర్విచారంగా జీవించే జీవితాలకే అకస్మాత్తుగా అడ్డుదెబ్బలు తగిలి దుఃఖితులనుజేసి పరిహసిస్తుంది అది.

సీతామహాలక్ష్మమ్మ భర్తతో బిడ్డతో సుఖంగా సంసారయాత్ర ప్రారంభించింది గుడివాడలో. రామబ్రహ్మం క్రొత్తగా మోటారు బస్ సర్వీసు ప్రారంభించాడు. ఈ సర్వీసు ప్రారంభమైననాటికి వీరిబిడ్డకు 11 మాసాలు వయస్సు. ఒకవైపు సర్వీసు ప్రారంభించామన్న సంతోషం మూడు దినాలైనా పూర్తిగా పొందకుండానే ఆ పాపడు ఆడుకుంటూ - ఆడుకుంటూనే ప్రాణాలనువదలి ఈ దంపతుల హృదయాలను ముక్కలు చెక్కలు చేశాడు! ఈ ఆఘాతం సీతామహాలక్ష్మమ్మ హృదయాన్ని తాకిన అనంతరం ఆమె పరిస్థితి ఎలామారిపోయిందో - ఆమె ఎంతగా దుఃఖిత అయ్యిందో వర్ణింపడం మాటలతో అయ్యేపని కాదనక తప్పదు. బరువుగా - భారంగా రోజులు ఒకటివెంట ఒకటిగా నిట్టూర్చుకుంటూ సాగిపోసాగాయి క్రమబద్ధంగానే!

ఉప్పు సత్యాగ్రహం

1930 వ సంవత్సరం! ఉప్పు సత్యాగ్రహోద్యమంతో భారత దేశమంతా నవోత్సాహంతో ఉరుకులు పరువులు తీయసాగింది. ఈ ఉద్యమంలో సత్యాగ్రహిగా చేరడానికి భర్త రామబ్రహ్మం నిశ్చయించుకోగానే ఎంతో సంతోషంతో ఉప్పొంగిపోయింది సీతామహాలక్ష్మమ్మ. నిజమే మరి! దేశస్వాతంత్ర్య సమరంలో పాల్గొనే వీరునిభార్య అనిపించుకోవడం కన్న అమూల్యమైనదీ - అభిలషింపదగ్గదీ మరొకటేముంటుంది ఆ వాతావరణంలో! నవ్వుతూ ఆర్ద్రాంగిగా తనకున్న కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు, భర్తను జైలుకు పోవడానికైనా వెనుదీయవద్దనేంత ధైర్యస్థయిర్యాలను అందించి పంపింది ఆమె. రామబ్రహ్మంకూడా ఓర పత్నిని పొందగలిగినందుకు ఎంతగానో ఉబ్బి తబ్బిబ్బులౌతూ కార్య రంగంలోకి వీరునిలా ప్రవేశించాడు. సత్యాగ్రహ సమరగీతాలు వాడవాడలా

-పల్లెపల్లెలా విజయోల్లాసాన్ని పంచిపెడుతూ వినిపించసాగాయి. నిరంకుశ ఆంగ్లప్రభుత్వ దమనవిధానం విశృంఖల రూపంతో వికటాట్టహాసం గావించసాగింది. లాఠీ దెబ్బలు; తుపాకీ కాల్పులు; అమాయక ప్రజానీకం వెచ్చటి నెత్తుటి మడుగులు; ఘోరాతిఘోరమైన - నీచాతి నీచమైన పద్ధతు లను ఆచరణకుతెచ్చి ఉద్యమాన్ని కూకటివ్రేళ్ళతో నాశనం గావించాలని అశేష ప్రయత్నం గావించింది ప్రభుత్వం. పొట్టకూటికి వాళ్ళను సేవించే బానిస బృందం తమ ప్రభుభక్తి పరాయణతను చాటుకొని పైపదవులకు ఎగబ్రాకాలనే హేయ సంకల్పంతో సత్యాగ్రహులను వేటాడటానికే వెను దీయక నిలిచారు. భారతజాతి ఒక్కసారిగా ఆగ్రహావేశాలతో అల్లాడి పోయింది. ఉద్యమంలో ప్రవేశించిన భర్త రామబ్రహ్మం జైలుకు పోయాడు. అందుకు సీతామహాలక్ష్మమ్మ ఏమాత్రం ఆవేదనకు పాలుగాక పోగా మరింత పట్టుదలతో తానుకూడా దేశస్వాతంత్ర్య సమరంలో పాల్గొనాలనే నిశ్చయానికి వచ్చింది. గాంధీ ఇర్విన్ ఒడంబడిక మూలంగా రాజకీయఖైదీల విడుదల జరిగింది. భర్త జైలునుండి విడుదలై గుడివాడ జేరాడు. తానుకూడా భర్తతోపాటుగానే స్వాతంత్ర్య సంగ్రామ రంగంలో ప్రవేశించి పనిచేసే సదవకాశానికి ఆశతో - ఆత్రంతో ఎదురు చూడసాగింది ఆమె.

దేశసేవిక

చల్లబడిపోయిందనుకున్న రాజకీయ వాతావరణం లోలోన రాజు కుంటూ పోసాగింది. రామబ్రహ్మం గుడివాడలో వాలంటీర్ శిబిరాన్ని నెలకొల్పాడు. సీతామహాలక్ష్మమ్మ చిరకాల వాంఛితం నెరవేరే సమయ మాసన్నమైనదని గుర్తించింది. తానూ ఓ దేశసేవికగా ఆ శిబిరంలో ప్రవేశించింది. తనతోపాటు మరికొంతమంది స్త్రీలు వాలంటీర్లుగా పనిచేయ

డానికి ముందుకు వచ్చినప్పుడు ఆమె పొందిన ఆనందమూ - ఆంధ్ర నారీలోకంలోని అభ్యుదయ భావనాసబలతకు అంతులేని గర్వమూ కలిగాయి. భారతదేశంలోని ఇతరరాష్ట్రస్త్రీలకు ఆంధ్ర నారీమణులు ఏమాత్రం వెనుకబడి లేరనిపించాలనే భావం మరింత బలవత్తరమైంది.

నూతనోత్సాహం! నూతన ధైర్యస్థయిర్యాలు! ఎండ కన్నెరుగని అబలలు సైతం కల్లుపాకలముందు - విదేశీవస్త్రాలయాల కట్టెదుట నిలచి ప్రబోధంగావిస్తూ-పికిటింగు చేస్తూంటే చూచేవాళ్ళు ఆశ్చర్యంతో అలానే స్థంభించి పోసాగారు.

సీతామహాలక్ష్మమ్మ నాయకత్వభారం వహించి - మలమల మాడ్చే ఎండాకాలం నాలుగుమాసాలు అకుంఠిత దీక్షతో పికిటింగు కార్య క్రమాన్ని నిర్వహించి - ఉద్యమానికి విజయం కలిగేట్లు చేసింది.

రోజులతోపాటు సీతామహాలక్ష్మమ్మలో కార్యదీక్షకూడా పెరుగు కుంటూ పోసాగింది. ఆమెలోని కార్యదీక్ష కాంగ్రెసు సంఘానికే ఆనందాన్ని కలిగించింది. కృష్ణాజిల్లాలోనేకాక కార్యరంగం పశ్చిమ గోదావరి జిల్లాకు కూడా విస్తరింపబడవలసి వచ్చింది.

సీతామహాలక్ష్మమ్మ విసుగూ - విరామమూ అనేదిలేకుండా ఏలూరు వాస్తవ్యులు - కాంగ్రెసువారూ అయిన శ్రీమతి ముట్నూరి చుక్కమ్మ, శ్రీమతి దుగ్గిరాల కమలమ్మలతోకలసి పశ్చిమ గోదావరి జిల్లాలోని గ్రామాలు అనేకం తిరిగి కాంగ్రెసు ఆశయాదర్శాలను ప్రబోధం చేస్తూ ప్రజానీకాన్ని భారత స్వాతంత్ర్య సంగ్రామోన్ముఖులను గావించిరి.

ప్రభుత్వం సీతామహాలక్ష్మమ్మ శక్తి సామర్థ్యాలను కొంచెం కొంచెంగా గుర్తించ నారంభించి, ఇలాంటివారిని పూర్తిగా స్వేచ్ఛలో వుండనివ్వడం మంచిదికాదని ఎంచింది. గుడివాడ సబ్ డివిజనల్ మేజి

స్టీ్రటు 144 వ సెక్షన్ అంతర్గతంగా ఎక్కడా ఏ సభా - సమావేశం లోనూ మాట్లాడ రాదంటూ సీతామహాలక్ష్మమ్మను ఆదేశించాడు.

శాసనోల్లంఘనము

1932 వ సంవత్సరం ప్రారంభమైంది. గాంధీ - వల్లభాయి పటేల్‌లను జైలుకుపంపింది ప్రభుత్వం. వారి అరెస్టుతోపాటుగానే తెల్ల ప్రభుత్వాధికారి విల్లింగ్‌డన్ నాలుగు నికృష్ట శాసనాలను భారతప్రజలపై ప్రయోగించి ఆనందించ పూనుకున్నాడు.

దేశం ఒక్కసారిగా దద్దరిల్లి పోయింది. సీతామహాలక్ష్మమ్మ భర్త రామబ్రహ్మం జైలుకు లాక్కుపోబడ్డాడు. అమె మితిమించిన దృఢ సంకల్పంతో అనేకమంది స్త్రీలను వెంటబెట్టుకొని గ్రామగ్రామాలలో ప్రబోధంతో అనేకమంది సోదరీమణులను కర్తవ్యనిష్టాపరాయణులను గావించుతూ-శాసనోల్లంఘన కార్యక్రమాన్ని ఆచరణలోపెట్ట పూనుకుంది.

గుడివాడ పట్టణంలో 144 వ సెక్షన్ ప్రయోగించింది ప్రభుత్వం. దాన్ని ఉల్లంఘిస్తూ సీతామహాలక్ష్మమ్మ మరికొంత మంది స్త్రీలతో పికిటింగు సాగించ సాగింది. బెదరింపులతో అదలింపులతో స్త్రీ వాలంటీర్లను ఉద్యమ తిరోగాములను గావించగల మనుకున్నాడు డిప్యూటీ కలెక్టర్ రంగప్ప బంగారు. పాపం! వాని ఆశ అడియాస కావడమేకాక, దినదినం సీతామహాలక్ష్మమ్మ నాయకత్వంలో ఉద్యమం మరింత పుష్టిని చేకూర్చు సాగింది. పోలీసు దౌష్ట్యం ఎంత శృతిమించితే ఈ వాలంటీర్ల పట్టుదల అంత మించిపోసాగింది.

డిప్యూటీ కలెక్టర్ రంగప్ప బంగారు పరిస్థితులను గమనించి కొంత కలవరపడ్డాడు. ఎన్నివిధాల ప్రయత్నించినా స్త్రీ సత్యాగ్రహులను అరికట్ట

డంలో విఫలత్వమే ఎదురైంది. పిల్లను జైళ్ళకు పంపాలంటే అందుకు ప్రత్యేకంగా ఎన్నో ఏర్పాట్లు చేయవలసి వుంటుంది. కనుకనే స్త్రీ వాలంటీర్లను వీలైనంత వరకూ జైళ్ళకు పంపకుండానే జాగ్రతపడసాగింది ప్రభుత్వం.

రోజురోజుకూ పికిటింగు ప్రభావం పెరిగిపోతూండటంవల్ల మరో మార్గాన్ని ఆచరణలో పెట్టదలిచాడు డిప్యూటీ కలెక్టర్. స్త్రీ వాలంటీర్లను అరెస్టు చేశామనడం - వాన్‌లలో ఎక్కించి తీసుకుపోయి 20 మైళ్ళ దూరంలో నిర్జనస్థలాలలో వదలిపెట్టి వేయడం ప్రారంభమైంది.

అయినా వారేమాత్ర పట్టుదల సడలించలేదు పిల్లైన విధాలతిరిగి స్వస్థానంజేరి పికిటింగు సాగింపసాగారు. నడచి రావలసివస్తే త్రోవలోగల గ్రామాలలో ప్రచారం సాగిస్తూ ప్రయాణం సాగించడం పోలీసులకు మరో క్రొత్త సమస్యగా అయ్యింది. సత్యాగ్రహులకు భోజన సదుపాయాలు చేసేవారిని నేరస్థులుగా పరిగణించి శిక్షిస్తామని హెచ్చరించి గ్రామాలలో భోజ పానాలు లభింపకుండా చేయసాగారు. అక్కడికీ స్త్రీ సత్యాగ్రహులు లొంగిరాకపోవడం, వెనువెంటనేవచ్చే పోలీసు భటులను లెక్కచేయక, పాడుపడ్డ దేవాలయాలలోనూ - మఠాలలోనూ - ఆశ్రమాలలోనూ మకాంపెట్టి వంటచేసుకొని భోజనం ముగించి విశ్రాంతి తీసుకోవడం, తిరిగి ప్రయాణం సాగించడం ప్రారంభమైంది.

కొమరవోలు గాంధీ ఆశ్రమాన్ని ప్రభుత్వం స్వాధీనపరచుకొని సీళ్ళువేసింది. సీతామహాలక్ష్మమ్మకు ఈ ఆశ్రమాన్ని స్వాధీనం చేసుకోవాలనే భావం కలిగింది. కొంతమంది స్త్రీ వాలంటీర్లను కూడగట్టుకుంది. ప్రభుత్వానికి ఈ ఆశ్రమాన్ని ఆక్రమించు కుంటున్నామంటూ ముందే తెలియజేసి, సీళ్ళు పగులగొట్టి ఆశ్రమాన్ని స్వాధీనపరచుకుంది. ఆడవాళ్ళ ఇలాంటి సాహసానికి పూనుకోవడం ప్రభుత్వ బానిస అధికారులకు

సహింపరాని ఆగ్రహ కారణమైంది. పెంటనే లారీలను అక్కడకు ఉరికించారు. సీతామహాలక్ష్మమ్మతోపాటు మిగిలిన దేశసేవికలను కూడా అరెస్టుచేసి - లారీలలో తీసుకుపోయి చాలాదూరాన సముద్రతీరాన-ఇసుక పర్రలలో వదలివేసి పోయారు.

ఇలా జరిగినందుకు ఏమాత్రం బాధపడలేదు వీరు. ధైర్యంగా ఉత్సాహంగా బయలుదేరి నడచి - నడచి మెల్లమెల్లగా స్వస్థానానికి జేరుకున్నారు. జేరిన వెనువెంటనే తిరిగి పికిటింగు కార్యంలో ప్రవేశించి పోలీసులనే ఆశ్చర్యచకితులను చేయడం ఆ వీరాంగనలకే చెల్లుబడి అయ్యింది.

ఈ విధానమూ విఫలం కావడంతో ఆడవాలంటీర్లపై హీనాతి హీనమైన విధానాలను అవలంభించడానికి తలపడింది ప్రభుత్వ యంత్రాంగం. పికెటింగు చేస్తున్న స్త్రీలపైన కారంకలిపిన నీళ్ళు - రంగుకలిపిన నీళ్ళు-ప్యాక్టరీ మసి కలిపిననీళ్ళు పెద్ద పెద్ద చిమ్మన గొట్టాలతో చిమ్మి స్పృహ గోల్పోయేలా చేయడం ఆ విధానాలలో ఒక విధానం!

సీతామహాలక్ష్మమ్మ పికిటింగుచేస్తోంది. పోలీసులు రంగంలోకి ప్రవేశించారు. చిమ్మనగొట్టాలను కారం, రంగు, మసి, బురదనీళ్ళతో నింపారు. ఎదుట నిలిచి హోలీపండుగ చేసుకుంటున్నట్టుగా ఆనందంతో మానవత్వాన్నే విస్మరించి - ముఖంమీదకు, కళ్ళలోకి ఆ నీళ్ళను చిమ్మడ మారంభించారు. సీతా మహాలక్ష్మమ్మ ఆ నీటిధారల వేగానికి ఉక్కిరి బిక్కిరి అవుతూండగా పైశాచిక ప్రభుత్వ బానిసలు వికృతహాసంతో ఆర్భాటం అధికంచేశారు. అయినా సీతామహాలక్ష్మమ్మ వెనుకడుగు వేయ లేదు. వారి ఈ దౌష్ట్యాన్ని శాంతియుతంగా ఎదిరించి నిలిచింది. అంత కంతకూ వారిచేష్టలు అధికమై ఆమెను స్పృహను గోల్పోయేట్టు చేశాయి. ఆ ధీరోదాత్త కుప్పలా నేల కూలిపోయింది. చిమ్మనగొట్టాల నీళ్ళు

రంగురంగులతో ఆ ప్రదేశాన్ని ముంచెత్తి విడిచాయి: సీతామహాలక్ష్మమ్మ జీవయాత్ర అంతతో ముగిసిపోయిందనుకుంది పోలీసు బృందం. అలానే ఆమెను విడచి విజయోన్మాదంతో వెనుతిరిగిపోయారు మాతృద్రోహులైన ఆ కూలి సేవకులు:....

వార్త: గాలిలో పయనించింది వార్త: జనం గ్రామాలనుండి గుంపులు గుంపులుగా గుడివాడ చేరసాగారు. ఒకరితో ఒకరు 'సీతామహాలక్ష్మమ్మ సత్యాగ్రహంచేస్తూ ప్రాణాలను బలి యిచ్చిందట!' అన్నదే ఆ వార్త: అది మహావేగంతో ప్రాకిపోయింది. ప్రజానీకం హృదయాలు దుఃఖంతో - ఆగ్రహంతో మిశ్రితభావ వైచిత్ర్యంతో అల్లాడిపోసాగాయి. కాని కొన్ని గంటలకు సీతామహాలక్ష్మమ్మ స్పృహ పొందిందనీ, తేరుకుంటూందనీ, మరోవార్త: ఈ వార్త ప్రజల దుఃఖాన్ని ఉపశమింపజేసింది. భారంగా విడిచే నిట్టూర్పులతో నిండిపోయింది వాతావరణం.

కారాగారవాసం

ఎన్నివిధాల ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో డిప్యూటీ కలెక్టర్ రంగప్ప బంగారు సీతామహాలక్ష్మమ్మను బంధించి కారాగారానికి పంపడంకన్న గత్యంతరంలేదనీ, అలా చేస్తేనైనా ఈ సత్యాగ్రహోద్యమం కొత్త చల్లారవచ్చుననీ భావించి, ఆమెను, ఆమెతోపాటు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొంటూన్న ఇతర స్త్రీలనూ అరెస్టు చేయించి రివాంఱులోవుంచే ఏర్పాటు చేశాడు.

ది 2-5-32 న విచారణ తతంగంసాగింది. సీతామహాలక్ష్మమ్మనూ, ఆమెతోపాటువున్న శ్రీమతి గోనుగుంట్ల లక్ష్మీనరసమ్మ, శ్రీమతి ఆరెక

పూడి మాణిక్యమ్మ, శ్రీమతి ఆరెకపూడి ఉషామణి, వృద్ధురాలైన ఆరెక పూడి మహాలక్ష్మమ్మ, శ్రీమతి కోనేరు భారతమ్మ, శ్రీమతి కన్నెగంటి నాగరత్నమ్మ। శ్రీమతి చెరుకూరు సౌభాగ్యమ్మ, శ్రీమతి ఘంటా మల్లికాంబ, చిరంజీవి ఆరెకపూడి సుగుణ, శ్రీమతి తిపిర్నేని కౌసల్యమ్మ లనూ శాసనధిక్కార నేరానికి దోషులుగా నిర్ధారించి, చిరంజీవి సుగుణను విడచి మిగిలినవారందరకూ తలకొక సంవత్సరం శిక్ష విధించడం జరి గింది. ఇందులో శ్రీమతి ఘంటా మల్లికాంబ ఆరుమాసాల పసిబిడ్డతో జైలుకు పోవలసివుంది. పాపం। బ్రిటీష్‌ప్రభుత్వ రాజనీతి విశారదత్వాన్ని పెల్లడించుకునేందుకుగాను డిప్యూటీ కలెక్టర్‌గారు, చిరంజీవి సుగుణకు, పన్నెండు సంవత్సరాల వయస్సు గనుక రెండు సంవత్సరాల శిక్షను విధించి చిన్నపిల్లల జైలుకు పంపే ఏర్పాట్లుచేసి, సంతృప్తి నందాడు।

సీతామహాలక్ష్మమ్మను వెల్లూరు సెంట్రల్ జైలుకు మిగిలినవారితో పంపారు. కొన్నిరోజులు గడవగానే ది. 12-10-32 న మలబారులోని కన్నూర్ జైలుకు ఆమెను మార్చింది ప్రభుత్వం. శిక్షాకాలం అక్కడనే పూర్తిచేసింది ఆమె. ది. 11-4-33 న విడుదలపొంది ఈ జైలు శిక్షా కాలంలో లభించిన విశ్రాంతిమూలంగా మరింత జవసత్వాలను ప్రోది గావించుకొని, నూతనోత్తేజం ప్రతి రక్తకణాన్ని ఆక్రమించుకోగా, తిరిగి కార్యరంగంలో ప్రవేశించాలనే ఆత్రంతో, 'తిరుచునాపల్లి 'జైలులో శిక్ష ననుభవిస్తోన్న భర్త రామబ్రహ్మన్ని కలుసుకొని, కొన్ని నిమిసాలు సంభాషించి స్వగ్రామానికి పయనమైంది ఆమె.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకమిటీ

1933 వ సంవత్సరం. సీతామహాలక్ష్మమ్మను ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యురాలుగా ఎన్నుకోబడింది. అందుమూలంగా తన

కర్తవ్యభారం పెరిగిందని ఆమె గుర్తించగలిగింది. తనయందు నమ్మిక ముంచిన వారికి సంతృప్తి కలిగేట్లు శ్రమపడటమే తన ప్రప్రథమ కర్తవ్యంగా భావించింది, గ్రామాలలో స్త్రీలకు ప్రత్యేకంగా దేశభక్తినిగురించీ, స్వాతంత్ర్యం విలువలగురించి ప్రబోధం గావించేందుకు పూనుకుని అనేక సభలూ - సమావేశాలు సాగింప సాగింది.

పల్లెపల్లెనా నూతన తేజస్సు పరిఢవిల్ల సాగింది. స్త్రీలలో స్వైతం స్వేచ్ఛా - స్వాతంత్ర్య వాంఛలు పెల్లుబికి పోసాగాయి. భారతమాత బంధనాలను విచ్ఛిన్నం గావించడానికి కాంగ్రెసు సాగిచే శాంతియుత సత్యాగ్రహ సమరంలో సర్వస్వం ధార పోసి పాలుగొనేందుకు స్వచ్ఛందగా ముందుకు దూకసాగింది ఆంధ్ర వీరనారీలోకం ! రకరకాల కార్యక్రమాలతో సీతామహాలక్ష్మమ్మ నిరంతరం కాంగ్రెసుసంస్థ పటిష్టానికి పరిశ్రమిస్తూండగానే మూడు సంవత్సరాలు కాలగమనంలో కరిగి లీనమై పోయాయి.

కృష్ణా జిల్లా బోర్డు యెన్నికలు

1936 వ సంవత్సరం: సత్యాగ్రహ ఉద్యమాలకూ పరాయి ప్రభుత్వాన్నిగడగడ లాడించిన కాంగ్రెసు సంఘం ఎన్నికలలోపాల్గొని అధికారాన్ని హస్తగతం గావించుకుంటూ పోవడంవల్ల కూడా స్వేచ్ఛా - స్వాతంత్ర్యాల ధ్యేయాన్ని సాధించడానికి మార్గం మరింత సుగమ మవు తూందనే భావానికి వచ్చింది.

జిల్లాబోర్డుల ఎన్నికలు వచ్చాయి. కృష్ణాజిల్లా బోర్డు ఎన్నికల సంరంభ మారంభమైంది. స్త్రీలసీటు గుడ్లవల్లేరు ఫిర్కాకువుంది. జనరల్ సీటుకు శ్రీ కొనూరి దామోదరయ్యనూ, స్త్రీ సీటుకు సీతామహాలక్ష్మమ్మనూ కాంగ్రెసు నిలబెట్టింది. వీరికి పోటీ శ్రీ చల్లపల్లిరాజా పార్టీ:---డబ్బా-

పలుకుబడీ, గ్రామతగవులూ ముమ్మరంగా రంగస్థలాన్ని అలంకరించాయి. మొత్తం జిల్లాబోర్డుకు కాంగ్రెసు నిలిపిన అభ్యర్థులలో ఒక్క హరిజన అభ్యర్థితప్ప మిగతావారంతా పూర్తిగా ఓడిపోయారు ఫలితాల ప్రకటనలో! ఎంతో శ్రమపడీ అపజయమందిన కాంగ్రెసువాదులు నిలువునా నీరుగారి పోయారీ సంఘటనవల్ల.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ

సీతామహాలక్ష్మమ్మ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ కార్య నిర్వాహకవర్గ సభ్యత్వమందింది. రాష్ట్రవ్యాపితంగా సంచారంచేస్తూ ప్రచార కార్యక్రమాన్ని సాగిస్తూ సంస్థకు బలాన్ని చేకూర్చడానికి పట్టు దలగా కృషి నారంభించింది.

పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ ఆంధ్రరాష్ట్ర పర్యటనకు బయలు దేరాడు. సోషలిస్టు సిద్ధాంతాలను ప్రబోధంగావించడమే ఆయన పర్యట నలో ముఖ్యభాగంగావుంది. అలా జిల్లాలలో పర్యటనజేస్తూ కృష్ణాజిల్లా గుడివాడ పట్టణానికి వచ్చాడాయన. పెద్ద బహిరంగసభ ఏర్పాటుచేశారు. స్వచ్ఛందసేవికల పక్షాన సీతామహాలక్ష్మమ్మ ఆయనకు సన్మానపత్రంతో పాటు 207 రూపాయల నిధిని సమర్పించింది. ఆంధ్ర మహిళా మణుల ధైర్యస్థయిర్యాలు, త్యాగ, సౌజన్యాలు చిరస్మరణీయాలనీ, స్వాతంత్ర్య సంగ్రామ సమరంలో వారి ముందంజ భారతదేశాన్నే ముగ్ధపరచిందనీ పండిట్ నెహ్రూ ఎంతో ప్రశంసిస్తూ మాట్లాడారు సభలో. నిరుత్సాహ మావరించిన కాంగ్రెసు కార్యకర్తలలో నెహ్రూజీ పర్యటన నూతనోధ్యా యాన్ని, నవోత్సాహాన్ని ప్రవేశింపజేసింది. నిదురనుండి మేల్కొన్న కొదమసింగాలరీతిగా కార్యరంగంలోకి ఉరికే నన్నాహాలలో పడ్డారువారు.

14

జిల్లా మహిళా సభ

1937 వ సంవత్సరం ఆరంభమైంది. సీతామహాలక్ష్మమ్మ స్త్రీలలో బాగాచై తన్యం గొనిరావడ మవసరమని భావించింది. అందుకోసం ఎక్కువ కాలం శ్రద్ధాసక్తులతో పనిచేయడ మారంభించింది. మే 21 వ తేదీన తూర్పు కృష్ణాజిల్లా రాజకీయ మహాసభలు జరుపబడాలని నిశ్చయింప బడటంతో-అదేసమయానికి జిల్లా మహిళాసభను జరపడం బావుంటుందను కుంది ఆమె. తన అధ్యక్షతను ఓ ఆహ్వానసంఘాన్ని ఏర్పాటు కావించి అందుకు విపులమైన సన్నాహాలు జరిగించింది. 21 వ తేదీన రాజకీయ మహాసభల కోలాహలం: 22 వ తేదీన మహిళామణుల మహాసభ: శ్రీమతి కొమర్రాజు అచ్చమాంబ అధ్యక్షురాలుగానూ, శ్రీమతి యస్. సుభద్రమ్మ ప్రారంభకురాలుగానూ పాల్గొన్న ఈ సభ మహిళామండలి మొత్తాన్నే నూతనోత్సాహంతో ముంచె త్తి విడిచింది:

సీతామహాలక్ష్మమ్మ అంతకంతకూ మహిళాసమస్యలపై అమితమైన శ్రద్ధతో అనేకచోట్ల జరిగే అనేక సభలకు అధ్యక్షస్థానాల నలంకరిస్తూ ఎంతో ఉన్నతమైన ఆశయాలతో ఉత్తేజిత మొనరించే ఉపన్యాసాలతో శ్రోతల నుర్రూతలూగిస్తూ ఎంతోకీ ర్తిని పొందుతూ పోసాగింది.

విరామ మెరుగని ఆమెకు రోజులు ఎంతత్వరగాగడచి పోతున్నవో కూడా గుర్తుకు వచ్చేదేకాదు. మహిళాసమస్యలపై మరింత దీక్షతో గ్రామాల్లో - జిల్లాలలో పర్యటిస్తూ 1938 వ సంవత్సరాన్ని కాల గర్భంలోకి నెట్టివేసివది ఆమె. 1938 వ సంవత్సరంతో పాటుగావే సీతా మహాలక్ష్మమ్మ మాతృమూ ర్తికూడా అ స్తమించింది:

17

జిల్లాబోర్డు యెన్నికలో విజయం

1939 వ, సంవత్సరం చివరిభాగం. జిల్లాబోర్డు ఎన్నికల హడావిడీ కాంగ్రెసుపార్టీని కదలించింది. శ్రీ చల్లపల్లి రాజాతో రాజీపడాలని కొంత మంది కాంగ్రెసు నాయకులు అభిప్రాయాన్ని వ్యక్తీకరించి - అందుకు సన్నాహాలుకూడా ప్రారంభించారు. ఈ పద్ధతి మిగిలినవారి కేమాత్రం రుచించక పార్టీ సమావేశాన్నిపిలిచి తమ అసమ్మతిని తీవ్రంగా వ్యక్తీకరించారు. గెలిచినా - ఓడినా అన్నిస్థానాలకూ పోటీచేసి తీరవలసిందేననే నిర్ణయాన్ని తీసుకుంది సమావేశం.

స్త్రీలస్థానం పామర్రు ఫిర్కాకు మార్చబడింది. స్త్రీలస్థానానికీ సీతామహాలక్ష్మమ్మ - జనరల్‌స్థానానికి భర్త శ్రీ రామబ్రహ్మం నిర్ణయింపబడ్డారు. ప్రముఖ రైతులూ, ధనికులూ అయిన శ్రీ వడ్డె శోభనాద్రి, వారి కుమార్తె ఎదుటి పక్షాననిలిచారు. పోటీ దినదినానికీ వింతవింత రూపాలలో మహా తీవ్రరూపం ధరించింది. కాంగ్రెసు కార్యకర్తలంతాదీన్ని చావు - బ్రతుకుల సమస్యగా పరిగణించి అహర్నిశలూ విశ్రాంతీ - విరామాలనే మాటలు తలపునకు రానివ్వకుండా పనిచేశారు. మిగిలిన స్థానాలకు కూడా పోటీ ఇంతతీవ్రంగానే జరిగింది. గెలుపోడులు తేలే సమయం సమీపమవుతూన్నకొద్దీ ఆత్రం అందరినీ ఆవహించి విచిత్ర పరిస్థితుల్లో పడిపోయేలా చేయసాగింది.——సమయం - ఆ సమయం రానేవచ్చింది. సీతామహాలక్ష్మమ్మా - ఆమె భర్త రామబ్రహ్మం అత్యంతబలంతో నెగ్గినట్లు వెల్లడి అయ్యింది. కార్యకర్తల ఆనందం వర్ణింప నెవరితరం ? ఈ దంపతులను బ్రహ్మాండంగా సన్మానించారువారు. కాంగ్రెసు పెద్ద మెజారిటీతో ఈ ఎన్నికలలో గెలుపొంది విజయశంఖాన్ని పూరించింది మహోత్సాహంతో!

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకమిటీ అధ్యక్షులు డాక్టర్ పట్టాభి. ఆ కమిటీలో మెంబరుగా సీతామహాలక్ష్మమ్మ ఎన్నుకోబడింది. తన కర్తవ్య నిర్వహణలో ఆమె అత్యంత శ్రద్ధాసక్తులను ప్రదర్శిస్తూ అందరిచేత అభినందింపబడటంలో ఏమాత్రం వెనుకబడలేదనే చెప్పాలి. ఏ ఆశయా దర్శాలకు తాను కట్టుబడి నిలిచిందో వాటికోసం అహరహం పాటుపడుతూ ముందుకు – మరింత ముందుకు సాగిపోసాగింది సీతామహాలక్ష్మమ్మ ఆత్మ విశ్వాసంతో! లీలగా రోజులు, నెలలు, కరిగి కాలగర్భంలో కలసిపో సాగాయి ఒకటివెంట ఒకటిగా!

వ్యష్టి సత్యాగ్రహం

చప్ప చప్పగా ఉందనుకున్న రాజకీయ వాతావరణం లోలోన మార్పు చేర్పులను కూడబెట్టుకుంటూ ఒక్కసారిగా విజృంభించే సూచనలు కానరాసాగాయి. ప్రపంచ వ్యాపితంగా యుద్ధజ్వాలలు ప్రాకి సర్వనాశన కారకంగా రూపొందాయి. చిలికిచిలికి గాలివానగా అయ్యింది యుద్ధ పరిస్థితి. ప్రపంచం రెండవ మహాసంగ్రామానికి గడగడలాడి పోసాగింది. బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని పూర్తిగా ఈ యుద్ధ కార్యక్రమానికి ఉపయోగించుకో బూనుకుంది. తమ ఇష్టానికీ విరుద్ధంగా తమ ధన, మనుజ సంపత్తిని ఉపయోగించుకోవడం సహించరాని అన్యాయంగా భావించారు దేశనాయకులు. ఇందుకు అసమ్మతిగా తమ భావాలను ప్రస్ఫుటింప జేయడం అవసరంగా గురించారు.

గాంధీజీ తీవ్రాతి తీవ్రంగా ఆలోచించి కార్యాచరణకు క్రొంగొత్త విధానాన్ని రూపొందించాడు. సామూహిక సత్యాగ్రహానికి మారుగా వ్యష్టి సత్యాగ్రహం ప్రారంభించాలని ఆదేశమిచ్చాడు ఆదేశ మందడమే తడవుగా సీతామహాలక్ష్మమ్మ – భర్త రామబ్రహ్మం ఒకేరోజున–ఒకేస్థానంలో సత్యాగ్రహం చేయ నిశ్చయించుకున్నారు.

19-3-41 తేది స్వగ్రామంలోనున్న మహాత్మాగాంధీ పంచాయితీ పార్కులో తాము సత్యాగ్రహం చేయబోతున్నట్లు కలెక్టరుకు ముందుగానే తెలియచేశారు. అన్నసమయానికే సత్యాగ్రహం ప్రారంభమైంది. పోలీసులు రావడం, అరెస్టుచేశామని వీరిద్దరినీ వెంటబెట్టుకు పోవడం క్షణాలలోనే జరిగిపోయింది.

గుడివాడ తీసుకుపోయి ఎస్. డి. ఎమ్. కోర్టులో అభియోగం దాఖలుచేశారు పోలీసులు. ఇలా సత్యాగ్రహం చేయడం నేరమని నిశ్చయించాడు న్యాయాధిపతి. సీతామహాలక్ష్మమ్మకు రూ 300 ల జరిమానా, కోర్టువారు లేచేవరకూ శిక్ష విధించాడా అధికారి! జరిమానా చెల్లించ నిరాకరించిన పక్షంలో మూడువందలకు మూడునెలలు శిక్ష ! శ్రీ రామ బ్రహ్మానికి ఇదే నేరానికి అయిదుమాసాల జైలు శిక్షా - రూ 400 ల జరిమానా విధించి ఆయనకూడా జరిమానా ఇవ్వనిపక్షంలో మరో నాలుగు మాసాలు శిక్షచెప్పి సంతృప్తిగా వారివంక చిన్నగా నవ్వాడు! సీతామహాలక్ష్మమ్మ భర్తతోపాటు జరిమానా చెల్లించడానికి నిరాకరించి ఆ న్యాయాధిపతి అహంకారానికి గొడ్డలిపెట్టుగా తీవిగా నిలచి, కన్నులలో మెరుపులు చిందించి తృప్తినందించి.

పోలీసులు సీతామహాలక్ష్మమ్మను రాయవెల్లూరు స్త్రీల జైలుకూ, శ్రీ రామబ్రహ్మాన్ని అల్లిపురం క్యాంపు జైలుకు ఆ రాత్రికి రాత్రే వెంట బెట్టుకు పోయారు. ఆమెకు ముందుగా "బి" క్లాసు నిశ్చయించినా, త్వరలోనే "ఏ" క్లాసుకు మార్చింది ప్రభుత్వం. - జైలుశిక్షను పూర్తిచేసుకుని 18-6-41 తేదీన విడుదల చేయబడి మరింత దీక్షా దక్షతలతో స్వస్థానం జేరింది సీతామహాలక్ష్మమ్మ. వెనుకటికన్నా మరింత శ్రద్ధాసక్తులతో కార్యక్రమ నిర్వహణలో మునిగి తేలసాగింది ఆమె.

క్విట్ ఇండియా

యుద్ధ తీవ్రత మరింత విలయరూపంతో ప్రత్యక్షమైంది. కాంగ్రెస్ 1942 వ సంవత్సరం ఆగష్టులో "భారతదేశాన్ని విడిచిపెట్టండి" (క్విట్ ఇండియా) అనే నినాదాన్ని లేవదీసింది. బానిసలంగా మేము పోరాడటాని కన్నా, స్వతంత్రులంగా జపాన్ పాసిస్టు విధానాలతో పోరాడటం న్యాయ మని తెలియజేసింది. అయినా బ్రిటీష్ ప్రభుత్వం ఈ వాంఛను పూర్తిగా పెడచెవిని పెట్టడమేకాక తీవ్రాతి తీవ్రమైన నిరంకుశ విధానంలో ప్రజానీ కాన్ని అదుపులో పెట్టగలమనే భావానికి వచ్చింది.

ప్రముఖ నాయకులను ఒకే ఒక క్షణంలో ఎక్కడనున్న వారి నక్కడక్కడే అరెస్టుచేసి దూరదూర కారాగారాలకుపంపి ఈ ఉద్యమాన్ని సమూలంగా పీకి పారవేయగలిగానని సంతృప్తిపడింది.— కాని వెనుకటి రీతిగా ఈసారి భారతజాతి అసమర్థ విధానాలను అంటిపెట్టుకొని చూస్తూ వూరుకోనేందుకు సిద్ధపడలేదు. భారతదేశం యావత్తు భగ్గున మండి పోయింది. విప్లవజ్వాలలు విలయతాండవ మాడాయి! రక్తపుటేరులు ప్రవ హించాయి! అనేక ప్రభుత్వ ఆస్తిపాస్తులు అగ్నిదేవునికి అర్పణ గావించ బడ్డాయి. ప్రయాణమార్గాలు – వార్తాప్రసార మార్గాలూ విచ్ఛిన్నమైపోయి ప్రభుత్వమే లేనట్టి పరిస్థితి ప్రత్యక్షమైంది.— తాను భావించింది తప్పని ఆంగ్లప్రభుత్వం గుర్తించడానికి అట్టేకాలం పట్టలేదు. ద్వేషంతో – నిస్పృహతో యుక్తాయుక్త జ్ఞానాన్ని విడచి అటవిక మనఃప్రవృత్తిని ప్రదర్శించేందుకు పూనుకుంది ప్రభుత్వం. రక్తదాహంతో ఉవ్విళ్ళూరి పోయింది. కరాళరూపంతో విరుచుకుపడింది. తుపాకులు – మరఫిరంగులు ప్రేమోత పెట్టాయి! లాఠీలు ఎముకలను సున్నంగావించాయి! మానవ వేటతో ఆంగ్లప్రభుత్వ బానిస ఉద్యోగులు భారతమాత మాతృత్వానికే చిన్నతనం తెచ్చేందుకు ముందుకురికారు!

"క్విట్ ఇండియా" ఉద్యమం ఆంధ్రలో అత్యంతోగ్ర స్వరూపంతో విరాజిల్లింది. సీతామహాలక్ష్మమ్మ భర్త రామబ్రహ్మాన్ని ప్రభుత్వం డిటెన్యూగా పట్టుకుపోయింది. రామబ్రహ్మం తల్లి వృద్ధాప్యంతోనేగాక, అనారోగ్యంతో చావు బ్రతుకుల సమస్యతో కొట్టు మిట్టాడుతూంది. అంతిమసమయానికి కన్నబిడ్డ సమీపంలో ఉంటాడో - ఉండడో తెలియని స్థితిలో పడిపోయింది ఆమె. అత్తగారిని అట్టి స్థితిలో వదలిపోవడం అన్యాయ మనిపించింది సీతామహాలక్ష్మమ్మకి. మనస్సు క్విట్ ఇండియా ఉద్యమాన్ని ముందుకు నడుపుకుంటూ పోవాలని ఎంత ఉద్రేకపరచినా, కర్తవ్యపరాయణత ఆమెనుకట్టి నిలిపింది. కంటికి రెప్పలా అత్తగారి ఆలనాపాలనా చూచుకుంటూ ఇంటిపట్టునే నిలచిపోయింది ఆమె.

మాతృశ్రీ కస్తూరిబా గాంధీ అస్తమయం

తెల్లప్రభువుల జైలులో భర్తతోపాటు బంధింపబడిన మాతృశ్రీ కస్తూరిబాగాంధి అస్తమించినవార్త కారుమబ్బులా దేశాన్ని క్రమ్ముకు పోయింది. జాతి కన్నీటివర్షం భారతభూమి నలుచెరగులా తడిపివేసింది. దుఃఖ సంతప్తమానసులైన ప్రజలు ఆమెపై గల భక్తిశ్రద్ధలను ప్రకటించు కునేందుకు, ఆమె స్మారకనిధిని ప్రోగుచేసి మహోత్కృష్ట కార్యాలకు వెచ్చబెట్టాలని నిశ్చయానికి రావడమే తడవుగా కార్యక్రమం ఆరంభ మైంది.

ఆంధ్రరాష్ట్రంలో ఓ కమిటీ ఏర్పడి పనికి పూనుకుంది. అన్నిజిల్లా-గ్రామాలలో కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి. కృష్ణాజిల్లా కమిటీకి శ్రీ అడుసుమెల్లి గోపాలకృష్ణయ్య అధ్యక్షునిగా, శ్రీమతి సీతామహాలక్ష్మమ్మను ఉపాధ్యక్షురాలిగా, శ్రీ కేతవరపు లక్ష్మీనృసింహారావును కార్యదర్శిగా నియుక్తి చేయడం జరిగింది.

సీతామహాలక్ష్మమ్మ కార్యరంగంలోకి దిగింది. సహచరులతో కస్తూరిబా స్మారకనిధి వసూలుకు పర్యటన ప్రారంభించింది. పెద్ద పెద్ద మొత్తాలుగా నిధిని ప్రోగుచేసి ఈ ప్రయత్నాన్ని దిగ్విజయం గావించింది ఆమె. ఈ నిధిలోనుండి లక్ష రూపాయలు వెలువలో - మాతా శిశుసంక్షేమ కేంద్రంకోసం ఓ పెద్ద భవనం, విశాలమైనస్థలం మొదలైనవి గుర్జ గ్రామంలో ఏర్పాటు కావడానికి పాటుపడింది ఆమె. గ్రామస్తుల సహాయ సహకారాలుకూడా ఈ సత్కార్యం కోసం అపారంగా ఆమె సంపాదించ గలిగింది.

విజయలక్ష్మి

మానవత్వాన్ని అవమానపరిచే పశుప్రవృత్తిలో యుద్ధ ధర్మానికి విరుద్ధంగా అమెరికా అటంబాంబు ప్రయోగించింది జపాన్ నగరాలపై! లక్షలాది జనం కొన్ని క్షణాలలో అణుబాంబు మూలంగా ఉత్పన్నమైన భీకర అగ్నిజ్వాలాకీలలమధ్య మలమల మాడిపోయారు. యుద్ధస్వరూపమే కొన్ని క్షణాలలో మారిపోయింది. కొన్ని రోజులలోనే జపాన్ అప జయాన్ని స్వీకరించి యుద్ధాన్ని ఆపి ఆయుధ నిసర్జన ఆరంభించింది.

చావుతప్పి కన్ను లొట్టపోయినట్టయ్యింది బ్రిటీష్ సామ్రాజ్య పరి పాలకుల పని! ఇక ఎక్కువకాలం భారతజాతిని బానిసబంధనాలలో బిగించి యుంచడం అసంభవమని బాగా అర్థమవడంతో సౌమనస్యంగా - స్వాతంత్ర్య ప్రధానంగావించి గౌరవకరంగా తొలగిపోవడం ఉత్తమ మార్గమనిపించింది వారికి. మెల్లగా చల్లటి మాటలు వల్లించడ మారం భించారు. కాంగ్రెసు నాయకులను, సేవకులను నిర్బంధంనుండి విడిచిపెట్ట డం సాగించారు. క్రొత్త ఎన్నికలకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

దేశవ్యాపితంగా ఎన్నికలు: ప్రజా ప్రతినిధులే భారతదేశ పరిపాలనలో భాగస్వాములయ్యే సుదినం చేరువవసాగింది. దేశప్రజల ఆనందం - ఆత్మ సంతృప్తి చెప్ప మాటలుచాలవు. అసెంబ్లీ ఎన్నికల కోలాహలంలో మునిగిపోయారు కాంగ్రెసువారు. భర్త రామబ్రహ్మంతోపాటు సీతామహా లక్ష్మమ్మకూడా అభ్యర్థిత్వానికి దరఖాస్తుపెట్టింది. ఎవరు ఎన్నికలలో కాంగ్రెసుతరపున పోటీ చేయవలసిందీ నిర్ణయించేందుకు ఓ సంఘం నియమింపబడింది. జిల్లాలోని అనేకమంది కాంగ్రెసు కార్యకర్తలు సీతా మహాలక్ష్మమ్మ అభ్యర్థిత్వాన్ని గట్టిగా బలపరుస్తూ తను అభిప్రాయాలను వ్యక్తంచేశారు. అయినా ఆమె అభ్యర్థిత్వానికి ప్రతిగా కొన్ని అంతఃశక్తులే తీవ్రంగా పనిచేయడ మారంభమైంది. కార్యరంగం ఢిల్లీదాకా ప్రాకింది. అనుకూలురూ - ప్రతికూలురూ చాలా పట్టుదలగా పనిచేయ సాగారు. సెంట్రల్ పార్లమెంటరీబోర్డు జనరల్ సీటుకు సీతా మహా లక్ష్మమ్మనూ-హరిజన సీటుకు శ్రీ వేముల కూర్మయ్యనూ ఎన్నిక గావించింది. సీతామహాలక్ష్మమ్మ పొందిన ప్రాథమిక విజయానికి ప్రత్యర్థులు సంతోషానికిమారు మరింత తీవ్రంగా వ్యతిరేకత గనపరుస్తూ డబ్బును నీళ్ళలా ఖర్చుపెట్టి ప్రముఖులైన కొంతమందిని ఢిల్లీకి తరలించి తమమాట నెగ్గించుకో ప్రయత్నం ప్రారంభించారు. సర్దార్ పటేలు వీరి మాటలకు ఏమాత్రం చెవినొగ్గక ముందు నిర్ణయించిన నిర్ణయమే అమలుపర్చబడుతుందని తేల్చివేశారు.

తెల్ల వెనుక నాటకం ప్రారంభమైంది: ఒకే సంస్థలో వుంటూ ఆ సంస్థ నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి మారు, అపజయాన్ని కలిగించి తమలోగల అక్కసును తీర్చుకోదలచిన పెద్దలు చాలామంది లోలోన అందుకు చాలా శ్రద్ధగా పనిచేయడ మారంభమైంది. కాని ప్రజలకు స్వాతంత్ర్యం రాబోతూందన్న ఆనందం, కాంగ్రెసు అందుకు సల్పిన కృషి, బలిదానం, రక్తార్పణ అపారమైన శ్రద్ధాభక్తుల కాలంబనమైంది.

అందుకోసం తీర్థయాత్రకు తరలినట్లు గుంపులు గుంపులుగా బయలుదేరి ఉత్సాహంతో తమ తమ ఓట్లను కాంగ్రెసు అభ్యర్థులకేవేసి తమ కర్తవ్యాన్ని నెరవేర్చుకోసాగారు.

ఎన్నికలు ముగిసాయి: విజయం సీతామహాలక్ష్మమ్మనే వరించింది. శ్రీ కూర్మయ్య కూడా ఆమెతోపాటుగానే అత్యధికబలంతో గెలిచాడు. వీరి విజయానికి కాంగ్రెసు ప్రముఖ నాయకులూ-కార్యకర్తలూ, అభిమానులూ అహరహం పడినశ్రమ ఫలించింది. విజయలక్ష్మి దరహాసంతో ఎల్లచోట్ల నాట్యమాడి వేడుకల నందుకొంది. కాంగ్రెసుపతాక వినువీధుల విజయ గీతాన్ని ఆలాపిస్తూ - భారతమాత భారమైన హృదయాన్ని సేదదీర్చ సాగింది.

శాసనసభా సభ్యత్వము

శాసనసభకు సీతామహాలక్ష్మమ్మ ఎన్నిక అయినంతతోనే ఆమెపై ప్రతికూల వర్గంవారి దొంగదెబ్బలు ఆగిపోక అవకాశం కలిగినప్పుడల్లా ఆమెపై ప్రయోగింప బడుతూరాసాగాయి: లీడర్ ఎన్నికలో శ్రీ ప్రకాశం పంతులు పాల్గొని విజయమందాడు. ఆయనకే సీతామహాలక్ష్మమ్మ ఓటు వేసింది. కాని ఆమె మరొకరికి ఓటు వేసిందంటూ ప్రచారం విరివిగా సాగించారు. ప్రతికూలవర్గం తనపై ఎంత వ్యతిరేక ప్రచారానికి పూనుకున్నా - 'నిజము దేముడెరుగు - నీరు పల్లమెరుగు' నన్న సామ్యాన్ని మనసులో తలచుకుని వృధా వాగ్వాదాలతో విలువగల కాలాన్ని వెచ్చింపక నియోజకవర్గ గ్రామాలలో సంచారంచేస్తూ వారు తన్ను ఎన్నుకొని - తనయందుంచిన విశ్వాసానికి అనుగుణంగా వారి కష్టసుఖాలను తెలుసుకొని చేతనైనంతవరకూ సాయపడే ప్రయత్నంలో గడపసాగింది ధీరోదాత్తగా ఆమె.

చల్లపల్లి ఎస్టేటులోని గాజుల్లంకలో కాల్పులు జరిగి నలుగురు మరణించిన విషయం తెలిసింది సీతామహాలక్ష్మమ్మకి. వెంటనే ఆమె ప్రయాణమై ఆ చోటుకు చేరుకుంది. ఆ గ్రామంలో విషయాలనువిని వివరాలు తెలుసుకుంది. వెనువెంటనే ప్రభుత్వానికి ఓ నివేదిక సిద్ధంచేసి సమర్పించింది ఈ విషయమై. ప్రభుత్వం మరికొంతమంది ప్రముఖ వ్యక్తులతో ఈమెనుకలిపి ఈ విషయమై పూర్తి విచారణసల్పి రిపోర్టును సిద్ధం చేసి అర్పించేందుకు ఒక నాన్ అఫిషియల్ కమిటీని నిర్మించింది. వీరంతా ప్రతి చిన్న విషయాన్ని సాకల్యంగా పరిశీలించి రిపోర్టును సిద్ధపరచి ప్రభుత్వానికి అందచేశారు దీక్షగా!

స్వాతంత్ర్యము

1947 ఆగష్టు రానేవచ్చింది: భారతదేశానికి స్వాతంత్ర్య భానోదయమైంది. 16 వ తేదీన ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంవారు నిర్వహించిన స్వాతంత్ర్యదినోత్సవ కార్యక్రమంలో సీతామహాలక్ష్మమ్మ "స్త్రీలు - భావిభారము" అనే విషయంపై ఓ ఉపన్యాసమిచ్చి ఎన్నో ప్రశంసల నందుకుంది.

శాసనసభ్యురాలుగా ఆమె అనేక విషయాలపై చక్కటి కృషి గావించసాగింది. "భోగంమేళాల నిషేధం" గురించి ఓ బిల్లు ప్రవేశపెట్టి-ఇది ఎంత అవసరమో వివరంగా గంభీరంగా ఉపన్యసించిందామె. ఈ బిల్లుపై వాద వివాదాలు బయలుదేరడం, వాటిని విని ఇందుగురించి చాలా ప్రచారం గావించడం సీతామహాలక్ష్మమ్మ పట్టుదలకు ప్రబల నిదర్శనమనక తప్పదు.

రాత్రింబవళ్ళు శాసనసభ్యురాలిగా తనపైగల బాధ్యతను ఏమాత్రం విస్మరించక సీతామహాలక్ష్మమ్మ పనిచేయసాగింది. అనేక సంఘాలలో -

ప్రజాహిత సంస్థలలో ఆమె అనేక పదవులలో నియమింపబడి ఆ బాధ్యత లనుకూడా ఎంతో ఓర్పు నేర్పులతో నిర్వహించుకుంటూ రావడం అందరి ప్రశంసలకూ పాత్రమైంది ఆమె. 1948 సంవత్సరంలో తండ్రిని గోల్పో యింది సీతామహాలక్ష్మమ్మ.

1948-49 సంవత్సరాల మధ్యకాలం: గన్నవరం తాలూకా కృష్ణా పుర గ్రామంలో ధాన్యం ప్రొక్యూరుమెంటు సందర్భంలో గ్రామప్రజలకూ-ప్రభుత్వ అధికారులకూ మధ్య చాలా విషమసమస్య ఎదురై నిలచింది. పరిస్థితులు చాలా ఉధృతమయ్యాయి, ఎవరి పట్టుదలను వారు నిలబెట్టు కునేందుకు రంగంలో ఆవేశాగ్రహాలతో నిలవడం జరిగింది.

జిల్లాకలెక్టరుతో మరో విషయంపై మాట్లాడవలసి వచ్చింది సీతామహాలక్ష్మమ్మకు. కలెక్టర్ శ్రీ మలయప్పన్ కృష్ణాపురం క్యాంపులో వున్నట్లు తెలిసి అక్కడకు భర్త రామబ్రహ్మం మరికొందరితో కలసి జీపులో బయలుదేరింది ఆమె. గ్రామంలోకి పోయే రోడ్డుమీదగల వంతెన లన్నీ అదృశ్యమయ్యాయి. జీపు ఊళ్లోకి పోవడానికి వీలుకలుగలేదు. కారణం ఏమిటా అని ఆశ్చర్యపోయి ఆక్కడ కనిపించినవారి నడిగారు వారు. ధాన్యం బయటకు తీసుకుపోకుండేందుకు ఊళ్లోనుండి బైటకుపోయే మార్గాలన్నీ ఈ విధంగా నిరుపయోగ పరచబడ్డాయని తెలిపారు.

పరిస్థితులు ఎంత తీవ్రస్థాయిలో పడ్డాయో అర్థమైంది వారికి. జీపు దిగి కాలినడకన ఊళ్లోకి చేరారు. సీతామహాలక్ష్మమ్మ, భర్త రామ బ్రహ్మంతోకలసి ఎంతో ఓర్పు నేర్పులను ప్రదర్శించి ఈ విషమసమస్యను సమరసంగా పరిష్కరించ పూనుకుంది. విజయం ఆమెయందు నిలచింది. నెత్తురుటేరులు పారుతవనుకున్న పరిస్థితి ప్రశాంతంగా పరిష్కారమై పోయింది. అందరూ ఆమెను అభినందిస్తూ తేలికగా శ్వాస విడిచిపెట్టి హృదయాలను తేలిక పరుచుకున్నారు. తెఱవెనుక ఆనందించ నిలచిన

కమ్యూనిస్టుల ఆశ నిరాశ అయిపోయింది. ప్రజలను ప్రభుత్వంపై రెచ్చ గొట్టి అవకాశాన్ని స్వార్థలాభానికి ఉపయోగింప జూడటం ఆ పార్టీ మూలుగులలోనే దాగివున్న కాకోలవిష మనడం అసత్యమని ఎలా అన గలం? చరిత్ర ఎలుగెత్తి చాటడంలేదా వారి నిజస్వభావం గురించి? ఇది అర్థం చేసుకున్న ఆ గ్రామప్రజ విస్మయంతో విచలితులయి పోయారు ఎంతో కాలం.

అనారోగ్యం

1950 వ సంవత్సరం సీతామహాలక్ష్మమ్మ ఆరోగ్యాన్ని అస్తవ్యస్త పరుస్తూ ముందుసాగింది. కార్యభారంతో, విశ్రాంతినిగోరని ఆమె పరిశ్రమ అకస్మాత్తుగా ఎదురుతిరిగింది. భర్త రామబ్రహ్మం మద్రాసులోవున్నాడు. సీతామహాలక్ష్మమ్మ గుడివాడలో. చూస్తూచూస్తూ వుండగానే దృశ్యశక్తి క్షీణించు కుంటూపోయింది. కన్నులముందు ఏముందో సీతామహాలక్ష్మమ్మకు కనుపించకుండా పోవడమేగాక క్రమక్రమంగా జీవశక్తి బలహీన పడిపోయి స్పృహనే హరించివేసింది. బంధువులు భయపడి పోయారు. వెనువెంటనే ట్రంకుకాల్ చేసి మద్రాసులోవున్న రామబ్రహ్మానికి విష యాన్ని తెలియజేశారు. తాను వచ్చేంతవరకూ తగు చికిత్స గావిస్తూ ఆమెను కనిపెట్టుకొని వుండవలసిందిగా కోరాడు అతడు.

సీతామహాలక్ష్మమ్మ పెదతండ్రి కుమారుడు శ్రీ సూర్యనారాయణ, ప్రక్కయింటివారైన శ్రీ ఈడ్పుగంటి లింగయ్య, వారి సతీమణి బాపనమ్మ దగ్గరనేవుండి కంటికి రెప్పలాచూడ నారంభించారు. గుడివాడలో ప్రముఖ అలోపతి డాక్టర్ శ్రీ అడుసుమిల్లి నారాయణరావును తీసుకువచ్చి చూపించారు. ఆయన సీతామహాలక్ష్మమ్మను పరీక్షించి—"వ్యాధి ఏమిటో

అంతుబట్టలేదు. మందు ఏవ్యాధికని వాడేది. ఇంకపైన ఏమైనా మార్పులు వస్తవేమో చూస్తూవుండండి. ఆ పిదప మందు వాడేందుకు ప్రయత్నించవచ్చు"నంటూ చెప్పి వెళ్ళిపోయాడు. మరో కొంతమంది డాక్టర్లను పిలిచి చూపారు. వారూ 'వ్యాధిఏమిటో తెలియడంలేదు' అంటూ తమ అశక్తత వ్యక్తంచేసి వెళ్ళిపోవడం జరిగింది. భయం - ఆత్రం పందెం వేసుకొని పరువులెత్తుతూండగా వారు శ్రీ రామబ్రహ్మం దంపతులకు మిత్రులూ - శ్రేయోభిలాషులైన హోమియోపతి వైద్యంలో ప్రఖ్యాతిపొందిన దేశ భక్తుడూ, ప్రముఖ జాతీయయోధుడూ అయిన డాక్టర్ శ్రీ ముదునూరి గుర్రాజును తీసుకువచ్చి చూపారు.

అల్లోపతి వైద్యులుగా వైధ్యవృత్తిని ప్రారంభించి - దానికన్నా అత్యంత శ్రేష్ఠమైన విధానం హోమియోపతి అని గుర్తించి దానినే ఆచరణలో అనుసరింప నిశ్చయించుకున్నారు శ్రీ గుర్రాజు. ఆయన సీతా మహాలక్ష్మమ్మను పరీక్షించిచూచారు. వ్యాధిపేరుతో పనిలేని వైద్యం హోమియోపతి. లక్షణాలనుబట్టే మందు నెన్నుకొనే విధానం దానిది. సారూప్య సిద్ధాంతరీత్యా మందుల నెన్నుకొన్నారాయన. మందులోనికి పోయేమార్గం కనిపించలేదు. అయినా ఆయన తన కర్తవ్యాన్ని విడచి అందరిలానే తప్పించుకు పోయేందుకు ప్రయత్నించలేదు. సాయంత్రం నాలుగు గంటలనుండి రోగిని కనిపెట్టుకొని కూర్చుని పెదవులమీద మందును చిలకరిస్తూ వైద్యవృత్తి ధర్మాన్ని అక్షరాలా పాటించ పూనుకున్నారు. రోగికి శక్తిగలంతవరకూ సేవచేయడమే రోగంనుండి మళ్ళించడానికి ప్రయత్నించడమే ముఖ్యధర్మం. ఆత్మవిశ్వాసంతో - హోమియోపతి మందులలోగల మహత్తర శక్తిపైగల గురితో తన ప్రయత్నం తాను సాగిస్తూ ఆ రాత్రంతా గడిపాడాయన.

తూర్పు తెల్లవారింది. ఇక్కడి పరిస్థితులు ఎప్పటికప్పుడు భర్త రామబ్రహ్మానికి ట్రంకు కాలిఫోనుద్వారా తెలియపరుస్తూ వచ్చారు. రోగి

ముఖంలో కొంచెం రంగుమారుకుంటూ వచ్చింది. పదిగంటల సమయానికి మంచంలో పడివున్న సీతామహాలక్ష్మమ్మ కొంచెంగా కదిలింది, ఆ కదలిక అభివృద్ధియై ఆమె పూర్తిగా స్పృహలోకి వచ్చింది. కాని చూపుతగ్గిపోయే వుంది. డాక్టర్ శ్రీ గుర్రాజు మరింత ఆత్మ విశ్వాసంతో మందులను వాడుతూవచ్చారు. బంధువుల మనస్సులు కాస్తకాస్త తేరుకున్నయ్! ఇక ఆపద గడచినట్టేనని నమ్మకం వారిలో ఏర్పడిపోయింది. సాయంత్రం నాలుగు గంటలయ్యింది. సీతామహాలక్ష్మమ్మ కోల్పోయిన దృష్టి తిరిగి వచ్చింది. ఎదుటనున్న సర్వస్వాన్నీ ఆమె గుర్తించగల స్థితికి వచ్చింది. రామబ్రహ్మం ఇంటికి చేరుకునే సమయానికి అర్ధాంగి సీతామహాలక్ష్మమ్మ పూర్తిగా తేరుకుంది. ఇక మిగిలిపోయింది నీరసం మాత్రమే!

పరాజయం

శాసనసభకు ఎన్నికల కోలాహలంతో 1951 వ సంవత్సరం వింత వింత రీతి నీతులను ప్రసాదించింది ఆంధ్రజాతికి. గుడివాడ నియోజక వర్గం జనరల్ స్థానానికి సీతామహాలక్ష్మమ్మనూ, హరిజన స్థానానికి శ్రీ మంగళగిరి రామదాస్‌ను కాంగ్రెసు పార్లమెంటరీబోర్డు అభ్యర్థులుగా నిర్ణయించింది. ప్రత్యర్థులుగా కమ్యూనిస్టుపార్టీ శ్రీ కొట్రుగడ్డ రాజగోపాల రావు, శ్రీ గంజి రామారావులను నిలిపింది. పదవీవ్యామోహం ధనికులను వెఱ్ఱెత్తించడంతో, రకరకాల వ్యక్తులు స్వతంత్ర అభ్యర్థులుగా కుల మత ప్రాతిపదికమీద పోటీకి నిలిచారు! వాతావరణం పూర్తిగా కలుషితమై పోయింది. ముఠాతత్వాలు విశృంఖలంగా విజృంభించాయి. కాంగ్రెసు వాదులలోనే కలిసి కట్టుభావం శూన్యమైపోయింది. లోలోన అనేక అకృత్యాలకు పూనుకుని నడక సాగించారు. పరిస్థితులు మెల్ల మెల్లగా మారుకుంటూపోయి పిట్ట పిట్ట పోరు పిల్లి తీర్చిన సామ్యం నిజమై ఊరు కుంది! సీతామహాలక్ష్మమ్మా – హరిజన అభ్యర్థి రామదాసూ ఓడిపోయారు. ఊహించనైనా లేనంత పెద్దబలంతో కమ్యూనిస్టు అభ్యర్థులు గెలిచారు.

అన్నిచోట్ల పరిస్థితి ఇలానే సిద్ధమైంది. ఫలితమూ ఇలానే అయ్యింది. పెద్దపెద్ద నాయకమణు లనుకొనే వారంతా చిత్తుగా ఓడిపోయి, తమ అంతర్గత కలహాలమూలంగా కలుగ గల ఫలితమేమిటో అనుభవ పూర్వకంగా గుణపాఠం నేర్చుకోగలిగారు. కమ్యూనిస్టులు తమ విజయా

లకు తామే విస్మయచకితులవుతుండగా కాంగ్రెసువారు తమ ఘోర పరాజయాలకు కారణాలను అన్వేషించడంలో మునిగి తేలారు!

సేవాభావము

1952 వ సంవత్సరం! సీతామహాలక్ష్మమ్మను ప్రభుత్వం రెండు సార్లు హిందూ ధర్మాదాయముల సంస్థ తాలూకూ కృష్ణాజిల్లా ఏరియా కమిటీ సభ్యురాలుగా నియమించింది. తనకు అప్పగించిన బాధ్యతలను ఎంతో శ్రద్ధాసక్తులతో నిర్వహించడం వెన్నతోబెట్టిన గుణం సీతామహాలక్ష్మమ్మకు. అందుచేత తన పనిని తాను శ్రద్ధగా చేసుకుంటూ ప్రజాభిమానాన్ని అపారంగా చూరగొంటూ జీవితయాత్రలో పురోగమించ సాగింది ఆమె. జైలు జీవితం - విశ్రాంతిలేని ప్రజాహిత కార్యక్రమ నిర్వహణమూలంగా సీతామహాలక్ష్మమ్మ ఆరోగ్యం మార్పుపొందింది. ఉబ్బసవ్యాధి సంక్రమించి కృంగదీయసాగినా ఆమెలోని సేవాభావం ఏమాత్రం లోపించకపోవడం గమనార్హం. బాధపడుతూనే ప్రజాహిత కార్యాలలో పాల్గొనసాగింది వజ్ర సంకల్పంతో! ఎన్నో ప్రజాహిత కార్యాలను జరిగించింది తన ఆధిపత్యంలో!

అపజయం

సాంఘికసేవా కార్యక్రమంలో సాగిపోతూన్న సీతామహాలక్ష్మమ్మ 1958 వ సంవత్సరంలో అడుగు పెట్టింది. ఆంధ్రప్రదేశ్ ఎగువ సభ నిర్మాణం జరిగింది! అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకదానికి సీతా మహాలక్ష్మమ్మను అభ్యర్థింగా చివరిక్షణాలలో ప్రదేశ్ కాంగ్రెసువారు సెలెక్టు చేశారు. తక్షణం టెలీఫోనుద్వారా హైదరాబాదు రావలసిందిగా ఆహ్వానించారు సీతామహాలక్ష్మమ్మచే నామినేషన్ పత్రం దాఖలు చేయించారు. అభ్యర్థితో సంప్రదింపులు లేకుండానే నాయకమ్మన్యులంతా ఏమేమో నిర్ణయాలను చేసుకుని - కొందరిని వారి ఓట్లు సీతామహాలక్ష్మమ్మకు వేయవలసిందిగా ఆదేశించారు. పైకి జరిగింది ఒకటి, లోపల మరొకటి జరిగిపోసాగింది. ఓట్లు వేయమన్న వ్యక్తులు రకరకాల అభిప్రాయాలతో తమ ఇష్టాయిష్టాలను వ్యక్తపరుస్తూ పోయారు. క్రమశిక్షణ గంగ - కాదు కాదు తుంగలో కలిసిపోయింది. నీతి నిజాయితీలు కాంగ్రెసు సంస్థనుండి మెల్ల

మెల్లగానే అయినా తిరోగమించి ప్రజానీకం మనస్సుల్లో పవిత్ర భక్తి శ్రద్ధలనే భగభగమండించి మసిగావించివేశాయి. కుటిలత్వం, కుట్రలు బహిరంగంగానేబజారునపడగా-నాటిని అరికట్టే నాధుడెవరు? నాయకులేనాటకాల పాత్రలైతే అనుచరులకు అదుపు ఎక్కడవుంటుంది. కాంగ్రెసు అభ్యర్థుల మూలంగానే-కాంగ్రెసు అభ్యర్థిని సీతామహాలక్ష్మమ్మ అన్యాయం చేయబడి అపజయమందింది. ఈ అపజయం ఎవరిది? ఆమెదా? ఉహూఁ! త్యాగ-సౌశీల్యాలతో అఖండప్రఖ్యాతిగాంచిన కాంగ్రెసుపార్టీది, దానినాయకత్వానిది!

బిడ్డ పెంపకం

సీతామహాలక్ష్మమ్మ చింతపడలేదు. ఇంటినిజేరింది; ఇంటిపట్టునే నిలచింది. పుట్టినబిడ్డపోయి-తిరిగి బిడ్డలు కలుగకపోవడంవల్ల బిడ్డలపై గల మమకారాన్ని చంపుకోలేక బావగారి కుమార్తెను పసిదాన్ని పెంపకం తీసుకుంది. ఆ పిల్లను పెంచడంలో ఎంతో శ్రద్ధతీసుకొని-ముద్దు ముచ్చటలతో మురిపెంపు మాటలతో ఆడుకుంటూ-పాడుకుంటూ జీవిత యాత్రను ఆనంద మయమార్గంలో నడుపుకుంటూ పోవడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. సాగిపోతూంది!

సాంఘికసేవ

1938 ఏప్రియల్ 20, 21 తేదీలలో శ్రీమతి సీతామహాలక్ష్మమ్మ గారి అధ్యక్షతను కొమరవోలు గాంధి ఆశ్రమం వద్ద కృష్ణాజిల్లా మహిళా మహా సభలు జరుపబడెను. ఈ సభను శ్రీమతి దర్శి సుభద్రమ్మ గారు ప్రారంభించిరి. జిల్లాలలోని నలుమూలల నుండి గ్రామీణ స్త్రీలు విరివిగా ఈ సభలలో పాల్గొని మహిళా అభ్యున్నతికి అనేక తీర్మానములు చేసిరి. దరిమిలా పశ్చిమ గోదావరి జిల్లాలో మహిళా సభలు జరిగినవి. ఆ సభలకు శ్రీమతి సీతామహాలక్ష్మమ్మను అధ్యక్షత వహించవలసినదని ఆహ్వాన సంఘ కోర్కెపై సదరు సభలకు భీమవరం తాలూకా లంకలకోడేరు గ్రామంలో అధ్యక్షత వహించి సభలు దిగ్విజయముగా జరిపించిరి. సభలకు చక్కని యేర్పాట్లు చేసిరి. వేలకొలది గ్రామీణ స్త్రీలు సభలలో పాల్గొని అనేక అభ్యుదయ తీర్మానములు చర్చించి ఆమోదించిరి.

వ్యష్టి సత్యాగ్రహములో శిక్ష ననుభవించి ది 18-6-41 వ తేదీ విడుదలైన తదుపరి ది 1-8-41 వ తేదీన విజయవాడ తాలూకా నైనవరం

గ్రామములో శ్రీ సుంకర నాగభూషణంగారు తమ తల్లి జ్ఞాపకార్థం హరిజనులకు కట్టించిన "మంచి నీళ్ళ బావి"ని ప్రారంభోత్సవము చేయుటకు సీతామహాలక్ష్మమ్మగారు ఆహ్వానింప బడిరి. ఈ సభకు విజయవాడ మునిసిపల్ ఛైర్మన్ శ్రీ సి. రాజగోపాలాచారిగారు అధ్యక్షతవహించిరి. వేలమంది హరిజనులకు ఈ బావినీరు ఉపయోగపడుచున్నవి.

1947 వ సంవత్సరము ఈమె శాసనసభా సభ్యురాలుగా "భోగము మేళాల నిషేధం" కోసము శ్రీమతి సీతామహాలక్ష్మమ్మ మదరాసు శాసన సభలో బిల్లు ప్రవేశపెట్టినది. దానిపైకొంత తర్జనభర్జనలు జరిపి ప్రభుత్వం వారే బిల్లు ప్రవేశ పెట్టెదమని హామీ ఇచ్చిన కారణమున ప్రభుత్వము వారి కోర్కె ననుసరించి ఆమె బిల్లు నుపసంహరించుకున్నారు. దరిమిలా ప్రభుత్వమే "దేవదాసీ నిషేధ బిల్లు" ప్రవేశపెట్టి చట్టము చేసిరి. జమీందారీ యబాలిషన్ బిల్లు ప్రవేశపెట్టిన తదుపరి ప్రభుత్వమువారు జాయింటు సెలెక్టుకమిటీలో సీతామహాలక్ష్మమ్మను సభ్యురాలుగా చేర్చిరి. ఈమె బిల్లులో అనేక సవరణలు చేర్పించుటేగాక, లంకభూములను బిల్లులో చేర్పించుటకు పాటుపడి కృతకృత్యురాలైరి.

1948 సం॥లో కృష్ణా జిల్లా బోర్డు స్పెషల్ ఆఫీసరు శ్రీ కలెక్టరు గారు సీతామహాలక్ష్మమ్మగారిని ఆంధ్ర యూనివర్శిటీ సెనేట్‌కు మెంబరుగా జిల్లాబోర్డుతరపున ఎన్నుకొనిరి. ఈపదవిలో వీరు 2సం॥లు వుండి సెనేట్ సభలలో పాల్గొనిరి. 1950 సంవత్సరములో తిరిగి మదరాసు రాష్ట్ర అసెంబ్లీవారు ఈమెను ఆంధ్ర యూనివర్శిటీకి సెనేట్ మెంబరుగా మూడు సంవత్సరములకు ఎన్నుకొనిరి. ఈ కాలములో ఈమె స్త్రీ విద్యావ్యాప్తికి ఎనలేని సేవజేసిరి. శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారిని ది 15-8-72 స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భములో కృష్ణాజిల్లా కలెక్టరు శ్రీ గిరిగారు భారత ప్రభుత్వం తరపున మచిలీపట్నం ఆహ్వానించి పోలీసు పెరేడు మైదానములో ఈమెతోపాటు జిల్లాలోని స్వాతంత్ర్య సమర వీరులందరిని సన్మానించిరి. దరిమిలా 1973 సంవత్సరము ఆగష్టు 15 వ తేదీన రజతోత్సవాలు ముగింపు సందర్భములో భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి పంపినటువంటి తామ్రపత్రములు శ్రీమతి సీతామహాలక్ష్మమ్మకు, జిల్లాలోని స్వాతంత్ర్య సమర వీరులకు ప్రభుత్వం తరపున ఆహ్వానించి మచిలీపట్నంలో పోలీసు పెరేడు మైదానములో బహుమతి ప్రదానం చేసి

సన్మానించిరి. శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారు శాసన సభాసభ్యురాలుగా నిరుపమానమైన ప్రజాసేవచేసి ప్రజల ఆమోదమును సంపాదించినారు. వారు ప్రజా సేవయే తమ పరమావధిగా భావించి నిష్కళంకమైన దీక్షతో నిరుపమాన పట్టుదలతో అచంచలమైన ఓర్పుతో అమితమైన పట్టుదలతో ధర్మనిర్వహణమొనర్చి ప్రజాభిప్రాయమును ప్రస్ఫుటంచేసి ప్రజల ఆదరాభిమానములను చూరగొనినారు. ఆమె శాసన సభాప్రసంగములను శ్రీ కొడాలి ఆంజనేయులుగారిచే గ్రంధముగాసంకలనము చేయబడిగుడివాడ తాలూకా కాంగ్రెసు సంఘమువారిచే 1951 సంవత్సరములో ప్రచురింపబడి యుండెను. ఆ గ్రంధము యధాతదముగా ఈ పుస్తకమునకు అనుబంధముగా ముద్రింపబడెను. ఆ ప్రసంగములు చూచిన సీతామహాలక్ష్మమ్మగారి ప్రజాసేవ తెలియనగును. ఇట్టి నిస్వార్థ దేశసేవిక, ప్రజాసేవిక జన్మించుట ఆంధ్రమాతకు గర్వకారణము.

వీరనారిగా, త్యాగమూర్తిగా – ఆదర్శ మహిళగా ఆంధ్రదేశ చరిత్రలోసువర్ణాక్షరాల లిఖింపబడగల చరిత్ర అనడంలో అత్యుక్తికాదు.ఆమె ధన్యజీవి! ఆమె ఆయురారోగ్యాభ్యున్నతితో విలసిల్లవలసిందిగా,కోరుదాం.

భారతదేశ స్వాతంత్ర్య సముపార్జన సందర్భమున మదరాసు ఆకాశవాణి ది 16-8-1947 న ప్రసారము చేసిన శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారి "స్త్రీలు భావి భారతము" అను ఉపన్యాసమును ఇందు రెండవ అనుబంధముగా ప్రచురించబడెను.

ఒకటవ అనుబంధము.

శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారి శాసనసభా ప్రసంగములు

పరిచయము

గుడివాడ నియోజకవర్గంనుండి మద్రాసుస్టేటుఅస్సెంబ్లీకి నేడుతిరిగి కాంగ్రెసు అభ్యర్థిగానియమింపబడిన శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారు ఇంతకుపూర్వం ఐదేళ్ళ నుండి కాంగ్రెసుపక్షాన ఎన్నుకోబడిన శాసనసభ్యురాలుగా అస్సెంబ్లీ సభలో చేసిన ప్రసంగము లీ చిన్న కరపత్రములో పొందుపఱుపబడినవి. ఆమె కడచిన ఏ సంll ల కాలంలో సామాన్య ప్రజాసమస్యలనుగూర్చిన శాసనసభా చర్చలన్నిటిలోను పాల్గొని ప్రజాక్షేమమేపర

మావధిగా భావించి, ప్రజాభిప్రాయాన్ని ప్రస్ఫుటంచేస్తూ వచ్చింది. ఆహారసమస్య, వస్త్రసమస్య, నైతుసమస్యలు, సాంఘిక ఆర్థిక రాజకీయ సమస్యలు, పోలీసుల అత్యాచారాలు, కమ్యూనిస్టుల దుండగాలు, జమీందారీ రద్దు చట్టం, బహుభార్య నిషేధం - విడాకులచట్టం, మద్య నిషేధచట్టం, ప్రజారక్షణచట్టం, ఈ అన్నిటికి సంబంధించిన చర్చలలోనూ పాల్గొని తన అభిప్రాయాలను ధైర్యంగా శాసనసభారంగమున ప్రకటించగలిగిన శాసన సభ్యురాలు సీతామహాలక్ష్మమ్మగారు.

జమీందారీ రద్దు చట్టం

ముఖ్యంగా జమిందారీ రద్దుచట్టం విషయంలో ఆమెచేసిన కృషి మిక్కిలి ప్రశంసనీయము. జమీందారీ రద్దునుగూర్చిన చిత్తుచట్టంలో, జమీందారీలు రద్దుకావడంతోనే, సెక్షన్ 3 (b) క్రింద ప్రభుత్వానికి స్వాధీనం కావలసిన భూముల వివరము లుదహరింపబడిఉన్నవి. అందులో అడవులు, బంజరు భూములు, చెఱువులు, సామాజిక భూములు, పంట బోదెలు వగైరా తదితర నాన్ రయతీ భూములు ప్రభుత్వ స్వాధీనము కాగలవని ఉన్నది. కాని లంక భూములను గూర్చి యేమీ ఉదహరింప బడలేదు. జమీందారీ యెస్టేట్లలో వేలకొలదీ యెకరాల కృష్ణాగోదావరి లంకలను, జమిందారులు తమ సొంతభూములుగా పరిగణిస్తూ ప్రతిసంవత్సరం పాటబెట్టి కవులుకిచ్చేవాడుకవుంది. ఒక్కొక్క ఎకరానికి సాలుకు రు 200/- రు 250/- లు వరకూ కూడా నైతులనుండి కవులు చెల్లించ బడుతూ ఉండేది. ఇవి జమీందారుల సొంతభూములుగా వ్యవహరింపబడు తూండటంవలన, ఆ యా ప్రాంతాలలోని నైతులు, కేవలం ఈ భూము లను కవులుకు తీసుకోవడం పైననే జీవించవలసి వుండేది. అందువలన వా రా యా జమీందారుల కటాక్షములకు ఎదురుచూస్తూ వారికి లోబడి ఉండవలసివచ్చేది. ఈ సందర్భంలో జమీందారీ రద్దుచట్టం అంగీకరింప బడటానికిముందు అనేకమంది లంక నైతులను లంకల నుండి వెళ్ళగొట్ట డానికి ప్రయత్నించినందున ఆ యా యెస్టేట్లలో జమీందార్లకూ, నైతులకూ జరిగిన తీవ్ర పోరాటములను గూర్చి అందఱికీ తెలిసిందే.

చిత్తు చట్టమునందు జమీందారీల రద్దుతోపాటు ప్రభుత్వం స్వాధీన పఱచుకోవలసిన భూముల జాబితాలో లంక లుదహరింపబడలేదన్న

విషయం గ్రహించిన శాసన సభ్యురాలు శ్రీమతి సీతామహాలక్ష్మమ్మ గారొక్కరే.

"నాన్‌రయతీభూముల" అనేమాటలోనే లంక భూములుకూడా యిమిడిఉన్నవని అప్పటి రెవిన్యూమంత్రి శ్రీ కళా వేంకటరావుగారి అభిప్రాయం. అందువలన లంక భూములను గూర్చి ప్రత్యేకం ఉదాహరించవకరలేదని ఆయన అనుకొన్నారు. 1907 ఎస్టేట్సులాండు ఆక్టులోకూడా "లంకభూముల" ప్రతిపత్తినిగూర్చి ఎక్కడా ఉదాహరింపబడి యుండలేదు. అందువలన అవి నిరంతరం రైతు హక్కు భుక్తముల క్రింద ఉంటూన్నప్పటికీ జమీందారుల సొంతభూములుగానే వ్యవహరింపబడుతున్నవి. శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారు "నాన్‌రయతీ భూములు" అనేమాటలో లంకభూములు ఇమిడి ఉండలేదనీ, ప్రభుత్వం స్వాధీనపఱచుకోవలసిన భూములలో "లంకభూములు" అనేమాట ప్రత్యేకం చేర్చవలసి ఉందని శాసనసభలో ప్రసంగించారు. గౌరవనీయులైన రెవిన్యూమంత్రి శ్రీ కళా వేంకటరావుగారు, నాన్‌రయతీభూములు, అనేమాటలో లంకలు, ఇమిడిఉన్నవని తా మభిప్రాయపడుతూన్నట్లున్నా, అలాఇమిడిఉండలేదని తమకు ప్రభుత్వ న్యాయశాస్త్రవేత్తలు అభిప్రాయ మిచ్చేయెడల తప్పక లంకలను చేర్చెదమని అభిప్రాయమిచ్చారు. *ఇవన్నీ శాసనసభాచర్చలను

*ఈ విషయంలో గౌ॥ శ్రీ. రెవిన్యూమంత్రిగారు చెప్పినమాటలివి.

"Then Sir, various other suggestions have been made. The hon. Lady Member Srimathi Seethamahalakshmamma suggested the inclusion of the word 'Lankas' in the definition clause. We thought that the word 'Non-ryoti land' used in this Act would, in all likelihood, cover this term "'Lankas" also; but if the Legal Department says that there is no objection to adding the word 'Lankas' also in the Bill, we shall be prepared to do so.

గూర్చిన ప్రభుత్వప్రచురణలో పాఠకులు చూడగలరు. తరువాత జమీందారీ రద్దు చట్టమునుగూర్చిన సెలెక్టుకమిటీ యెదుట శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారి ప్రోత్సాహంవలన లంకల రైతుల సంఘంవారు సాక్ష్యం ఈయడం జరిగింది. ఆ సాక్ష్యం ఫలితంగానూ, శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారు, శాసనసభలో కావించిన ప్రసంగముల ఫలితంగానూ, గౌ॥ రెవిన్యూమంత్రితో కావించినచర్చల ఫలితంగానూ, లంకలు జమీందారీ రద్దుచట్టంలో చేర్చబడినవి.

అందువల్ల ఇప్పుడు 1939 నుండి పది సంవత్సరములు వరుసగా రైతుల స్వాధీన భుక్తములలోనున్న 'లంకలు' రైతులకునూ, 1918 కి పూర్వం 12 సంవత్సరాలు వరుసగా, జమీందార్లు సొంత వ్యవసాయం చేస్తూన్నట్లు ఋజువయిన లంకలు మాత్రం జమీందార్లకునూ రైత్వారీ పట్టా లీయబడును. తక్కినవి ప్రభుత్వ స్వాధీనం కాగలవు. ఈ ప్రకారం జమీందార్లకు రాదగిన లంకలు దాదాపు లేనేలేవని చెప్పవచ్చును. కొంతమంది రైతులకు కొన్ని లంకభూములు లభించినవి.

ఇందువల్ల కొన్నివేల ఎకరాల లంకలు ప్రభుత్వ స్వాధీనమై, "వ్యవసాయకూలీ సహకార సంఘాలకు" ఈయడానికి వీలు కలుగుతూన్నది. భూములులేని వ్యవసాయకూలీల ఆర్థిక ప్రతిపత్తిని పెంపొందించేటందుకు శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారి కృషి ఈ విధంగా సఫలీకృతమయింది.

ఈ కారణంగా కొంతమంది జమీందార్లకు సీతామహాలక్ష్మమ్మగారంటే కంటగింపు ఇప్పుడు. శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారికి పోటీగా నిలబడిన శ్రీ పిన్నమనేని లింగయ్యగారు శ్రీ చల్లపల్లి రాజాగారి స్టాండింగువకీలు కావడమేకాక ఒకవిధంగా ఆయనగారి యెస్టేటు వ్యవహారాలన్నిటినీ చక్కబెట్టేవారని చెప్పవచ్చును.

36

కళావంతుల మేళాలు

కళావంతుల మేళాల నిషేధమునుగూర్చిన సాంఘిక శాసనమును శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారే మొట్టమొదట్లో శాసనసభలో ప్రవేశపెట్టడానికి నోటీసిచ్చిన విషయం పాఠకులు తెలుసుకునేఉంటారు. ఆ చట్టాన్నే ప్రభుత్వంవారు తమకు ఉచితమని తోచినమార్పులతో శాసనసభలో ప్రవేశపెట్టి అంగీకరింపజేయడం తటస్థించింది. కాని అది యింకనూ అసమగ్రంగా ఉందని సీతామహాలక్ష్మమ్మగా రభిప్రాయపడుతూ దానిని మఱింత బందోబస్తుచేయడానికి ఇప్పటికీ కృషిచేస్తూనే ఉన్నారు. ఈ కళావంతుల మేళాలమూలానే అనేకమంది యువతీ యువకులు అవినీతికి ఆకర్షింపబడి తమ కుటుంబాలను దుఃఖ భాజనములు కావించు కొంటున్నారని సీతామహాలక్ష్మమ్మగారి అభిప్రాయం.

ఐదు సంవత్సరాలనుండి బందరు రూరల్ నియోజక వర్గములకు మద్రాసు శాసనసభలో ప్రాతినిధ్యమువహించిన శ్రీమతి సీతామహాలక్ష్మమ్మ గారు, ఈ కరపత్రములో ప్రచురించిన అమె శాసనసభోపన్యాసములను బట్టి, తన కర్తవ్యము నెంత సక్రమంగా నిర్వహించగలిగినారో పాఠకులు గమనించ ప్రార్థన.

ఆమెగారిని తిరిగి శాసన సభాభ్యర్థిగా గుడివాడ నియోజకవర్గమునకు నిర్ణయించి నందున కాంగ్రెసు ఆమె సేవను గుర్తించిందని చెప్పవచ్చును.

1951 సం॥

కొడాలి ఆంజనేయులు.

జై హింద్

శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారి

శాసనసభా ప్రసంగములు

అభినందనాలు

"అధ్యక్షా! ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకొన్న శ్రీమతి అమ్మన్న రాజా గారికి నా అభినందనములు. మన దేశములో స్త్రీలు మానవ జాతిలో సగముగా ఉన్నారు. కాని అభ్యున్నతి లేనందువల్ల ఈ నాటికి బానిసత్వ ముతో ఉన్నాము. అందుచేతనే గాంధిగారు స్త్రీలందరు మేల్కొని బైటకు రావలెనని అన్నారు. ఆయన ఉద్యమాలలో స్త్రీ జాతి అంతా దేశ స్వాతంత్ర్యానికి పాటుపడవలెనని అన్నారు. ఈ శాసన సభలో స్థానములు కాంగ్రెసు సేవా ఫలితముగా స్త్రీలకు లభించినవి. మన కాంగ్రెసు పార్టీ వారు స్త్రీ అయిన అమ్మన్న రాజాగారిచే ఈ నాడు ఆ పదవిని అలంకరింపచేయించారు. లోగడ ఈ స్థానాన్ని మన రుక్మిణమ్మగారు అలంకరించారు. ఈ స్థానాన్ని మన అమ్మన్న రాజాగారు అలంకరించాలి అని నేను కాంగ్రెసుపార్టీ తరపున మా అభినందనములను అర్పిస్తున్నాను."

(M. L. A. Debates Official Report Vol. I. No. 2 Page 31)

అధికాహారోత్పత్తి సూచనలు

"అధ్యక్షా! ఇప్పుడు మన డాష్ట్రింలో ఆహారం విషయమై చాలా కష్టంగాఉంది. మేము కష్టపడి వ్యవసాయము చేస్తున్నాముగాని మాకు తిన డానికి సరియయిన ఆహారములేదని పేదరైతులు, కూలీలు ఆందోళన

పడుతూ ఉన్నారు. ఇప్పుడువెంటనే ఆహారలోటును భర్తీ చెయ్యవలెను. అంటే కృష్ణా, గోదావరి జిల్లాలలో ముఖ్యముగా ఆహారధాన్యములు అధికముగా పండించడానికి అవకాశముఉన్నది. ఎందువల్ల నంటే కృష్ణా, గోదావరి లంకలలో రైతులు ఎక్కువగా పొగాకు పండిస్తున్నారు. ఇప్పుడు మనకు ఆహార ధాన్యములు అవసరం కొబట్టి ఎక్కువ ఆహార ధాన్యములను మెట్ట ప్రదేశాలలో జొన్న వగైరాలు పండించవలయును. అందువల్ల మన మద్రాసు ప్రభుత్వం, మన ప్రధాన మంత్రిగారు పొగాకు పంటను నిషేధించి మెట్ట ప్రదేశాలలో మనకు అదనముగా అవసరమయ్యే ధాన్యాలను పండించుటకు వెంటనే చర్య తీసుకొనవలెనని నేను కోరుచున్నాను."

(M. L. A. Debates Official Report Vol. 1 No 5 Pape 31)

ప్రజా సామాన్యమునకు గుడ్డ

చెప్పేది ఏమిటంటే ఆహారము లేకపోయినప్పటికి ప్రతి మానవునికి తన ప్రాణముపోయేవరకు మానము కాపాడుకునేందుకు గుడ్డ అత్యవసరము. 10 కుటుంబములకు ఒక చీర అనేది ఎంత ఘోరమో, స్త్రీల మానము ఎలాగ కాపాడగలరో మీరే ఆలోచించవలయును. బట్టలకొరకు ఈ రాష్ట్రిములో ఎంత కొటకముగా ఉన్నాకూడా కాంగ్రెసు మంత్రివర్గం అధికారంలో ఉంతగా ఎగుమతులు వెంటనే ఆపివేసి తగినచర్య తీసుకొనవలెను. ప్రస్తుతము మిల్లు బట్టలు దొరకడమేలేదు. నేతబట్టలు సాధారణ కుటుంబములకు అందుబాటులోలేవు. మిల్లుబట్ట ప్రజలకు చాలినంతగాలేదు. గ్రామవాసులలో రు 50 లు వరకు ఆదాయము వచ్చేవారికి ప్రతికుటుంబానికి మిల్లు బట్టలు సప్లయి అయ్యేటట్లు చూడాలి. పట్టణాలలో నెలకు రూ 100 లకు తక్కువ ఆదాయము వచ్చేవారికి మిల్లు గుడ్డలు అందేటట్లు చూడాలి. ఆహారవిషయములో ఏవిధముగా మరలనుండి ముదుగు బియ్యం

తీయించుటకు యేర్పాట్లు చేయుచున్నారో అదేవిధముగా బట్టలుగూడా మిల్లునుండి ముదుగులో తయారు చేయించవలెను. నెలకు రూ 50 నుండి 100 వరకు ఆదాయముగలవారు ఈ చేనేతగుడ్డలు కొనలేకుండాయున్నారు. సంవత్సరానికి సాధారణముగా కనీసం ఒక స్త్రీకి 3 చీరలు కావాలి. చీర రు 10 ల చొప్పున రూ 30 లు ఇచ్చి చీరలు కొనలేనివారు చాలామంది ఉంటారు. కాబట్టి మిల్లు చీరలు బీదవారికి దొరికేటట్లు చూడాలి.

"అంతేకాకుండా (All India) చరఖా సంఘమువారు పనిచేస్తున్నా ఖద్దరు చాలినంతగాలేదు అని మన టెక్స్టైల్ ఆఫీసరుగారు అన్నారు. చాలినంతగా ఖద్దరు ఉత్పత్తిగావలెనంటే గ్రామాలలో బీదలకు చరఖాలు, ఏకులు ఉచితంగాఇచ్చి రూ 100 లకు రూ 5 లు విలువగల చిలపలు పన్నుల రూపకముగా చెల్లించేటట్లు చెయ్యవలెను. ఇప్పటి నిబంధనల ప్రకారము రూ 5 ల ఖద్దరు కావలెనంటే ఆంధ్రచరకా సంఘములో ఒక చిలపయున్నా, తమిళనాడు సంఘములోకూడా రెండు చిలపలు నూలు ఇవ్వాలనిఉంది. ఆలాగు ఇచ్చి ఖద్దరు కావలసినవారు కొంటున్నారు. నూలు ఉత్పత్తి అధికముగాలేదు కాబట్టి ఈ బట్టలకొరత తీర్చవలసిన బాధ్యత ప్రభుత్వము వారిమీదను ఉంది. కాబట్టి ముఖ్యముగా రూ 5 ల సిసలుకు ఒకచిలప నూలునైనను ఖండితముగా వసూలు చేయవలయును.

"మిల్లు బట్టలు ఎక్కువగా సప్లయి చెయ్యవలయును. హిందూ వితంతువులకు మల్లు దొరకడములేదు అని అంటున్నారు. వారు రంగు చీరలు అంచు బట్టలు కట్టుకోరు. మా సాంప్రదాయముల ప్రకారంగా కట్టడానికి వీలులేదు కాబట్టి మల్లు కావలెనని వారు అంటున్నారు.

చేనేత పారిశ్రామికులకు సహాయము ఎక్కువగా చెయ్యాలి. ఖద్దరు నేయు మగ్గములకు Bons ఇవ్వాలి. ఈ బట్టల కొరతను మన మద్రాసు ప్రభుత్వం తొలగించాలి. అన్న వస్త్రములకు లోటులేని ఈ భారత

దేశములో 10 కుటుంబములకు ఒక చీరకన్న ఎక్కువ ఇవ్వలేమని చెప్పుట విచారకరముగాఉంది. రాట్నములు ప్రజలకు విరివిగా సప్లయిచేస్తే ఈ కొరత తీరుతుందని నేను చెప్పుచున్నాను. ఇది నా పిన్నపముగా చెపుతూ నేను సెలవు తీసుకుంటున్నాను."

(M L. A Debates Official Report Vol. I No. 8 P. 296, 297)

మద్యపాన నిషేధము

"అధ్యక్ష ! ఈనాడు మన రాష్ట్రములో మద్యపాన నిషేధమును 8 జిల్లాలలో అమలు జరిపేటట్లు మన ప్రధాన మంత్రిగారు బడ్జెటులో ఏర్పాటు చేసివున్నారు. దీనివలన మన రాష్ట్రములో ప్రజలు సంతోషించు చున్నారు. అంతేగాకుండా, దీనిలో ముఖ్యముగా భాగస్వాములై యీ మద్యపానమువల్ల బాధపడేవారందరు దీనివలన ముఖ్యముగా సంతోషిస్తూ వున్నారు. ఎందువల్లనంటే, యీ మధ్యపానము దురభ్యాసమువలన అనేక కుటుంబాలు యీ పిపాసకులోనై, చాల దరిద్రములో మునిగి వున్నాయి.

కాంగ్రెసు యీ దురభ్యాసాన్ని తొలగించటానికిగాను యిప్పటికి దాదాపు 20 సంవత్సరములనుండి కృషిచేస్తూవచ్చింది. దానికే, 1937 వ సంవత్సరములో మన కాంగ్రెసు ప్రభుత్వము వచ్చినప్పుడు, యీ రాష్ట్రి ములో 4 జిల్లాలలో మద్యపాన నిషేధాన్ని అమలు జరిపింది. కాని అంతలో మంత్రివర్గము పదవీ త్యాగము చేయవలసివచ్చింది. అందువల్ల యీ మద్యపాన నిషేధాన్ని వారు పూర్తిగా సాగించలేక పోయినారు. కాని, యీనాడు కాంగ్రెసు ప్రభుత్వము అధికారానికి వచ్చిన వెంటనే, దీనిని కొనసాగించి, 8 జిల్లాలలో పెట్టినారు.

మొన్న జరిగిన ఎన్నికలలో కాంగ్రెసుకు అకుంఠిత విజయము చేకూరిందంటే యీ మద్యపాన నిషేధము కాంగ్రెసు యొక్క ఎన్నిక ప్రణాళికలో ఒక అంశమై వున్నందువల్లనే, నేను యీ ఎన్నికలైన తర్వాత బందరు వెళ్ళినప్పుడు, ఒక యాదవ స్త్రీ నావద్దకు వచ్చి, "మా వోట్లు అన్నికూడా కాంగ్రెసుకేయించ్చి, దిగ్విజయము ఎందుకు చేకూర్చి నామో తెలుసునా?" అని అడిగింది. ఎందుకు అని అడిగితే, ఆమె యీ విధముగా చెప్పింది. "మన రాష్ట్రములో కాంగ్రెసు ప్రభుత్వము అధికారమునకు రాగానే, వీలైనంత త్వరలో రాష్ట్రములో మద్యపాన నిషేధమును అమలుజరిపి, మా కష్టములను హృదయములో పెట్టుకొని, మాకు సహాయము చేస్తారనే వుత్సాహముతో మావోట్లు యిచ్చినాము. ప్రతిరోజు, నాభర్త కష్టపడి, సాయంకాలానికి ఒక రూపాయ సంపాదించుతాడు. కాని, నేను, నా నలుగురు పిల్లలుకూడా తిండిలేక వున్నాము. ఈ రోజులలో, ఆ వచ్చిన రూపాయకూడా మద్యపానానికి వుపయోగించినటులైతే, ఏ పావలా డబ్బులో మిగులుతే, యీ నాటికి దానికి నూకలుకూడా దొరకవు. కనుక, వెంటనే యీ ప్రభుత్వము మద్యపాన నిషేధమును వీలైనంత త్వరలో అమలు జరిపేటటుల చూడవలసినదని ఆమె చెప్పింది. ఇండియాలో, అందులో ముఖ్యముగా మన రాష్ట్రములోవున్నట్టి పేద స్త్రీలు, వారి కుటుంబాలు సౌఖ్యముగా వుంటేటట్లు చేయవలసినదిగా ఆమెకోరినది.

"మన ప్రధాన మంత్రిగారు చాలా శ్రద్ధ వహించి, ప్రజల కష్టములను తెలిసికొని, ముఖ్యముగా స్త్రీలయొక్క బాధలను తెలిసికొని, ఇప్పుడు 8 జిల్లాలలో మద్యపాన నిషేధమును అమలు జరుపుచున్నందుకు వారికి వందనములు సమర్పించుతూవున్నాను."

(M. L. A. Debats Official Reprot Vol. II No. 2 P. 416,417)

కృష్ణాజిల్లా రైతులతరపున పోరాటము - సేద్యము

అధ్యక్షా! ఠి మోడలింగు తూములవల్ల నీరు సరిగ్గా సప్లయికాక, గండ్లుకొట్టి సాగుచేయుటయు, అందుమీద పి. డబ్లు. డి. (P. W. D.) వాళ్ళు లంచములు పట్టుటకు మార్గములు ఏర్పడుచున్నవి. ప్రత్యేకముగా, కైకలూరు తాలూకాలో, చేవూరు గ్రామస్థులమీద 80 ఎకరముల భూమికి పెనాల్టీకట్టి, అక్కడి వుద్యోగస్థులు దానిని రైతులనుండి వసూలు చేయుటకు ప్రయత్నిస్తూవున్నారు. దీనికే మొన్న ఆ రైతులు ఇక్కడకువచ్చి మన రివిన్యూ మంత్రిగార్కి కూడా, వారు పిటీషను (Petition) పెట్టుకున్నారు.

"కాన, ప్రస్తుతపు ఠిమోడలింగు తూములు పెద్దవిచేయుట అవసరము. అట్లు పెద్దవిగా చేసినటులైతే, యీలాంటి కష్టములుతొలగి, సక్రమముగా నీరు సప్లయి అవడానికి అదను ఏర్పడుతుంది.

"అదేకాకుండా, మురుగు కాలువలు లేకపోవుటవల్ల, అప్పుడప్పుడు రెమిషసులు (Remissions) యివ్వవలసి వచ్చుటచే, గవర్నమెంటువారి ఆదాయముకూడ తగ్గుచున్నది. భూములసారము తగ్గి, రైతుకు ప్రతి సంవత్సరము ఆదాయముకూడ తగ్గుతూవుంటుంది. కావున, వెంటనే మురుగుకాలువల సౌకర్యములు చేయవలయును.

"మా కృష్ణాజిల్లాలో (Kistna District) కైకలూరు (Kikalur) తాలూకాకు ప్రతి సంవత్సరము గవర్నమెంటువారు రెమిషను యిస్తూవున్నారు. అక్కడ బుడమేరు, కొల్లేరు ముంపులవల్ల, ఆ తాలూకా రైతులు ప్రతి సంవత్సరము కొన్ని వందల ఏకరముల భూములు మురుగుపోక బాధపడుచున్నారు. దీనివల్ల గవర్నమెంటు ఆదాయములో లోటు

వచ్చుచున్నది. అందువల్ల లోగడనే, యీ మురుగు, సముద్రానికి పోవు టకుగాను గవర్నమెంటువారు ఒక స్కీమును ఆలోచించి వున్నారు. ఆ స్కీము (Scheme) ను కాంగ్రెసు ప్రభుత్వమువారు వెంటనే అమలు జరిపిన, అధిక ఆహార వుత్పత్తికి, రైతుల ఆర్థికమునకు, ప్రభుత్వపు ఆదాయమునకుకూడ వుపయోగపడును. కనుక, వెంటనే ప్రభుత్వమువారు, ఇరిగేషను (Irrigation) మంత్రిగారు తగుశ్రద్ధతో యీ పనులు చేయించవలసినదిగా కోరుచున్నాను.

"ఇదికాక, నాన్ - గ్యారంటీ (non - guarantee) భూములు కొద్దికాలపరిమితిమీద ఆయకట్టు (Ayacut) క్రింద చేర్చి, తూములు పెద్దవిగా చేయవలెను. వెంటనే వాటిని గ్యారంటీ భూములుగా మార్చుటకు గవర్నమెంటువారు ఏర్పాటుచేయవలెను. అలా మార్చుటవల్ల, గ్యారంటీ భూములకు ఎట్టి నీటి యిబ్బందులు వుండవు. నాన్ - గ్యారంటీ భూములు సకాలములో సాగుచేయుటకు వీలుండును. అదీకాక, రైతులు పి.డబ్ల్యు.డి. (P. W. D) వాళ్లకు లంచములు యిచ్చు బాధను గవర్నమెంటువారు తప్పించినవారవుచున్నారు.

"కాన, గవర్నమెంటువారు ఆ విధముగా చేసినటులైతే, భూము లను సారవంతము చేయుటకుకూడ అవకాశము ఏర్పడుకుంది."

(M L. A. Debates Official Report Vol II No 10 P. 609, 610)

స్త్రీలవిద్యాభివృద్ధి - నిర్బంధ విద్యావిధానము

"అధ్యక్షా! మన దేశంలో విద్య చాలా వెనుకబడియున్నది. దానికి విదేశపరిపాలనే కారణం. అదేవిధంగా మన రాష్ట్రంలోనూ, లోగడ

ఉన్నటువంటి ప్రభుత్వమేకారణం. కాబట్టి విద్యకు ప్రోత్సాహంలేదు. ఈ సంవత్సరం ప్రజా ప్రాతినిధ్యంవహించి ప్రభుత్వం మన రాష్ట్రంలో అధికారానికి వచ్చినతరువాత విద్యాశాఖామంత్రిగారు విద్యాసంస్థలలో నలభై వేలమంది విద్యార్థులకు అధికంగా విద్య నభ్యసించే అవకాశం కలుగజేశారు. అందుకు ముఖ్యంగా వారి నభినందించవలసియున్నది. కాని ఇది ఏమాత్రంచాలదు. ప్రతిగ్రామంలోనూ స్కూళ్ళువుండేటట్లు చేయాలి. అదిగాక కంపల్సరీ విద్యావిధానం మనరాష్ట్రంలో అమలుజరపాలి. ప్రజలు ఆర్థికంగా వెనుకబడియుండుటవల్ల అనేక ఇబ్బందులుంటూయున్నవి. గ్రామాలలో ఇప్పటికే ఉన్నస్కూళ్ళకు తమ పిల్లలను తల్లి దండ్రులు ఎక్కువగా పంపి చదివించలేకున్నారు. అందువల్ల కంపల్సరీ విద్యా విధానం ప్రవేశపెట్టినయెడల, మన రాష్ట్రంలో ఇప్పుడు నడిచేస్కూళ్ళ "తగినంత విద్యార్థుల సంఖ్యలేదు" అనే నెపంవల్ల ఎత్తివేయవలసిన బాధ తప్పిపోతుంది. బిడ్డలనందరిని విద్యావంతులుగా చేయుటకు అవకాశం ఉంటుంది. వయోజన విద్యావిధానం ప్రభుత్వం ప్రోత్సహించాలి. ముఖ్యంగా ప్రతిజిల్లాలోనూ స్త్రీలకు ప్రత్యేకంగా ఒక, కళాశాల స్థాపించి స్త్రీలలోనున్న నిరక్షరాసత్యను రూపుమాపి విజ్ఞానవంతులజేసి, పూర్వపు భారతదేశ ఔన్నత్యమునూ, భారతస్త్రీల ప్రతిభనూ నెలకొల్పవలసిదినదిగా కోరుచూ, ప్రభుత్వంవారి బడ్జటు గ్రాంటును బలపరుస్తూ సెలవు పుచ్చు కుంటున్నాను."

(M. L. A. Debates Official Report Vol II No. 16 Page 1101)

కృష్ణా జిల్లాలో కమ్యూనిష్టుల దౌర్జన్యాలు, ఆర్డినెన్సులు.

"అధ్యక్షా! గవర్నమెంటువారు పెట్టిన ఈ ఆర్డినెన్సు (Ordiance) ను Support చేస్తూ, మన రాష్ట్రంలో అల్లరులు చాలా ఎక్కువగా

ఉండటంవల్ల ప్రజలకు శాంతి, రక్షణల నివ్వడంకోసం ప్రభుత్వంవారు ఆర్డినెన్సును పెట్టియున్నారని మనవి చేస్తున్నాను. అన్ని జిల్లాలలోను అనేకమైనటువంటి దౌర్జన్యాలు జరుగుచున్నట్లు గౌరవనీయులగు సభ్యులందరకు తెలిసినటువంటి విషయమే మా కృష్ణాజిల్లాలో జనవరి 14 వ తారీఖున కమ్యూనిస్టులు (Communist) దివి తాలూకాలో వెలువోలు అను ఒక పల్లెటూరిలో చెడుగుడు పందెములు, ఎడ్ల పందెములు అనే పేరుతో ఒకపోటీనిపెట్టి ఆ ఆటలలో గెలుపొందినవారికి బహుమతులు ఇస్తాము అనేమిషతో, చుట్టుపట్ల గ్రామములలో ఉన్నటువంటి కమ్యూనిస్టు (Communist) లందరినీకూడా రప్పించి ఆ గ్రామములో ఈ చెడుగుడు పందెములను, ఎడ్ల పందెములను పెట్టారు. ఆ సాయంకాలం ఈ చెడుగుడు పందెములు, ఎడ్ల పందెములు అయిపోయిన తరువాత వాటిలో నెగ్గినవారికి బహుమతులు ఇచ్చారు. ఇలా ఇచ్చి అంతటితో వారు ఊరు కొనక తెల్లవారుజామున 3 గంటలప్పుడు గ్రామములోనివారందరూ గాఢ నిద్రపోతున్నప్పుడు "-దొంగలు, దొంగలు" అని ఈ (Communist) లందరూకలసి కేకలు పెట్టారు. గాఢనిద్రలో ఉన్నటువంటి గ్రామస్థులందరు ఖంగారుపడుచు, ఆ కేకలనుబట్టి నిజముగా దొంగలు వచ్చారని అనుకొని తలుపులు తీసికొని బయటకువచ్చారు. అల్లావచ్చిన వారినందరిని ఈ కమ్యూనిష్టు (Communist) లందరూకలసి చావగొట్టి ఇండ్లలో దూరి ఇండ్లలో భయపడుచున్నటువంటి స్త్రీలనుకూడా తమ యిష్టమువచ్చినట్లు దూషించి కొట్టారు. నేను ఆ గ్రామము వెళ్ళినప్పుడు అక్కడ వారునాకు ఒక మెమోరాండం (Memorandum) ఇచ్చారు.

ఆ గ్రామములోనే కాకుండా పక్కన ఉన్నటువంటికుమ్మర పాలెం అనే గ్రామానికికూడా ఈ (Communist) లందరు వెళ్ళి అక్కడ ఉన్నటువంటి కుమ్మరులను కూడా చావమోది వారితో ఈరోజునుంచి మీరు కుండలు చేసినట్లయితే మీ కుండలను బద్దలుకొడతామని భయ

పెట్టారు. వారి ఇండ్లలోదూరి ఇండ్లలో నిద్రపోతున్న స్త్రీలను కొట్టారు. ఈ కమ్యూనిష్టులు (Communits) ఈ విధంగా గ్రామాలలో నిద్ర పోతున్న సమయంలో పురుషులను స్త్రీలను బాధలు పెట్టారు. అక్కడి స్త్రీలు నాకు వారికి తగిలిన గాయాలుకూడా చూపించారు. ఇంతేకాక ఈ పందాలు అనే పేరుతోను, ఇట్టి దౌర్జన్యమగు చర్యలవల్లను, గ్రామాలలో గందరగోళములను జరిపించుచున్నారు. ఇలా ఏ పార్టీ అయినప్పటికి ఇటు వంటి దౌర్జన్యములుచేస్తే ఏ ప్రభుత్వంకూడా సహించవలసిన విషయం కాదు. అందుచేత ఈనాడు ఈ ఆర్డినెన్సు (Ordianance) మన మద్రాస్ ప్రభుత్వంవారు అమలుజరపడానికి బిల్లును ప్రవేశపెట్టదలచారు.

"ఇంతే కాకుండా, నేనీ పైగ్రామాలకు వెళ్ళినపుడు అక్కడఉన్న పురుషులు, స్త్రీలుకూడ, మొన్నటి ఎన్నికలలో పాల్గొని, కాంగ్రెస్‌తో (Congress) పోటీ చేసినటువంటి కమ్యూనిష్టులకు కాక మేమంతా కాంగ్రెస్ (Congress) వారిని బలపరచిన కారణంచేత మమ్మలను ఈ కమ్యూనిస్టు (Communist) చర్యలను మన కాంగ్రెస్ (Congress) ప్రభుత్వమువారు అరికట్టాలని చెప్పారు.

"కాబట్టి ఏపార్టీ వారుకూడా ఇటువంటి దౌర్జన్యాలను చెయ్యడం అనేది చాలా అన్యాయము. అందువల్ల మమ్మలను పరిపాలించుచున్నటు వంటి ప్రభుత్వం, అందులో ముఖ్యంగా కాంగ్రెస్ (Congiess) వారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు కమ్యూనిష్టులు ఇటువంటి దౌర్జన్యాలు జరుపు తున్నప్పుడు ఈ విధంగా స్త్రీలను బాధలు పెట్టుచున్నప్పుడు మీ గవర్న మెంటువారు కళ్ళారా చూస్తూవూరుకుంటారా? లేక ప్రజలను రక్షిస్తారా? అని అడిగారు.

"ఈ విధంగా స్త్రీలు, పురుషులు ఇల్లా కష్టాలుపడుతుంటే సహించ లేక, ఈ బీభత్సాలను చూడలేక, వినలేక, మన మద్రాస్ ప్రభుత్వంవారు

ఈ బిల్లును ప్రవేశపెట్ట నున్నారు, కాబట్టి దీనిని వెంటనే చట్టముగాచేసి, యిలాంటి దౌర్జన్యాలు అంతరించిననాడు ఈ చట్టమును తీసివేస్తారని నేను అనుకొంటున్నాను. అందుచేత వెంటనే ఈ ఆర్డినెన్సును చట్టముగాచేసి స్త్రీలకు, పురుషులకు, పల్లెటూళ్ళలో ఉన్నటువంటి ప్రజలందరికి కూడ రక్షణయివ్వడం ఈ ప్రభుత్వంవారి కర్తవ్యమని హెచ్చరిస్తూ యింతటితో విరమిస్తున్నాను."

(M. L. A. Debates Official Report Vol. III No. 5 P. 225, 226)

కళావంతుల మేళవముల బిల్లు

"అధ్యక్ష : Kalavanthula Nautches Prohibition Bill నేనిప్పుడు Move చెయ్యదలచుకోలేదు. దేవదాసీ బిల్లును రేపు గవర్న మెంటువారు పెట్టదలచినారు. కాబట్టి దానితో దీనినికూడచేర్చి ఒక బిల్లు తయారుచేస్తారు. కాబట్టి దీనిని ఇప్పుడు Move చెయ్యదలచుకోలేదు."

(M. L. A. Debates Official Report Vol. III No 10 Page 543)

హిందూ బహుభార్యాత్వ నిషేధ విడాకుల బిల్లు

అధ్యక్ష: శ్రీ కాశేశ్వరరావుగారు ప్రవేశ పెట్టదలచిన ఈ సంస్కరణమును నేను హృదయపూర్వకముగా బలపరచుచున్నాను. హిందూ స్త్రీలు చాలా పవిత్రమైనటువంటి వారనియు; హిందూమతము, హిందూ ధర్మము ప్రపంచమునకు ఆదర్శప్రాయములైనటువంటి వనియు మనవారు

చెప్పుచున్నారు. వీటిని ఎవరు కాదనరు. కాని ఒక విషయం నేను మనవి చేస్తాను. మన హిందూ ధర్మములో స్త్రీల స్వాతంత్ర్యము విషయములో కొన్ని లోపములుకలవు. హిందూ ధర్మములో పురుషులకు సర్వవిధముల సంపూర్ణమైన స్వేచ్ఛను కలిగివున్నారు. కాని స్త్రీలకు అట్టి స్వేచ్ఛగాని స్వాతంత్ర్యముగానిలేవు. మనవారు శ్రీ రామచంద్రమూర్తి యొక్కయు సీతాదేవియొక్కయు ఉదాహరణలు చెప్పుచున్నారు. పురుషులు ఆ శ్రీరామచంద్రమూర్తివలె ఏక పత్నీవ్రతులై ఉన్నచైతే, దేశములోని స్త్రీలందరూ సీతాదేవివలె పతివ్రతాశిరోమణులై ఉండెదరని చెప్పుచున్నాను. కాని ప్రస్తుతము పురుషులు ఆ శ్రీరామచంద్రమూర్తివలె ఏకపత్నీవ్రతులై ఉన్నారా? అనే విషయము ఆలోచింపవలసియున్నది. ఇట్టి ఏక పత్నీ వ్రతము పురుషులలోలేదని నా అభిప్రాయము. పురుషులకు ఈ విధంగా బహు భార్యలనుకలగి ఉండుటకు హక్కుఉన్న కారణంచేత చాలామంది స్త్రీలకు అన్యాయము జరుగుచున్నదని చెపుతున్నాను. దీనివల్ల కొందరు పురుషులలో అవినీతి పెరుగుచున్నది. అందువల్ల హిందూ ధర్మము అవినీతి పాలుగాకుండా చూచుటకుగాను ఇట్టి సంస్కరణలనుచేసి హిందూ ధర్మమును, పురుషులను, స్త్రీలను మిక్కిలి పవిత్రమై నటువంటి వారినిగా చేయవలెనని మనవి చేయుచున్నాను.

"హిందూ స్త్రీలకు విడాకులనిచ్చు (డైవర్సు) హక్కు నిచ్చుట వల్ల, హిందూ స్త్రీల పాతివ్రత్యమునకు భంగమనియు, హిందూధర్మము చెడిపోవుననియు, కొందరు వ్యతిరేకముగా మాట్లాడుచున్నారు. వారు స్త్రీలకు డైవర్సు చేయుటకు హక్కు ఇచ్చినచైతే, ఇట్టి విడాకులు చేసుకొనుట ప్రబలిపోవుననియు, హిందూ స్త్రీల గౌరము తగ్గుననియు కూడా చెప్పుచున్నారు. స్త్రీలకు ఈ డైవర్సుచేయు హక్కు ఇచ్చినంత మాత్రముచేతనే వారు వారికిష్టము లేనప్పుడు వారి భర్తలతో విడాకులు

చేసుకొంటారని నేను అనుకోను. హిందూ స్త్రీలు ఇట్టిపనులు చేయరని గట్టిగా చెప్పుచున్నాను.

ఈ విడాకుల హక్కు, ప్రత్యేకముగా కొన్ని కొన్ని వివాహముల వల్ల స్త్రీలకు భరింపరాని అన్యాయము అపకారము జరిగినపుడే వారికి ఉపయోగపడునని, అందుకొరకే ఈ సంస్కరణ ఉద్దేశింపబడినదని నా అభిప్రాయము. ఒక్కొక్కప్పుడు తల్లి దండ్రుల తెలివితక్కువవల్లనో, స్నేహితుల సలహాలవల్లనో కొన్ని కొన్నిచోట్ల ఆడపిల్లలకుగాని మగ పిల్లలకుగాని వివాహములు జరుగుతూఉంటాయి. వారిలో తెలివితక్కువో, లేక దీర్ఘ వ్యాధిగ్రస్తమో వచ్చుటచేత వారికి, వారి భర్తలకు సరిపడదు. అటువంటప్పుడు ఆ స్త్రీలు ఏమిచేయవలయును? ఆ జన్మాంతము వుభయులు బంధింపబడి వుండవలసినదేనా ? అని అడుగుచున్నాను. ఒక్కొక్కప్పుడు పురుషులుగాని, స్త్రీలుగాని, పనికిరానివారై ఉంటారు. అటువంటి పరిస్థితులలో స్త్రీలు వారి జీవితాంతమువరకు ఇట్టి పనికిరాని బ్రతుకే బ్రతుకవలయునా? కొన్ని విషయములలో పురుషులు చెప్పరాని జబ్బులతో బాధపడుచూ ఉంటారు. స్త్రీలు అటువంటి భర్తలతో యావత్ జీవితము గడుపవలసినదేనా? అందువల్లనే స్త్రీలకు ఇటువంటి డైవర్సు హక్కు ఉన్నట్లయితే వారికి ఇటువంటి అన్యాయములు జరుగవని నా అభిప్రాయము. అందువల్ల ఇటువంటి సంస్కరణ చాలా అవసరమైనటువంటిదని, ముఖ్యముగా హిందూ స్త్రీల హక్కులను, గౌరవమును కాపాడేటటువంటిదని చెప్పుతూ నేను శెలవు తీసుకుంటున్నాను."

(M. L. A. Debates Official Report Vol. V. No. 12 P. 947, 948)

కోయ ప్రజలను గురించి

ప్రశ్న :- "పోలీసు కాల్పులవల్ల చనిపోయినటువంటి కోయవారి భార్యలకు కలిగినటువంటి నష్టమును గుర్తించి, వారికి ప్రభుత్వమువారు సహాయము ఏమైనా చేస్తారా?

జవాబు :- The Hon. Dr. P. SUBBARAYAN :- I am glad the Hon. Lady Member is interested in women; if it is found that there is any need of help, it is a matter which will have to be considered by the Government as a whole."

(M. L. A. Debates Official Report Vol. VIII No. 4 Page 266)

కృష్ణపై వంతెనను గురించి

ప్రశ్న:- "కృష్ణా నదిమీద వంతెన కట్టుటవలన కృష్ణా, గుంటూరు జిల్లాలవారికే కాక రాష్ట్రంలోని ప్రజలందరికికూడా సౌకర్యము కలుగునని ప్రభుత్వమువారికి తెలియునా?"

జవాబు:- The Hon. Sri M. BHAKTAVATSALAM :. Yes, We are aware of that."

(M. L. A. Debates Official Report Vol. VIII No. 5 Page 343)

జమీందారుల రద్దు బిల్లు - పూర్వాపరాలు

"అధ్యక్షా! ప్రభుత్వంవారు ప్రవేశపెట్టిన జమీందారీ, ఈనాందారీల రద్దు బిల్లును నేను పూర్తిగా (**Support**) చేస్తూ కొన్ని సవరణలను సూచించ దలచినాను.

"కాంగ్రెస్‌వారి ఎన్నిక ప్రణాళికలో ఈ జమీందారీలను రద్దు చేయుట అనునది ఒక ముఖ్యమైన అంశము. దానిని ఆధారము చేసుకొనే 1937 సంవత్సరములో కాంగ్రెస్‌వారు ప్రభుత్వంలో వున్నపుడు ఒక కమిటీని నియమించి ఒక రిపోర్టును తయారుచేయించినారు. అప్పటినుంచి ప్రజలలోను రయితులలోను ఎప్పుడు జమీందారీలు రద్దగునా ? అనే ఆతురతఉన్నది. 1937 వ సంవత్సరములో శ్రీ ప్రకాశంపంతులుగారు రెవిన్యూ మంత్రిగా ఉన్నప్పుడు ఈ **(Report)** తయారు చేసినారు. కాని అప్పుడు కొన్ని కారణాలవలన జమీందారీ రద్దు చట్టము **(Pass)** చేయ కుండగనే **(Congress ministry)** వారు **(Resign)** చేసినారు. ఈ కారణంచేతనే ఇంతవరకు జమీందారీలు రద్దు చేయబడలేదు. ఈసారి 1946 వ సంవత్సరములో ఎన్నికలు జరుగునపుడుకూడా (Congress) ఎన్నిక ప్రణాళికలో జమీందారీలను రద్దు చేయదలచినట్లు ఉన్నది. ఈ కారణంచేతనే రైతు క్షేమం కోరేటటువంటిది కాంగ్రెస్ సంస్థఒక్కటేననే ఉద్దేశ్యంతో ప్రజలందరూ ఎన్నికలలో కాంగ్రెస్‌ను గెలిపించినారు. శ్రీ ప్రకాశం పంతులుగారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఎస్టేటు కౌలు భూములలోని రయితులను జమీందారులను జమీందారులు 2 సంవత్సర ములవరకు తొలగించకూడదని ఒక చట్టము ప్యాసుచేసినారు. అది ప్యాసు చేసిన తరువాత చాలామండి జమీందారీ రయితులు ప్రకాశంపంతులుగారి వద్దకువచ్చి తమ హక్కులనుగురించి అడిగినారు. వారికి శ్రీ ప్రకాశం పంతులుగారు "మీకు ఈ చట్టమువల్ల చాలా ఉపయోగము జరుగుతుంది

మిమ్మల్ను జమీందారులు కౌలు భూములలోనుంచి 2 సంవత్సరముల వరకు తొలగించలేరు. అని చెప్పిఉన్నారు. ఈ విధంగా వారిని నా (**Constituency**) లోని చల్లపల్లి ఎస్టేటులోని రయితులు కొందరు అడిగినారు. శ్రీ ప్రకాశంపంతులుగారు వారికి నేను ప్రధానమంత్రిగా ఉన్నంతకాలం మిమ్మ్మలను భూములలోనుంచి ఎవ్వరూ తప్పించలేరు అని చెప్పినారు. ప్రకాశం పంతులుగారివద్దనుంచి ఇటువంటి సమాధానమును తీసుకొని వారు వారి గ్రామములకు వెళ్ళిపోయారు. అక్కడ జమీందారులు వారిని కౌలు భూములనుంచి తొలగించుటకు చాలా ప్రయత్నములు చేసినారు. వారి పలుకుబడిని ఉపయోగించి పోలీసు సహాయము, రక్షణ సంపాదించినారు. ఈ కారణములవలన మా జిల్లాలోని ఒక గ్రామమైన గాజులలంకలో రైతులపై పోలీసు కాల్పులు జరిగినాయి. అమాయకులైన 4 గురు రైతులు మరణించారుకూడాను. ఈ విషయాలన్ని మనకు తెలిసి నటువంటివే. ఈ విధంగా 1937 వ సంవత్సరం నుంచి జమీందారులు రైతులను అనేకమైన బాధలు పెట్టుచున్నారు. ఈ సంగతుల నన్నింటిని గురించి మన రివిన్యూమంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు జమీందారీ, ఈనాందారీలను రద్దు చేయుటకుగాను ఈ బిల్లును ఈ శాసనసభలో ప్రవేశ పెట్టినారు. వారి ఆశయములను అనేకవేల రైతులు, ప్రజలు బహిరంగ సభలద్వారాను, పత్రికలద్వారాను ప్రశంసించియున్నారు. ఈ మద్రాసు పట్టణములో గోఖలేహాలులో ఒక మహాసభ జరిగింది. దానికి నేను అధ్యక్షురాలుగను శ్రీ కళా వెంకట్రావుగారు ప్రారంభకులుగాను ఉన్నాము. ఆ సభ కమ్యూనిష్టుల ఆధ్వర్యాన జరిగిందని, మేము కమ్యూనిష్టులుగా మారిపోయినామని శ్రీ ప్రకాశం పంతులుగారు వారి ఈ 3 రోజుల ప్రసంగంలో అనేకసార్లు చెప్పియున్నారు. కాని అది ఎంతమాత్రము సత్యమైనటువంటి విషయముకాదు. కాంగ్రెస్ ఎన్నిక ప్రణాళికలో సూచించిన విధంగా జమీందారీలను రద్దు చేయుటను నేను బలపరచినాను

కాని పేరుకాదు. బాధ్యతగల ప్రకాశం పంతులుగారివంటివారు ఈ విధంగా నేను కమ్యూనిష్టుగా మారిపోయినానని అనుట చాలా పొరపాటు.

"శ్రీ ప్రకాశంపంతులుగారు ప్రధానమంత్రిగా ఉంటున్నప్పుడు ఏదోపనిమీద నేను వారిని కలుసుకొనుటకు వారి ఇంటికి వెళ్ళినాను. అప్పుడు అక్కడ కొంతమంది రైతులనుచూచినాను. వారిని ఎందుకు వచ్చినారని అడిగినాను. వారు ధాన్యంధరలను హెచ్చించవలసినదిగా ప్రకాశం పంతులుగారిని కోరటానికి (Deputation) వచ్చినామని, పని ఉన్నదనే కారణంచేత ప్రకాశం పంతులుగారు వారికి (Interview) ఇవ్వ లేదని, రెండు రోజులవరకు (Interview) ఇచ్చుటకు వీలులేదని అన్నా రని చెప్పినారు. తరువాత ఆ రైతులు ప్రకాశం పంతులుగారిని కలుసు కొని ధాన్యం ధరలు హెచ్చించవలసినదిగా ప్రార్థించినను, వారు ధాన్యం ధరలను హెచ్చించుటకు ఏ విధమైన అవకాశములేదని చెప్పినారు. వారు ప్రీమియర్‌గా ఉన్నప్పుడు ధాన్యం ధరలను పెంచటానికి వీలుకాదని, ప్రీమియరు పదవినుంచిమారి మామూలు మెంబరుగా ఉన్నప్పుడు బస్తాకు రూ 6 ల బోనస్ ఇవ్వవలెనని చెప్పడంలో బాధ్యత, అర్థం ఏమో నాకు తెలియుటలేదు. ఇటువంటి ప్రకటనలు చేసేటటువంటి ప్రకాశం పంతులు గారి మాటలలోని విలువను ప్రజలు గ్రహింపలేకపోలేరు. వారు ఈ విధ మైనటువంటి ప్రకటనలను చేయడము, నేను జమీందారీ రద్దును బలపరచి నందుకు కమ్యూనిస్టుగా మారిపోయినానని అనడము చాలా పొరపాటు. రాజకీయ అభిప్రాయములలోను, సిద్ధాంతములలోను భేదములుండవచ్చును గాని, ఈ విధముగా అనవసరముగా నిందలు మోపడం చాలా పొరబాటు అని నేను భావిస్తున్నాను.

"ఇప్పుడు మనము చర్చిస్తున్న జమీందారి రద్దుబిల్లు విషయంలో కొన్ని సవరణలను సూచిస్తాను.

"3 వ సెక్షన్ (B) క్లాజులో ఎస్టేటుఅంటే కమ్యూనల్‌లాండు, లేక పోరంబోకులు, బంజర్లు, అడవులు, రైతీభూములు కాక యితర భూములు అని ఉన్నది. ఈ క్లాజులో లంకభూములు అని చేర్చవలెను.

"మా కృష్ణా, గోదావరి లంకలలో అనేకవేల ఎకరముల భూమి జమీన్‌దార్లకు ఉన్నది. ఈ భూమి (Survey) చేయబడలేదు. ఇటువంటి భూములను రైతులు అనేక సంవత్సరములనుంచి సాగుచేస్తున్నారు. కాని ఈ రైతులకు కవుళ్ళు ఉండవు. ఉదాహరణంగా మా చల్లపల్లి ఎస్టేటు లోని లంకలను గురించి మనవిచేస్తాను. మా ఎస్టేటులోని లంక భూములను సాగుచేసేటటువంటి రైతులకు కవుళ్ళులేవు. ఆ భూములను వారు సాగు చేస్తున్నట్లు చూపటానికి ఏ విధమైన రికార్డులులేవు. జమీందారులు ఈ భూములకు ఎటువంటి రిక్కార్డులు రైతులవద్ద ఉంచరు. 1937 వ సంవత్సరము నుంచి జమిందారులు ఇటువంటి భూములను సాగుచేసేటటువంటి రైతులకు కవుళ్ళ రసీదులు ఇవ్వటంలేదు. కాబట్టి ఈ విషయములను పరిశీలించి యీ క్లాజులో లంక భూములనుకూడ చేర్చవలసినదిగా రివిన్యూ మంత్రిగారిని కోరుచున్నాను.

"5 వ సెక్షను (1) క్లాజులో జమీందారులయొక్క స్వంత భూము లను పరిశీలించడానికి ఒక కమిటీని వేస్తారనిఉన్నది. యీ కమిటీలో ఒక (Deputy Collector) ను జమీందారుల తరపున ఒక మెంబరును రైతుల తరపున ఒక మెంబరును వేస్తారనిఉన్నది. దీనివలన రైతులకు ఏ విధంగాను ఉపకారము జరగదు. రైతులకు రికార్డు పూర్వకంగా ఏ విధమైన ఆధారాలు ఉండవు. అందువలన రైతుల తరపున నియమింపబడిన మెంబరు వారికి ఏ విధమైన సహాయము చేయలేడు. ఇంక డెప్యూటి కలెక్టరు, జమిందారు తరపు మెంబరు జమిందారుకే ఉపకారము చేస్తారని ప్రజలలో భయముఉన్నది. జమిందారువద్దఉన్న రికార్డులన్నీ జమిందారుకు

ఉపయోగించునవిగానే ఉంటాయి. కాని రైతులకు ఉపయోగించునవిగా వుండవు. కాబట్టి జమిందారుయొక్క స్వంతభూములు ఏవో నిర్ణయించే విషయములో **(final authority)** ఈ కమిటీ వారికి ఇచ్చినట్లైతే రైతులకు చాలాఅన్యాయము జరుగుతుంది. అందువలన ఈ **(final authority)** ని గవర్నమెంటువారి చేతులలోనే వుంచుకొనినట్లయితే చాలా మంచిదని నా అభిప్రాయము.

"అంతేకాక ఈ ప్రయివేటుభూమి అన్నదానికి 1908 వ సంవత్సరపు ఎస్టేటు ల్యాండు ఆక్టు **(Estate Land Act)** లో ప్రయివేటు లాండు నిర్ణయింపబడవలెను. అంతేకాని 1908 వ సంవత్సరపు ఎస్టేటు ల్యాండు ఆక్టు 11 వ అధ్యాయము ప్రకారముకాని లేక ఆ చట్టంలోని 182, 183 శెక్షనుల ప్రకారం రికార్డు ఆఫ్ రైట్సు **(Record of Rights)** లో వుదహరింపబడినవి కూడ ప్రయివేటు ల్యాండు అవుతుందని వుదహరింపబడిన షరతు తీసివేయవలెను. ఈ షరతు తీసివేయనిచో కవుళ్ళు, రికార్డులు లేక లంక భూములను సాగు చేసేటటువంటి రైతులకు చాలా అన్యాయము జరుగుతుంది. అందువలన ఆ క్లాజును మార్పు చేయవలసినదని మన రెవిన్యూ మంత్రిగారిని నేను కోరుచున్నాను.

"6 వ సెక్షనులో కాంపెన్‌సేషన్ **(Compensation)** ను గురించి 13 వ సెక్షను 1 వ క్లాజులో అవిభాజ్య ఎస్టేట్లుగా వుండుటకుగాను లోగడ 1904 చటం ఈ ఆకురాగానే రదయి పోతుందని అందువల ఈ జమీందారులకు గవర్నమెంటువారు యిచ్చు ప్రతిఫలము జాయింటు కుటుంబములకే చెందుతుంది అని వున్నది. ఇది న్యాయంగానేవున్నది. కాని కొంతమంది కుటుంబములోని పెద్ద కుమారునికే ప్రతిఫలము చెందునట్లుగా సవరించవలెనని సలహాలు ఇచ్చుచున్నట్లు తెలుస్తున్నది. ఇది చాలా అన్యాయము. కాంగ్రెసు సిద్ధాంతములకు వ్యతిరేకముకూడాను. ఒకే తల్లి

గర్భములో పుట్టిన ఒకనిని భాగ్యవంతుని చేయడము, ఇంకొకనిని దరిద్రునిగాను చేయడం న్యాయం ధర్మం కాదు. కాబట్టి జమిందారీలకు ఇచ్చే **(Compensation)** ను కుటుంబములోని అందరకు సమానముగా చెందేట్లు చేయడము చాలా మంచిది. **(Select Committee)** వారు నేను చెప్పిన ఈ సవరణలన్నింటిని గమనించి, బిల్లులోని క్లాజులను రైతులకు వుపయోగపడునటువంటివాటిగా వుండునట్లు చూడవలసినదని మంత్రిగారికి మనవి చేస్తూ ఇంతటితో విరమించుచున్నాను."

(M. L. A. Debates Official Report Vol. IX No. I P. 45, 46, 47)

1948-49 బడ్జెటులో వివిధ సమస్యలపై సూచనలు

"అధ్యక్షా! ఆర్థిక మంత్రిగారు ఆయవ్యయ పట్టికలను తయారుచేసి మన శాసనసభ **(House)** కు సమర్పించినందుకు వారికి నా హృదయ పూర్వక వందనములు. అదేకాకుండా వారు ఆయవ్యయ పట్టికను ఎంత జాగ్రత్తగా తయారుచేశారో వారి ప్రసంగం **(Speech)** కూడా అంత త్వరగా ముగించి కాలాన్ని ఎంతో సద్వినియోగము చేశారు."

"అదేకాకుండా ముఖ్య విషయం, కాంగ్రెస్ యొక్క ముఖ్య సిద్ధాంతాలలో ఒకటి అయినటువంటి మద్యపాన నిషేధాన్ని ఈ సంవత్సరంతో పూర్తిచేస్తూ దానినికూడాకలిపి బడ్జెట్టును వారు మనకు సమర్పించే టటువంటి అవకాశము వారికి కలిగినందుకు వారు చాలా ధన్యులని నేను అనుకొంటున్నాను. ఎందువల్లనంటే గాంధిమహాత్ముని ముఖ్యసిద్ధాంతాలలో ఒకటైనటువంటి మద్యపాన నిషేధముయొక్క చివరి ఘట్టమును అమలు

జరుప నిశ్చయించి యీ మూడు సంవత్సరాలలో ఆ కార్యక్రమాన్ని మన రాష్ట్రిమంతలో జయప్రదముగా కొనసాగే అవకాశాన్ని వారు బడ్జెటులో కలుగచేశారు.

"ఇప్పుడు దేశంలోని రైతాంగంలో చాలా అసంతృప్తి ఏర్పడి ఉన్నది. దీనికి ముఖ్యకారణం ఏమిటంటే 1947 వ సంవత్సరం ఆగస్టు 15 వ తేదీ తరువాతకూడా వారికి కడుపుకు తిండీ, ఒంటికి బట్ట దొరకడం చాలా కష్టంగావున్నది. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వం వారికి తగిన సహాయం చేయలేకపోతోంది. అందువల్ల ప్రజలు ఇది ప్రజాప్రభుత్వమా అని అడుగుతున్నారు.

"ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్‌వారి చేతులలో నున్నప్పటికి ప్రభుత్వం చేసేపనులు ఇదివరకువలెనే చాలా ఆలస్యం (Slow) గానే జరుగుతున్నాయి. పనులు చురుకుగా సాగటంలేదు. ప్రజలకు ఉపయోగం జరుగటంలేదు.

"ఈ సందర్భంలో మా కృష్ణా జిల్లాలో ఇప్పుడు అక్కడ అనుసరింపబడుతున్న **Re - modelling system** వలన రైతాంగానికి కలుగుతున్న కష్టనష్టాలనుగురించి మనవిచేస్తాను. ఈ **Re-modelling system** వలన రైతులకు వ్యవసాయ నిమిత్తం సకాలంలో నీరు ఇవ్వడంలేదు. అదునుదాటిన తరువాత నీరు ఇచ్చినా లాభంలేదు. పంటలు సరిగాపండవు. సకాలంలో భూములు సాగుచేసుకోటానికి రైతులు చాలా బాధలు పడవలసివస్తోంది. వేరు గత్యంతరంలేక కాలవలకు వీరు గండ్లుకొట్టవలసివస్తోంది. ఈ విధంగా చేయడంవలన వారు **Public Works Department** వారియొక్క ఇతర అధికారులయొక్క జులుముకు గురికావలసివస్తోంది. అందువలన ఈ **Re-modelling system** ను సాధ్యమైనంత త్వరలో మార్చివేయవలసినదని ప్రభుత్వమువారిని కోరుచున్నాను.

"అదేకాకుండా జరిగినటువంటి సంవత్సరం అతివృష్టివల్ల బుడమేరు పొంగి మా కృష్ణాజిల్లాలో పంటచేలు మునిగిపోయి రయితులకు కలిగినటువంటి అపారనష్టాన్ని గురించి మనవి చేస్తాను. సకాలంలో Re-modelling system వల్ల నీరు లభించక అనేక కష్టనష్టాలకోర్చి రైతులు వ్యవసాయంచేస్తే తీరా పంట చేతికివస్తుందనే Time లో అతివృష్టివల్ల బుడమేరు పొంగి పంట పాడైపోయింది. దీనివల్ల రైతులకు కలిగిననష్టం అపారం. మన రెవిన్యూ మంత్రిగారు మా జిల్లాలో పర్యటన చేసినప్పుడు రైతులకు కలిగిన నష్టాన్ని స్వయంగా చూచారు. ఇటువంటి నష్టాలవల్ల రైతులకే కాకుండా ప్రభుత్వానికికూడా నష్టం సంభవిస్తోంది. పంటలు పండక, పండినపంటలు పాడైపోయి రైతు బాధపడుతున్నాడు. ఇటువంటి రైతులకు శిస్తు రెమిషన్ ఇవ్వడంవల్ల ప్రభుత్వం నష్టపడుతోంది".

"ఈ సంవత్సరం బడ్జెటులో 50 లక్షల రూపాయలు శిస్తు రెమిషన్ ఇచ్చినందువలన రైతుకు ఎక్కువ కలిసివచ్చేదేమిలేదు. ఎందువల్ల నంటే ఈరోజున బస్తా ధాన్యం 15 రూపాయలు అమ్ముతోంది. గవర్న్మెంటువారు ఇచ్చునటువంటి రెమిషన్ ఎకరానికి 10 రూపాయలు మాత్రమే ఉంటుంది. అందుచేత రైతు సాధారణంగా పంట ఎక్కువ పండవలెననే కోరుతుంటాడు కాని, శిస్తు రెమిషన్ కోరుకోడు."

"కాబట్టి ప్రభుత్వంవారు అతివృష్టివల్ల రైతులు నష్టపడకుండా మురుగునీరు పొలములలోనుంచి పోయే Scheme లను వెంటనే అమలు జరిపించవలసినదిగా కోరుచున్నాను. ఈ విషయంలో అవసరమైతే తగినంతమంది ఇంజనీర్లను సిబ్బందినిపేసి ఈ Drainage scheme లను వెంటనే అమలుజరిపించే ఏర్పాటు చేయవలసినదిగా నేను మన ఇర్రిగేషన్ మంత్రిగారికి సలహా ఇస్తున్నాను".

"అంతే కాకుండా ఈ బడ్జెటులో 60 లక్షల రూపాయలను బుడ మేరు Scheme కు గాను Provision చూపించినందుకు మన ఆర్థిక మంత్రిగారికి నా ధన్యవాదములు తెలియజేయుచున్నాను. ఎందువల్లనంటే ఈ బుడమేరు విషయమై ఎప్పటినుంచో అలాగేవున్నది. లోకల్ సంఘ ములవారు Scheme లు తయారుచేసినారు. కాని ఏమీ పని జరుగలేదు ఇర్రిగేషన్ విషయాలలో లోగడ Advisory Government ఏ పని చేశారో అదేవిధంగా ఈనాడుకూడా ఉన్నారని, ఆవిధంగా కాకుండ ఈ పనులన్నింటిని వెంటనే చేయించ వలసినదని నేను మిమ్మలను కోరు తున్నాను."

అవేకాక ఈనాడు ప్రజలలో ఒక విధమైన అసంతృప్తి ఏర్పడి వున్నదని గట్టిగా మనవి చేస్తున్నాను. అదేమిటంటే మన ప్రకాశం పంతులుగారు Premier గా ఉన్నప్పుడు మా సర్కారు జిల్లాలలో వుత్పత్తి కొనుగోలుదార్ల సంఘాలను ఏర్పాటుచేశారు. ఈ సంఘాలకు షేరుధనాన్ని వసూలుచేయటానికి వారు సంఘాలలో సభ్యులుగాచేరిన వారికి కంట్రోలు ధరలకు Supply చేస్తామని వారి అధికారులద్వారా ప్రచారముచేయించి ప్రజలవద్దనుంచి Share ధనాన్ని వసూలు చేయించారు. ప్రజలు ఆనాడు ఈ కంట్రోలు వస్తువులు తమకు Black - market లో కొనుక్కో నవసరం లేకుండా సులభంగా తమకు లభ్యమవుతాయనే అభిప్రాయముతో అప్పులు చేసికూడా Share ధనము ఇచ్చారు. ఆనాడు కంట్రోలులు ఉన్నాయి కాని ఈనాడు కంట్రోలులులేవు. అందువలన ఈ సంఘాలకు ఎక్కువ పనిలేదు. అందుచేత Share ధనము ఇచ్చినవారికి వారి డబ్బు తిరిగి ఇచ్చివేయడం మంచిది. కాని ఆ విధంగా ప్రభుత్వమువారు చేయ లేదు. ఈ బీదరైతుల డబ్బును బ్యాంకులలోను, డైరెక్టర్ల చేతులలోను, సెక్రటరీ చేతులలోను పెట్టుట సబబుకాదు. యీ విధంగా పేదరైతుల

డబ్బు అన్యాక్రాంతమవుతుంటే ప్రభుత్వమువారు సహించడం మంచిది కాదు. ఇందువల్ల ప్రజలలో అసంతృప్తి ఏర్పడివుంది.

"అదేకాక యీ సంవత్సరం జనప విత్తనాలు కొనుక్కోటానికై రైతులు పడినబాధలు చెప్పతరంకాదు. దీనివలన రైతులలో చాలా అసంతృప్తి ఏర్పడినది. జనప విత్తనాల ధరలు కంట్రోలు తీసివేయవలసినదిగా ప్రజలు అనేకమంది మెమోరాండములు పంపుకొన్నారు. మెంబరులు Representations కూడా చేశారు. కాని ప్రభుత్వమువారు ధరలు కంట్రోలు తీసివేయలేదు. దానివల్ల రైతులు జనపవిత్తనాలు బస్తా రూ 200 లకు బ్లాక్‌మార్కెటులో కొనుక్కోవలసి వచ్చింది. ఇంత హెచ్చుధరలుపెట్టి జనపవిత్తనాలు కొనుక్కోవడం చాలా కష్టం. ఏదో విధంగా కష్టపడి రైతులు జనపవిత్తనాలు చల్లారు. కాని అకాల వర్షాలవల్ల బుడమేరు పొంగి మురుగు వచ్చుటవల్ల మా జిల్లాలో జనప విత్తనాలు మురుగుకు తేలిపోయి కొట్టుకొనిపోయాయి. అందువలన రైతులు చాలా విచారపడ్డారు.

"కాబట్టి ఇటువంటి నష్టాలు ఇకముందు కలుగకుండాను ప్రజా సామాన్యానికి కూడు గుడ్డ దొరికేటట్లు ప్రభుత్వమువారు చూడాలి.

"అదేకాక ఆర్థిక మంత్రిగారు, ఇతర మంత్రులు సంప్రతించుకొని మన రాష్ట్రంలో ఏ ఏ Scheme లు అమలుజరుపాలో ఆలోచించి తదనుగుణంగా ఆయవ్యయ పట్టికలను తయారుచేసి ప్రజలకు సహాయ పడతారని ఆశిస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను."

(M. L. A. Debates Official Report Vol. X No. 5 P. 392, 394)

1948-49 సప్లిమెంటరీ బడ్జెటు-పై చర్చ-

ధాన్యసేకరణ

"అధ్యక్షా: Supplemental budget లోని Revenue demand ను నేను బలపరుస్తు కొన్ని సలహాలు చేయదలచినాను.

"యీనాడు అమలులో ఉన్న భూమి పన్ను విధానంలో చాలా లోటులున్నవి. వ్యాపారస్థుడు సంవత్సరమునకు రూ 2,000 లు ఆదాయము సంపాదించినను అతడు గవర్నమెంటువారికి పన్ను చెల్లించ నవసరములేదు. కాని వ్యవసాయ దారుడు ఒక పుట్టెడు ధాన్యం పండించినా ప్రభుత్వంవారికి పన్ను చెల్లించాలి. ఇటువంటి విధానము మనదేశము ఒకదానిలోనే ఉన్నట్లున్నది. దీనివలన వ్యవసాయ పరిశ్రమ రైతుకు ప్రోత్సాహకరముగాలేదు; దేశంలో కరువు, కాటకము ఏర్పడుటకు అవకాశము కలుగుతోంది. మన రెవిన్యూ మంత్రిగారు ఇప్పుడు మన రాష్ట్రంలో జమీందారీలను రద్దుచేసి రాష్ట్రమంతటిలో ఒక్క రైత్వారీ విధానాన్నే అమలు చేయదలచినారు. కాబట్టి, యీనాడు రైత్వారీపన్ను విధానంలో ఉన్నలోటులను సంస్కరించి, 5 ఎకరముల భూమికి లోపున ఉండేరైతు పన్ను చెల్లించనక్కరలేకుండగను, అంతకుపైన భూమిఉన్న రైతులు వారు ఆదాయమునుబట్టి పన్ను చెల్లించునట్లుగను చేసినట్లైతే చిన్న రైతులమీద పన్నుభారము తగ్గుతుంది; వారు వ్యవసాయమును జయప్రదముగా కొనసాగించుటకు అవకాశము కలుగుతుంది.

"యీ మధ్యన మా జిల్లాలో జరిగిన ఒక సంఘటన విషయమై మనవిచేస్తాను. నేను కొన్ని అవసరపనులవల్ల మా జిల్లాకు వెళ్ళినాను. అప్పుడు కలెక్టరుగారిని చూడడానికిగాను వారు వీరంకిలాకు బంగాళాలో

మకాము చేస్తున్నారంటే అక్కడకు వెళ్ళినాను. నేను వీరంకిల పు బంగాళా దగ్గరకు వెళ్ళేటప్పటికి కలెక్టరుగారు అక్కడలేరు. అక్కడి వారిని అడుగగా వారు కలెక్టరుగారు అక్కడకు 4 మైళ్ళ దూరములోడున్న కృష్ణాపురం అనే గ్రామానికి రైతులవద్దనుంచి ధాన్యము సేకరించటానికి (Procurement) కు వెళ్ళారని తెలియజేశారు. నేను కలెక్టరుగారిని కృష్ణా పురంలోనే కలుసుకొనే ఉద్దేశంతో అక్కడకు బయలుదేరినాను. కొంత దూరము వెళ్ళినతరువాతచూస్తే ఇదివరకు ఆ **Road** కు ఉండే వంతెనలు లేవు. ఆ త్రోవలోఉండే 6 వంతెనలను వ్యవసాయదారులు తెగ్గొట్టేశారు. మా కారు వెళ్ళటానికి అభ్యంతరం కలిగింది. సమీపములో ఉండే గ్రామం లోనివారిని వంతెనలను యీ విధంగా తెగగొట్టడానికి కారణమేమని అడు గగా వారు యీ రోజున జిల్లాకలెక్టరుగారు ప్రొక్యూర్‌మెంటు చేయటానికి కృష్ణాపురం వెళ్ళారని, వ్యవసాయదారులు సక్రమంగా వారికి ధాన్యం ఇవ్వ రనే అభిప్రాయంతో వారు 20 మంది **Reseive Police** ల తోను, లారీల తోను అక్కడకువస్తారని వ్యవసాయదారులకు తెలిసి వారిని అక్కడకు రాకుండా చేయాలనే ఉద్దేశంతో త్రోవలోవుండేవంతెనలనుతెగ గొట్టేశారని చెప్పారు. నేను అప్పుడు కృష్ణాపురంలో వారికి, వీరికి దెబ్బలాట జరుగు తుందనే అభిప్రాయంతో వెంటనే మా కారును అక్కడ వదలివేసి కృష్ణా పురానికి నడచివెళ్ళాను. నేను అక్కడకు వెళ్ళేటప్పటికే కలెక్టరుగారు ఒక పురి పట్టించారు. మరొక పురి పట్టించడానికి సిద్ధంగావున్నారు. వ్యవసాయ దారులు యీవిధంగా కలెక్టరుగారు బలవంతంగా ధాన్యం తీసుకొనిపోవడం ఏవిధంగానైనా నిరోధించాలని పట్టుదలతోవున్నట్లు కనిపించారు. వారువారి సహాయంకొరకు చుట్టుప్రక్కల వున్నటువంటి 5, 6 గ్రామాలలోని వారిని తీసుకొనివచ్చారు కూడాను. వారి సంరంభమంతాచూస్తే ఏదో పెద్ద ఎత్తున యుద్ధం చేయటానికి సన్నద్ధులవుతున్నట్లు కనిపించారు. నేను అప్పుడు ఆ వ్యవసాయదారులవద్దకు వెళ్ళి యీ విధంగా వారు పోరాటానికి దిగటాకిని

కారణమేమిటని అడిగాను. దానికి వారు సమాధానంగా, "యీ కలెక్టర్లు, తహసీలుదార్లు, ప్రొక్యూర్‌మెంటు ఆఫీసర్లు, మాదగ్గరకు ధాన్యసేకరణ (Procurment) కోసమై మాత్రమే వస్తారుకాని, మా బాధలేమిటో మా కష్టాలేమిటో వారికేమీ అవసరంలేదు. మాకు వ్యవసాయానికి కావలసిన బండి పట్టాలు, పారలు, పలుగులు మొదలైన పనిముట్లు ఏమీ దొరకటం లేదు. ఎన్నిసార్లు యీ ఆఫీసర్లను అడిగినా వారికి మా ఆలనా, పాలనా, ఉన్నట్లు కనిపించడంలేదు. ఇంతేకాకుండా నిరుడు అమ్మిన ధాన్యానికి ఇంతవరకు బోనస్ ఇవ్వలేదు. మాకు బోనస్ ఇప్పించవలసినదని వీరిని ఎన్నిసార్లు ప్రార్థించినా వారు ఏవిధమైన శ్రద్ధ చూపించరు. ఎన్నిసార్లు తాలూకా ఆఫీసులచుట్టు తిరిగినా ప్రయోజనంలేకుండా ఉన్నది. కాని మమ్మల్ని ధాన్యం ఇవ్వవలసినదని వీరు నిర్బంధిస్తున్నారని ఆ వ్యవసాయదారులు చెప్పారు. దానికి బదులుగా వారిని ఓర్పు వహించవలసినదని, వ్యవసాయ పనిముట్లు వ్యవసాయశాఖ (Agricultural departement) వారిని అడిగి తీసికొనవలసినదని, యీ విషయంలో కలెక్టరుగారిని అడిగిన లాభంలేదని, ఇప్పుడు మన రాష్ట్రంలో కరువు ఏర్పడివున్నదని, ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వమువారికి ధాన్యమును ఇవ్వక ఒత్తిడిచేయడం మంచిది కాదని వారితో చెప్పినాము. కలెక్టరుగారు ఆ వ్యవసాయదారులవద్ద నుంచి 6,000 బస్తాల ధాన్యము కావాలని అన్నారు. కాని రైతులు 1,500 బస్తాల కన్న హెచ్చు ఇవ్వలేమని చెప్పారు. కలెక్టరుగారు ఇందుకు ఒప్పుకోలేదు. రైతులు అంతధాన్యాన్ని ఇవ్వలేమని, ఇప్పుడు ధాన్యము అమ్మితే వారికి తరుగువల్ల నష్టం కలుగుతుందని చెప్పారు.

ఇంతేకాకుండా ఇప్పుడు ప్రభుత్వమువారు యీ మార్చి 1వ తేదినుంచి, ఏప్రిల్ 15వ తేదీ లోపున ప్రొక్యూర్‌మెంటు పూర్తిగా జరగాలని యీ విధంగా ప్రొక్యూర్ చేసినటువంటి ధాన్యానికి బస్తాకు రూ. 0-12-0 తగ్గించి ఇవ్వవలసినదని ఆర్డర్లు ఇచ్చారని వారు చెప్పారు. ఇది చాలా

అన్యాయము. ఎందువల్లనంటే మొదటి సంవత్సరంలో శ్రీ ప్రకాశం పంతులుగారు రైతులకు రూ 2 లు, రూ 4 లు బోనస్ ఇచ్చారు. యీ జరిగిన సంవత్సరంలో కూడా శ్రీ రామస్వామి రెడ్డియారు, నవంబరు, డిశంబరు నెలలో అమ్మినవాటికి కూడా బోనస్ ఇప్పించారు. యీ విధంగా రైతులకు బోనస్ ఇవ్వటానికి కారణం వారు రైతుల ధాన్యానికి సరి అయిన ధర రాలేదనే అభిప్రాయముతోనేనని మనవిచేస్తున్నాను. కాని ఇప్పుడు బస్తాకు రూ 0-12-0 తగ్గించదలచడము చాలా అన్యాయము. రైతులకు చాలానష్టం సంభవిస్తుంది. యీ కరువురోజులలో రైతుకు సరసమైన ధర ఇవ్వకపోతే అతడు వ్యవసాయం చేయలేడు. రైతుకు అవసరమైన వస్తువులు అతనికి న్యాయమయిన ధరలకు దొరుకునట్లు చేయకుండా, పైగా అతనిమీద జబర్దస్తీ చేస్తుంటే, రైతాంగంలో చాలా అసంతృప్తి ప్రబలిపోతుంది. యీనాడు రైతు, ప్రభుత్వము తనమీద దౌర్జన్య విధానాన్ని అవలంభిస్తోందని బాధపడుతున్నాడు. యీ విధంగా రైతులను అసంతృప్తి పరచడం మంచిదికాదు."

"అయినప్పటికి యీ నాడు రైతులు పడుతున్న బాధలనుగురించి మనవిచేస్తున్నాను. యీ విషయాలు మంత్రులందరు గమనించి రైతులకు ఉపకార చేయించవలసినదని నా కోరిక."

స్పీకరుగారు నాకు ఇంకో 2 నిముషాల వ్యవధి ఇస్తే నేను ముగిస్తాను.

యీ విధంగా కృష్ణాపురంలో రైతులకు, కలెక్టరుగారి సిబ్బందికి మధ్యన ఘర్షణ వస్తుందని భయపడి నేను రైతులవద్దకు వెళ్ళి వారు ఏవిధంగానైనా కలెక్టరుగారికి ధాన్యమునిచ్చి వారిని పంపించి వేయాలని చెప్పాను. ఆఖరుకు వారు 3,000 బస్తాలు ఇవ్వటానికి ఒప్పుకున్నారు. కలెక్టరుగారు ఆ ధాన్యాన్ని లారీలలోకి ఎక్కించుకొని బయలుదేర

బోతుంటే, ఆ గ్రామ రైతులకు సహాయముగా ఇతర గ్రామములనుంచి వచ్చినవారు లారీలను, పోలీసువారిని కర్రలతోను, రాళ్ళతోకు ఎదిరించారు. రిజర్వు పోలీసులను కలెక్టరుగారు తుపాకులను లోడ్ (load) చెయ్యవలసి నదిగా ఆర్డరు చేశారు. ఆ పరిస్థితులనుచూస్తే ఆ వేళ అక్కడ కొన్ని శవములు వెళ్ళిపోతాయని నేను చాలా బయపడ్డాను. రైతులలో చాలా అసంతృప్తి ఏర్పడినది. వారు సర్వవిధాలా ప్రభుత్వంవారి జబర్దస్తీను ప్రతిఘటింప నిశ్చయించారు. నేను వెంటనే వారి మధ్యకు వెళ్ళి ఇది మన ప్రజాప్రభుత్వము, దేశంలో యీనాడు కరువు పరిస్థితులు ఏర్పడిఉన్నాయి. మీరు యీవిధంగా ప్రభుత్వము వారిని ఎదిరించడం మంచిదికాదని వారికి నచ్చచెప్పి వారివద్దనున్న కర్రలను మాకు ఇచ్చివేయమని అడిగినాను. వారు అందుకు అంగీకరించి వారి వద్దనున్న కర్రల నన్నింటిని మాకు ఇచ్చివేసినారు. తరువాత మేము, కలెక్టరుగారు, వారి సిబ్బంది అంతాకలసి వుయ్యూరు బంగాళాకు వచ్చినాము.

ఈనాడు రాష్ట్రంలోని రైతాంగంలో ప్రభుత్వ నిర్బంధ ధాన్య సేకరణ విధానం వలన, ప్రభుత్వోద్యోగుల జబర్దస్తీవల్ల అసంతృప్తి ఏర్పడినది. ఈ విషయముల నన్నింటిని ప్రభుత్వమువారు గుర్తించి రైతులకు మేలు కలుగులాగున చేయవలసినదని వారిని కోరుచున్నాను.

"ఇప్పుడు మలబారు వర్తకులను సరాసరి ధాన్యమును రైతుల దగ్గరనుంచి తెచ్చుకోమనడము వల్ల ....."

(M L A Debates O R. Vol XI No. 10 P. 677, 678, 679.)

హిందూ బహుభార్యాత్వ నిషేధ విడాకులబిల్లుపై చర్చ

అధ్యక్షుడు: శ్రీ కాశేశ్వరరావు పంతులుగారు ప్రతిపాదించిన ఈ

బహు భార్యాత్వ నిషేధ బిల్లును, ఇందులో వారు ఏర్పాటుచేసిన విడాకులు చేసుకొను నియమములనుకూడా నేను బలపరుస్తున్నాను.

ఈ బిల్లు విషయములో నేను కొన్ని సలహాలను ఇవ్వదలచినాను. మన భారతదేశంలో ఇప్పుడు జరుగుచున్న వివాహములకును పూర్వము జరిగిన వివాహములకు ఎంతో తేడావున్నది. పూర్వము జరిగిన వివాహములు, స్త్రీ పురుషుల సాంప్రదాయములమీద, వారి శారీరక, మానసిక స్థితులమీద ఆధారపడి యుండెడివి. కాని ఇప్పుడు జరుగుచున్న వివాహములు సాంప్రదాయ సిద్ధాంతములమీదగాని, వధూవరుల మానసిక ప్రతిపత్తులమీదగాని గాక కేవలం ఆర్థిక దృష్టితోను మాత్రమే జరుపబడుచున్నవి. అందువల్ల స్త్రీలకు చాలా అన్యాయములు జరుగుచున్నవి.

ఈనాడు మనలో వివాహాలు, ఆడపిల్ల ఇష్టముమీదకన్న ఆమె తల్లి దండ్రుల ఇష్టముమీదనే ఎక్కువభాగము ఆధారపడి జరుగుచున్నవి. ఆ అమ్మాయిని వివాహమాడిన పురుషుడు సన్మార్గుడైతే మంచిదే కాని అతడు దుర్మార్గుడైతే ఆ స్త్రీ పడేబాధలు చెప్ప నలవికాకుండా వున్నాయి. ఆమె భర్త ఎటువంటి చెడునడతలకు లోనైనా, వేరుస్త్రీతో కాపురము చేస్తున్నా తనను నిరాకరించినా, ఆ భర్తనే నమ్ముకొని, అష్టకష్టములు పడుతూ, యావజ్జీవితము గడపవలసివస్తోంది. ఇటువంటి ఆచారమువలన అనేకమంది స్త్రీల జీవితములు దుర్భరమవుతున్నాయి. మగవాళ్ళు ధనాశచే మొదటిభార్య వున్నప్పటికికూడా తిరిగి వివాహము చేసుకొనుచున్నారు. అటువంటి పరిస్థితులలో మొదటిభార్య అనేక కష్టములపాలు గావలసి వస్తోంది. ఆమె ఆ పురుషునితో విడాకులిచ్చి వేరు వివాహము చేసికొనుటకు వీలులేకుండా వున్నది. అందువల్ల అనేకవిధములుగా భర్తచేత నిరాదరింపబడినా నిరాకరింపబడినా వేరు గత్యంతరము లేక ఆ భర్తవద్దనే జీవితము అతి కష్టముమీద వెళ్ళబుచ్చవలసి వస్తోంది. ఇటువంటి కష్టా

లను తొలగించడానికిగాను ఈ బిల్లును తీసుకొచ్చినందుకు ముఖ్యంగా శ్రీ కాశేశ్వరరావుగారిని నాతరపున ఈ రాష్ట్రంలోని స్త్రీల తరపున అభినందిస్తున్నాను.

ఈ బిల్లుపైన మాట్లాడుచు గౌరవ సభ్యులు కొంతమంది సీతారాములను, దశరథుని, ఉదాహరణములుగా తీసుకొని హిందూ సాంప్రదాయముల గురించిన, ఆచారముల గురించి చెప్పియున్నారు. మనము ఈనాడు కేవలం ఉదాహరణముమీదగాకుండా, ఈ నాడు మన సంఘంలో ఎటువంటి లోపాలు అన్యాయాలు జరుగుతున్నాయోచూచి వాటిని తొలగించుటకనియే మన ఆచారములలో మార్పులు చేసుకొనువిధి మనపైన వున్నది. పూర్వపు వివాహములకు ఈ నాటి వివాహములకు చాలా తేడా లున్నాయని, ఆ నాటి సాంప్రదాయ సిద్ధాంతములను ఈ నాడు పాటించుటలేదని, అందుచేతనే ఇట్టి సంస్కరణలు అవసరమని మనవిచేస్తున్నాను. ఒక్క విషయము గమనించండి. రాముడు ఏకపత్నీ వ్రతుడని చెప్పినారు. ఈ నాడు ఎంతమంది పురుషులు ఈ వ్రతమును ఆచరించుచున్నారని అడుగుతున్నాను. పురుషులలో అవినీతి ప్రబలుటచేతను, సాంప్రదాయములను వారు పాటించకుండుటచేతనే ఇట్టి సంస్కరణలు అవసరము. అందువల్లనే స్త్రీలు సీత, దమయంతి, సావిత్రి మొదలైనటువంటివారు గడిపినట్లు దాంపత్య జీవితములను గడుపజాలకున్నారు. ఈ నాడు మన ఆచారములు, సాంప్రదాయములు నామమాత్రముగనే వున్నవి. వివాహములు ముఖ్యంగా ఆర్థిక దృష్టితోనే జరుపబడుచున్నవి. అందువల్లనే శ్రీ కాశేశ్వరరావుగారివంటి సంఘ సంస్కర్తలు సంఘములో స్త్రీ, పురుషులు ఉభయులకు సమాన హక్కులను, అవకాశములను కలుగజేయుటకుగాను ఇట్టి సంస్కరణలను ప్రతిపాదించి యున్నారు. కాబట్టి ఈ నాడు సభ్యులు, సీతారాముల సాదృశ్యాన్ని, ఏకపత్నీవ్రత ఉదాహరణలమీదనేగాక ప్రస్తుత

సంఘములోని లోపములను గుర్తించి స్త్రీలోకానికి సహాయము చేయవలసి నదిగా కోరుచున్నాను.

ఈ బిల్లులో కొన్నిలోపములున్నట్లున్నాయి. వాటిని శ్రీ కాశేశ్వర రావుగారికి మనవిచేస్తాను.

ఈ బిల్లులో (Divorce) చేసుకొనే నిబంధనలలో, భార్యాభర్త లలో ఎవరైనను కుష్ఠురోగముతో బాధపడుచుండిన, ఆ రోగముతో 5 సంవత్సరములనుంచి వరుసగా బాధపడుచుండిననే భార్యా భర్తలు విడాకు లిచ్చుకొనవచ్చునని నిబంధన చేయబడినది. అయిదు సంవత్సరములకు లోపల విడాకు లిచ్చుకొనుటకు ఈ నిబంధన ప్రకారము హక్కులేదు. కుష్ఠురోగము అంటురోగమని అందరకు తెలిసినవిషయమే. ఏస్త్రీ యైనను 5 సంవత్సరములపాటు కుష్ఠురోగి అయిన భర్తతో కాపురం చేయటం కష్టము. ఇంత పెచ్చుకాలములో ఆ అంటురోగము ఆమెకుకూడా రావచ్చును. ఒకవేళ రాకపోయినను కుష్ఠురోగి అయిన భర్తతో 5 సంవత్సరముల కాలము కాపురముచేసి ఆ తరువాత విడాకులిచ్చిన స్త్రీని ఎవ్వరూ వివాహమాడరు. కాబట్టి ఈ 5 సంవత్సరములనే నిబంధనను సంవత్సరమునకు తగ్గించవలసినదిగా శ్రీ కాశేశ్వరరావుగారిని కోరు చున్నాను.

నపుంసకత్వపు నిబంధనలోకూడా కొంతపొరపాటు జరిగినట్లున్నది. స్త్రీకిగాని, పురుషునకుగాని ఈ నపుంసకత్వము కొంతకాలమునుంచి వరు సగా ఉండాలనిచెప్పారు. మనదేశంలో వివాహాలు జరిగేటప్పుడు మొదటలో స్త్రీ పురుషులు నపుంసకులా కారా అని పరీక్ష చేయించే ఆచారములేదు. అందుచేత ఈ నపుంసకత్వము మొదటినుంచి ఉన్నదా, లేక మధ్యలో వచ్చినదా, ఎంతకాలమునుంచి వున్నది అని తెలుసుకొనుట కష్టము. అంతేకాకుండా ఒకప్పుడు పుంసకులైనవారు మరొకప్పుడు నపుంసకులు కూడా కావచ్చునని డాక్టర్లు చెప్పుచున్నారు. కాబట్టి ఇటువంటి చిక్కులు

తేకుండా ఎప్పుడైతే నపుంసకత్వము కనిపిస్తుందో అప్పుడు (**Petition**) పెట్టుకొనవచ్చుననే సవరణ చేయవలెనని శ్రీ కాళేశ్వరరావుగారిని కోరుచున్నాను.

విడాకులు ఇవ్వబడిన స్త్రీకి భర్త ఇవ్వవలసిన డబ్బు వారి పిల్లలకు ఇవ్వవలసిన ఆస్తి విషయాలను గురించి కోర్టువారి తీర్పులనుబట్టి చేయవలెనని బిల్లులోవున్నది. దీనివల్ల చాలా అన్యాయములు జరుగవచ్చును. కొబట్టి పిల్లలకు తండ్రి ఆస్తిలో హక్కును కలిగించవలెను. ఈ విషయాన్ని గురించికూడా ఆలోచించవలసినదని శ్రీ కాళేశ్వరరావుగారిని కోరుచున్నాను.

"ఈ బిల్లును కొంతమంది పూర్వాచార పరాయణులు మన మత ధర్మములకు, ఆచార వ్యవహారములకు ఇది విరుద్ధముగా వున్నదని చెప్పుచున్నారు. వీరికి ఒక్క విషయము మనవిచేస్తాను. పూర్వము మన దేశములో సహగమనము—చనిపోయిన భర్తతో భార్యనుకూడా చితిలో కాల్చడము అనే ఆచారము వుండెడిది. ఇటువంటి దారుణమైన ఆచారాన్ని మనము ఇప్పుడు ఆచరించడము లేదు. రాజా రామమోహనరాయ్ వంటి సంఘ సంస్కర్తల ప్రయత్నములవల్లనే మనలో ఇటువంటి దురాచారము పోయినది. అదేవిధంగా మన సాంఘిక జీవనములో ఉండేటటువంటి ఈ లోపాలను మనము సంస్కరించాలి. ఏసంఘ సంస్కరణ చేయదలచినను పూర్వాచార పరాయణులు ఎప్పటికప్పుడు వారి వ్యతిరేక అభిప్రాయాన్ని తెలియజేస్తుంటారు. కాని సంఘముయొక్క అభివృద్ధినికోరి మనము వారి ఉద్దేశముల నుఅంగీకరించకూడదు.

ఈ బిల్లులో స్త్రీ పురుషులకు విడాకులు చేసుకొనుటకు హక్కు ఇచ్చుచున్నందువలన చాలా సంసారములు బాధపడునని చెప్పుచున్నారు. నా అభిప్రాయములో మన దేశంలో స్త్రీలు వారికి విడాకులు చేసుకొను

టకు హక్కు ఇచ్చినంతమాత్రాన విడాకులు చేసుకోరని ఇది మన హిందూ స్త్రీల నైజగుణమునకు విరుద్ధము అని ఎవరైతే అపరిమితంగా బాధలుపడుతున్నారో వారే విడాకులు చేసుకుంటారని ఈ శాసనము అటు వంటివారికే సహాయము చేయగలదని మనవి చేస్తున్నాను. కాబట్టి ఈ విషయముల నన్నింటిని గమనించి సభ్యులందరు పూర్వాచార పరాయణులు కూడ ఈ బిల్లును ఆమోదించి దీనిని వెంటనే చట్టముగా చేయుటకు తోడ్పడుతారని ఆశిస్తూ ఇంతటితో సెలవు తీసుకొంటున్నాను.

(M. L. A. Debates O R. Vol. XIII No. 8 P. 518, 519, 520)

పోలీసుల అత్యాచారములపై ప్రభుత్వానికి లేఖ - ప్రశ్నలు

డిప్టర్నుడు యేరియూగా ప్రచురింపబడిన కృష్ణాజిల్లా దివితాలూకాలో మే, జూన్ నెలలో పోలీసువారి వలన జరుపబడిన అత్యాచారములను గురించి తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రసిడెంటుగారివల్ల రిపోర్టు చేయబడిన దాని విషయమై గవర్నమెంటువారు యేమైనా చర్య తీసుకొనినది లేనిది ప్రీమియర్‌గారు దయచేసి తెలుపగలరా?

Hon'ble Sri B. Gopalareddy :— (On behalf of the Hon'ble the Premier). The Government have dlrected an enquiry to be conducted into the allegations made in the letter.

(M. L. A. Debates Official Report Vol. XIV No. 11 Page 721)

పోలీసు డిప్యూటీ సూపరిండెంటు దౌర్జన్యము - ప్రభుత్వచర్య

ఆ పిటీషను విచారణ చేయించడానికి ఎంతకాలము పడుతుందో చెప్పగలరా?

జ. ఆ పిటీషను పోలీసు **Inspector - General** గారికి పంపించినాము. వారి జవాబు ఇంకా రాలేదు.

అంగలూరు మునసబుగారిని ఈ డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటుగారు 3 గంటలు సేపు నిర్బంధములో వుంచినారని ప్రభుత్వమువారికి తెలుసునా ?

జ. ఆ పిటీషనులో ఈ విషయములన్నీ ఉన్నాయి.

ఈ పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటుగారు గ్రామోద్యోగస్థుల ఎడల ప్రజలయెడల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారనేరిపోర్టులు ప్రభుత్వం వారికి వచ్చినవా?

"ఈ పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటుగారు కొంతమందిమీద దౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఈ పిటీషనులోఉన్నది. దానిని విచారించుటకు పోలీసు **Inspector - general** కు పంపించాము.

(M. L A. Debates Official Report Vol. XV No. 5 P. 294)

జమీందారు రద్దు బిల్లులో రైతులకు అప్పీలు క్లాజుపై సవరణ

అధ్యక్ష: 3వ క్లాజులోని ప్రొవిసో (i) item లో "Officer", అనే పదము తరువాత "**and the Tribunal on appeal, if auy, to**

it" అనే పదాలను చేర్చాలి. ఎందువల్లనంటే ఈ క్లాజు ప్రకారము రైతులు Set lement Officer కు appeal చేసుకోవడానికి వీలులేదు. కాని దిగువఉన్న Sub - clause లో జమీందారులకు appeal చేసుకొనే అధికారమును కలుగజేశారు. మనము ఈ జమీందారీ రద్దు బిల్లును రైతులకు ఈ జమీందారీ భూములలో ఎక్కువ హక్కులను కలుగచేయటానికి మాత్రమే Pass చేస్తున్నాము. ఈ ఉద్దేశముతోనే రెవిన్యూ మంత్రిగారు ఈ బిల్లును ఈ శాసనసభలో ప్రతిపాదించినారుకాని ఈ బిల్లులోని 3వ Clause వల్ల రైతులకు అన్యాయము జరిగినప్పుడు appeal చేసుకొనే హక్కు వారికి ఇవ్వబడలేదు. కాని ఈ హక్కు జమీందారులకు కలుగ జేశారు. దీనివల్ల ఒక వర్గానికే ఉపకారము జరుగుతుంది. రెండవ వర్గానికి అన్యాయము జరిగే అవకాశమున్నది. అందువల్ల రైతులకుకూడా Tribunal కు అప్పీలు చేసుకొనే అధికారము కలుగచేయవలసినదిగా కోరుచు, రెవిన్యూ మంత్రిగారిని నా Amendment ను ఆంగీకరించవలసి నదిగా ప్రార్థిస్తున్నాను.

"14 వ క్లాజు Private land కు మాత్రమే సంబంధించినది. ఈ clause అన్ని భూములకు వర్తిస్తుందని రెవిన్యూ మంత్రిగారు అంటున్నా కూడా నాకు ఇంకా సందేహముగానే ఉన్నది. ఈ clause స్వరూపము వేరు, 14వ క్లాజు స్వరూపము వేరు."

గౌ॥ రివిన్యూమంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు

"14 వ సెక్షను ప్రైవేటు భూములకు మాత్రమే కాకుండా ఇతర భూములకు కూడా వర్తిస్తుంది."

మంత్రిగారు అంత గట్టిగా హామీ ఇస్తున్నారు కనుక రైతులకు ఇటువంటి apple అధికారాన్ని 14 వ section లో తప్పక కలుగచేయ వలసినదని కోరుతూ నా సవరణను ఉపసంహరించుకొంటున్నాను.

(M. L. A. Debates O. R. Vol. Xv, No. 6 Pages 406 - 409.)

లంక రైతుల ఆంధ్రోళన - వారిహక్కులకై కృషి

అలాగే ఉన్నది. II Sub - clause (b) (ii) ప్రకారం 1945 వ సంవత్సరం July 1 వ తేదీనుండి జమీందారుల స్వాధీనములోఉన్న కొన్ని పొలాలకు పట్టాలను పొందే అవకాశము జమీందారులకు కలుగ జేయబడినది. కాని ఇటువంటి అవకాశము రైతులకు కలుగజేయబడలేదు. ఈ లంక రైతులు చాలా పేదవారు. ఇటువంటి నిబంధనవలన ముఖ్యంగా నా నియోజకవర్గంలోని పేద లంక రైతులకు చాలా అన్యాయము జరుగుతుంది. ఇంతేకాకుండా యీ లంక రైతులు ఎప్పటినుంచి యీ భూములను సాగుచేస్తున్నారో రుజువు చేసుకోవడము చాలా కష్టము. యీ రైతులవద్ద ఎటువంటి రికార్డులు ఉండవు. దీనివల్ల యీ లంక భూము లను తాము 1939 వ సం॥ నుంచి సాగుచేసుకొంటున్నామని వారు రుజువు చేసుకోవడం చాలా కష్టము. అంతేకాకుండా యీ అసెంబ్లీ ఎన్నికలు జరిగేవరకు జమీందారులకు రయితులకు ఏవిధమైనటువంటి భేదాలుగాని, తగాదాలుగానిలేవు. కాని 1945 వ సంవత్సరంలో కాంగ్రెస్ ఎన్నిక ప్రణాళిక ప్రకటింపబడిన తరువాతనే జమీందారులు యీ లంకభూములను అన్యాక్రాంతము చేయడము, కొంతమంది పేద రయితులను తొలగించ డం, భూములను అమ్ముకొనడము జరిగింది. ఇందువల్ల అనేకానేక తగాయి దాలు వచ్చినవి. కాబట్టి శ్రీ కాశేశ్వరరావుగారు ప్రతిపాదించినట్లుగా యీ time limit ను 1945 వ సంవత్సరం జులై 1 వ తేదీ నుండి అని పొడిగించినట్లయితే న్యాయముగా వ్యవసాయము చేసుకొంటున్న రయితు లకు అన్యాయము జరుగదు. అంతేకాకుండా చాలామంది రయితులకు వారు 1939 వ సంవత్సరంనుంచి యీ లంకభూములను స్వాధీనము చేసుకొని సాగు చేసుకొంటున్నామనేటటువంటి దానిని రుజువు చేసుకోవ డం తప్పుతుంది. వీరు యీ లంకభూములను చాలా కాలమునుంచి సాగు చేస్తున్నా నిజానికి రికార్డులులేని కారణముచేత రుజువు చేసుకోవడం కష్ట

మవుతుంది. కాబట్టి శ్రీ కాళేశ్వరరావుగారి **amendment** ను అంగీకరించ వలసినదిగా రెవిన్యూ మంత్రిగారిని వినయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

(M. L A. Debates Official Report Vol XV No. 9 Page 594)

జమీందారుల రద్దు బిల్లుపై - రైతుల ప్రయోజనాలకై

"అధ్యక్షా: ఈ జమీందారి రద్దు బిల్లు యొక్క 11 వ క్లాజు (b) లోని 3వ **Subclause** ను తీసివేయవలసినదిగా నేను నా సవరణను ప్రతిపాదిస్తున్నాను. ఎందువల్లనంటే మన రెవిన్యూ మినిష్టరుగారు లోగడ ఈ బిల్లును ఈ శాసన సభలో ప్రవేశపెట్టేటప్పుడు తమ యొక్క ఉద్దేశములను చెబుతూ రాష్ట్రీములో చాలా ఆహారకొరత ఏర్పడిఉన్నదని, యీనాడు మన రాష్ట్రీములో సాగుకు వీలైనంత భూమి అంతా తమంత తాము సాగు చేసుకోలేనటువంటి — పెద్దపెద్ద జమీందారుల చేతులలో ఉన్నదని, మరొకవంక సాగుచేసుకోటానికి భూమిలేక అనేక లక్షల మంది ఉన్నారని చెప్పి ఉన్నారు. అంతేకాకుండా ఇటువంటి భూములను రైతులకు సంక్రమింపచేయడము తర్వాత ఆహారోత్పత్తి అధికముచేయుటే తమ అభిప్రాయమని తెలియచేసినారు. అంతేకాకుండా **Select Committee** నివేదికను, ఇక్కడ ప్రతిపాదించేటప్పుడు ఒకసారి రైతీ భూమిగా పరిగణింపబడినటువంటి దానిని తిరిగి జమీందారులకు ఇప్పించే ఉద్దేశము తమకు లేదని స్పష్టముగాచెప్పారు. అనేక సందర్భములలో జమీందారుల దౌర్జన్యమువలన, ఇతర కారణములవలన రైతులు తమ భూములను తమ ఇష్టములేక పోయినను వదలివేయవలసి వచ్చినది. అసలు 1908 వ సంవత్సరపు **Estate Land Act** ప్రకారము ఏ భూమి రైతీ భూమి అని నిర్వచింపబడిఉన్నదో అటువంటిభూమి అంతయు రైతులకే సంక్రమించవలెనుగాని, మరల జమీందారులకు సంక్రమింపజేయుట చాలా

అన్యాయమని మనవిచేస్తున్నాను. ఈ విధమైనటువంటి **clause** ను ఈ బిల్లులో ప్రవేశపెట్టడంవలన పేరుకు మాత్రమే ప్రభుత్వమువారు జమీందారీలను రద్దుచేస్తున్నామని చెబుతున్నారుగాని, యథార్థాన్ని ఆలోచించి చూచినట్లైతే జమీందారులకు ఇదివరకటికన్న ఈ బిల్లు వలన హెచ్చు ఉపకారములు జరుగుచున్నాయని ప్రజలలో చాలా అసంతృప్తి ఏర్పడిఉన్నది. ఈ **Sub - clause** ను కనుక ఇప్పుడైనను ఈ బిల్లులో నుంచి తొలగించినట్లైతే కొంతమంది పేదరైతులకైనా ఉపకారము జరుగుతుందని మనవి చేస్తున్నాను.

అంతేకాకుండా 1939 వ సంవత్సరం నుంచి జమీందారుల చేతులలో ఉన్నటువంటి **Waste lands** కూడా వారికి దఖలు పడతాయని ఈ **Sub - clause** లో ఉన్నది. ఈనాడు దేశంలో ఆహారకొరత ఏర్పడి ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో ఈ ఎక్కువ భూములను ఇంకను జమీందారులకు సంక్రమింపచేస్తే ఏ విధంగా అధికాహారోత్పత్తి జరుగగలదో బోధపడటంలేదు. ముఖ్యంగా ఈ విషయంలో మన ప్రభుత్వము వారు అవలంబిస్తున్న విధానము కాంగ్రెస్‌యొక్క సిద్ధాంతములకు విరుద్ధముగా ఉన్నది. కాబట్టి **Sub - clause** ను తీసివేయవలసినదని రెవిన్యూ మంత్రిగారిని మరీ మరీ కోరుతూ నా సవరణను అంగీకరించవలసినదిగా ప్రార్థిస్తున్నాను.

(M. L. A. Debates Official Report Vol. XV No. 10 P. 665, 666.)

ఈనాందారుల స్వార్థపరత్వము - రైతుల యిక్కట్లు

అధ్యక్షా, శ్రీ స్వామినాధన్‌గారు ప్రతిపాదించిన సవరణను నేను బలపరుస్తున్నాను. 11 వ క్లాజులో శిస్తు బకాయిలకుగాను జమీందారులు

వేలము వేయించుకొన్న భూములు జమీందారులకు చెందకుండా చేసినారు కాని ఈ 12 వ క్లాజులో ఈనాందారులకు ఇటువంటి శిస్తు బకాయిలకు గాను వేలముకాబడిన భూములు సంక్రమించునట్లుగా ఉన్నది. ఇది చాలా అన్యాయము. ఈ బిల్లుయొక్క ముఖ్యోద్దేశము సాధ్యమైనంతవరకు రైతులకు ఉపకారము చేయవలెనని అందరకు తెలిసిన విషయమే. కాని దుర దృష్టవశాత్తు కొన్ని ఈనాములను ఈ బిల్లులోనుంచి ఇప్పుడు తొలగించి వేసినారు. అంతేకాకుండా ఇప్పుడు యీనాందారులకు అనేకమంది పేద రైతుల భూములను సంక్రమింపజేస్తున్నారు. ముఖ్యముగా మనము ఒక విషయాన్ని గమనించాలి. యీనాందారీ రైతుల నొకవిధంగాను జమీందారీ రైతుల నొకవిధంగాను చూచినట్లయితే రైతులలో చాలా అశాంతి, అసంతృప్తి ఏర్పడుతుంది. యీ యీనాము గ్రామాలలో రైతులు తమ భూములు శిస్తు బకాయిలకుగాను వేలమయిపోతుంటే ఎందుకు ఊరుకోవలసి వచినదో మనము గమనించాలి. జమీందారీలలో కన్న యీనాం గ్రామములలో రైతులు ఇచ్చుకొనవలసిన శిస్తులు అనేక రెట్లు ఎక్కువగా ఉంటూఉండేది. ఇంత హెచ్చుశిస్తులను ఇచ్చుకొనలేకనే రైతులు బకాయిలు పెట్టవలసివచ్చినది. అందువలననే వారు తమ భూములు అక్రమంగాను, అన్యాయంగాను వేలమయిపోతుంటే చేసేదేమీ లేక ఊరుకోవలసివచ్చినది. ఇటువంటి భూములను తిరిగి రైతులకు ఇప్పించకుండా వాటిని యీనాందారులకు కట్టబెడితే రైతులు చాలా బాధ పడతారు. యీ విధంగా రైతులకు అన్యాయము చేయడమువలన రైతులలో చాలా ఆందోళన, అసంతృప్తి ఏర్పడతవని రెవిన్యూ మంత్రిగారికి పదే పదే తెలియజేస్తున్నాను. ఇది ముఖ్యంగా కాంగ్రెస్ సిద్ధాంతాలకు, ఆశయాలకు విరుద్ధంగా ఉన్నదనికూడా మనవిచేస్తున్నాను. యీనాందారులు కాంగ్రెస్ ప్రభుత్వమువారు తమకు అన్యాయము చేసినారని అనుకోకుండా ఉండాలనే అభిప్రాయముతోనే నేను యీ సవరణను బలపరుస్తూ దీనిని అంగీకరించవలసినదిగా రెవిన్యూ మంత్రిగారిని మరీ మరీ ప్రార్థిస్తున్నాను.

అధ్యక్షా, 14 వ క్లాజులో అన్యాయము జరిగినటువంటి రైతులు Settlement officer కు అప్పీలు చేసుకొనేటటువంటి అధికారాన్ని కలుగజేస్తామని ఇదివరలో రెవిన్యూమంత్రిగారు సెలవిచ్చినారు. యీ విషయమై వారు తమ అభిప్రాయములను తెలియ జేయవలసినదిగా కోరుచున్నాను.

గౌ॥ రెవిన్యూమంత్రి కళా వెంకట్రావుగారు :– "ఇకముందు భూములన్నీ రైత్వారీ భూములక్రింద చేయబడుతాయి కనుక ఏ రైతుకైనా అన్యాయము జరిగినట్లయితే అతడు ట్రిబ్యునలుకు అప్పీలు చేసుకోటానికి యీ క్లాజు ప్రకారం బోర్డు ఆఫ్ రివిన్యూ యొక్క స్టాండింగు ఆర్డరుల ప్రకారం హక్కు ఉన్నది."

విసీ :– ఏ క్లాజులో అటువంటి Provisions ఉన్నదో తెలియ జేస్తారా?"

గౌ॥ రివిన్యూమంత్రి కళా వెంకట్రావుగారు:– "10 వ Section ప్రకారము రైతుకు వచ్చేది జిరాయితీ భూమి. జిరాయితీ భూముల విషయంలో అన్యాయాలు జరిగితే రైతులు అప్పీలు చేసుకోవటానికి Board Standing Order ప్రకారము హక్కుఉన్నది. దానికి వేరే Procedure ఉన్నది."

"11, 12, 13 క్లాజులు జమీందారులయొక్క స్వంతభూములకు వరిసయి కనుక యీ క్లాజుకూడా అటువంటి భూముల విషయములోనే appeal చేసుకొనే హక్కు రైతులకు కలుగజేస్తుంది.

గౌ॥ రివిన్యూ మంత్రి కళా వెంకట్రావుగారు :– "జమీందారు యొక్క సర్వేభూమి (స్వంతకమతము) విషయంలో అన్యాయము జరిగితే రైతులు Tribunal కు appeal చేసుకొనవచ్చును. యీ హక్కు యీ

13 వ Clause లో కలుగచేయబడింది. అంతేకాకుండా జిరాయితీ భూముల విషయంలోకూడా Appeal చేసుకొనే హక్కు Board Standing Order ల ప్రకారము ఉన్నదని మరల తెలియజేస్తున్నాను. కాబట్టి సీతామహాలక్ష్మమ్మగారు ఏ విధంగాను భయపడనవసరంలేదు.

Clause 14 was put and carried.

"అధ్యక్షా: 15 వ క్లాజును తీసివేయవలసినదిగా రెవిన్యూ మంత్రి గారిని కోరుతూ నేను నాపేరునఉన్న సవరణ move చేస్తున్నాను."

(M L. A. Debates O. R. Vol. XV No. 11 P. 724, 725, 733, 735).

హిందూదేవాదాయ ధర్మాదాయ బిల్లుపై -

అధ్యక్షా: డాక్టరు రాజన్‌గారు తీసుకొని వచ్చినటువంటి హిందూ దేవాదాయ, ధర్మాదాయ చట్టసవరణ బిల్లును నేను బలపరచుచున్నాను.

మన పూర్వులు ఇదివరలో తమముందుతరములవారికి హిందూ మతమన నేమో, హిందూమతముయొక్క ఉత్కృష్టతఏమో, దాని ఆదర్శములేమో తెలుసుకొనుటకుగాను, పెద్దలయొక్క, గొప్పవారియొక్క త్యాగ శీలాదిగుణాలను గ్రహించుటకుగాను, యీ దేవాలయములను, మఠములను స్థాపించియున్నారు. ఇంతేకాకుండా యీ ధర్మసంస్థలు సక్రమముగా కొనసాగింప బడేటందుకుగాను వాటికి తగినంత ఆదాయమును ఇచ్చేటటువంటి యీనాములు మొదలైనటువంటి వాటిని ఏర్పాటుచేసినారు. మన పూర్వీకులయొక్క అభిప్రాయములో యీ ధర్మ సంస్థలన్నియు సక్రమముగా నిర్వహింపబడవలెనని, వాటి ధర్మకర్తలు, మఠాధిపతులు హైందవమత వ్యాప్తికి పాటుపడవలెనని, హిందూ మతముయొక్క ఉత్కృష్ట ఆదర్శాలను ప్రజలకు బోధించి, వారిలో ప్రబోధము కలుగ

జేయవలెనని మాత్రమేకాని పేరుకాదు. కాని ఇప్పటికి కొంతకాలమునుండి కొంతమంది మతాధిపతులు, ధర్మకర్తలు, తమకు వచ్చుచున్న ఆదాయము లను దుర్వినియోగము చేస్తున్నటువంటి సంగతి మన కందరకు తెలిసినదే. ఇందుచేత ప్రజలలో చాలా అసంతృప్తి ఏర్పడియున్నది. ప్రజాభి ప్రాయాన్ని గుర్తించి 1922 వ సంవత్సరములో ఉన్నటువంటి **Justice Party** వారు ఒక బిల్లును Draft చేశారు. తరువాత 1927 వ సంవత్సర ములో **Religious Endowment Board** అనేటటువంటి పేరుతో ఒక సంస్థను ఏర్పాటుచేసి, యీ సంస్థద్వారా యీ దేవాదాయ, ధర్మాదాయాలను సక్రమంగా వినియోగించుటకు కొన్ని ఏర్పాటులు చేశారు. కాని యీ **Board** వారికి ఇచ్చినటువంటి అధికారములు యీ ధర్మాదాయ, దేవా దాయములలోని అవినీతిని పూర్తిగా తొలగించటానికి అవకాశము కలిగి యుండలేదు. కాబట్టి ఇటువంటి వాటిని పూర్తిగా తొలగించుటకుగాను, యీరోజున మన కాంగ్రెస్ గవర్నమెంటువారు ఇటువంటి చక్కటి బిల్లును తీసుకొనిరావడము చాలా సంతోషించవలసినటువంటి విషయము. ఇంతకుముందు కొంతమంది గౌరవ సభ్యులు శ్రీ వైద్యనాధయ్యర్‌గారు తెచ్చినటువంటి సవరణను బలపరచుచు ప్రభుత్వమువారు మత విషయము లలో జోక్యము కలుగ జేసుకోకూడదని తెలియ జేసినారు. వీరి అభి ప్రాయములతో నేను ఏకీభవించలేను. మతముపేరుతో అవినీతి ప్రబలు తుంటే ప్రభుత్వంవారు ఉపేక్షించి ఊరుకుంటే కొంతకాలానికి పూర్తిగా హిందూమతమే అపకీర్తి పాలవుతుందేమోననే భయముకూడా కలుగు తోంది. కాబట్టి యీ దేవాదాయాలను ధర్మాదాయాలను సక్రమముగా వినియోగించేటట్లు చూచేబాధ్యత ప్రభుత్వమువారిమీద ఉన్నదని మనవి చేయుచున్నాను. ఇందువలననే నేను యీ బిల్లును **Support** చేస్తున్నాను. యీ విషయములన్నింటిని ప్రభుత్వమువారు గుర్తించి, మన పూర్వీకులు ఏ కారణాలచేత యీ ధర్మసంస్థలను ఏర్పాటుచేశారో ఆ ధర్మాలకొరకే

యీ ఆదాయాలను వినియోగపరచినట్లైతే యీ సంస్థలు సక్రమంగా నడుస్తా యని, హిందూమతము అభివృద్ధి చెందుతుందని మనవిచేస్తున్నాను. అదే గాక గౌరవసభ్యుడు అన్నామలై పిళ్లై యీ బిల్లు పెట్టినందువల్ల నాస్తి కము రాష్ట్రియములో వచ్చునన్నారు. అలా కాదు. యీ బిల్లు పెట్టకపోయిన సంస్థలు క్షీణించి రాష్ట్రియములో నాస్తికమువచ్చుటకు అవకాశముఉన్నది. అందువల్ల కొంతమంది గౌరవసభ్యులు యీ బిల్లుకు ప్రజాభిప్రాయము అనుకూలముగాలేదని, కాబట్టి ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా తెలుసు కోటానికిగాను యీ బిల్లును కొంతకాలము ఆపవలెనని అంటున్నారు. నా అభిప్రాయములో ప్రజాభిప్రాయము యీ సభలోని గౌరవసభ్యుల అభి ప్రాయమునకు వ్యతిరేకముగాఉండదు. మనమందరము ప్రజల ప్రతినిధు లము, ప్రజాభిప్రాయమునే గుర్తించి యీ బిల్లును నేను బలపరచు చున్నాను. ముఖ్యంగా మా ఆంధ్ర దేశములో యీ బిల్లుకు వ్యతిరేకాభి ప్రాయములేదని నేను మనవి చేస్తున్నాను.

యీ రోజున మేము ఇక్కడ ఉపవాసము చేయుచున్న స్వాముల వారిని చూచినాము. వారు గత 14, 15 రోజుల నుంచి జలంకూడా తీసుకొనటంలేదని అక్కడ ఉన్నవారు చెప్పారు. వారు జలమైన తీసు కొంటున్నారో లేదో నాకు తెలియదు. కాని ఆయనమట్టుకు చాలా దృఢ ముగా ఉన్నారు. అందువల్ల ఇటువంటివారి ప్రాయోపవేశాలకు భయపడి యీ బిల్లును ఆలస్యము చేయవలసిన అవసరములేదు. యీ బిల్లు విష యంలో ప్రజాభిప్రాయము పూర్తిగా ప్రభుత్వమువారిని బలపరచుచున్నదని మనవి చేస్తున్నాను. యీ సంస్థలన్నింటిని ప్రభుత్వమువారు స్వాధీనము చేసుకొని వాటిని సక్రమముగా నిర్వహించి మిగులు ఆదాయముతో అనాదు లైన కుంటివాళ్ళకు, గుడ్డివాళ్లకు శరణాలయాలు కట్టించి వాళ్లకు జీవనో పాధి వగైరా యీ సంస్థలద్వారా కలుగజేసి ఆధ్యాత్మిక ప్రబోధము

చేయించినచో సంస్థలయొక్క వుపయోగము ఆదర్శము అభివృద్ధిపొందును. కాబట్టి ఈ బిల్లును వెంటనే Select Committee వారిచేత పరీక్షచేయించి తొందరగా చట్టము చేయించ వలసినదిగా ప్రభుత్వము వారిని కోరు చున్నాను."

(M. L. A. Debates Official Report XVII No. 13 P. 812, 813)

పోలీసులచే ఆవాయకుల నిర్బంధము - ఆందోళన

ఉపాధ్యక్షురాలుగారు; ఈ రోజున Police demand పై చర్చ జరుగునపుడు ఆ శాఖ పరిపాలనను నిర్వహించుచున్నటువంటి గౌరవ నీయులగు ప్రధానమంత్రిగారు శాసనసభలో ఉండటము చాలా ముఖ్యావస రము. పోలీసుశాఖ ప్రభుత్వ వివిధ శాఖలలో చాలా ముఖ్యమైనటువంటిది. ఇటువంటి శాఖను నడిపేటటువంటి వారుకూడా చాలా సమర్థులుగను రాజ కీయ పేత్తలుగాను ఉండవలెనేతప్ప జపమాలా పరులుగా ఉండకూడదు. ఈనాడు దేశములో పరిస్థితులు చాలా క్లిష్టముగా ఉన్నాయి. ప్రజలు అనేక బాధలకు గురి అగుచున్నారు. వారి అవస్థలు చాలా విషాదకరముగా ఉన్నవి. జిల్లాలలో ముఖ్యముగా కమ్యూనిష్టులబాధ, బ్లాక్ మార్కెట్, లంచగొండితనము విపరీతముగా ఉన్నాయి. అటువంటి క్లిష్టపరిస్థితులలో ఈ శాఖను నడిపేటటువంటివారు చాలా సమర్థులుగను, గట్టిగా పనిచేసే టటువంటి వారుగను ఉండవలెను. ఇంత ముఖ్యమైనటువంటి పోలీసు శాఖను గురించి చర్చించుచున్నపుడు ఈశాఖను నిర్వహించుచున్న ప్రధాన మంత్రిగారు శాసనసభకు హాజరు కాలేకపోవడము చాలా విచారకరమైన విషయము.

మా జిల్లాలో కొన్ని తాలూకాలను కల్లోల ప్రాంతాలుగా పరికటించి నారు. వీటిలో నా నియోజక వర్గము (**Constituency**) లో ఉన్నటువంటి దివి తాలూకా ఒకటి ఈ సభలో మంత్రులు శాసనసభ్యులు కూర్చొని శాస నములను **pass** చేస్తున్నారు. ఈ శాసనములను జిల్లాలలో సక్రమముగా నడుపవలసిన బాధ్యత రెవిన్యూ డిపార్టుమెంటుమీద, పోలీసు డిపార్టుమెంటు మీద ఉన్నది. వీరియొక్క సంపూర్ణసహకారము ఉంటేనేకాని ప్రభుత్వము వారు చేసినటువంటి శాసనములయొక్క ఫలితము ప్రజలకు కలుగదు.

మన ప్రకాశంగారు ప్రధానమంత్రి (**premier**) గా ఉన్నపుడు ఎస్టేటు రైతుల కౌలురక్షణ చట్టాన్ని (**pass**) చేసినారు. దానిని **pass** చేసినతరువాత, దివితాలూకా చల్లపల్లి ఎస్టేటులోని రైతులు, ఆ చట్టము రీత్యా తాము కౌలుకు చేసుకొనుచున్న భూములను సాగు చేసుకొనుటకు హక్కు కలదని, జమీందార్లు వారిని తొలగించరాదని నమ్మి ఆ విషయాన్ని జమీందార్లకు, ప్రభుత్వంవారికి తెలియజేసుకొనినారు. అయినప్పటికి జమీం దారులు వారిని తొలగించుటకు అనేకరీతుల ప్రయత్నము చేస్తూవుండే తమకు రక్షణ ఇవ్వవలసినదిగా ప్రభుత్వంవారికి **petition** లు పెట్టుకొని నారు. అనేక విధాల ప్రార్థించినారు. అయినప్పటికి ఆ జిల్లాలలో పోలీసు వారు రైతులకు ఏ మాత్రము రక్షణ ఇవ్వలేదు, సరికదా, జమీందారుల ప్రోద్బలంతో అనేకమంది పేదరైతులను కమ్యూనిష్టులని చెప్పి అరెస్టు చేసినారు. ముఖ్యంగా దివితాలూకాలోనుండి చినవెంకటనరసయ్య, పెద వెంకటనరసయ్య అనేవారు ఎప్పటినుంచో కాంగ్రెస్‌వాదులు, వారు పై చట్టము ప్రకారం రైతులకు సహాయము చేయుచున్నారనే ఉద్దేశముతో వారిని కమ్యూనిష్టులుగా సృష్టించి డిటెన్షన్‌లో ఉంచారు. ఈవిషయాన్ని మంత్రులందరకు, ప్రధాన మంత్రిగారికికూడా తెలియజేశాము. కాని ఏవిధ మైనటువంటిరక్షణ ఇవ్వబడలేదు. ఏ ప్రాంతమైనను కల్లోలిత ప్రాంతముగా ప్రకటింపబడినపుడు ఆ ప్రదేశములలో పరిస్థితులు ఏవిధముగా ఉన్నవో, పోలీసు అధికారులు ప్రభుత్వమువారి ఉత్తర్వులను సక్రమంగా అమలు

జరుపుచున్నారో లేదో అనే విషయాలను పోలీసు శాఖామాత్యులు స్వయంగా పరిశీలన చేయించడం చాలా అవసరము. ఏ నెలకో, లేక రెండు నెలలకో, ఒక పర్యాయము పోలీసుశాఖా మంత్రిగారు ఒకసారి అయినను కల్లోలిత ప్రాంతములకు వెళ్ళి, స్వయంగాచూచి, ప్రజల కష్టసుఖాలను తెలుసు కొనడం ఎంతో అవసరము ఆవిధంగా కాకుండా తమకేమీ బాధ్యత లేద న్నట్లు మంత్రిగారు, పోలీసు అధికారులపైనే అంతయు వదలి వేసినట్లైతే ఇప్పుడు మాజిల్లాలో జరుగుచున్నట్లు అనేక అన్యాయాలు అక్రమాలు జరగ టానికి అవకాశాలు ఏర్పడుతాయి. ఈ ప్రాంతాలను కల్లోల ప్రాంతాలుగా ప్రకటించిన తరువాత పోలీసు శాఖను చూచుచున్న ప్రధాన మంత్రిగారు, అక్కడకు ఎన్నిసార్లు వెళ్ళి చూచినారని ఈ శాసనసభలో పోలీసు డిమాం డును ప్రతిపాదించిన (**in-charge**) మంత్రిగారగు శ్రీగోపాలరెడ్డిగారిని ప్రశ్నిస్తున్నాను ఈవిధంగా మంత్రులు జిల్లాలోని ప్రజలమీద తగినంత శ్రద్ధ చూపించక పోవుటవలన వారు చాలా బాధలకు గురి కావలసి వస్తోం దని ప్రభుత్వమువారు గమనించ గోర్తాను.

"అంతేకాకుండా పోలీసు సహాయముతో జమీందారులు తమకు ఎవరు వ్యతిరేకులో వారిమీద జబర్దస్తీ చేసి బలవంతంగా ప్రోనోట్లు కొన్ని వేల రూపాయలకు వ్రాయించుకున్నారు. ఎవరిమీదనైతే జమిం దారులకు వ్యతిరేక అభిప్రాయము కలుగుతుందో వారిని కమ్యూనిష్టులని చెప్పి పోలీసులతో జబర్దస్తీ చేయించి బలవంతముగా ప్రోనోట్లువ్రాయించు కొంటున్నారని ఇటువంటి బలవంతం వలననే ఆ విధంగా చేయవలసి వచ్చినదని అనేకమంది ప్రజలు ఉద్యోగస్థులకు చెప్పుకున్నారు. దీనిపైన వారు **Enquiry** చేసి అది యదార్థమని రుజువు అయినప్పటికికూడా ఏమీ చర్య (**Action**) తీసికొనలేదు. ఈ విషయాలను గమనించి ప్రభుత్వము వారు ప్రజలకు అన్యాయాలు జరుగకుండా చూస్తారని నమ్ముచున్నాను.

అంతేకాక పశ్చిమ గోదావరిజిల్లా, చింతలపూడి కాపురస్థులు రెడ్డి మావిళ్ళమ్మగారు నాకు ఉత్తరము వ్రాసినారు. ఆమె ఉత్తరము ప్రకారము

ఆమె భర్త అక్కడ మొఖాసాదారుకు వ్యతిరేకముగా రైతులకు సహాయము చేయుచున్నాడని కమ్యూనిష్టు అనే పేరుపెట్టి పోలీసు సర్కిల్ యిన్స్పెక్టరుగారు అరెస్టుచేసి డిటెన్షన్‌లో వుంచినారు. అరెష్టు చేయబడిన పెద్దమనిషి కమ్యూనిష్టు కాదని స్థానిక ఎం. ఎల్. ఏ. లైనటువంటి మాగంటి బాపినీడుగారు, అల్లూరి సత్యనారాయణరాజుగారు, కాంగ్రెస్ పెద్దలైన డాక్టర్ మూల్పూరి రంగయ్యగారుకూడా ప్రభుత్వమువారికి తెలియజేశారు.

ఆ జిల్లా స్థానిక కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర (Provincial) కాంగ్రెస్ సంఘమువారుకూడా ఆయన కమ్యూనిష్టు కాదని ఆయనను విడుదల చేయించవలసినదనికూడా ప్రభుత్వమువారికి, సిఫారసు చేసినప్పటికి కూడా ప్రధానిగారికి దయ రాలేదని ఆమె వ్రాసినారు. ఈ విధంగా అనేక అన్యాయాలు జరుగుచున్నవి. ఇటువంటి అన్యాయాలను గురించి స్థానిక నాయకులు ప్రభుత్వమువారికి తెలియజేసినప్పుడు, వారికి యింకను సంకోచము ఉన్నట్లైతే మంత్రిగారే స్వయముగా ఆయా తాలూకాలలో పర్యటన చేసి పరిస్థితులను తెలిసికొని ప్రజల కష్టాలను తొలగించినాడే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ప్రజా ప్రభుత్వమని అనుకొంటారు. అంతేకాని ప్రభుత్వోద్యోగుల రిపోర్టులే వేదాక్షరాలుగా భావించినట్లైతే ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలు నమ్మలేరు. అటువంటి విధానము బ్రిటిష్‌వారి పరిపాలనా కాలములో ఆచరణీయము అయితే అవవచ్చునుకాని, ఇప్పుడు మన పరిపాలనా కాలములో దానికి తావుండకూడదు. ఒకవేళ ప్రజానాయకులయొక్క ప్రజా ప్రతినిధులైనటువంటి శాసనసభా సభ్యులయొక్క సిఫారసులపట్ల మంత్రులకు సందేహముగాని, సంకోచముగాని ఉన్నట్లైతే వారే స్వయముగా ఆ ప్రదేశమునకు వెళ్ళి పరిస్థితులను తెలిసికొని న్యాయము కలుగజేస్తే బాగుంటుంది. అంతేకాని ఉద్యోగుల రిపోర్టులను ఆధారం చేసుకొని కొందరిని కమ్యూనిష్టులనిచెప్పి అరెస్టు చేసినంత మాత్రంచేత ప్రజల బాధలుగాని, ప్రజలకు కమ్యూనిష్టులవల్ల కలుగుచున్న బాధగాని తగ్గదు. కమ్యూనిష్టులను

అణచడానికి ప్రయత్నించేముందు ఏయేకారణాలచేత ప్రజలు కమ్యూనిష్టుల మాటనమ్మవలసివస్తుందో, ప్రజలు ఈనాడు పడుచున్న బాధలేమోగమనించి వాటిని తీర్చటానికి ప్రయత్నించాలి. ఆ విధంగా కాకుండా ప్రజలను శిక్షించ ప్రయత్నించినట్లైతే కమ్యూనిష్టులకే ఎక్కువ ప్రోద్బలము కలిగించిన వారము అవుతాముగాని వారిని అణచలేము. ఈనాడు ప్రజాసామాన్యానికి ఉద్యోగస్థులవల్ల ఇతరులవల్ల జరుగుచున్న అక్రమాలను ఆధారం చేసు కొనే కమ్యూనిష్టులు ప్రజలను ఉద్రేకపరుస్తున్నారు. కాబట్టి ఈ అక్రమాలు జరుగకుండా చూడవలెనేగాని, కేవలం పోలీసు బలంతో ప్రజలను పరిపా లించ దలచడం తెలివితక్కువ. ఆ విధంగా ఎవరైనా ఎక్కువకాలం పాలించలేరు. ఇటువంటి కారణాలచేత చైనాలో ఈనాడు కమ్యూనిష్టులు విజృంభిస్తున్నారు. అటువంటి పరిస్థితులే మనదేశములోకూడా ఏర్పడకుండ చూడవలసిన బాధ్యత గౌ. మంత్రిగారిమీదవున్నదని తెలియజేయుచున్నాను.

M: L. A. Debates Official Report Vol. XIX No. 1 P. 37, 38, 39)

కృష్ణాజిల్లా కల్లోల ప్రాంతాలు — స్వార్థపరుల అవకాశవాద తత్వాలు

అధ్యక్షా: గ్రామాలలో ఏర్పడిన పార్టీ కక్షలవలనను, యుద్ధానంతరము దేశములో కలిగినటువంటి విపరీత పరిస్థితులను, ఆధారంగా చేసుకొని కమ్యూనిష్టులు తమ సిద్ధాంతములను ప్రజలలో ప్రచారముచేసి వారిని రెచ్చగొట్టి తమ పార్టీని బలపర్చుకోడానికి సర్వవిధాల ప్రయత్నిస్తున్నారు. ఇంతేకాకుండా ఎక్కడైతే దారిద్ర్యము హెచ్చుగా ఉంటుందో అక్కడ, కమ్యూనిజం వర్ధిల్లడానికి అవకాశముంటుందని మనవి చేస్తున్నాను. మా కృష్ణాజిల్లాలో 5 తాలూకాలను ప్రభుత్వమువారు కల్లోల ప్రాంతాలుగా ప్రకటించారు. ఈ 5 తాలూకాలలోను జమీందారులున్నారు. ఈ జమీందారులు రైతులను అనేక విధములుగా బాధలు పెట్టుచుండటంచేత రైతులు కొన్ని కొన్ని సందర్భములలో కమ్యూనిష్టుల ప్రచారములకు లొంగవలసి

వస్తోంది. మిగత 4 తాలూకాలలోను జమీందారీ ప్రాంతము తక్కువ. ఈ తాలూకాలలో కమ్యూనిష్టు చర్యలూ తక్కువే. అనగా మా జిల్లాలో ఏ యే తాలూకాలలో జమీందారుల ప్రాబల్యము హెచ్చుగా ఉన్నదో అచ్చటనే కమ్యూనిష్టు చర్యలు ఎక్కువగా ఉన్నవికాని మిగతాచోట్ల చాలా తక్కువ. ఈ కల్లోల ప్రాంతాలలో జరుగుచున్న విపరీత హత్యలకు దౌర్జన్యమునకు కారణము ముఖ్యంగా రెండు వర్గములవారు. అవి ఒకటి జమీందారీ వర్గము. రెండవది కమ్యూనిష్టు వర్గము. ఈ జమీందారులు 1946 వ సంవత్సరము నుండే కౌలు రక్షణచట్టం అమలులోకి వస్తుందన గానే లంక భూములను పోరంబోకులను అడవి భూములను అమ్మడము ప్రారంభించినారు. అప్పటినుండే మా జిల్లాలో ఈ కల్లోలాలు ఎక్కువ అయినవి. స్వార్థపరత్వముతో జమీందారులు చెరువు భూములను, పోరం బోకులను, అడవి భూములను అన్యాక్రాంతము చేస్తూవచ్చారు. ఇందువల్ల రైతులకు వ్యవసాయానికి సక్రమంగా నీరు అందకపోవడం వారి పశువు లను మేపుకొనుటకు వీలులేకపోవడం తటస్థించింది. అడవులలోనుంచి పుల్లలు తెచ్చుకోవడంకూడా కష్టముగా పరిణమించింది. వీటికొరకై వారు జమీందారుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడవలసి వస్తోంది. మనము ఈ శాసనసభలో ఇదివరకు జమీందారులు పోరంబోకులను, అడవులను అన్యాక్రాంతము చేయకూడదని, కౌలు భూములలోనుంచి రైతులను తొల గించకూడదని శాసనములు చేసినాము. ఈ శాసనాలద్వారా మనము తమకు కలుగజేసిన హక్కులను రక్షించుకొనడానికిగాను రైతులు జమీందారులు చేస్తున్న అన్యాక్రాంతాలను అక్రమాలను ప్రతిఘటిస్తున్నారు. కాని జమీం దారులు ఎవరైతే వారికి వ్యతిరేకులుగా ఉన్నారో వారినందరిని కమ్యూ నిష్టులని చెప్పి కొట్టించి అనేక విధములుగా బాధలు పెడుతున్నారు. ఈ విషయాలను గురించి నేను మన మద్రాసు ప్రభుత్వమువారికి అనేకసార్లు రిపోర్టు చేసినారు. మండవ చినవెంకటనరసయ్య, పెదవెంకటనరసయ్య అనేటటువంటి కాంగ్రెసువారు ఈ రోజువరకు డిటెన్యూలుగా ఉన్నారు.

ఈ విధంగా జమీందారులు పోలీసువారి సహాయముతో తమకు వ్యతిరేకంగా ఉన్నటువంటి రైతులను కమ్యూనిష్టులని చెప్పి జైలుకు పంపించుట, వారి మనుష్యులచేత కొట్టించుట చేస్తున్నారు. అందువల్లనే ఈ కల్లోల ప్రాంతాలలోని రైతులకు పోలీసుమీద, ప్రభుత్వముమీద వ్యతిరేక భావములు కలుగుచున్నవి. కాబట్టి కాంగ్రెసు ప్రభుత్వంవారు లోగడ బ్రిటిషు ప్రభుత్వమువారు జమీందారులకు సహాయము చేసినట్లుగా కాకుండా, మనము ప్రజా ప్రతినిధులము కనుక ప్రజాసామాన్యానికి ఉపయుక్తముగా ఉండేటట్లుగా జమీందారీలను వెంటనే స్వాధీనము చేసుకొని రైతులకు సహాయపడవలసినదని కోరుచున్నాను. కాబట్టి ప్రభుత్వమువారు, శాసనసభ్యులు, ఉద్యోగులు అందరు కలిసి ప్రజలకు కలుగుచున్న కష్టాలను తొలగించటానికి ప్రయత్నించిననాడు కమ్యూనిష్టు ప్రాబల్యము దానంతటదే అణగిపోతుందనీ ప్రజలు కమ్యూనిష్టులను నమ్మరని మన ప్రభుత్వమువారికి మనవి చేస్తూ ఇంతటితో సెలవు తీసుకొంటున్నాను.

(M. L. A. Debates Official Report Vol. XX No. 8
P. 446, 447

యలమంచిలి, కాటూరు గ్రామాలలో పోలీసుల అత్యాచారముల ఖండన

ఉపాధ్యక్షురాలగు అమ్మా! ఇదివరలో అమలుచేసిన ప్రజారక్షణ చట్టమువంటిదానిని ఇప్పుడుకూడ అమలు చేయుటకుగాను ప్రభుత్వమువారు మనియెదుట ఈ బిల్లును ఉంచినారు. ఈ బిల్లును పాస్‌చేసే సందర్భములో ప్రభుత్వమువారికి కొన్ని విషయములను మనవి చేయుదలచినాను

ఈనాడు గ్రామాలలో ఉన్నటువంటి ప్రజలు ప్రజా రక్షణ చట్టము అమలులో ఉండుటవలన ఎటువంటి కష్టనష్టముల పాలగుచున్నారో తెలుసుకోవడము చాలా అవసరము. ప్రజారక్షణ అనే పేరుతో ఈ చట్టమును అమలు చేయుటకు నియమింపబడిన పోలీసులు, ఇతర అధికారులు వారి అధికారమును దుర్వినియోగము చేయుచున్నారని చెప్పుటకు విచారించు

చున్నాను. ఈనాడు పోలీసు జులుమువల్ల చాలామంది అమాయకులైన ప్రజలు, అందులో ముఖ్యంగా సామాన్యస్థితిక చెందిన ప్రజలకు, కూలి నాలి చేసుకొనే కార్మికులకు రక్షణ అనేది ఏ మాత్రము ఎక్కడాకూడా కనిపించకుండా పోయింది. పోలీసువారియొక్క లోపములవల్ల ప్రజాసామాన్యము కమ్యూనిష్టులు అనే పేరుతో దౌర్జన్యమునకు గురి కావింపబడటము, గ్రామాలలోని స్త్రీలకు, పురుషులకు రక్షణ అనేది లేకుండపోవడం చాలా అక్రమమైన విషయమని ప్రభుత్వంవారికి మనవి చేస్తున్నాను.

ఈనాడు సామాన్య ప్రజలలో ఆందోళన కలిగించు ఆర్థికపరిస్థితులు ఏర్పడి యున్నవని మన గవర్నమెంటువారికి తెలిసిన సంగతే. ముఖ్యంగా ఆహారధాన్యాల ధరలు విపరీతముగా పెరిగిపోయినాయి. పాటకజనానికి అవి అందుబాటులో ఉండుటలేదు. అంతేకాకుండా అధికాహారోత్పత్తి చేయుటకు అనువగు పరిస్థితులుకూడ కలుగజేయబడుటలేదు. ఇదివరలో మన ప్రభుత్వమువారు రాష్ట్రములోని జమీందారీలను రద్దు చేసినారు. ఈ విధముగా చేసిన తరువాత జమీందారీ ప్రాంతములలో ఉన్నటువంటి అనేకమైన బంజరు భూములు (**Wast lands**) ప్రభుత్వమువారి పరమైనవి. ఇట్టివాటిని సాగు క్రిందకు తీసికొనివచ్చుట చాల అవసరము. ఈ విధంగా అధికాహారోత్పత్తి చేయుటకు ఎక్కువ అనువైన అవకాశములున్నవి. ఏ సదుద్దేశ్యముతో ప్రభుత్వమువారు జమీందారీలను రద్దు చేసినారో ఆ ఉద్దేశ్యమునే మనసు నందుంచుకొని సాగు చేయుటకు వీలగు బంజరు భూముల నన్నిటిని పేద వ్యవసాయదారులందరకు కో-ఆపరేటివు విధానము మీద వెంటనే సాగు చేసుకొనుటకు ఇవ్వవలెను. ఈవిధంగా చేసినయెడల, అనేకమంది పేద రైతులకు వృత్తులను కల్పించినవారవుతారు. అంతేకాకుండ ఆహారకొరత ఏర్పడిన ఈ రోజులలో ప్రజలకు, దేశానికిఎక్కువ సహాయము చేసినవారము అవుతామని మనవి చేస్తున్నాను. ఈనాడు ఆహార పదార్థముల ధరలు విపరీతముగా పెరిగిపోయినవనే సంగతి అందరకు తెలిసినదే. ముఖ్యముగా పల్లెటూళ్ళలోని పాటకపు ప్రజకు ఇవి ఏమాత్రము

అందుబాటులో లేవు. కూలినాలి చేసుకొని జీవించేటటువంటివారి పరిస్థితి చాల ఆందోళనకరముగ నున్నది, ముఖ్యముగ హరిజనుల పరిస్థితి చాల విషాదకరముగ నున్నది. నేను ఈ మధ్యన ఒకగ్రామమునకు పోయినాను. ఆ గ్రామములోని భూస్వాములు షాహుకారులు ఆ వూరిలోని హరిజనులు కమ్యూనిస్టులని నాతో చెప్పినారు. ఇందలి యదార్థమేమో తెలిసికొందామనే అభిప్రాయముతోను ఈ హరిజనులు ఎందువలన కమ్యూనిస్టుల ప్రచారానికి గురి అవుతున్నారో తెలుసుకుందామనే అభిప్రాయముతోను నేను సరాసరి ఆ హరిజనవాడకు వెళ్ళినాను. అచ్చట హరిజనులతో మాట్లాడినాను. ఆ హరిజన వాడలో నేను వెళ్ళినప్పుడు స్త్రీలే తప్ప పురుషులెవ్వరును నాకు కనుపించలేదు. ఈ విధంగా ఉండటానికి కారణమేమని అచ్చటి స్త్రీలను అడగగా ఆ గ్రామములోని పెద్దరైతుల షాహుకారుల ప్రోద్బలంచేత పోలీసువారు అక్రమముగ, అన్యాయముగ దౌర్జన్యము చేసి కొంతమంది మగవారిని జైళ్ళలో పెట్టినారని మిగతావారు భయపడి పరారి అయినారని చెప్పినారు ఆ గ్రామములోని పెద్ద రైతులకు షాహుకారులకు హరిజనుల మీద ఇటువంటి ద్వేషము, కోపము కలుగటానికి కారణమేమిటని వారిని తిరిగి అడిగాను. అందుకు సమాధానముగా వారు ఇలా చెప్పినారు:—

"ఇక్కడనుండు భూస్వాములు, షాహుకారులు మాచేత ఊడుపుల రోజులలో ఊడిపించుకొంటున్నారు. కోతల రోజులలో చేలు కోయించుకొంటున్నారు. కాని ఊడుపులకూలి కోతలలోను, కోతల కూలి ఊడుపులలోను ఇస్తున్నారు. ఇంత ఆలస్యముగ ఇస్తున్న ఈ కూలికూడ సక్రమముగ ఇవ్వడములేదు. ఏ రైతైనా తక్కువ కూలి ఇస్తే ఆ కూలే ఆధారముగ తీసికొని అ దరుకూడ తక్కువకూలి ఇస్తున్నారు. ఈ విధంగా ఇవ్వడము వల్ల మేము చాల బాధపడుతున్నామని ఆహార పదార్థాల ధరలు అపరిమితంగా పెరిగిపోయినవని మాకు ఎప్పటికూలి అప్పుడుఇవ్వాలని ఇదివరలో ఇచ్చేటటువంటి రూ. 0-12-0 ల కూలి చాల తక్కువగా ఉందని, మామూలుగ ఇతర కూలీలు సంపాదించుకునే రూ. 1-4-0, 1-8-0 ల కూలి

మాకు ఇప్పించవలసిందని కోరినాము. ఈ విధముగ చేయుటకు వారు ఒప్పుకోలేదు. ఇందువల్లనే హరిజనుల మందరము కమ్యూనిస్టులమని పోలీసువారికిచెప్పి మమ్ములను అనేకమైన విధాలుగా బాధలు పెట్టించారు. అటుపైన నేను అక్కడఉండే కమ్యూనిస్టులైనా, మీకు హెచ్చుకూలి ఇస్తున్నారా అని అడిగినాను. వారు కమ్యూనిస్టులుకూడ తక్కువ కూలే ఇస్తున్నారని, కాని హెచ్చుకూలి ఇవ్వడము న్యాయమని అంటున్నారని అంతవరకే వారు మామీద అభిమానము చూపుతున్నారు కాని కూలి ఇచ్చే విషయంలో శ్రేతులు - కమ్యూనిష్టులు ఉభయులు ఒకటేననిచెప్పి వాళ్ళు అన్నారు. ఈ విధముగా కమ్యూనిష్టులుకూడ మీకు యెక్కువకూలి ఇవ్వనప్పుడు మీరు ఎందుచేత కమ్యూనిష్టులను బలపరుస్తున్నారు? మీరు వాళ్ళలో చేరటానికి అవసరం ఏంకలిగింది? అని నేను వారిని అడిగితే, వారు మేము కమ్యూనిష్టులను బలపరచడములేదని, మేము వాళ్ళలో చేర లేదని, మాకు ఏపార్టీతో సంబంధములేదని న్యాయమైన కూలి సంపాదించు కోవడమే మాకు కావలసినదని మేము ఎప్పుడు ప్రజాప్రభుత్వము తరపు ఉంటామని వాళ్ళు చెప్పారు. ఈ గ్రామములోనేకాకుండ మా జిల్లాలో అనేక ఇతర గ్రామాలలో ఇటువంటి అక్రమ చర్యలు సర్వసామాన్యమయి పోయాయని చెప్పవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను.

"ఇటువంటి ఆందోళనకరమైన పరిస్థితులు ఏర్పడుటకు కారణము ప్రజారక్షణచట్టాన్ని అవకాశంగాతీసుకొని పోలీసులు స్వలాభాపేక్షతో ప్రజలపై దౌర్జన్యంగా ప్రవర్తించడమేనని, అందుచేత ఈ బిల్లును పాస్‌చేసిన తరువాత ఈ దౌర్జన్యాలు జరుగకుండా చూడటము గవర్న మెంటువారి విధ్యుక్తధర్మమని చెప్పుచున్నాను. ఈ మధ్యన మా గ్రామము నకు దగ్గరగ ఉన్నటువంటిన్ని, నా నియోజకవర్గానికి చెందినటువంటి యలమఱ్ఱు అనే గ్రామంలో కమ్యూనిష్టులను పట్టుకోవాలనే అభిప్రాయ ముతో పోలీసువారు అర్ధరాత్రి ఆ గ్రామాన్ని ముట్టడివేశారు. తెల్లవార

గట్ల దొడ్డికి పోయేటటువంటి పురుషులను అడ్డగించి ఒక స్కూలు ఆవరణలోనికి తీసికొని వచ్చినారు. అక్కడికి తీసుకొనిరాబడిన పురుషులు, తాము నిర్దోషులము కమ్యూనిస్టులము కాము అని చెప్పుకొనుటకుకూడ అవకాశము ఇవ్వకుండా, వాండ్లందరిచేత పోలీసు అధికారులు బట్టలు విప్పించి, వీపులు బద్దలయ్యేటట్లు కొట్టించారు. ముఖ్యంగా హరిజనవాడకు పోయి దిగంబరులుగాచేయించి వారి స్త్రీలను తీసుకొనివచ్చి యెదురుగుండా పెట్టి, దిగంబరులైన మగవారివైపు చూచేవరకు లాఠీలతో కొట్టారు. ప్రజా రక్షణ చట్టము అనే పేరుతో అనేకమైనటువంటి, ఎప్పుడు, కని, విని, ఎరుగని అమానుషకృత్యములను పోలీసువారు జరుపుతున్నారు.

"ఇదేవిధంగా, కొటూరు అనే పశ్చిమ కృష్ణాలోని గ్రామంలో కూడ జరిగింది. ఆ గ్రామంలో రెండు వందలమంది గ్రామస్థులపైన నడిబజారులో పోలీసులు లాటీచార్జిచేసి, వాళ్ళను దిగంబరులుగాచేసి, వాళ్ళ స్త్రీలయెదుట నిలబెట్టి డప్పులతో వూరేగించినారు. ఇది కాంగ్రెస్ గవర్న మెంటు. ఇది ప్రజాప్రభుత్వమా? లేక మరేగవర్నమెంటో నాకు అర్థం కావడములేదు. ఈ అక్రమాలనుగురించి మా జిల్లాలో ఉన్నటువంటి M. L. A. లు గవర్నమెంటువారికి మెమోరాండంద్వారా తెలియజేశాము. కాంగ్రెసు కమిటీవారుకూడ తెలియజేసినారు. దీనిపైన తగినచర్య తీసికొన బడినట్లు తెలియలేదు. కమ్యూనిష్టులను అణచటానికి పోలీసులు నిర్దాక్షి ణ్యంగా ప్రవర్తిస్తేనే కాని పని జయప్రదముగా సాగదని కొంతమంది చెప్పవచ్చును. కాని అది చాలపొరపాటు. న్యాయమనేది అందరిపట్ల ఒకే విధముగా ఉండవలెను. లేనిచో అధికార దుర్వినియోగము జరగటానికి అవకాశాలెన్నో వున్నాయి. దీనివల్ల ప్రభుత్వముయొక్క పేరు ప్రతిష్ఠ లకు భంగము కలుగవచ్చును. అందుచేత ఎవరైనా అధికార దుర్వినియోగము చేసినట్టయితే వారిని ప్రభుత్వమువారు మందలించి శిక్షించాలి. ఆ విధముగా చేసినట్టయితేనే మనముచేసెడి చట్టములు సద్వినియోగములు

అవుతాయి. లేకపోతే దుర్వినియోగ మవుతాయి. నేను యీ విధంగా అనేక గ్రామాలలో అక్రమాలు జరుగుతున్నాయని విన్నాను. పోలీసులు గ్రామస్థుల యిండ్లలో సోదాకు వెళ్ళినప్పుడు అక్రమాలు చేస్తున్నారు. అనేక బీద కుటుంబాలవారిని కట్టుకోటానికి బట్టలుగాని, తినటానికి బొచ్చలుగాని, నీరు తాగటానికి గ్లాసులుగాని లేకుండా చేస్తున్నారు. ఇటువంటి కఠిన చర్యలవల్ల వారు కమ్యూనిష్టులను గురిచేసినట్టయితే మాకేమి అభ్యంతరములేదు. కాని వారు ఆవిధంగా చేయలేకపోతున్నారు. కమ్యూనిష్టులకు బదులుగా పేదసాదలను వారు హెచ్చుగా బాధిస్తున్నారు. నిజంగా కమ్యూనిస్టులైనవారు పోలీసువారికి దొరకకుండా Underground లో ఉంటున్నారు. పోలీసువారు వారిని పట్టుకునే ప్రయత్నము అనే పేరుతో ప్రజలను బాధిస్తున్నారు. ఇందువల్ల గవర్నమెంటుయొక్క గౌరవము కుంటుబడటమేతప్ప కమ్యూనిస్టు చర్యలను నిరోధించలేరు. కాబట్టిగవర్నమెంటువారు వారి అధికారులను అదుపులోనుంచి వారు అధికారాన్ని సక్రమంగా వినియోగించేటట్లు చూడాలనీ అమాయకులను నిర్దోషులను తమను తాము పోషించుకోలేని వారిని కమ్యూనిష్టులనిచెప్పి శిక్షించి జైళ్ళలో డిటెయిన్‌చేసి వారికి, వారికుటుంబాలవారికి బత్యములు ఇప్పించడము అనవసరము అని మనవిచేస్తున్నాను. ఈనాడు యధార్థము ఆలోచించి చూస్తే అసలు కమ్యూనిస్టులైనవారు కమ్యూనిస్టుపార్టీతో సంబంధించిన వారు చాలమంది Underground లో ఉన్నారు. ఏకొద్దిమంది కమ్యూనిస్టులు మాత్రమో జైళ్ళలోవున్నారు. మిగిలినవారందరు పోలీసువారి లోపములవల్ల శిక్షింపబడినవారేనని మనవిచేస్తున్నాను. ఇంతేకాకుండ మరికొన్ని పొరపాట్లుకూడ జరుగుతున్నాయి. హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్లు డాఖలుచేసుకొని విడుదలకాబడిన వారిలోకూడ కొంతమంది అసలు కమ్యూనిస్టులుకూడ ఉంటున్నారు. ఇటువంటివారిని తగిన జాగ్రత్తతో వెంటనే చర్యతీసుకోవలెను.

"ఈ చట్టము చాల ప్రమాదమైనటువంటిది. ఆచరణలో పెట్టడములో చాల శ్రద్ధ పరిశీలన కావలసియున్నది. ఏసదుద్దేశముతో ప్రభుత్వమువారు ఈ చట్టాన్ని చేస్తున్నారో ఆ ఉద్దేశంతోనే అధికారులు దీనిని అమలు చేయాలని అధికార దుర్వినియోగము ఆరికట్టాలని అధికార దుర్వినియోగము చేసినవారిపై వెంటనే యాక్షన్ తీసుకోవాలని నా సలహాలను ప్రభుత్వంవారు మన్నించి కాంగ్రెసు సంస్థయొక్క ప్రభుత్వము వారియొక్క పలుకుబడిని ప్రతిష్ఠను నిలబెట్టడానికి ప్రయత్నిస్తారని ఆశిస్తూ నేను సెలవు తీసుకొంటున్నాను."

(M. L. A. Debates O. R. Vol. XXI No. 3 P. 196, 197, 198, 199.)

ఆంధ్రలో తుపాను బీభత్సము - ప్రభుత్వకృషిపై

"అధ్యక్షా! ఆంధ్రదేశంలో ఈ మధ్య సంభవించినతుపాను ప్రమాదంవల్ల మెట్ట, మాగాణి భూములు, ముఖ్యముగా కోస్తాప్రాంతములలో, సర్వనాశనమైపోయినవి. కృష్ణానది పొంగుటవలన మంచి సారవంతమైనటువంటి లంక భూములు పూర్తిగా పాడైపోవుటవల్ల అక్కడి రైతులందరు కూడా దెబ్బతిన్నారు. కృష్ణానదికి ఇవతల నున్న జిల్లాలలో నష్టం సంభవించినపుడు అవతలనున్న జిల్లాలవారు సానుభూతి చూపించడం, అవతల జిల్లాలవారికి నష్టం కలిగినప్పుడు ఇవతల జిల్లాలవారు సహాయపడడం జరిగేది. కాని సెప్టెంబరు, అక్టోబరు నెలలలో సంభవించిన వరద తుపానులవల్ల ఆంధ్రదేశములోని అన్ని జిల్లాలకుకూడ నష్టం కలిగింది. ఇటువంటి పరిస్థితులలో ఎవరు ఎవరికి సానుభూతి చూపించవలెనో విచక్షణచేసి చెప్పటానికి అవకాశం లేకుండ పోయింది, ఇంత విపరీత నష్టం ఆంధ్రదేశంలో ఈ సంవత్సరం జరిగినది. కేంద్ర ప్రభుత్వము వారూ, రాష్ట్ర ప్రభుత్వంవారూ రైతులు కష్టపడి అధికాహారోత్పత్తి

చేయాలని నిరంతరము బోధిస్తున్నారు. వారు ఆహారోత్పత్తి విషయంలో మనదేశం ఎంత ముందుకు పోవాలని వాంఛిస్తున్నారో అది అంత వెనుకకు పోతూంది.

"మా కృష్ణాజిల్లాలో బుడమేరు ముంపువల్ల రైతులకు కలిగిన నష్టం అంచనావేయడంకూడ చాల కష్టం. ఈ బుడమేటి ముంపులవల్ల రైతులు సర్వసాధారణంగా నష్టపడవలసివస్తూంది. 1947 వ సంవత్సరంలో బుడమేటి వరదలు వచ్చినాయి. పంటలు ఆప్రాంతాలలో పూర్తిగా నష్టం అయినాయి. ఆ సంవత్సరం రైతులకు ప్రభుత్వంవారు నాలుగు లక్షల రూపాయలు రెమిషన్ యిచ్చినారు. 1948 వ సంవత్సరంలో పెద్ద వరదలులేవు. ఈ సంవత్సరం మరల విపరీతమైన బుడమేటి ముంపువలన 40 వేల ఎకరముల భూమిలోని పంట సర్వనాశనం అయిపోయింది. ఈ విషయాన్ని మా ఎక్జిక్యూటివ్ ఇంజినీరుగారుకూడ యధార్థమని చెప్పినారు. ఈ విధంగా ఈ ప్రాంతాలలోనున్న రైతులు సర్వసాధారణంగా బుడమేటి ముంపువలన నష్టపడుతున్నారు. 1947 వ సంవత్సరంలో పూర్తిగా దెబ్బతిన్నారు. 1948వ సంవత్సరంలో కొంతపంటదక్కింది. మరల 1949 వ సంవత్సరంలో ఈ విషాదకరమైన తుపానులవల్ల అపార నష్టానికి గురి అయినారు. రైతులు నష్టపడినప్పుడు తాత్కాలికంగా ప్రభుత్వంవారు వారికి తోచిన రెమిషన్ ఏర్పాటుచేయడం, తిరిగి ఆ రైతుల మొరలు ఆలకించకపోవడం పరిపాటైపోయింది. రెమిషన్ ఇచ్చామని ప్రభుత్వం సంతృప్తిపడుతున్నారే కాని ఎటువంటి నిర్మాణాత్మకమైన కృషికూడ ప్రభుత్వంవారు చేయలేదు. ఎప్పటికప్పుడు రైతుల కళ్ళనీళ్ళు తుడువటానికి ప్రయత్నం చేస్తున్నారే కాని, ఈ బుడమేటి నీటి ముంపు తగ్గించటానికి, నీరు సద్వినియోగం చేయటానికి ప్రభుత్వమువారు ఎటువంటి చర్య ఇంత వరకు తీసుకోలేదంటే విచారించవలసినటువంటి విషయం. గతసంవత్సరం Irrigation శాఖామాత్యులు గౌ॥ శ్రీ భక్తవత్సలంగారు మా జిల్లాలో

పర్యటనచేసి ఈ బుడమేటి ప్రాంతాన్ని స్వయంగాచూశారు. బుడమేటి మీద రిజర్వాయరు కట్టడానికి ప్రయత్నిస్తామని రైతులకు హామీయిచ్చారు. ఎస్టిమేట్లు తయారు చేయించారు. కాని ఇంతవరకు పని ఏమాత్రంకూడ ప్రారంభింపబడలేదు. ఈ తుపానువల్ల కలిగిన నష్టమునుగురించి వారు మాట్లాడుతు బుడమేటికి రిజర్వాయర్ కట్టినాకూడ ఈ ఉప్పెనవల్ల ప్రమాదం లేకుండ పోయేదికాదని, రిజర్వాయర్ కట్టినప్పటికికూడ బుడమేటి నీటిని ఆపడం కష్టమని, ఏకొద్ది నీటినిమాత్రమో ఆపగలముగాని చాల భాగము నీరుపొంగి పొర్లిపోవలసిందేనని, ఈనాడు ఆ ప్రాంతములకు సంభవించినటువంటి నష్టాన్ని అరికట్టడము అసాధ్యమని వారు తెలియజేసియున్నారు. వారి ఈ ప్రసంగము నాకు చాలా ఆశ్చర్యాన్ని కలుగజేస్తుంది. ఏవిషయంలోనైన మనము మొట్టమొదటగా హృదయపూర్వకంగా కృషి చేయాలి. అ కృషిచేసిన తర్వాతకూడ ప్రమాదాన్నుంచి మనం తప్పించుకోలేకపోతే అది మనశక్తికి అతీతమైతే తరువాత దైవాధీనమని అనవచ్చును. కాని మనము ఏమాత్రంకూడ కృషిచేయలేదు. కృషిచేసిననుకూడ ఇట్టి నష్టం సంభవించేదే అని అనడం హాస్యాస్పదమైనటువంటి విషయం.

"అధికాహారోత్పత్తి చేయాలంటే మా జిల్లాలో మొట్టమొదటగా బుడమేటిపై రిజర్వాయర్ కట్టాలి. దీనివల్ల పది, పదిహేనువేల ఎకరముల భూమికి నీటివసతి కల్పించడమేగాక, రమారమి 40 వేల ఎకరముల భూమి మునిగిపోకుండా చేయగలిగినవారవుతారని ప్రభుత్వమువారికి మనవి చేస్తున్నాను. కాని ప్రభుత్వమువారు రామపాదసాగరం ప్రాజక్టు కట్టుటకు ఆలోచిస్తున్నారు. కనుక యీ బుడమేటి రిజర్వాయరును కట్టుట ప్రస్తుతం ఆపుదలచేసినట్లుగా భక్తవత్సలంగారు వారి ప్రసంగంలో చెప్పివున్నారు. రామపాదసాగరం ప్రాజెక్టు ఎప్పుడు కట్టుటకు ప్రయత్నిస్తారో ఎవరికి తెలియదు. అందుచేత బుడమేరు రిజర్వాయర్వంటి చిన్నచిన్న రిజర్వాయర్లను వెంటనే ఏర్పాటుచేసి రైతులకు సహాయపడవలసినదని ప్రభు

త్వమువారిని కోరుచున్నాను. అప్పుడే అనేకవేల ఎకరముల భూమిని సాగుచేస్తూన్న రైతులకు రక్షణ కలుగచేసినవారము అవుతాము. అంతే కాకుండా మా జిల్లాలో ఉన్నటువంటి ఉప్పుటేరును Widen చేయాలి. ఇప్పుడు ఉప్పుటేరు మురుగు నీటి నంతను తీసుకొనలేక పోవడంవల్ల మురుగునీరు పొంగి గుడివాడ, కైకలూరు తాలూకాలలోని అనేకవేల ఎకరముల భూములలోని వంటలు పాడై పోతున్నాయి. ఇటువంటి ముంపులను ఆపుచేయాలంటే ఉప్పుటేరును వెడల్పుచేయాలి. అప్పుడే మురుగు నీరు పూర్తిగా పోవటానికి అవకాశముంటుంది. అధికాహార ధాన్యములను పండించుటకు వీలుకలుగుతుంది. కొబట్టి వరదలు వచ్చినప్పుడు రైతులకు రెమిషన్లనుయిచ్చి వాళ్ళ కళ్ళనీళ్ళు తుడుచుటతో తమ విధిని సక్రమంగా నిర్వర్తింపుగలిగినామని ప్రభుత్వమువారు సంతృప్తి పడకుండా ఈ చిన్న చిన్న స్కీములను వెంటనే అమలు జరుపవలసినదని కోరుచున్నాను. ఈ నాడు మా ఆంధ్రదేశంలో రైతులు వ్యవసాయం చేసుకోవటానికి నీటి వసతులు లేక పంటకాలువలు లేక కొందరు ఏడుస్తుంటే, పంటకాలువలున్నచోట్ల మురుగునీరు పోవటానికి సౌకర్యములులేక మరికొందరు ఏడుస్తున్నారు. మన కాంగ్రెస్‌వారు 1946-వ సంవత్సరములో అధికారములోనికి వచ్చినారు, ఇప్పటికి మూడు - నాలుగు సంవత్సరముల నుంచి ఈ రాష్ట్ర ప్రభుత్వము వారిచేతులలోనున్నది. ఈ కాలములో అనేకమైనటువంటి ప్రణాళికలను మన ప్రభుత్వమువారు కాగితములమీద తయారుచేసినారు. కాని ఇంతవరకు ఒక అభివృద్ధి ప్రణాళికనుగూడ అమలుజరిపినట్లు కనుపించదు. ప్రణాళికలను తయారు చేయించినంత మాత్రముననే ప్రభుత్వమువారి బాధ్యత తీరినదని వారు అనుకొనరని ఆశిస్తున్నాను.

"అంతేకాకుండా ఆంధ్రదేశంలో ఈ తుపానులవల్ల కలిగిన నష్టాన్ని పత్రికలలో ఎగ్జాజిరేట్ చేసినారని మన ప్రధానమంత్రిగారు పత్రి

కలవారితో అనినట్లు పత్రికలలో మేముచూచినాము. ఏ యే ఆధారములను పురస్కరించుకొని వారు ఈ విధంగా అనినారో నాకు తెలియదు. అది మా అందరకు చాల ఆశ్చర్యాన్ని కలిగించింది. మా జిల్లాలలో ఎంత నష్టము జరిగినదో జిల్లాకలెక్టర్లు, బోర్డు మెంబర్లు స్వయంగావచ్చి చూచినారు. ఎవ్వరుకూడా నష్టము తక్కువగా ఉన్నదని అనలేదు. ఈ అధికారుల రిపోర్టులనుచూచి తరువాత నయినను ప్రధానమంత్రిగారు వారి అభిప్రాయాలను మార్చుకొని ఉంటారని, అపరిమితమైన నష్టము ఆంధ్ర దేశములోని రైతులకు సంభవించినదని వారు నమ్మితారని నేను విశ్వసిస్తున్నాను.

"మా జిల్లాలలో ముఖ్యమైనటువంటి వరిపంట ఈ తుపానులవల్ల దెబ్బతిన్నది. సుమారు 10, 11 లక్షల ఎకరముల భూములలోని పంట పూర్తిగా పాడై పోయినదని ప్రభుత్వోద్యోగులే అంచనాలు వేస్తున్నారు. ఇంత హెచ్చుపంట నష్టపడుటవలన వచ్చే సంవత్సరం తిండికి గింజలు ఎట్లు దొరుకుతాయో బోధ పడటంలేదు.

(M. L. A. Debates O. R. Vol. XXI No. 9 P. 638. 639, 640)

జమీందారులకు పరిహారము - రైతులకు సక్రమమైనహక్కులు.

"ఉపాధ్యక్షురాలగు అమ్మా! జమీందారీ అబాలిషన్ చట్టము Pass అయిన తరువాత, జమీందారులకు Compensation ఇచ్చే విధానంలో కొన్ని మార్పులను సూచిస్తూ ప్రతిపాదింప బడినటువంటి ఈ సవరణ బిల్లును బలపరచడానికి నాకు ఏమి అభ్యంతరములేదు. మా జిల్లాలలో కొన్ని జమీనులను గవర్నమెంటువారు స్వాధీన పరచుకొన్నారు. అయినప్పటికి కొంతమంది జమీందారులు, అమాయకులైన రైతులను

ఏవిధంగా మోసము చేస్తున్నారో ప్రభుత్వంవారికి మనవి చేయదలచినాను. ఇదివరలో ప్రభుత్వంవారు, అడవులు కొట్టకుండా జమీందారులు ఉండుటకుగాను, Waste Lands ను అన్యాక్రాంతము చేయకుండా ఉండుటకుగాను, కొన్ని చట్టాలు Pass చేసి ఉన్నారు. ఆ చట్టముల ప్రకారము, అడవులను కొట్టకూడదు. జమీందారీలలో ఉన్నటువంటి లంక భూముల పైన జమీందారులకు జమీందారీ అబాలిషన్ చట్టప్రకారము ఏవిధంగాకూడ హక్కులేదు. అయినప్పటికికూడ జమీందారులు లంకభూములవిషయములో ఎటువంటి అక్రమాలు చేస్తున్నారో మనవిచేస్తున్నాను. మాజిల్లాలోని దేవరకోట అనే ఎస్టేట్‌లో జరిగినటువంటి విషయాలను కొన్నిటిని ముఖ్యముగా మన రివిన్యూ మంత్రిగారికి తెలియజేయ దలచినాను. ఈ ఎస్టేట్‌ను 1949 వ సం॥ సెప్టెంబరు 7 వ తారీఖున గవర్నమెంటువారు స్వాధీనము చేసుకొన్నారు. ఈ ఎస్టేట్ ప్రాంతంలోఉన్న కొన్ని లంకలలో అడవులు ఉన్నాయి. అక్కడఉండే జమీందారుగారు Lease అనే పేరుతో ఈ లంక భూములను కొందరు రైతులకు కౌలు వ్రాస్తున్నారు, ఈ భూములను lease కు తీసుకొన్నట్లయితే, అవి జమీందారీ రద్దు చట్టప్రకారం లీజుకు తీసుకున్నవారికే ఉంటాయనిచెప్పి ఆవిధంగా రైతులను మోసపుచ్చి, ఒక్కొక్కరివద్దనుంచి లోపాయికారిగా నాలుగువందలు మూడువందల రూపాయలు తీసుకొని lease లు ఇస్తున్నారు. కాని Publice recordలో మాత్రము ఆరు రూపాయలకే lease కు ఇచ్చినట్లుగా చూపిస్తున్నారు. ఈ విధంగా ఆ యెస్టేట్లలో ఉండేటటువంటి అడవులనంతా కొంతమంది రైతులకు జమీందారుగారు lease కు ఇచ్చినారు. తరువాత, ఈ విధంగా ఇచ్చిన అడవులనంతా lease కు తీసుకొన్నవారు కొట్టి పాడుచేస్తూయుంటే, అక్కడి స్థానిక రైతులు, పేద హరిజనులు కొంతమంది ప్రభుత్వంవారికి Complaint చేసినారు. వారి అర్జీలమీద అక్కడఉన్న Assistant Manager గారు enquiry చేసినప్పుడు, గవర్నమెంటుకు జమీందారు hand over చేసిన Publice records లో ఆ భూములను ఆరు రూపా

యల రేటు ప్రకారమే **lease** కు ఇచ్చినట్లు చూపబడినది. కాని, Enquiry లో రైతులను మీరు **lease** కు ఎంత మొత్తమును ఇచ్చినారు?" అని విచారించగా, మేము ఒక ఎకరమునకు నాలుగు వందలు మూడు వందలు మొత్తములకు అడవి భూములను **lease** కు తీసికొనినాము" అని వారు ట్టేటుమెంట్లు ఇచ్చినారు.

"ఈ బిల్లు ప్రకారము, జమీందారులకు సగము మొత్తము **Compensation** ముందుగా ఇవ్వవలెనని ప్రభుత్వంవారు అనిన మాకేమీ అభ్యంతరములేదు. కాని ఈ విధంగా జమీందారులకు డబ్బు యిస్తున్నపుడు, వారి మాటలను నమ్మి మోసపోయినటువంటి పేదరైతులకు ఎటువంటి నష్టమురాకుండా చూడవలసిన బాధ్యత గవర్నమెంటువారిపైన ఉన్నదని గుర్తించగోర్తాను. ఈ విధంగా రైతులను మభ్యపెట్టి డబ్బు తీసికొనినారని ప్రభుత్వమువారికి ఏమైనా **Complaints** వచ్చినట్లైతే, ఆ ఫిర్యాదుల నన్నింటిని విచారణచేయించి, ఎంతమంది రైతులు ఈ విధంగా జమీందార్లకు ఎంతడబ్బు ఇచ్చినారో లెక్కపెట్టించి ఆ డబ్బు తిరిగి వారికి ఇప్పించే ఏర్పాటు చేయవలసినదని మనవి చేస్తున్నాను.

"ఈ విధంగా **Lease** కు తీసుకొనిన అడవులను ఆ యా రైతులు కొట్టి పాడుచేస్తున్నారు. అనేకచెట్లు కొట్టివేశారు. ఎవరికి దొరికిన కలప వారు ఎత్తుకొనిపోయినా గూడా ఎస్టేటు మేనేజరుగారికి సుమారు లక్ష రూపాయల విలువగల సరకు దొరికింది. ఈ విధంగా జమీందారు వారి హక్కులనుమీరి అడవులను పాడుచేయించి, రైతులను మోసపుచ్చి డబ్బు సంపాదించు కొంటున్నారు. ఇటువంటి అన్యాయాలు జరుగుచున్నవని **Complaints** వచ్చినయెడల అటువంటివాటిని విచారణ చేయించి జమీందారులకు **Compensation** ఇచ్చేటప్పుడు ఏ ఏ రైతులు ఎంతెంత డబ్బు ఇచ్చారో ఆ డబ్బును తిరిగి వారికి ఇప్పించి మిగతాది జమీందారు

లకు యివ్వవలసినదని మంత్రిగారికి మనవిచేస్తూ సెలవు తీసి కొంటున్నాను.

(M L. A. Debates O. R Vol. XXII No. 8 Page 638, 639)

రైతులకు పరికరాలు - వ్యవసాయశాఖధోరణి

"అధ్యక్షా: వ్యవసాయ శాఖామాత్యులు ప్రతిపాదించిన ఈ demend ను నేను బలపరచుచున్నాను. వ్యవసాయ శాఖవారు ఎంతవరకు రైతులకు తోడ్పడుచున్నారనే విషయము ముఖ్యముగా ఆలోచించవలసి యున్నది. ఇప్పుడు వ్యవసాయశాఖలో పనిచేసే ఉద్యోగులకు, రైతులతో ఎక్కువ సంబంధము ఉన్నట్లుగా కనిపించుటలేదు. వ్యవసాయము అభి వృద్ధి కావలెనంటె Agr cultural department వారు రైతులతో చాలా దగ్గరగా పనిచేయవలసి యుంటుంది. వ్యవసాయశాఖోద్యోగులు రైతులతో దగ్గర సంబంధాన్ని కలిగించుకొని తమ అనుభవములను, సలహాలను ఎప్పటికప్పుడు తెలియజేయవలసిన అవసరమెంతయో యున్నది. కాని ఈ నాడు ఆ విధంగా కాకుండా ఈ **department** లోని ఉద్యోగులు రైతు లతో ఎంతమాత్రము దగ్గిరసంబంధము ఏర్పాటు చేసుకొనుటలేదు. అనగా ఈ **department** వారు వారి శాఖ ముఖ్యోద్దేశములను గుర్తించినట్లులేదు. వ్యవసాయశాఖవారు రైతులపట్ల హెచ్చు శ్రద్ధ తీసుకొని ఉన్నట్లయితే మన దేశంలో ఆహారకొరత ఏర్పడియుండదని నా అభిప్రాయము.

"ఈ నాడు రైతులు వ్యవసాయం చేసుకొనే విషయంలో చాలా బాధలు పడుచున్నారు. రైతులకు సామాన్యంగా కావలసినటువంటి వ్యవ సాయ పరికరములు దొరకడం అరుదైపోయింది. **Agricultural department** వారు ఈ వ్యవసాయ పరికరములను రైతులకు ఎంత మాత్రము ఇప్పించలేకుండా ఉన్నారు. అందువల్ల రైతులు చాలా బాధలు పడవలసి వస్తుంది.

"ఇదివరలో మన ప్రకాశం పంతులుగారు ప్రధానిగా ఉన్నప్పుడు మనకు విత్తనాలనుకూడా కంట్రోలు చేసినారు. అందువల్ల రైతులు లేనిపోని అనేక యిబ్బందులు పడవలసివచ్చింది. ఆ రోజులలో రైతులకు జనపవి తనాలు కూడా దొరకలేదు. Agricultural deparlment వారు రైతులకు జనప విత్తనాలు ఇప్పించలేక పోతునారు. కంట్రోలు ధరకన్న అనేకరెట్లు హెచ్చుధర పెట్టి black market లో రైతులు వీటిని కొను క్కొనవలసిన అవస్థ వచ్చింది. ఇది గమనించి వారి తరువాత అధికారము నకు వచ్చివారు ఈ విత్తనములకు కంట్రోలు తొలగించి రైతులకు ఆ బాధ తప్పించినారు. కంట్రోలు అనేటప్పటికే ధర పెరిగిపోతుంది. ఈ నాడు రైతులకు కావలసిన వ్యవసాయ పనిముట్లు ఎంతమాత్రంకూడా దొరకడంలేదు. దీనికి కారణం వీటిపైన ఒకవిధమైన కంట్రోలు పెట్ట డమేనని మనవి చేస్తున్నాను. రైతులకు బండిపట్టాలు చాలా అవసరము. Agricultural department వారు బండి పట్టాలను రైతులకు ఇప్పించ లేకుండా ఉన్నారు. కాని బ్లాకులో హెచ్చుధరలకు రైతులకు పట్టాలు దొరుకుతున్నాయి. సామాన్య రైతులకు బండిపట్టాలు దొరుకుటలేదు. ఈ సందర్భంలో ఉదాహరణంగా ఒక విషయాన్ని మనవిచేస్తాను. నా నియో జక వర్గము (Constituency) లోని కొతవరం అనే గ్రామంలోని 30 మంది రైతులుకలసి ఒక దరఖాస్తును, తమకు బండి పట్టాలు, పలుగులు, ఇరుసులు కావలసి Joint Director of Agriculture గారికి ఒక దరఖాస్తును పెట్టుకున్నారు. ఈ దరఖాస్తు ఆ రైతులు 1949 వ సంవత్స రం April 4 వ తేదీన పంపుకున్నారు. మూడు, నాలుగు మాసాల తరువాత Joint Director of Agriculture గారి వద్దనుంచి ఈ వ్యవ సాయ పనిముట్లు గుడివాడ Demonstrator గారి అఫీసు నుంచి తెచ్చు కొనవలసినదని Order వచ్చింది. కాని ఈ రోజువరకు ఈ వ్యవసాయ పనిముట్లు వారికి ఇవ్వబడలేదు. రోజూ వ్యవసాయశాఖ Demonstrator

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

101

గారి ఆఫీసుచుట్టు ఈ రైతులు తిరుగగలసివస్తోంది. ఈమధ్యన ఆ రైతులు నన్ను కలిసికొని Joint Director గారి వద్దనుంచి ఆర్డరులువచ్చి రమారమి ఒక సంవత్సరము అయినప్పటికిని ఇంతవరకు మాకు ఈ వ్యవసాయ పనిముట్లు ఇవ్వలేదని, బ్లాకులో హెచ్చుధరపెట్టి మేముకొనుక్కొనలేక పోతున్నామని చెప్పినారు. ఈ విధంగా రైతులకు నిత్యము కావలిసినటువంటి వ్యవసాయ పరికరాలను వారికి **Agricultural department** వారు ఇప్పించలేకుండా ఉన్నారంటే, చాల విచారకరమైనటువంటి విషయము. రైతుకు ముఖ్యంగా కావలసినటువంటి వస్తువులను **Supply** చేయక, **Grow more food, Grow more food** అని అంటే లాభం లేదు. ఈ పరిస్థితులలో అధిక ఆహారోత్పత్తి చేయుటకు ఏ విధంగా ప్రోత్సాహము కలుగజేయగలమో నాకు అర్థమగుటలేదు.

"**Agricultural demonstrator** లు వారి **Tour programme** లను వేసుకోవడంలో వారి సౌకర్యాలనే గమనిస్తారుగాని, పల్లెటూళ్ళలో ఉండేటటువంటి రైతులయొక్క ఉపయోగాలను గుర్తించుటలేదు. **Tour programme** లను రోడ్లమీద ఉండే గ్రామాలకు, పట్టణాలకు, **City** లకు మాత్రమే వేసుకుంటున్నారు గాని మారుమూలలలో ఉండే గ్రామాలకు వెళ్ళుటలేదు. మన దేశంలోని హెచ్చుసంఖ్య గ్రామాలు రహదార్లకు చాలా దూరంగాఉన్నాయి. అటువంటి గ్రామాలకు ఈ డిమాన్‌స్ట్రేటర్లు వెళ్ళకపోవడంవలన ఆ గ్రామాలలోని రైతులకు వ్యవసాయ శాఖవలన ఏవిధమైన ఉపయోగం కలుగుటలేదు. ఈ విషయాన్ని గమనించి **Demonstrator** లు పల్లెటూళ్ళకు కూడా వెళ్ళేటట్లుగా చూడవలసినదని మంత్రిగారి కోరుచున్నాను.

"ఈ మధ్యన తుపానువల్ల పంటలు పాడైనందున **West Godavari district** లో రెండవ పంటకుగాను **Tanjore district** నుంచి విత్తనాలు వ్యవసాయ శాఖవారు తెప్పించి రైతులకు **Supply**

చేయించినారు. **West Godavari** జిల్లాలోని వాతావరణానికి, **Tanjore** జిల్లాలోని వాతావరణానికి చాలా తేడాఉన్నది. ఈ విషయం అందరికీ తెలిసినటువంటిదే. అందుచేత ఈ విత్తనాలు సరిగా పండలేదని రైతులకు నష్టంవచ్చినదని తెలిసినది. ఈవిషయాన్ని జిల్లా **Agriculttral Officer** గారు కూడా ఒప్పుకొన్నారు. దీనివలన చాలా విత్తనాలును, గవర్న మెంటుకు డబ్బు దండుగ అయినది. Tanjore జిల్లాయొక్క వాతావరణానికి, **West Godavari** జిల్లా యొక్క వాతావరణానికి వ్యత్యాసము ఉన్నదనే విషయం జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు తెలియనటువంటి విషయము కాదు. అయినప్పటికి ఈ విత్తనాలను వారు ఎందుకు తెప్పించినారో తెలియుటలేదు. ఏ ఏ జిల్లాలకు ఏ ఏ భూమికి ఎటువంటి విత్తనాలు సరిపడతాయో సరిగా గుర్తించి అటువంటి విత్తనాలనే రైతులకు **Supply** చేయించవలెను. ఆ విధంగా కాకుండా ఇప్పుడు **Tanjore** జిల్లా విత్తనాలు **Supply** చేయబడినట్లుగా కనుక చేసినట్లయితే **Agricultural department** మీదరైతులకు ఇప్పుడుఉన్న కొద్దిపాటి విశ్వాసముకూడా పోతుందని నాభయము.

నా నియోజకవర్గంలో కొల్లేటి ప్రాంతము ఎక్కువగాయున్నది. ఈ సంవత్సరం అధికవర్షాలవల్ల భూములలో ఎక్కువ నీరు నిలిచి పోయింది. హెచ్చు నీటివల్ల చాలాభాగము పంట పాడై పోయింది. కాబట్టి నీటిముంపును తట్టుకొనేటటువంటి రకము విత్తనాలను రైతులకు **Supply** చేయించినట్లయితే పంటలు పాడవటం తగ్గుతుంది. ఈ విషయాన్ని గమనించవలసినదిగా గవర్నమెంటువారికి మనవి చేస్తున్నాను.

బండిపట్టాలు, ఇతర వ్యవసాయ పనిముట్లు రైతులకు ఎంత మాత్రము దొరుకుటలేదు. ఈ వ్యవసాయ పనిముట్లు అధికాహారోత్పత్తి చేయుటకు చాలా అవసరము. ఏరైతు అయినను పనిముట్లులేనిదే వ్యవ

సాయము చేయలేడు. ఈ పనిముట్లను రైతుకు ఒకసారి **Supply** చేయి స్తే మరి ఏడు ఎనిమిది సంవత్సరములవరకు వాటిని అతను వాడుకోగలడు. పనిముట్లను కంట్రోలుచేయడం వలన వ్యవసాయదారు చాలా బాధలుపడు తున్నాడు, కాని బ్లాకులో పనిముట్లు దొరుకుతున్నాయి. ఎక్కువధరయిచ్చి వీనిని పేదరైతులు కొనుక్కోనలేక పోతున్నారు. కాబట్టి కంట్రోలును తీసివేసినట్లయితే బాహాటంగా రైతులు వీటిని కొనుక్కోనగలరు. ఈ పని చేసినట్లయితే రైతులకు ఎక్కువ ఉపకారము చేసినవారు అవుతారు. రైతు లలో ఎక్కువ సంతృప్తి కలుగుతుంది. కంట్రోలు వుంచడమువలన ఒక్క సంవత్సరం డిమాన్స్ట్రేటరుగారి ఆఫీసుచుట్టు తిరిగినా రైతుకు పారగాని, పలుగుగాని దొరుకుటలేదు. కాబట్టి వెంటనే వ్యవసాయ పని ముట్లను **de-control** చేయవలసినదని మరల ప్రభుత్వమువారికి మనవి చేస్తున్నాను. ఇప్పుడు బండిపట్టాలు మొదలైన పరికరాలు కావాలంటే వాటిని ఏ **Tata Company** నుంచో తెప్పించవలసివస్తుంది. అంతవరకు రైతులు నిరీక్షిస్తూఉండాలి. కాబట్టి మన ప్రాంతాలలో వున్నటువంటి ఇనుమును బండిపట్టాలుగాను ఇతర వ్యవసాయ పనిముట్లుగాను తయారు చేసే యేర్పాట్లు చేయించవలెను. తగినంత ఇనుమును కనుక **Supply** చేయించినట్లయితే మన రాష్ట్రంలోవుండే **Factory** లలోనే మనము తయారు చేయించవచ్చును. వ్యవసాయ పనిముట్లను రైతులకు ప్రభుత్వము వారు ఇప్పించకపోవడంవలన రైతులలో చాలా అసంతృప్తి కలుగు తోంది. ఈ అసంతృప్తిని అవకాశంగా తీసుకొని కమ్యూనిష్టులు మొద లగు ఇతర పార్టీలవారు కాంగ్రెసుకు వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. వారు రైతులవద్దకు వెళ్ళి మీ దగ్గరనుంచి ధాన్యాన్ని కంట్రోలు ధరకు ప్రభుత్వమువారు తీసుకొంటున్నారుగాని మీకు కావలసిన వ్యవసాయ పని ముట్లను మీకు సరిగా **Supply** చేయటంలేదని, అటువంటి పరిస్థితులలో మీరు ఎందుకు ధాన్యాన్ని **Black - mark t** లో అమ్ముకొన కూడదని ప్రచారం చేస్తున్నారు. దీనికి ఉదాహరణంగా మా కృష్ణాజిల్లాలోని కృష్ణా

పురం అనే గ్రామంలో ఏమిజరిగిందో మనవిచేస్తాను. 1948 వ సంవత్సరంలో ఆ గ్రామానికి **Procurment** అధికారులు వెళ్ళినపుడు రైతులు వారికి ధాన్యాన్ని అమ్మటానికి నిరాకరించారు. కాబట్టి రైతులను సంతృప్తి పరచడం చాలా అవసరం. వారికి అత్యవసరంగా కావలసిన మేలురకపు విత్తనాలు మొదలగునవి సరసమైన ధరలకు **Agricultural department** వారు సహాయం చేయవలసియున్నది. ముందుగా ఇనుపపనిముట్లపైన **Contro** ను తొలగించవలసినదని ప్రభుత్వమువారిని మరల కోరుచు సెలవు తీసుకొంటున్నాను."

(M. L. A. Debates O R. Vol. II No. 2 P. 98, 99, 100)

కృష్ణాజిల్లాలో కమ్యూనిష్టుల చర్యల నరికట్టుటలో పోలీసుల అసమర్ధత - పోలీసులకై బడ్జెటులో కేటాయింపు.

ఉపాధ్యక్షిణీ! అమ్మా! పోలీసు డిమాండు చాలా ముఖ్యమైనటువంటిది. ఏ దేశములోనైనప్పటికి శాంతి, భద్రతలు నెలకొల్పుటకు పోలీసుశాఖ యొక్క సామర్థ్యము మీదనే ప్రభుత్వంయొక్క పేరు ప్రతిష్ఠలు ఆధారపడియున్నవి. ఇప్పుడు మన రాష్ట్రంలో అచ్చటచ్చట జరుగుచున్నటువంటి కల్లోలములను అరికట్టుటకు ఎంతవరకు పోలీసు శాఖవారు ప్రయత్నము చేయుచున్నారనే విషయాన్ని ఈ సభవారు గమనించవలసియున్నది. పోలీసువారు కల్లోలములను అణచివేసి ప్రజలకు సేవచేసేదానికి బదులు ఎక్కువగా ప్రజలనే "సేవ" చేస్తున్నారని చెప్పుటకు విచారముగానున్నది.

మా కృష్ణా జిల్లాలో, ముఖ్యంగా నూజివీడు, తిరువూరు తాలూకాలలో ఒకటి, రెండు, మూడు నెలల నుంచి జరుగుచున్నటువంటి, దోపి

డులు, హత్యలు ప్రజలను భీతావహులనుగా చేస్తున్నవి. ఈ కల్లోలాలు జరుగుటకు కారణము కమ్యూనిస్టులేనని వేరే చెప్పవలసిన అవసరము లేదు. ఇంకను కొందరు కమ్యూనిస్టులు underground లో వున్నారు. వారిని పోలీసువారు పట్టుకొనలేక పోయినారు. వారే ఈ కల్లోలాలకు కారణ మని, వారినిశిక్షి స్తేనేగాని దోపిడులు,హత్యలు అరికట్టజాలమని ఇదివరలో అనేకసార్లు ప్రభుత్వం వారిని హెచ్చరించి యున్నాము. గాని ఈ పోలీసు శాఖను పరిపాలించుచున్నటువంటి మంత్రిగారుగాని, ఆ శాఖాధి కారులుగాని ఇంతవరకు కమ్యూనిష్టు ప్రమాదాన్ని అరికట్టడానికి ఎట్టిచర్య తీసుకొనుచున్నారో మా కేమియు అర్థమగుటలేదు. రోజు రోజూ అల్ల రులు, అరాచకాలు అభివృద్ధి అవుతున్నాయి. వీటిని ఎప్పటికి ప్రభుత్వం వారు అరికట్టగలుగుతారో, ఎప్పుడు ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కలుగుతుందో చెప్పటానికి అవకాశము లేకుండా ఉన్నది. ప్రజలకు క్షేమంగాని, రక్షణగాని కనుపించుటలేదు. ఇటువంటి కల్లోలాను అరికట్టే ఉద్దేశంతో అక్కడక్కడ పోలీసు స్టేషన్లను అచనంగా ఏర్పాటు చేసినామని ప్రభుత్వంవారు చెపుతున్నారు. పోలీసు స్టేషనులు ఉన్నాకూడా అక్కడఉండే పోలీసులు గ్రామస్థులను కమ్యూనిష్టుల బారినుండి తప్పించ లేకుండా ఉన్నారు. ఈ మధ్యన చిన ఓగిరాల అనే గ్రామంలో కమ్యూ నిష్టు దండయాత్ర జరిగిన విషయము ప్రభుత్వంవారికి తెలిసినటువంటిదే. ఈ గ్రామంలో పోలీసు స్టేషన్ ఉన్నది. ఒకవైపున దండయాత్ర జరు గుతూఉంటే, రెండోవైపున ఉన్నటువంటి పోలీసువారికి వినపడలేదని కూడా అనుటకు వీలులేదు. ఇది ఏమీ పెద్ద పట్టణంకాదు. ఇది ఒక చిన్న పల్లెటూరు. గ్రామంలో ఏమూల అలికిడికలిగినా వెంటనే అన్ని వైపులకు తెలుస్తుంది. అటువంటి సందర్భంలో కమ్యూనిష్టులు జరిపిన దండయాత్ర కాల్పులు పోలీసువారికి తెలియలేదంటే నమ్మదగినటువంటి విషయముగా కనుపించుటలేదు. ఈ గ్రామం విషయంలో పోలీసులు కమ్యూనిష్టులపైన ఎటువంటి చర్య తీసుకొనలేక పోయినారు. ఈ విషయంగురించి ప్రజలలో

కొన్ని అనుమానాలుకూడ లేకపోలేదు. ఇటువంటి దండయాత్రలు ఇక ముందు జరుగకుండుటకుగాను ప్రభుత్వమువారు పోలీసులను హెచ్చరించ వలసినదని మనవి జేస్తూఉన్నాను.

"ఈ మధ్యన మన Inspector - General of Police గారు మా జిల్లాలోని నూజివీడులో ఒక సభలో మాట్లాడుచు ఆత్మ సంరక్షణకు గాను కమ్యూనిష్టులను ఎదుర్కొనుటకు ప్రజలకు ఆయుధములు ఇచ్చే విషయం ప్రభుత్వంవారు ఆలోచించుచున్నట్లుగా చెప్పియున్నారు. ఈ విధంగా ప్రజలకు ఆయుధాలు ఇచ్చేముందు కొన్ని విషయాలను గమనించ వలసి యున్నదని ప్రభుత్వంవారిని కోరుచున్నాను. ఇదివరలో ప్రభుత్వం వారు హైద్రాబాదు సరిహద్దులలో ఉన్నటువంటి కొన్ని గ్రామాలలోని ప్రజలకు ఆత్మ సంరక్షణకుగాను ఆయుధాలు ఇప్పించియున్నారు. ఈ విధముగా ఆయుధాలు ఇవ్వబడినవారు వాటిని ఏ విధంగా ఉపయోగించు చున్నారో ఎంతవరకు వారు కమ్యూనిష్టులను ఎదిరించి ఆత్మ సంరక్షణ జేసుకొన గలుగుతున్నారో అనే విషయాలను ముందుగా పరిశీలించవలసి యున్నదని మనవిజేస్తూఉన్నాను. ఈ విధంగా ఆయుధాలు ఇవ్వడంవలన ప్రజలు కమ్యూనిష్టు దండయాత్రలనుండి రక్షించుకొనగలరని ప్రభుత్వం వారు తలంచినట్లయితే వారిని బలపరుస్తాను. కాని కొన్ని ముఖ్య విష యాలను ప్రభుత్వంవారి దృష్టికి తేదలచినాను. సాధారణంగా గ్రామాల లోని ప్రజలు తుపాకులను మోసికొనిపోతూ వారి పనులు చేసుకొనలేరు. వారు ఏ పొలాలలోనో రోజంతా పని చేసుకుంటేనేగాని కుటుంబాన్ని తమను పోషించుకొనలేరు. ఈ ఆయుధాలను వారు వారితో ఎక్కడకు పోతే అక్కడకు తీసుకొనిపోలేరు. ఈ ప్రజలు వారి ఆయుధాలను ఇండ్లలోఉంచి బయటకు పనులు చేసుకోవటానికి వెళ్ళినపుడు కమ్యూ నిష్టులువచ్చి ఆడవారిని బెదిరించి ఈ ఆయుధాలను తీసుకొని పోయేదానికి కూడా అవకాశములున్నవి. ఇందువలన మనము ప్రజలకు ఆత్మసంరక్షణ

కొరకు ఇచ్చే ఆయుధాలు శత్రువుల చేతులలోపడి శత్రువులకే ఉపయోగకరములుగా ఉండునేమోననే విషయము గమనించవలసియున్నది.

మనము ఈ శాసనసభలో అనేక చట్టములను పాస్ చేయుచున్నాము. వాటిని సక్రమంగా అమలుచేసేది ప్రభుత్వోద్యోగులచ్చై యున్నది. ఇదివరలో ప్రభుత్వమువారు రైతు కౌలు రక్షణచట్టాన్ని పాస్ చేసియున్నారు. దానిప్రకారము జమీందారీ ప్రాంతాలలోని రైతులను జమీందారు తొలగించుటకు వీలులేదు. కాని మా జిల్లాలలోని కొందరు రైతులను ఒక జమీందారు తొలగించుటకు ప్రయత్నము చేసినాడు. ఆ రైతులు ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినారు. ఈ విధంగా రైతులు ఫిర్యాదు చేసినప్పటికి ఆ Gazetted Officer జమీందారు యొక్క మాటలనునమ్మి ఆ రైతులను భూములలోనుంచి తొలగవలసినదని బెదరించినారు. ఆ రైతులు చట్టపూర్వకంగా మేము తొలగనవసరంలేదని చెబితే వారిని కమ్యూనిష్టులుగా చిత్రిస్తున్నారు. ఇటువంటి చర్యలు జరుగకుండుటకుగాను, మనము ఇచ్చట పాస్ చేస్తున్నటువంటి చట్టము లన్నింటిని పోలీసు డిపార్టుమెంటు ఆఫీసర్లకు పంపించాలి. వారు ఆ శాసనములను చదివి అర్థముచేసుకొని వాటిని సక్రమంగా అమలు జరిపేటట్లుగా చూడవలసియున్నది.

శ్రీ కాశేశ్వరరావుగారు ఉదయం మాట్లాడుతు, కృష్ణా జిల్లాలోని కాంగ్రెసువారిలో గ్రూపులు ఉన్నాయని, అందువలన కమ్యూనిష్టులను అణచుట కష్టంగా ఉన్నదని, ఒక గ్రూపువారు కమ్యూనిష్టులను ఆదరిస్తున్నారని అన్నారు. శ్రీ కాశేశ్వరరావుగారు పెద్దవారు. వారు ఈవిధంగా చెప్పడం బాగుంతలేదు. వారికి ఉన్నటువంటి వ్యక్తిగత భేదాలను పురస్కరించుకొని కొందరు కాంగ్రెసువారు కమ్యూనిష్టులను ప్రోత్సహిస్తున్నారని అనడం భావ్యంకాదు. పల్లెటూళ్లలో ఉండేటటువంటి అమాయక ప్రజలకు ఇక్కడ ఉండేటటువంటి గ్రూపులకు ఏమీ సంబంధము

లేదు. శ్రీ కాశేశ్వరరావుగారు అనేక సందర్భాలలో అనేక రకాలుగా మాట్లాడుతూ ఉండడం వారికి మామూలు. శ్రీ ప్రకాశం పంతులుగారు ప్రధానిగా ఉన్నప్పుడు కాశేశ్వరరావుగారు వారికి వ్యతిరేకంగా మాట్లాడారు. అప్పుడు వారు రెడ్డియారుగారు మంచివారు అన్నారు. తరువాత రెడ్డియారుగారు ప్రధానిగా ఉన్నప్పుడు వారికి వ్యతిరేకంగా ప్రచారము చేశారు. తరువాత రాజాగారు వచ్చినతరువాత వారినికూడా మంచివారుకారని నిందిస్తున్నారు ఈ విధంగా మాట్లాడడం వారికి అలవాటుగా కనిపిస్తోంది. మంత్రులతో వారికిగల వ్యక్తిగతంగా ఉన్నటువంటి భేదాభిప్రాయాలను పురస్కరించుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడడము కాశేశ్వర రావుగారివంటి పెద్దవారికి భావ్యముకాదని నాయభిప్రాయము. వారు ప్రభుత్వానికి కమ్యూనిష్టులను అణచివేసే సందర్భంలో చక్కని సలహాలు ఇవ్వవలెను. అంతేకాని ప్రభుత్వాన్ని ప్రతి విషయంలోను దూయబట్టుకోవడం ఎవరికికూడా లాభకారిగాదు.

మా కృష్ణా జిల్లాలో ఇంకను కమ్యూనిష్టు దురంతాలు జరుగుతున్నాయంటే దానికి కొందరు Underground లో ఉన్నటువంటివారే కారణమని మనవిచేస్తున్నాను. ఈ **Under – ground Communist** లను పట్టుకోనిదే ప్రజలకు రక్షణ కలుగజేయడం కష్టము. ఈ విషయంలో మన **C. I. D.** శాఖ ఉద్యోగస్థులు హెచ్చు చాకచక్యముతోను శ్రద్ధతోను పని చేయవలసియున్నది. మన రాష్ట్రంలోని **C. I. D.** ఉద్యోగులు ఇందుకు చాలకపోయినట్లయితే ఇతర ప్రదేశములనుంచి **C. I. D. Specialist** లను తీసుకొనివచ్చి అయినను ఈ **Underground Communist** లను పట్టుకొనేటట్లు చేయించవలసినదని మంత్రిగారిని మరల కోరుచున్నాను.

పోలీసులకు ఏ విషయములలో నైనను **Complaint** చేసినట్లయితే వారు వెంటనే **action** తీసుకొనుటలేదు. ఫిర్యాదు చేసినతరువాత ఏ రెండు

మూడు రోజులకో వారు దర్యాప్తు చేయటానికి పోలీసువారు వస్తున్నారు. ఈలోపల నేరస్థులు తప్పించుకుపోతున్నారు. వారిని పట్టుకొనుటకు ఎంత మాత్రము అవకాశములేకుండా ఉన్నది. ఈ శాఖను చూస్తున్న ముఖ్య మంత్రిగారు, ఆర్థిక మంత్రిగారు పోలీసు ఉద్యోగస్థులను మందలించవలసి యున్నదని మనవిచేస్తున్నాను. అనేక సందర్భములలో పోలీసులు వారి యిష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. వారికి ప్రభుత్వము అంటే ఏమా త్రము భయములేకుండా వున్నది. ఎవరైనా పోలీసులమీద ఫిర్యాదు చేసి నట్లయితే అటువంటివారిపైన ఏదో కారణంజెప్పి గుడ్డలు ఊడదీయించి తన్నుతున్నారు. ఇటువంటి వుద్యోగుల సంగతి మేమందరము ఏక గ్రీవంగా అంగీకరించి మంత్రిగారికి తెలియజేసినప్పటికి ఇంతవరకు ఏవిధ మైన చర్య తీసుకొనినట్లులేదు. ఇటువంటి ఉద్యోగులను శిక్షించవలసినదని మరొకసారి హెచ్చరించుచు సెలవు తీసుకొంటున్నాను."

(M. L. A Debates O. R. Vol. II No. 8 P. 564, 566, 567)

Alleged alienation of communal lands, lanka lands, etc., by the ex - Zamindar of Devarakota.

* 60 Q.—(Mr. SPEAKER :— "The Hon. Member is not in her seat. The answer will be printed in the proceedings.")

*Srimathi V. SITAMAHALAKSHMAMMA :- Will the Hon. the Minister for Land Revenue be pleased to state

(a) the action that has been taken on the petitions submitted by the ryots of several villages in Devarakota Estate in Krishna district, that the ex – Zamindar of Devarakota has alienated communal lands, lanka lands, waste lands and forest lands for several lakhs of rupees, deliberately disregarding the provisions of the Madras Estates Communal, Forest & Private Lands (Prohibition of Alienation) Act, 1947; and

(b) the action that has been taken against the said zamindar for having out trees worth several thousands of r upees in the estate ?

The Hon. Sri H. SITARAMA REDDI :— "(a) & (b) The allegations in the several petitions received by Government and the subordinate authorities were duly enquired into. The Zamindar of Devarakota was reported to have contravened the provisions of Acts XIV of 1947 and XXVII of 1949 in respect of the lease of five lankas namely, Nadakuduruletha lanka, Tummaladibba, Ravilanka, Venkayyadibba and Gokuladibba in Divi taluk Trees to the value of about Rs. 3,000 were also reported to have been cut by certain persons in contravention of the statutory provisions, in Tummaladibba, Ravilanka and Gokuladibba. Steps are being taken to ask the Zamindar to show cause why he should not be prosecuted in respect of the leases of lankas referred to. Action is also being taken to prosecute the persons who cut trees in contravention of the statutory provisions."

(M. L. A. Debates Official Report Vol. III No. 8 P. 564)

ఉపాధ్యక్షురాలగు అమ్మా! మన మద్రాసు ప్రభుత్వమువారి ఆదాయ వ్యయపట్టిక అయిన ఈ బడ్జెటును మన అర్థిక మంత్రిగారు చాలానేర్పుతో తయారుచేసినందుకు వారిని నేను అభినందించుచున్నాను. మన దేశము నేడు ఆర్థికముగా ఎన్నో చిక్కులను ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన వలసియున్నది. అయినప్పటికి ధైర్యముతో వాటిని అధిగమించి మన రాష్ట్రాన్ని అన్నివిధాలా ప్రజలను అభివృద్ధిపరచే వివిధ ప్రణాళికలను అమలు చేయుచుకూడా 23 లక్షల రూపాయల స్వల్ప కొరతతో బడ్జెటును బయటపెట్టగలిగి నందుకు గౌరవనీయులగు ఆర్థిక మంత్రిగారు అభినందనీయులు.

"ఇప్పటికి 1946 వ సంవత్సరము నుంచి 1951 వ సంవత్సరము వరకు అనగా ఈ అయిదు సంవత్సరముల నుంచి కాంగ్రెస్‌వారు మన రాష్ట్రి పరిపాలనను నిర్వహించుచూ, ప్రజలకు ఏమి అధికంగా ఉప కారము చేయగలిగినారు? వారి ఏ యే యిబ్బందులను తీర్చగలిగినారు? అనే విషయం ఆలోచించి చూచినట్లయితే చెప్పుకోతగినంత ఏమీ చేయ లేదని తెలుస్తుంది. ఉదాహరణముగా మా జిల్లాలోని రైతులకు ఎట్టి ఉప కారము కలిగిందో మనవిచేస్తాను. మా కృష్ణాజిల్లాలో **Irrigation** ఇబ్బందులు 1946 వ సంవత్సరానికి పూర్వము ఎల్లావున్నాయో ఈ నాటికి కూడా అలాగేవున్నాయి. ఈ అయిదు సంవత్సరాలలో వచ్చిన తుపానుల వల్ల కానివ్వండి ఇతర అవాంతరాలవల్ల కానివ్వండి మా జిల్లాలలోని రైతులు అనేకసార్లు పంటలు పాడైపోయి కష్టనష్టాలకు లోనుగావలసి వచ్చినది.

మా జిల్లాలోని పంటలు పాడై పోవుటకు బుడమేరు ముంపు ప్రధాన కారణమని ప్రభుత్వమువారికి తెలియకపోలేదు. ఏటేట బుడమేరు, కొల్లేరు ముంపులవల్లనే వేలాది ఎకరాలలోని పంట నష్టపడిపోతోంది. ఈ నాటికైనా బుడమేరుపై అనకట్ట కట్టే **Scheme** కు గాను ఈ బడ్జెటులో ఒక కోటి రూపాయల మొత్తమును Provide చేసినందుకు చాలా సంతోషము. అయినప్పటికి ఈ పనిని ప్రభుత్వమువారు ఎప్పుడు చేయ మొదలు పెడతారో, ఎప్పటికి పూర్తిచేస్తారో అనేవిషయమై ప్రజలలో సందేహము, నిరాశ ప్రబలివున్నది. ఈ బుడమేరు **Scheme** విషయంలో ఇంతవరకు ఒక నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వమువారు ఆమోదించినట్లు లేదు. ఈ **Scheme** విషయంలో ఒక ఇంజనీరుగారు Undertunnels పెట్టి మురుగు నీరు పోవునట్లు చేయవలసినదన్నారని, మరొక ఇంజనీరుగారు ఈ మురుగు నీటిని కృష్ణానదిలోకి వదలివేయవలసినదని చెప్పినట్లును తెలుస్తోంది. ఈ విధమైన ఆలోచనలతో కాలయాపనచేయక ఈ **Scheme** ను,

grow more food scheme క్రింద తీసుకొని తొందరలో అమలు జరిపినట్లైతే అనేక వేల ఎకరములలోని పంటలను రక్షించడమే కాకుండా, ఎన్నో వేల ఎకరాల భూమిని సాగులోనికి తీసుకొని రాగల్గుతామని మనవి చేస్తున్నాను. అంతేకాకుండా యీ **Scheme** ను తప్పక అమలు జరుపుతా మని రైతులకు హామీ ఇచ్చినట్లైతే వారు కనీసము ఎకరానికి నూరు రూపా యల చొప్పున అయినా ప్రభుత్వము వారికి అప్పుగాయిచ్చి తోడ్పడగలరని మనవి చేస్తున్నాను. కాబట్టి యీ విషయాన్ని ప్రభుత్వమువారు శ్రద్ధగా పరిశీలించి బుడమేరు ప్రణాళికను తొందరలో ప్రారంభించవలసినదని **Public Works Department** మంత్రిగారిని కోరుచున్నాను.

యీ కాంగ్రెస్ ప్రభుత్వమువారు జమీందారీలను రద్దుచేసినారు. వెనుకటి జమీందారులకు ఇవ్వవలసిన **Compensation** కు గాను 120 లక్షల రూపాయలను **Tribunal** దగర **Reserve** చేసినట్లు బడ్జెట్‌లో **Provision** చూపించినారు. యీ చట్టమువల్ల రైతులకు చెప్పుకోతగినంత ఉపయోగము జరిగినట్లు కనుపించుటలేదు. రైతులలో ఉత్సాహము కను పించుటలేదు. దీనివల్ల ప్రభుత్వమువారికి గూడా అనుకున్నంత ఆదా యము వచ్చుచున్నట్లులేదు. అంతేకాకుండా రైతులకు కలసివచ్చినది కూడా ఇంతవరకు ఏమి కనుపించడంలేదు. జమీందారీలను రద్దుచేసిన తర్వాత రైతులు వారిఇబ్బందులు యెక్కువ అయినవేగాని యెంత మాత్రము తగ్గలేదని రైతులు భావిస్తున్నారు. అనేక సందర్భాలలో జమీందారులు **waste lands** ను అన్యాక్రాంతము చేస్తున్నారు; అడవులను కొట్టించి పాడుచేస్తున్నారు. యీ విషయాలను అనేకసార్లు ప్రభుత్వమువారి దృష్టికి తీసుకొని వచ్చినప్పటికి కూడా వారు ఇంతవరకు యెటువంటిచర్య తీసు కొనలేదు. దీనివల్ల రైతులు జమీందారీ రద్దువలన కలిగేలాభాలను పొంద లేక పోతున్నారు. జమీందారీల రద్దును అమలుచేయు సందర్భములలో ఏర్పాటుచేసిన డిపార్టుమెంటులో పనులు తొందరగా జరుగుటలేదు.

ఇందుకుగాను జిల్లాలవారిగా Tribunals ను ఏర్పాటు చేయవలసినదని ప్రభుత్వమువారిని కోరుచున్నాను. యీ Tribunals యెక్కువగా శ్రద్ధ తీసుకొని జమీందారులకు యెంత Compensation ఇవ్వవలసి ఉంటుందో పరిష్కరించి, దానిని వారికి త్వరలో ఇప్పించే ఏర్పాట్లుకూడా చేయవలసి యున్నది. జమీందారీ రద్దు చట్టముయొక్క ముఖ్యవుద్దేశము, అధికాహారోత్పత్తియేనని మనము ఇదివరలో ప్రజలకు చెప్పుచున్నాము. అటువంటి సందర్భములలో ఈ వుద్దేశానికి భిన్నముగా జమీందారులు ఏమైనా చేయుచున్నట్లయిచే అందువల్ల సంభవించే నష్టానికి వారినే బాధ్యులుగా చేయవలసియున్నది. అంతేకాకుండా ప్రజలయొక్క డబ్బును ఏనో్నకోట్ల రూపాయలు ఈ జమీందారులకు Compensation క్రింద ఇవ్వదలచినాము. అటువంటప్పుడు జమీందార్లు ప్రజాసామ్యానికి నష్టము కలిగించే పనులు, బంజరు భూములు అన్యాక్రాంతం చేయడం, Forests కొట్టించివేయడం మొదలైనపనులు చేయడం మాన్పించవలసియున్నది. కాబట్టి ఈ విషయాన్ని గమనించవలసినదని మన రెవిన్యూ మంత్రిగారిని కోరుచున్నాను.

ఎనో్న కోట్ల రూపాయలలోటు వచ్చినప్పటికి లెక్క చేయకుండా మన మద్రాసు ప్రభుత్వమువారు, ప్రజాసామాన్యముయొక్క బాగుకొరకే మద్యపాన నిషేధశాసనాన్ని రాష్ట్రమంతట అమలు పరచియున్నారు. కాని ఈ మద్యపాన నిషేధము ఈ నాడు జయప్రదముగా అమలు జరుపబడుతోందనే విషయము నమ్మేవారు చాలా తక్కువమంది వున్నారు. మద్యపాన నిషేధము యొక్క ఆశయము చాలా గొప్పది. అందు విషయమై ఎంతమాత్రము సందేహములేదు. కాని ఈ విషయములో ప్రజలు కొంత వరకు సహకరించవలసియున్నది. ప్రజల సంపూర్ణ సహకారములేనిదే ఏ ప్రణాళిక జయప్రదముకాలేదు. అంతేకాకుండా Prohibition department లో కూడా కొన్నిలోటులున్నాయి, అందువల్లనే అనేక సందర్భాలలో మద్యపాననిషేధము సక్రమముగా నిర్వహింప బడుటలేదు. ఇందు

వలననే అనేకమంది మనలను ఆక్షేపిస్తున్నారు. మద్యపాన నిషేధము అమలులో లేనప్పుడు ఎక్కడో అక్కడక్కడ దొంగతనంగా సారాకాస్తు వుండేవారు. కాని ఈ నిషేధమువచ్చిన తరువాత దొంగతనంగా సారా కాచడం హెచ్చిపోయింది. ఇదొక పెద్ద కుటీరపరిశ్రమగా తయారవు తోందని ప్రజలు మనలను ఆక్షేపిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వమువారు తమ సిబ్బందిని జాగ్రత్తగాఉండి దొంగసార కాచడం తగ్గించవలసినదిగా ఆదేశించమని కోరుచున్నాను. ఆవిధంగా జరిగినప్పుడే ఇన్నికోట్ల రూపాయల కష్ట నష్టాల నెదుర్కొని చేసిన మద్యనిషేధ శాసనముయొక్క ఫలితము ప్రజలు పొందగలరు. అంతేకాని ఇప్పటివలె **Prohibition department** వారు తగినంత శ్రద్ధ తీసుకొనక పోయినట్లయితే శాసనము యొక్క ప్రయోజనము ఏమీ వుండదు.

ఈ మధ్యన కృష్ణా పశ్చిమ గోదావరి జిల్లాల మధ్యవున్నటువంటి వుప్పుటేరుపై వంతెన కట్టించినందుకు ఈ ప్రాంతాలలో ప్రజల తరపున మన **Public Works Department** మంత్రిగారికి నా కృతజ్ఞత తెలియ జేయుచున్నాను.

మా జిల్లాలో వున్నటువంటి బుడమేరు, వుప్పుటేరు, కొల్లేరు **schem** ను తొందరలో **sanction** చేయించి పని జరిగేటట్లు చూచినట్లైతే ఎక్కువభూమి స్వల్పకాలములో వ్యవసాయము చేయించి తద్వారా అధికాహారోత్పత్తి చేయుటకు దోహద మివ్వగలరని ప్రభుత్వమువారికి మనవి చేయుచున్నాను.

"మా జిల్లాలో చేనేత కార్మికులకు రెండు గ్రామాలలో కరువు భత్యాలు ఇచ్చినట్లు మన ఆర్థిక మంత్రిగారు చెప్పినారు. రెండు వూళ్ళలో కరువు భత్యము ఇచ్చినంత మాత్రముచేత కార్మికుల కవురు తీరిపోలేదు. వాళ్ళకు కావలసినది చేతినిండా పనియిచ్చే నూలు. వాళ్ళకు పని కల్పించ

లేకపోవడము చాలా శోచనీయమైనటువంటి విషయము. కంట్రోల్సుపెట్టిన తరువాత కూడా చేనేత కార్మికులకు నెలలో 15 రోజులకు సరిపోయేటంత నూలు దొరుకుతూవుండేది. కాని రానురాను నెలలో వారము రోజులకు సరిపోయినంత నూలుకూడ దొరకడం కష్టమైపోయింది. రెండు వూళ్ళలోని చేనేత కార్మికులకు కరువు భత్యము ఇచ్చామని చెప్పినంతమాత్రము చేత వారి కష్టముగాని, దరిద్రముగాని తీరిపోదు. కాబట్టి మన రాష్ట్రంలో వున్నటువంటి మిల్లులలో ఎక్కువ నూలు వుత్పత్తి చేసేటట్లు చూచి దానిని చేనేత కార్మికులకు ఇచ్చి తగిన సహాయముచేసి వారి కష్టాన్ని దరిద్రాన్ని తీర్చవలసినదని నేను మన పరిశ్రమల మంత్రిగారినికోరుచున్నాను.

విద్యాభివృద్ధికై 11 కోట్ల రూపాయలు ఖర్చు చేయదలచినట్లు బడ్జెటులో చెప్పియున్నారు. ఇందుకుగాను విద్యా శాఖా మాత్యులను అభినందించుచున్నాను. ప్రభుత్వము వారు వయోజన విద్యపట్లకూడా విశేషంగా శ్రద్ధవహించవలసినదని మనవి చేయుచున్నాను. వయోజన విద్యకై గత రెండు సంవత్సరములనుంచి అక్కడక్కడ మన రాష్ట్రంలో కృషిసల్పబడుతోంది. ఇంకా ఎక్కువకృషి ఈ విషయమై జరుపవలసియున్నది. మన రాష్ట్రంలోని రైతులలో చాలామంది చదువురానివారు. వారిని విద్యావంతులుగా చేయడం ఎంతో ముఖ్యమైనటువంటి విషయము. వయోజన విద్యాభివృద్ధికి కొంతమందిని **Propaganda** చేయుటకుగాను నియమించడము చాలా అవసరము. ఇటువంటి **Propagandist** లకు ప్రయాణపు ఖర్చులు ఇచ్చి నియమించి రాష్ట్రములో విద్యా విహీనత నిర్మూలనము చేయవలసినదని కోరుతూ ఇంతటితో సెలవు తీసుకొనుచున్నాను."

(M. L. A. Debates O. R. Vol. IX No. 3 P. 236, 237, 238)

Contravention of the provisions of the Madras Estates Communal, Forest and Private Land Act, 1947, by the ex - Zamindar of Devarakota.

* 32 Q.—Srimathi V. SITAMAHALAKSHMAMMA: Will the Hon. the Minister for Land Revenue be pleased to place on the table of the House the reply given by the ex - Zamindar of Devarakota (Krishna district) to the "Show Cause" notice issued to him for having contravened the provisions of the Madras Estate Communal. Forest and Private Land (Prohibition of Alienation) Act. 1947, and the Madras Preservation of Private Forests Act, along with the remarks of the Collector. Krishna district. and the Board of Revenue : passed on it, and the final orders of the Government thereon ?

The Hon. Sri H. SITARAMA REDDI — "The Government consider that it will not be in the public interest to place the papers on the table of the House. The explanation of the Zamindar of Devarakota to the 'Show Cause' notice was accepted, but he was warned not to allow any more cutting of trees in the areas in question.

Sri M. G. NATESA CHETTIYAR— "May I have a gist of the reply of the Zamindar to the communication form the Government ?"

The Hon. Sri H. SITARAMA REDDI.— "Whether it is part or whole, Sri, I have already said that it is not in the public interest to say what it is and therefore, I am not prepared to give the gist "

Sri T. VISWANATHAM:- 'May I know, Sir, whether the final order of the Government is also to be treated as confidential ?"

The Hon. Sri H. SITARAMA REDDI :— "I have already said that after accepting his explanation he was warned not to allow any more cutting of trees.

(M. L. A. Debates O. R, Volume XI No. 6-P. 287, 288)

స్త్రీలు - భావి భారతము

గత రెండున్నర దశాబ్దములనుండి పరప్రభుత్వముతో అహింసా యుతముగా పోరాడి భరతవర్షమునకు స్వాతంత్ర్య ప్రదానమొనర్చిన సోదర వీరులకు, వీరాంగనలకూ నా జోహారులు.

నేడు మనము స్వంత పౌరులము. మాట్లాడుటకు, వ్రాయుటకు స్వేచ్ఛగలదు. నిజమయిన స్వతంత్రము లభించుటకు ఈ వాక్-ప్రచురణా స్వాతంత్ర్యమే మూలకందము.

ప్రస్తుత సంఘములో నిన్నటివరకు స్త్రీలకు వున్నస్థానము వేరు. నేటినుండి వుండవలసిన స్థానమువేరు. నిన్ననే భారతదేశము దాస్య శృంఖలములనుండి విముక్తి నొందినది. ఈ స్వాతంత్ర్య సంపాదనలో స్త్రీలు శక్తికొలది తమ పాత్రను నిర్వహించి ప్రాచీన హిందూవనితల ధర్మ దీక్షను అనుసరించిరి. ప్రాచీన భారతదేశములో స్త్రీలు పురుషులతోబాటు రాజకీయములందు బాల్గొనుచు పురుషులకు తీసిపోని ధైర్యసాహసములను రాజనీతిని ప్రకటించిన సందర్భములెన్నియో చరిత్రచూపుచున్నది. మచ్చు నకు ఒకటి, రెండు చెప్పి నా వుపన్యాసమును సాగింతును. క్లిష్టతరమైన పరిస్థితులందు సత్యభామ తన యుద్ధ నైపుణ్యతను బ్రకటించి ధైర్య సాహసములతో శ్రీ కృష్ణ పరమాత్మునకు తోడ్పడి నరకాసురుని వధించెను, సావిత్రి తన పాతివ్రత్య మహిమచేతను, ధైర్యసాహసముల వల్లను యమధర్మరాజునే లొంగదీసి తన భర్తను తిరిగి పొందెను.

అట్టిస్త్రీలు మధ్య యుగమునందు అబలలనియు, బిడ్డలగనుట, గృహ కృత్యములు నెరవేర్చుట, మినహా మిగిలిన కార్యములందు వీరికి ప్రమేయముండరాదనియు, తీవ్ర ప్రచారము సాగినది. అట్టి స్థితిలోగూడా ఝాన్సీరాణి తన చిన్ని బిడ్డను, రాజ్యమును కాపాడు కొనుటకు బ్రిటీష

వారితో యుద్ధముచేసి తన ధైర్య సాహసములను బ్రకటించి రణకౌశలము చూపి, రణ రంగమునందే తన అశువులనుబాసెను. ఇట్లనేకమంది స్త్రీలు తమ ధర్మ రక్షణకుగాను రణ రంగములలోనికురికి సింహకిశోరములవలె పోరాడి ఆదర్శ మహిళలైరి.

ఈ స్వాతంత్ర్య పోరాటములో గూడా మహాత్ముని అడుగుజాడల ననుసరించి నిజమయిన అహింసాదీక్షతో, స్వభావసిద్ధమైన సహనము, వోర్మిగలిగినవారై నిండుమనంబున సత్యాగ్రహముబూని దేశమునందలి అన్నిభాగములయందును పురుషులతో సమానముగను, కొన్ని కొన్ని యెడల మిన్నగను పాల్గొని పనిచేసియుండిరి. పురుషులతోబాటు జైలు శిక్షల ననుభవించిరి, లాఠీ దెబ్బలకు గురియైరి. తుపాకీకాల్పులకు గుండెల నిచ్చిరి. అనేక సందర్భములలో పురుషులకు వాటిల్లనున్న అపాయముల నుండి తప్పించుటకు ధైర్యసాహసములు ప్రదర్శించిన ఘట్టములు భారత చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింపదగినవై యున్నవి. ఈ సందర్భములో వీరనారి అరుణా అసఫాలీని పేర్కొనవలసివుండెను. రాజకీయ నిపుణత లోను మాధుర్యమైన కవిత్వ రచనలోను, శ్రీమతి సరోజనీ నాయుడుని మించిన నాయకులుండుటరుదు: అంతర్జాతీయ వ్యవహారములందు సమ యోచిత రాజకీయ విజ్ఞతనుపయోగించి కార్యదీక్షత చూపుచున్న శ్రీమతి విజయలక్ష్మికి సాటివెవ్వరు? అట్టి విజ్ఞానవతులను కలిగియున్న యీ స్త్రీ జాతికే, ఇప్పటి సంఘములోనున్న హక్కులు చాలా సంకుచితములని చెప్పుటకు సిగ్గుపడవలసియున్నది.

ఈ నవయుగములో స్త్రీ – పురుష భేధములు పాటింపని రాజ్యమును స్థాపించవలసియున్నది. ఇందులకు నిన్ననే ప్రారంభోత్సవము జరిపి యున్నాము. మానవసేవయే మాధవసేవయను సిద్ధాంతమును ప్రచార మొనర్చి తరతరాలనుండి నేటివరకు అష్ట కష్టములకులోనై కృంగి –

కృషించి నశించుచున్న పతితజాతులను వున్నతస్థానమునకు తేవలసి యున్నది. నేటి రాజ్యములో స్త్రీ - పురుష, కుల - మత విచక్షణలేక మైనారిటీదాటిన సర్వజనులకు వోటింగు అధికారము వచ్చియున్నది. అట్టి స్థితిలో సగానికిపైగా జనాభాగలిగిన స్త్రీలను యేవిధముగ సంఘకట్టుబాట్లు ఆచార - సంప్రదాయముల మరగున దాస్యశృంఖలములచే బంధించి వుంచగలరు?

నేటినుండి మన నాయకత్వమున మన హక్కులను మనము సాధించవలసియున్నది. ఇందుకు తగిన ప్రచారమెంతేని అవుసరము. వార్తా పత్రికలు స్థాపించవలెను. శాసనసభలో చట్టములు చేయించవలెను, విజ్ఞానవంతులగు యువతులు రాత్రి పాఠశాలలు పెట్టి నిరక్షరాస్యతను నిర్మూలించవలెను. రాజ్యాంగములో మనకు తగినంత ప్రాతినిధ్యము సంపాదించుటకు ప్రయత్నించవలెను. ఇప్పుడు మేల్కొని సంచరించనిచో జాతికి అభివృద్ధిసున్న. విజ్ఞానవతులందరూ ముందుకువచ్చి నాయకత్వము వహించి సంఘ ఔన్నత్యముకొరకు పాటుబడవలెను. అయితే కొందరు స్వార్థపరులు, సంఘ విద్రోహులు దుష్ ప్రచారము చేయుచున్నట్లు స్త్రీ ఔన్నత్యము సంఘ వినాశముగాక సంఘాభివృద్ధికి దోహదమని రుజువు చేయవలసిన భారము మనపై నున్నది.

భారత దేశము బానిసత్వము నుండి విముక్తి నొందుటకు మహిళా లోకమయొక్క చేయూతయేనని పెద్ద లంగీకరించిన విషయము గమనింప దగినది! అట్టిచో మహిళలకు పూర్ణ స్వాతంత్ర్య మబ్బిన సంఘములో విజ్ఞాన, వికాసములు అభివృద్ధియై దేశ ఔన్నత్యమునకే తోడ్పడునుగదా! స్త్రీ - పురుషుల సమాన స్వాతంత్ర్యకు, జాతిని ముందుకు తీసుకొనిపోయి భావిసంతతికి విజ్ఞాన, వికాసములొసంగి శక్తివంతమైన స్వరాజ్యమును గట్టిపునాదితో నిర్మాణము చేయగలదని జాతీయ నాయకులు చెప్పుచున్న విషయమును విమర్శకులు గమనింతురుగాక.

ఈ సందర్భములో మన మాచరించవలసిన విధానమునుగూర్చి కొంత చర్చించుటవసరము. సమాన స్వాతంత్ర్యము, సమాన ఆర్థిక - రాజకీయ హక్కులు, సమాన విజ్ఞానము కోరుటతోపాటు మన కర్తవ్యమును మనము పాలించినగాని, సంఘమువున్నతిని బొందజాలదు. కాబట్టి మనము పురుషులతోపాటు, రాజకీయములలోను, ఉద్యోగములలోను, వ్యవహార నిర్వహణలోను, సమాన భాగస్వామ్యమును పొందుటయేగాక, వ్యవసాయము వాణిజ్యము మొదలగు వృత్తులయందు పురుషులు వహించే శ్రద్ధకన్న గృహనిర్వహణ, శిశుపోషణ మొదలగు కార్యములయందు స్త్రీలు అధికశ్రద్ధ వహించపలసి యున్నారు. ఇందులో న్యూనతయను కార్యమేలేదు. ఇది మనయొక్క సహజ కర్తవ్యము. విద్యావంతులైన స్త్రీలు, బిడ్డలను ఆరోగ్యవంతులుగను, గుణవంతులుగను చేయగలరు. అందువలన స్త్రీ లోకమే భావిభారత సౌభాగ్యమునకు మూలకందము.

జై హింద్.

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

Blank Page

122

Check List

Book Number	GVP07H119	**Date**	2-1-21
Front Cover	~~YES~~ NO	**Back Cover**	YES
Blank Pages	36, 38, 40, 42, 46, 44, 58, 121		
Missing Pages	NO		
Prepared	Mounika	**Scanned**	Lakshmi
BOOK SIZE	H 7-'0 W 4.8	**Pages**	227